UNIVERSAL LIBRARY
OU_206270
UNIVERSAL LIBRARY

OUP—43—30-1-71—5,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No T425/V44A Accession No T4377

Author

Title ఆంధ్రుల సాంఘిక చరిత్ర

This book should be returned on or before the date last marked below.

# ఆంధ్రాలంకార

# వాఙ్మయ చరిత్రము

★★
★

బులుసు వేంకటరమణయ్య
33, సింగరాచారి వీథి
ట్రిప్లికేను . మదరాసు-5.

# పీఠిక

ఆంధ్రమునఁ గల లక్షణగ్రంథములలో ఛందోగ్రంథముల సంఖ్యయే ఎక్కువ. వ్యాకరణగ్రంథము లంతకంటెను తక్కువ, వ్యాకరణములకంటె అలంకారవిషయ ప్రతిపాదకములగు గ్రంథములు మఱియు తక్కువ. గ్రంథములు తక్కువగ నున్నను, వానిలోని విషయములను పరిశీలించుటకు విద్వద్వతంసులు పూనుకొని యుండలేదు. కావున, ఆ గ్రంథములలోని విషయమును పరిశీలించుటకును, అలంకారశాస్త్రమునకు సంబంధించిన కావ్యగుణాలంకార రసాదుల స్వరూపమును సంగ్రహముగ నిరూపించుటకును నాకు కుతూహలము కలిగినది.

దైవికముగా – ఆంధ్ర విశ్వకళాపరిషత్తువా రొసంగిన విద్యార్థివేతనము ప్రోత్సహింపఁగా, కాశీ విశ్వవిద్యాలయమున రెండేండ్లపాటలంకార శాస్త్రమునఁ బరిశోధనచేయు నవకాశము నాకు లభించినది. విశ్వవిద్యాలయము మూయఁబడినపుడు–వేసవిలో విజయనగరమున నుండి ఆంధ్రాలంకార గ్రంథములను పరిశీలించు నవకాశమును లభించినది. స్వల్పకాలమున నొనర్చిన యీ పరిశోధనల ఫలితమే యీ 'ఆంధ్రాలంకార వాఙ్మయచరిత్రము.'

ఏతద్రచన పూర్తియైనవెంటనే దీని ప్రకటనమునకై ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారికి తెలియఁజేయఁగా, వారు–దీనిని ప్రకటించుకొను నధికారము నొసంగుచు నీ క్రిందిరీతి జాబును వ్రాసిరి—

**MEMO** **ANDHRA UNIVERSITY**
No. 63—C—32. WALTAIR
15-11-1932

**Read: Letter dated 1-11-'32 From Mr. B. Venkataramanayya.**

Mr. B Venkataramanayya is informed that he is at liberty to publish his manuscript re. "The history of Telugu Poetics".

**(Sd.) R. S. RAO,**
*For Registrar.*

ఈ రీతిని విశ్వకళాపరిషత్తువా రనుమతి యొసఁగినను, దీనిని ప్రకటించుట కింతవఱకు నవకాశము కలుగకపోయినది. 'పరిశోధన' పత్రికాసంపాదకులే ప్రోత్సహించి, దీనిని అమూల్యమగు తమ పత్రికలో తొలుత ప్రకటించి, పిదపఁ దమ 'పరిశోధన గ్రంథమాల'లో ప్రథమకుసుమముగా వెలువరించుట కంగీకరించి, దీని హక్కులను నాకే దయతో నొసంగిరి. వారికిని, దీనిని ప్రకటించుకొన నమమతించిన ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారికిని అనేక ధన్యవాదములు.

ఆంధ్రాలంకారగ్రంథజిజ్ఞాసువులకే మాత్రమేని ఇది యుపయోగించిన–నా పరిశ్రమ చరితార్థము కాఁగలదు.

22-11-55. —బులుసు వేంకటరమణయ్య

# విషయానుక్రమణిక

—:o.—

## ప్రథమభాగము


| విషయము. | | | పుట. |
|---|---|---|---|
| అనుక్రమణిక | ... | ... | 1 |
| విన్నకోట-పెద్దయకవి | ... | ... | 7 |
| అనంతామాత్యుఁడు | ... | .. | 14 |
| భట్టుమూర్తి | ... | ... | 18 |
| గుడిపాటి-కోదండకవి | ... | ... | 26 |
| అడిదము-సూరకవి | ... | .. | 27 |
| పెణుతుర్ల-వడ్డికవి | ... | ... | 33 |
| కటికినేని-రామయకవి | ... | ... | 35 |
| నవీనవాఙ్మయము | ... | ... | 40 |


## ద్వితీయభాగము


| | | | |
|---|---|---|---|
| కావ్యము | ... | ... | 45 |
| రసచర్చ | ... | ... | 57 |
| గుణములు | ... | ... | 66 |
| అలంకారములు | ... | .. | 68 |
| వృత్తులు | ... | ... | 72 |
| రీతులు | ... | ... | 74 |
| దోషములు | ... | ... | 75 |
| అనుబంధము 1 | ... | ... | 77 |
| అనుబంధము 2 | ... | ... | 84 |

పరిశోధన గ్రంథమాల—౧

# ఆంధ్రాలంకార వాఙ్మయ చరిత్రము

## ప్రథమ భాగము

### అనుక్రమణిక

సరసముగఁ జతుర్వర్గములను సాధించి బాలురనుకూడఁ బ్రజ్ఞాన్వితుల నొనరించు కావ్యముయొక్క తత్త్వము నెఱుకపఱచునది అలంకారశాస్త్రము. సాహిత్య శాస్త్రమనునది దీనికి నామాంతరము. సాహిత్య (కావ్య) వాఙ్మయము ననుశాసించుటచే ఈ పేరు కలిగినది. అలంకార శాస్త్రపరిచితి లేని కవి యెట్టి ప్రతిభాన్వితుఁడయినను, అతని కావ్యమున సరసత కొఱవడును. పాఠకుఁడెట్టి సహృదయవతంసుఁ డయినను ఏతచ్ఛాస్త్రజ్ఞత లేనిచో అతనికిఁ గావ్యామృతరస మాస్వాదనమునకు రాఁజాలదు.

గ్రంథరచనమునుగూర్చిన నిశ్చయ మెటులున్నను, కావ్యవాఙ్మయముతోడనే యలంకార విషయ విమర్శన మారంభమైన దనవలెను. వేద శాస్త్రాది వాఙ్మయమున కంతకును హిత ప్రాప్తియు, నహిత నివృత్తియు ప్రయోజనములు. కావ్యమువలనఁగల్గు ప్రయోజనములు కూడనవియే. కాని కర్తవ్యతాబుద్ధి కావ్యము వలన సరసముగఁగల్గును. కావ్యమునందు రసమే ప్రధానము. ఈవిశేషమునుబట్టియే కవులు కావ్య రచనకుఁ గడంగుదురు. సహృదయులు పఠింప సంసిద్ధులగుదురు. అట్టి రసముయొక్కయు, కావ్యముయొక్కయు తత్త్వమును తెలుపునదే అలంకారశాస్త్రమగుట, కావ్యముతోడనే యీ శాస్త్రపుటాలోచన లారంభింపఁబడిన వనవలెను.

కావ్యమునందలి ప్రధానాంగములలో అలంకారములును ముఖ్యములు. అలంకారము లన్నింటియందును (ఇంచుమించుగ) అతిశయ కథన ముండును. అది చమత్కారాధాయకము కూడను. 'నిండు వెన్నెల కాయుచున్న'దని చెప్పుటకు బదులు 'పిండియారఁబోసినట్లు వెన్నెలయున్న'దనియు, 'ఆమె మిక్కిలి చక్కని' దనుటకు మాఱు 'ఆమె రంభ' యనియుఁ జెప్పుట స్వాభావికము; చమత్కారాధాయకమును. ఇట్లే కొన్ని కొన్ని విషయములను మాటలతోఁజెప్పక, సూచనచేయుట రమణీయముగనుండును. ఇట్టి చమత్కారములే కావ్య వాఙ్మయమునకుఁ గారణములు కావచ్చును. ఈ యంశము లలంకారశాస్త్ర సంబద్ధములు. కావున అలంకార విషయకము లగు నూహలు కావ్యవాఙ్మయముతోఁగాని, - వాఙ్మయముతోఁగాని ప్రారంభమయి యుండవచ్చును.

భారతీయులకుఁ బ్రధానమగు సంస్కృత వాఙ్మయమున పురాణయుగమునకుఁ బూర్వమే పెక్కు శాస్త్రములు పరినిష్ఠిత స్వరూపములయి, ప్రఖ్యాతిని గడించినవి; సారస్వతమును పెంచి కొని నలుగడల వ్యాపించినవి. కాని యాలంకార శాస్త్రము మాత్రము కొన్ని శతాబ్దులకాలము అజ్ఞాతముగ నుండవలసి వచ్చినది. జ్ఞానమయిన పిదపఁగూడ పలుమార్గములఁ బరుగిడు నీ శాస్త్రమునకుఁ బదునొకండవ శతాబ్దివఱకును ఏదో యొకదారిని స్థైర్యమే లేకపోయినది. అట్లయినను, సంస్కృతాలంకారశాస్త్రమే వివిధాలంకార వాఙ్మయములకు అన్నింటికిని ఆధారమయ్యెను.

లక్ష్యగ్రంథముల రీతిని లక్షణగ్రంథములకు తగిన యుత్పత్తివికాసములు కలుగని యాంధ్ర వాఙ్మయమున తొలుత అలంకార వాఙ్మయము నామమాత్రావశిష్టమైనది. క్రమక్రమముగఁ గ్రంథము లుత్పన్నములైనను తగినవృద్ధి గలుగలేదు. వెలువడిన గ్రంథములందును భాషాంతరీకరణములే యెక్కువ. ఒక్క యలంకార వాఙ్మయమే కాదు. ఆంధ్రవాఙ్మయమునందలి వివిధ విషయములకుఁ జెందిన గ్రంథములు చాలవఱకు సంస్కృతానువాదములు. వాఙ్మయ

మున నాదిగ్రంథమగు మహాభారత మనువాదము. మొదటి యాంధ్రలక్షణ గ్రంథమని చెప్పబడు నాంధ్రశబ్దచింతామణిగీర్వాణభాషా గ్రథితము; సంస్కృత వ్యాకరణానుసారి. సంస్కృతాంధ్ర భాషల పరస్పర బాంధవ్యమున వాదవివాదములు హెచ్చు పెరిగినను, సంస్కృతవాఙ్మయమే ఆంధ్రవాఙ్మయమునకు మూలమని, పుష్టిని కలిగించినదని అందఱు నంగీకరింపక తప్పదు.

సంస్కృతమునం దలంకార శాస్త్రసంబద్ధమగు నాలోచన మెప్పుడు ప్రారంభమయినదో, అలంకార గ్రంథరచనా ప్రారంభకాలమేదియో నిశ్చయముగఁ జెప్పుటకష్టము. కాని వైదిక వాఙ్మయమునఁగూడ కొన్ని యలంకార విషయములు కన్పించుచున్నవి. కావున సంస్కృతాలంకార వాఙ్మయ మతిప్రాచీనమైనదని చెప్పవలెను. ఆంధ్రమున నిది అర్వాచీనము.

ఆయా శాస్త్రముల లక్షణములను తెలుపుటచే శాస్త్రగ్రంథములు లక్షణగ్రంథములగుచున్నవి. ఆంధ్రమున ఛందో, వ్యాకరణాలంకార శాస్త్రములకు మాత్రము లక్షణగ్రంథ వ్యపదేశము ప్రసిద్ధము. సంస్కృతమున ప్రతి శాస్త్రమునకును సూత్రయుగమునందియుఁ ప్రత్యేక గ్రంథములుకలవు. ఒక శాస్త్రగ్రంథముననే వ్యాకీర్ణముగ శాస్త్రాంతరములు ప్రతిపాదింపఁబడుటలేదు. తెలుఁగునఁ మాత్ర మట్లు కాదు. తొలుతనుండియు నంగు పయువూఁగు లక్షణములును సంకీర్ణము లగుచునే వచ్చుచున్నవి.

ప్రథమాంధ్రలక్షణ గ్రంథమని యనుకొనుచున్న నాంధ్రశబ్దచింతామణియందు వ్యాకరణముతోఁబాటు కొలఁదిగ ఛందోలంకార విషయములు నీయఁబడినవి. ఛందోగ్రంథములగు కవిజనాశ్రయ చ్ఛందోదర్పణములం దలంకార సంబద్ధమగు దోషప్రకరణము కలదు. ప్రథమాలంకార గ్రంథమగు చూడామణియందు ఛందో వ్యాకరణములును వివరింపఁబడినవి. అప్పకవీయ కవిచింతామణ్యాదులు సర్వలక్షణ ప్రతిపాదకములు.

ఆంధ్రశబ్దచింతామణికి వ్యాఖ్యను వ్రాయ సమకట్టిన అప్పకవి తనకుఁ బూర్వముననుండిన లక్షణగ్రంథములను పేర్కొనుచు వ్యాకరణములవే కాక ఛందోలంకార గ్రంథములనుగూడ ఏకరువు పెట్టినాఁడు.[1] ఈ మిశ్రణమును దోషముగా లెక్కింపవీలు లేదు; ప్రథమాంధ్ర వ్యాకరణ లక్షణగ్రంథమని చెప్పబడు ఆంధ్రశబ్ద చింతామణియందలి తొలిరెండు కారికలును కావ్యవిషయ ప్రతిపాదకములు.[2] కావ్యచర్చ అలంకారశాస్త్ర సంబద్ధము; వ్యాకరణ సంబద్ధము కాదు. అందే ప్రథమోచ్ఛ్వాసమునందలి 'ఇంద్రాద్యా అపి చ గణాః, వళిరాద్యమన స్త్వరాక్షరం ప్రాసః' అను సూత్రములు ఛందోలక్షణమునకు చేరినవి. మొదటి ఛందోలక్షణ గ్రంథమగు కవిజనాశ్రయమున సంజ్ఞాధికారమున అలంకార శాస్త్రసంబద్ధములగు కావ్య ప్రయోజనములు, కావ్యభేదములు మొదలగునవి, ఏకాక్షరాదిగాను గలంకారికులు చెప్పవలెనవి సెప్పఁబడినవి. మొదటి యలంకారగ్రంథమగు కావ్యాలంకార చూడామణి యందు చివరి మూడుల్లాసములందు ఛందో వ్యాకరణ విషయములు వివరింపబడినవి.

పయి ముత్త్రివిధములగు లక్షణములును కావ్యమునకు సంబంధించినవే; కావున నవి పరస్పర సాపేక్షములు నగుచున్నవి.

---

1. కవిగజాంకుశంబును, కవిసర్పగారుడంబును, కవిజనాశ్రయంబును, కవిలోక సంజీవనియును, కవికంఠాభరణంబును, కావ్యాలంకారచూడామణియును, కావ్యచింతామణియు, నథర్వణచ్ఛందంబును, గోకర్ణచ్ఛందంబును, శ్రీధరచ్ఛందంబును, ననంతామాత్యచ్ఛందంబును, ఛందోదర్పణంబును, నలంకార సంగ్రహంబును నలంకార రత్నాకరంబును.................. లక్షోపలక్షలుగలవు. (అప్పకవీయ పీఠిక పుట. 14.)

2. విశ్వశ్రేయః కావ్యం తదదోషే పరిష్కృతే చ వాగర్థౌ,
సాలంకారసవృత్తిః సాధ్యోఽపి రసో యథాతథం కవిభిః.
స్వస్థానవేష భాషాభిమతాః సన్తో రసప్రలుబ్ధధియః,
లోకేబహుమన్యన్తే వైకృతకావ్యాని చాన్యదపహాయ.

ఇట్టివిషయ సాంకర్య మాంధ్రముననేకాక సంస్కృతమందును కలదు. అలంకార శాస్త్రమున కంగమగు నాట్యము ననుశాసించు భరతముని తన నాట్యశాస్త్రమున ఛందోవిషయములను విపులముగ చర్చించినాఁడు; [1] భామహుఁడు తన కావ్యాలంకారము నందును, వామనుఁడు తన కావ్యాలంకార సూత్రవృత్తియందును 'శబ్దశుద్ధి' యను పేర వ్యాకరణాంశములను వివరించియున్నారు. క్రమక్రమముగ సంస్కృతాలంకారికులు, వారి ననుసరించిన తెలుఁగువారును అట్టి సాంకర్యములను విడచి స్వతంత్ర (ప్రత్యేక) లక్షణములను వ్రాయ మొదలిడిరి. సాంకర్యము కల గ్రంథములును, సంకీర్ణములగు విషయములును సంస్కృతమునం దత్యల్పముగను, ఆంధ్రమునం దత్యధికముగను ఉన్నవని మాత్రము చెప్పవచ్చును.

ఆంధ్రమున లక్షణగ్రంథములు చాలతక్కువ. ఒక్కొక్క లక్షణమునందే ప్రత్యేకముగఁ గృషిచేసి ప్రతిష్ఠగడించుట గుర్లుటము. అన్ని లక్షణములను ఒక గ్రంథమునఁ జేర్చి బహుముఖమగు తమ పాండిత్యమును వెల్లడించి, తెలుగు లాక్షణికులు పేరుపెంపు గడంపవలసి యుండును. ఒక్కొక్క శాస్త్రమునందు పరిపూర్ణమగు పాండిత్యము గడింపవలసిన వారు సంస్కృతమునే అభ్యసించెడివారు. మఱియు శాస్త్రగ్రంథములు అన్నియును సమగ్రముగ సంస్కృతమునందే కలవు. ఆంధ్రమున ఏమాత్రపు లక్షణజ్ఞానము కలుగవలెనన్నను సంస్కృతలక్షణపరిజ్ఞాన మావశ్యకము. అది లేని నాఁడిదియును బోధపడదు. ఇట్లాంధ్రలక్షణము సంస్కృత సాపేక్షమగుటచే మనవారు సంస్కృతమునందువలె తెలుగునను మరల ఎక్కువగ లక్షణగ్రంథములను-విశేష చర్చావిశిష్టములను రచింపకపోయిరి. వారు ఇతిహాస పురాణ కావ్యాదులను తెలిగించుటకే సంకల్పించిరి. తెలుగు వాఙ్మయమును పరిశీలించినచో మనవారికి సంస్కృతమునందును విశేషమగు పాండిత్య ముండెడిదని నిశ్చయింపవచ్చును. జనసామాన్యమునకు అందుబాటులోనుండు విషయములను జేర్చి గ్రంథములను రచించుటయే వారి యుద్దేశ్యము. విపులములు, ప్రత్యేకములు నగు లక్షణములు సామాన్యజనుల కందరానివి. వానివలన వారికిఁ గలుగు ప్రయోజనము నల్పము. కావుననే ఆంధ్రలాక్షణికులు పురాణ కావ్యాది వాఙ్మయమును భాషాంతరీకరించుటకును, చేసిన భాషాంతరీకరణముల నవగాహనము చేసికొనుటకును ఉపయోగించు ప్రధానలక్షణములను వారు సంగ్రహ గ్రంథరూపమున వెలయించుచుండిరి. కావుననే తెలుఁగు లక్షణగ్రంథములందు సంస్కృతలక్షణగ్రంథసామాన్యములగు విషయకాఠిన్యము, శాస్త్రాంతర సంబంధములగు చర్చలును కానరావు.

ఆంధ్రమున గల కొలది లక్షణగ్రంథములలోను అలంకారగ్రంథము లత్యల్పసంఖ్యాకములు; ఈయంశము అప్పకవి పేర్కొనిన లక్షణగ్రంథముల పట్టికవల్లనే స్పష్టపడుచున్నది. మన ప్రాచీనాలంకారగ్రంథములందీ క్రింది విషయములు సాధారణముగ కన్పించుచున్నవి.

1. ఏదేని గ్రంథము ఒక భాషనుండి వేఱొక భాషలోనికి అనువదింపబడినచో — ఆ యనువాదమువలన ఆ భాషకు కొంత మేలుకలుగవలసియున్నది. అది యట్లుకాక కేవలము అనువాద మగునచో మాత్రము ప్రయోజనమల్పము. తెలుఁగువారు సంస్కృతాలంకార గ్రంథములను తెలిగించినపుడు తెలుగునకు సంబంధింపని కావ్యగుణములు, దోషములు మొదలగువాని నాటిలినే ఆంధ్రీకరింపసాగిరి. కావ్యాలంకార చూడామణి మొదలగు గ్రంథములం దిట్టి విషయములున్నవి. ఆ గ్రంథములు యథామూలానువాదము లయినను కావు. ఇచ్చట వచ్చినట్లు వానియందు సంస్కృత లక్షణము లనుకరింపబడినవి. కొన్నియెడల మూలము విడువఁబడినపుడు భాషానుకూలములగు విషయములఁ జేర్చుట మేలు.

2. ఆంధ్రాలంకారికులు చాలమంది విషయమును సంస్కృతమునుండి గ్రహించినను, మూలగ్రంథనామమును గాని గ్రంథకర్తృనామమును గాని - స్మరింపలేదు. తెలుగునుండి విషయమును గ్రహించినను అర్వాచీనుఁడు ప్రాచీనుని గాని, అతని గ్రంథమును గాని స్మరింపమానెను. అప్పకవి కావ్యలక్షణమును వివరించుచున్న

1. నాట్యశాస్త్రము అధ్యా. 32. ధ్రువలక్షణాధ్యాయము.

చూడామణియందలి విషయము నే అమూలా గ్రముగ గ్రహించినను పెద్దయను స్మరింపలేదు.[1]

3. ఆంధ్రాలంకారికులు సంస్కృతమునుండి విషయమును గ్రహించునపుడు ఒకే గ్రంథము- లేదా-దానితో విరోధించని గ్రంథములను ఏర్చుకొనక—విభిన్న కాలికములు, పరస్పరము పొందికలేని యనేక గ్రంథములలోని విషయములనే ఏరుకొనెడివారు. అట్లొనర్చునపుడు పరస్పర విషయవిరోధము కలుగుట సాధారణము. కాలమునుబట్టి అభిరుచులును, ఆశయములును మాఱుచుండును. కాన రసైకజీవనమగు సాహిత్యశాస్త్రము యొక్కయు, తల్లక్షణముల యొక్కయు సంగతి చెప్పబనిలేదు. ప్రాచీనుల పద్ధతులువేఱు. వారి మతమున రసము అలంకారములలోగాని, గుణములలోగాని అంతర్భవించును; వారి మతమున అది కావ్యాత్మ కాదు. అర్వాచీనులు రసమును ఇంకొక కావ్యాంగముగను అంతర్భవింపజేయక దాని ప్రత్యేకతను నిల్పిరి. తెలుగు లాక్షణికులు రెండు పద్ధతులనుకూడ అనుసరించి—ఒకే పుస్తకమున-ఒకచో కావ్యమున రసము ప్రధానమని, వేఱొకచో రసమలంకారమని-ఒకచో రీతి కావ్యాత్మయని-వఱొకచో రసము ముఖ్యమని వ్రాయుట అనుచితము.

4. విషయవివరణముపట్ల అక్కఱలేని సంస్కృతలక్షణములను వివరించినట్లే ఆంధ్రులు ప్రధానములగు తెలుగున కావశ్యకములగు లక్షణములను వివరించుట మానిరి.

5. మూలమున కఠినములగు విషయములున్నచో తెలుగువారు విడిచిరి; కొన్ని యెడల గల అనువాదములనుబట్టి అనువాదకునికి మూలాభిప్రాయమును తెలుపుటయందు ఆసక్తిలేనట్లు తెలియుచున్నది.

6. ఆంధ్రాలంకారగ్రంథములు రచనయందు సంస్కృతమున కత్యంత విలక్షణములు. సంస్కృతమున లక్షణోదాహరణములు పద్యరూపమునన్నను వివృతి-అందఱికిని తెలియునట్టుల వచనమునం దుండుటయే సామాన్యము. ప్రాచీన గ్రంథములగు కావ్యాలంకారము, కావ్యాదర్శము మొదలగు కొన్నింటియందు మాత్రము వివృతియు పద్యములందేకలదు. కాని ఆ పద్ధతి అరుదు. తెలుగు లక్షణగ్రంథములు పద్యరూపములు. వివృతియు పద్యరూపమే. కొలది లాక్షణికులు తప్ప తక్కిన సంస్కృతలాక్షణికులెల్లరును తమ లక్షణములకు ప్రమాణములగు నుదాహరణములను పైవారి గ్రంథములనుండియే యేర్చి కూర్చెడివారు. కాని ఆంధ్రాలంకారికులందఱును స్వయంకృతోదాహరణపద్యములనే యిచ్చుచున్నారు.

సంస్కృత లక్షణగ్రంథములలో నీయఁబడు నుదాహరణములు సరియగు పద్ధతిలోనుండును. ఆంధ్రాలంకారికులుకూర్చిన స్వోదాహరణములు పయితము కొన్ని లక్షణముల కనుకూలములుగా లేకున్నవి. దానికిఁగల కారణముగమనార్హము. ఆంధ్రాలంకారికులు సామాన్యముగ అర్వాచీన గీర్వాణాలంకారికుల ననుసరించి, వారి గ్రంథములకు భాషాంతరీకృతులనో, విషయసంగ్రహమునో చేయుచుండెడివారు. [2]అప్పకవి తొమ్మిది సంస్కృతాలంకార గ్రంథములను మాత్రము పేర్కొనెను. అందులో ప్రతాపరుద్రీయము కంటె ప్రాచీనములగు గ్రంథములులేవు. ప్రతాపరుద్రీయాదులు నవీనగ్రంథములు.

కావ్యాలంకార చూడామణి, కవిజనాశ్రయము అనంతునిఛందము మొదలగువానియందు ప్రాచీన గ్రంథములందలి విషయములున్నను అవి అత్యల్పములు. వానియందలి విషయముకూడ స్వల్పము.

ఆంధ్రమున స్వతంత్రములగు నలంకారగ్రంథములులేవు. కాని ఇప్పుడిప్పుడు కొందఱు పాశ్చాత్యభాషా విద్వాంసులు, భాషాంతరముల బరిశ్రమ చేసినవారును తక్కిన భాషల లక్షణములు తెలుగునకు సమన్వయించుచు కొన్ని విమర్శగ్రంథములను వ్రాయుచున్నారు. వాఙ్మయము వేఱయినను ప్రయోజన మన్ని వాఙ్మయముల కొక్కటే; భాషలు వేఱయినను భావములన్ని భాషలయందు నుసమానములే. కాన భాషాంతరగ్రథితములగు సాహిత్య లక్షణములు ఆంధ్ర

---

1. అప్పకవీయము-ప్రథమాశ్వాసము. 'తదదోషౌ...' సూత్రవివృతి.

పెద్దయ-దండ్యాదులు.

2. అవి యెయ్యవియనినఁ బ్రతాపరుద్రీయంబును, కువలయానందంబును, చంద్రాలోకంబును, రసమంజరియును. (అప్పకవీయము, పు. 14.)

మునకును అనుగుణములగును. అవి యనుసరణము లయినను, అనువాదములయినను తెలుగునకు కొఱఁతలేదు.

## ఆంధ్రవాఙ్మయము-సాహిత్యశాస్త్రము

ఆంధ్రభాష ద్రావిడభాషలలోఁ జేరినను దానికి అన్నివిషయములందును సంస్కృతాను సారిత్వము తప్పలేదు; ఒక్క తెలుఁగేకాదు. ద్రావిడ భాషలన్నియును సంస్కృతాను సారులని అందఱు నంగీకరించుచున్నారు. లక్షణకర్తలన్ని ద్రావిడ భాషలయందును 'సంస్కృత సమ' భేదము నొప్పికొనియున్నారు. ఎంత పారతంత్ర్య మున్నను, ఏ భాష కయినను కొన్ని స్వతంత్రలక్షణము లుండుట సహజము. అట్టి లక్షణములు తెలుఁగునకు గలవు. లక్షణగ్రంథములనుబట్టి చూచినచో ఛందో వ్యాకరణ విషయములందుమాత్ర మాంధ్రమునకు ప్రత్యేకత స్పష్టముగఁ గన్పడు చున్నది. అలంకార శాస్త్రవిషయమున-తెలుఁగు సంపూర్ణముగ సంస్కృతానుసారియే యని చెప్పవలసి వచ్చుచున్నది.

వాఙ్మయ చరిత్రకారుల సిద్ధాంతము లెట్టు లున్నను, నన్నయ భారతభాగమునుబట్టి భాషా వాఙ్మయము లానాటికే సుప్రతిష్ఠితములయి, కావలసిన పరికరములను సంపాదించుకొని, నాగరక భాషావాఙ్మయముల పగ్దున కెక్కినవని చెప్పవలెను.

అప్పటికే సంస్కృతసాహిత్య శాస్త్రమున పరస్పర విభిన్నమార్గ ప్రతిపాదకములగు ప్రాచీన గ్రంథములును, ఒకదానిపయి మఱొకటి యొనర్చు ఖండనములును వ్యాపించి నవి. నన్నయనాటికి సర్వామోదకరము గు నూతన మార్గమును ప్రదర్శించి, అలంకారభాష్యమను పేరుగడించిన కావ్యప్రకాశము వెలువడినది. అది తన సమ్మోహనశక్తిచే ఆంధ్రమునుకూడ వశపఱచుకొనినది. అదివఱకే కొన్ని శాసనములు అనుప్రాసాది శబ్దాలంకారములతోడను, ఉపమా రూపకాతిశయోక్త్యాద్యర్థాలంకార ములతోడను కూడి,నన్నయకు కొంత మార్గమును చూపినవి. ఆమార్గము, సంస్కృతాలంకార గ్రంథమార్గము చేరి భారతాంధ్రీకరణమున నన్నయకు చేదోడు, వాదోడు అయినవి. సాహిత్య శాస్త్రతత్త్వమును సమగ్రముగ గ్రహించుటచేతనే కాఁబోలు అతఁడు మూల గ్రంథము సుహృత్సమ్మితమగు నితిహాసమయినను అనువాదమును రసవత్కావ్యముగ రచింపఁ గడఁగినాఁడు. [1] ఇతిహాసఫక్కిని యథా మూలానువాద మొనరింపక అగ్రాహ్యములను విడిచి, గ్రాహ్యములను గ్రహించి, మూలమునకు మెఱుగు పెట్టి కావ్యమార్గము నవలంబించినాడు. శ్రీ రాజరాజనరేంద్రుఁడును నన్నయను భారతార్థమును తెనుఁగున వెలయింపఁ గోరెనుగాని యథామూలానువాదమునపేక్షింపలేదు. నన్నయ తిక్కనాదులకు మార్గదర్శకుఁ డయినాఁడు.

తెలుఁగున మొదట వెలువడినదే కావ్యము. ఆంధ్రమున ప్రభుసమ్మిత సుహృత్సమ్మిత వాఙ్మయముల కవకాశము లేనేలేదు. లక్షణగ్రంథ ములు వ్యాకరణాదులింగు కేవలము (సంస్కృతమునవలె సర్వసాధారణములు కాక) కావ్య వాఙ్మయ సంబద్ధములు. 'నృసింహపురాణము' మొదలగువానిలోని నామైకదేశమగు 'పురాణ' పదము మూలగ్రంథ నామమును బట్టి వచ్చినదే కాని యథార్థము కాదు.

సంస్కృతాలంకారికులు వైదిక, సంస్కృత వాఙ్మయములందలి అలంకారవిషయములనుకనుగొనుటకు చాల పరిశోధనలు చేయవలసివచ్చినది. తెలుఁగున నట్టి కష్టమున కవశ్యకతయేలేదు. ఒక్క నన్నయ భారతభాగమునందే పెక్కు అలంకారములను సమన్వయింపవచ్చును. అందు ప్రాచీనాలంకారిక లక్షణములేకాక నవీనాలం

1. క. జననుత కృష్ణద్వైపా
యనముని వృషభాభిహిత మహాభారత బం
ధనిరూపితార్థ మేర్పడఁ
దెనుఁగున రచియింపు మధికధీయుక్తి మెయిన్. [ఆ-1-16.]

..............................

వ. అయినను దేవా నీయనుమతంబున విద్వజ్జనంబుల యనుగ్రహంబునం జేసి నా నేర్చు విధంబున నిక్కావ్యంబు రచియించెదనని... [భార-ఆది-1-20]

కారికల అలంకార లక్షణములును సమన్వ యించును. కొన్ని వర్ణనములపట్టున ప్రాచీన లక్షణములకంటె నవీనలక్షణములే లెస్సగ సమన్వయించుచున్నవి. [ఉ. అప్రస్తుతప్రశంస. మొ.] ప్రాచీనులు ప్రత్యేకముగ నంగీకరింపనివి నవీను లంగీకరించినవియు నగు అసమము,[1] ప్రౌఢోక్తి మొదలగు నలంకారము లిందు కనబడుచున్నవి. అసమాలంకారము నన్నయకు పూర్వమున వెలసిన శాసనములందును తెలుచుగ కన్పించుచున్నది.

దాక్షిణాత్యులు సామాన్యముగ దాక్షిణాత్యాలంకారికుఁడగు దండ్యాచార్యునే ప్రమాణీకరించెదరు; అట్లగుటచేత 'కావ్యాదర్శ' భాషాంతరీకృతి 'దండియలంకార' మను పేర ప్రాచీనకాలమునందే వెలువడినది. ప్రాచీనాంధ్రకవులు ప్రథమాలంకారికుఁడు చాలవఱకును దండి మతమునే అనుసరించెను. విన్నకోట పెద్దన కంటె ప్రాచీనుఁడగు కవిరాజశిఖామణి నన్నె చోడదేవుఁడు తన కుమారసంభవమున అలంకారవిషయమును చెప్పుచు కావ్యమున 18 వర్ణనములు, 10 గుణములు, 36 అలంకారములు, 9 రసములు మొదలగునవి యుండునని వివరించెను.[2] ఒక్క రస విషయమును విడిచిన పయి విషయ వివేచనము దండికావ్యాదర్శమునకే ఎంతయు సరిపడియున్నది. దండి శాంతమును విడిచి రసముల నెనిమిదింటినే గ్రహించెను. నన్నెచోడుఁడు శాంతమునుకూడ ఒప్పుకొనెను. మఱియు నతని కుమారసంభవమునకు మూలప్రాయమగు కుమారసంభ వైకదేశమును, దాని నుదాహరణముగ గ్రహించిన కావ్యాలంకారసంగ్రహోఖ్యాలంకార లక్షణమును (లక్ష్య, లక్షణములు రెండును ఉద్భటకృతములు.) రసములు తొమ్మిదేయని చెప్పుచున్నవి. కావున నే నన్నెచోడుఁడు రసవిషయమున దండిమార్గమును విడిచెను.

కుమారసంభవమున దండిననుసరించి 36 అలంకారము లని చెప్పినంత మాత్రమున కవిరాజశిఖామణికాలమునకన్నియే అలంకారము లుండవలెనుగాని, ఎక్కువ ఉండరాదని చెప్ప వీలులేదు. దండిమార్గానుయాయి అనుటచే అతఁడట్లు వ్రాసెననియు, నన్నయకాలమునాటికే దండ్యాచార్యుఁడు చెప్పని క్రొత్తయలంకారములు కొన్ని తెలుగున చేరినవనియు చెప్పవలెను. ఇంతయేల? కవిరాజ శిఖామణి యెఱిఁగి యున్న కావ్యాలంకార సంగ్రహమునందే నలువదియొక్క అలంకారము లంగీకరింపబడి యున్నవి.

ఆంధ్రమున లేకున్నను సంస్కృతమున నన్నయ నాటికే అలంకార లక్షణము (శాస్త్రము) బాగుగ వ్యాప్తిచెందినది; నన్నయ తన కావ్య రచనమున దానిని తగినరీతి నుపయోగించుకొనినాఁడు. ప్రథమాంధ్ర గ్రంథమగు నతని భారత భాగముననే అలంకారలక్షణములు సుస్పష్టము లగుచున్నవి. కావున అర్వాచీనుల గ్రంథములందలి వానిస్థితిని వేఱుగ వివరింప బనిలేదు.

---

1. సామ్యమును నిషేధించుట అసమమనునలంకారము. ఉదా:- ఓ రాజా! నీకు సాటియగువాఁ డిదివఱకు లేఁడు; ఇప్పుడులేఁడు. ఇకపయినిఉండఁ బోఁడు.

2. క. వనజలకేళీరవిశశి, తపనోదయమంత్రకరిరతక్షితి వరణాం
బునిధిమధుబుతు పురోద్యా, హనగవిరహదూత్యవర్ణనాష్టాదశముల్.

వ. పరిపూర్ణంబైన దశప్రాణంబుల సప్రాణంబై, నవరస భావభరితంబై, షట్త్రింశదలంకారాలంకృతంబై, రమణీయంబైన.......... (1. 44, 45)

పాల్కురికి సోమన బసవపురాణము, పండితారాధ్య చరిత్ర.

# విన్నకోట పెద్దయకవి

## ౧

తెలుఁగున వెలసిన మొదటి యలంకార గ్రంథము కావ్యాలంకార చూడామణి. అలంకార శాస్త్రవిషయములతోఁబాటు ఛందో వ్యాకరణాంశములు కూడ ఇందు వివరింపఁబడినను, అవి రెండును గలిపి మూఁడాశ్వాసములలో సంగ్రహముగనే చర్చింపఁ బడినవి. ఇందలి [1] ఆశ్వాసాంత గద్యములుకూడ ఇది అలంకారశాస్త్రమనియే పేర్కొనుచున్నవి.

కావ్యాలంకార చూడామణిని రచించినవాఁడు విన్నకోట పెద్దయకవి, నియోగి బ్రాహ్మణుఁడు; కౌశిక గోత్రుఁడు; గోవిందామాత్యుని పుత్రుఁడు. ఇతఁడు తన గ్రంథమును రాజమహేంద్రవర నగరాధీశ్వరుఁడును, చళుక్య వంశ సంభవుఁడు నైన విశ్వేశ్వరరాజున కంకితమిచ్చెను. ఈ విశ్వేశ్వరరాజుం గూర్చియు, పెద్దయకవిం గూర్చియు శ్రీ వీరేశలింగము పంతులుగారు కవుల చరిత్రయందు క్రింది విషయము వ్రాసియున్నారు.

"విశ్వేశ్వరమహారాజు విశాఖపట్టణమండలమునందలి సర్వసిద్ధి కీశాన్యముగా మూఁడు క్రోశముల దూరమున్న 'పంచధార'లవద్ద శ్రీ ధర్మలింగేశ్వరస్వామి కొక మండపమును కట్టించినట్లచటి శిలాశాసనమువలనఁ దెలియవచ్చుచున్నది. శాసనమున మండపమును గట్టించిన సంవత్సరము సూచింపఁబడలేదు; కాని, విశ్వేశ్వరుని వంశవృక్షము మాత్రము క్రిందివిధమున నీయఁబడినది- 1. భీమేశ్వరుఁడు; అతని కుమారుఁడు 2. విమలాదిత్యుఁడు; 3. తత్పుత్రుఁడు రాజనరేంద్రుఁడు; 4. అతని కొడుకు కులోత్తుంగ చోళదేవుఁడు; 5. తత్సుతుఁడు విమలాదిత్యుఁడు; 6. అతని తనయుఁడు మల్లప్పదేవుఁడు; 7. అతని నందనుఁడు ఉపేంద్రభూపాలుఁడు; 8. తత్తనయుఁడు కొప్పభూపాలుఁడు; 9. అతనికొడుకు మనుమోపేంద్రుఁడు; 10. అతని తనయుఁడు విశ్వేశ్వరరాజు - దీనింబట్టి చూడ, విశ్వేశ్వరరాజు రాజనరేంద్రున కేఁడవ మనుమఁడైనట్లు తెలియుచున్నది. పెద్దయకవి కావ్యాలంకార చూడామణియందు మీఁది కృతిభర్తృవంశమును పూర్తిగా నీయలేదు; కాని, యిచ్చినంతవఱకును మీఁది వంశవృక్షమునకు సరిపడియేయున్నది.[2] రాజనరేంద్రుఁడు క్రీ. శ. 1064 వ సం. వఱకును రాజ్య మేలినట్లు నిశ్చయింపఁబడినది; తక్కిన విశ్వేశ్వరుని పూర్వులార్గురు నొక్కొక్కఁడు నలుబది సంవత్సరములు రాజ్య మొనరించిరని యనుకొన్నను, విశ్వేశ్వరరాజుకాలము [40 × 6 = 240 + 1064 = 1304] క్రీ. శ. 1304 వ సం. కంటె నవీనమగునదికాదు"

పయి కాలనిరూపణము యుక్తిదూరమని శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు విభవ సం॥ భాద్రపదమాస 'భారతి'యందు వివరించి పెద్దయకవి కాలమును, శ్రీ విశ్వేశ్వరభూపతి కాలమును క్రింది రీతిని నిర్ణయించి యున్నారు.

"శాసనమునందు విమలాదిత్యుని కొడుకు రాజనరేంద్రుఁడు, అతనికొడుకు కులోత్తుంగ చోడకేసరి, అతని వంశమున విమలాదిత్యుని కొడుకు మల్లపదేవుఁడు, అతని పుత్రుఁడుపేంద్రుఁడు, ఉపేంద్రుని కొడుకు మల్లపదేవుఁడు (2), అతనికుమారుఁ డుపేంద్రుఁడు (2), అతని కుమారుఁడు కొప్పభూపతి, కొప్పభూపతిపుత్రుఁ డుపేంద్రుఁడు (3), అతని

---

1. '..శ్రీ మధుమారమణ చరణారవిందవందన, గోవిందామాత్యనందన, వివిధబుధవిధేయ, విన్నకోట—పెద్దయనామధేయ విరచితంబైన కావ్యాలంకార చూడామణియను నలంకార శాస్త్రంబునందు'.

2. సీ. శ్రీకంఠచూడాగ్ర శృంగారకరణ మేరాజున కన్వయారంభ గురుఁడు,
చాళుక్యవంశ భూషణుఁడు శ్రీ విష్ణువర్ధనుఁ డే మహీశు తాతలకుఁదాత,
భృతకుమారారామ భీముండు చాళుక్యభీముఁ డే నృపకులాబ్ధికి విధుండు,
రాజమహేంద్ర పరస్థాత రాజనరేంద్రుఁ డెక్కువ తాత యేవిభునకు,
సంద్రధరదానవోపేంద్రుఁడగు నుపేంద్రుధరణి వల్లభుఁ డే రాజు తండ్రితాత,
ఘనుఁ డుపేంద్రాఖ్యుఁ డెవ్వని కన్నతండ్రి యతఁడు విశ్వేశ్వరుఁడు లక్కమాంబ
సుతుఁడు. [చూడా. 1-4]

పుత్రుఁడుమనుమో పేంద్రుఁడు, మనుమోపేంద్రుని కొడుకు విశ్వేశ్వరభూపతి, అని తెలుచున్నది.

శాసనమున విశ్వేశ్వరభూపతి మండపమును కట్టించినసంవత్సరముకూడ నిట్లు తెలుపఁబడినది.

'శాకాబ్దేనవ బాహురామశశిసం
ఖ్యాతే శుచౌ భాసితే
సప్తమ్యా మినవారభాజి మహితః
సంస్థాపితో మండపః।
కల్యాణోత్సవ సిద్ధయే సవిభవః
శ్రీ పంచధారాపురీ
ధర్మేశస్య చళుక్య విశ్వధరణీ
భర్తా విచిత్రాస్పదమ్.'

ఇందువలన విశ్వేశ్వరభూపతి మండపమును కట్టించినది నవ-బాహు-రామ-శశిసంఖ్య అనఁగా 1329, శకసం, అని తెలుమన్నది. కావున విశ్వేశ్వరభూపతి శ. సం. 1329 అనఁగా క్రీ. శ. 1407 ప్రాంతమువాఁడు. క్రీ. శ. 1304 వందసంవత్సరముల తరువాతివాఁడు. ఈ శాసనముననే విశ్వేశ్వరభూపతి సర్వసిద్ధివద్ద చిత్రభాను సంవత్సరమునకు సరియయిన శకవర్షము 1424 ప్రాంతమున శత్రువుల నోడించెనని క్రింది శ్లోకమున శ్లేషింపఁ బడినది.

'గతి శాహుశక్తి భూమితి
మవిగణయత్సర్వ సిద్ధిపదభగ్నం,
సతి చిత్రభానుసాక్షిణీ
ధరణివరాహోదధావ దాంధ్రబలమ్.'

గతి-బాహు-శక్తి క్షమలకు సరియైన శకవర్షము 1821. ఈ శ్లోకమునకు సరియైన తెలుఁగుసేతయే పెద్దన కావ్యాలంకార చూడామణి ఏడవ యుల్లాసమున-

'ఆ. చతురుపాయబాహు-శక్తిక్షమావళి
బాఱవిడిచి చిత్రభాను సాక్షిఁ
బాఱెసర్వసిద్ధి పదమేది ధరణీవ
రాహమునకునోడి రాచకదుపు.'

అని యుండుటచేత శాసనరచయితకూడఁ బెద్దనయేయయి యుండును. కావ్యాలంకార చూడామణి నాతఁడు శా. స. 1324 న చిత్రభాను సంవత్సరమునకుఁ దరువాత రచియించి యుండును.'' ఇందు శ్రీ శర్మగారి కాలనిర్ణయమే యుచితమని చెప్పవలెను.

పెద్దయకవి రచనము ఒక్క- చూడామణియే లభించినది. ఇతఁడు తన గ్రంథాంతరములను తన లక్షణగ్రంథమునందు పేర్కొ-నలేదు. 'ప్రద్యుమ్నచరిత' మితని కృత్యంతరముగా శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు వ్రాసియున్నారు. (చూ. ప్రబంధ మణిభూషణపుఁ బీఠిక; కుమారసంభవము అథమ్నాచికలు.) కాని 'ప్రద్యుమ్న విజయము'ను రచించిన యాతని యింటిపేరు పొన్నాడవారు; విన్నకోట వారుకాదు. (చూ. ప్రబంధ రత్నావళి పీఠిక శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిలుగారు.)

కావ్యాలంకారచూడామణి యేసంస్కృతాలంకార గ్రంథమునకును సరియగు ననువాదము కాదు. ఓరుగల్లులేక వరంగల్లు [ఏకశిలా] నగరమును రాజధానిం జేసికొని త్రిలింగదేశమును పరిపాలించిన ద్వితీయ ప్రతాపరుద్రదేవుని యాస్థానముననుండిన విద్యానాథ పండితుఁడు సంస్కృతమున రచించిన 'ప్రతాపరుద్రయశోభూషణ'మను నలంకారశాస్త్రము దీనిలో గొంత భాగమునకు మూలము. రస, భావ, నాయికా, నాయక, దోషస్వరూప నిరూపణము చాల వఱకు మీఁది మూలము ననుసరించినది. కావ్యభేద, గుణాలంకార విషయములలో దీనికి మూలము దండికృతమగు కావ్యాదర్శము. ఈ రెండు గ్రంథములేకాక కావ్యప్రకాశము మొదలగు నితరగ్రంథములును గ్రంథరచనమున నుపయోగించినట్లు 'శక్తిగ్రాహకములు' మొదలగు విషయములంబట్టి చెప్పవచ్చును. ఇందలి ఛందోవ్యాకరణభాగములు కవి స్వయంరచితములు. కాఁగా నిందలి యలంకార భాగమునకు కావ్యాదర్శ, ప్రతాపరుద్రీయములు స్థూలమూలము లనియు, తక్కి-నవి కవిస్వయంకృతములనియు, నందుచే నిదియొకరీతి స్వతంత్రగ్రంథమనియుఁ జెప్పవచ్చును. అతనికిఁ దన యేలిక యొసఁగిన యానతిని బట్టికూడ నిది మిశ్రలక్షణ గ్రంథముగ వెలయవలయుననియే కవికోరిక యైనట్లు తెలియుచున్నది.[1] ఇతఁ డేగ్రంథమునుగాని, గ్రంథకర్తనుగాని (తనకు ఉపయోగించిన వానిని) తలపలేరు.

---

1. ఉ. భావరస ప్రపంచమునఁ బర్వు నలంకృతిలక్షణంబు, ఛం
దోవిచితి ప్రకారము, కుతూహల విస్ఫురదంధ్రదేశ భా
షా వివిధప్రసంగములె చందమునందముగా నొనర్చి, వి
ద్యావిధి గానిపించుటగదా చతురత్వమనంగ మేదినిన్! [1-11]

కావ్యాలంకార చూడామణి తొమ్మిదియుల్లాసముల గ్రంథము. మొదటి యేడుల్లాసములను మాత్రము శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిల వారు 1909 వ సం. న ముద్రించి ప్రకటించిరి. పిదపఁ గొంతకాలమునకు శ్రీ ఆంధ్రసాహిత్య పరిషత్తువారు పరిశిష్టోల్లాసద్వయమును సంపాదించి ప్రత్యేక గ్రంథముగఁ బ్రకటించిరి. 1929 సం. న వెలసిన నూతన ముద్రణమున శ్రీ శాస్త్రి గారు చివరి రెండుల్లాసములను గూడఁ జేర్చిరి.

ఇందలి ప్రథమోల్లాసమున, భావము, విభావానుభావ, సాత్త్విక వ్యభిచారిభావములు, స్థాయిభావములు లక్షణోదాహరణములతో కలవు. ద్వితీయోల్లాసమున శృంగారము, దాని భేదములు, చేష్టలు, అవాంతరభేదములతోఁ గూడిన హాస్యాద్యవశిష్టాష్టరసములు వివరింపఁబడినవి. తృతీయోల్లాసము నాయికా నాయకులు, నాయకసహాయులు, నాయికా సహాయులు. సప్తవిధకవులు, అష్టాదశవర్ణనములు అను వానిని వివరించుచున్నది. చతుర్థోల్లాసమున కావ్యభేదములు, ద్రాక్షాదిపాకములు, వృత్తులు, రీతులు, గుణములు మొదలగువాని నిరూపణ కలదు. పంచమోల్లాసము అర్థాలంకారములను, షష్ఠోల్లాసము శబ్దాలంకారములను, పదవాక్యార్థదోషములను వివరించుచున్నది. అలంకార విషయ ప్రతిపాదకము లీయాఱుల్లాసములే. సప్తమోల్లాసమును, అష్టమోల్లాసమును ఛందోవిషయ నిరూపణతో ముగిసినవి. నవమోల్లాసము వ్యాకరణాంశ ప్రతిపాదకము.

ఏదో యొక గ్రంథమును గాక పెక్కు గ్రంథముల ననుసరించి వ్రాయఁబడిన గ్రంథములలో పొందికలేనివి, విరుద్ధములు నగు అభిప్రాయములు చేరవచ్చును. అన్ని గ్రంథములను బాగుగ పరిశీలించినఁగాని విరోధములు లేకుండ విషయమును నిరూపించుట దుర్ఘటము. పెద్దయ కవి రసభావాదిస్వరూపనిరూపణమున విద్యానాథుని మతమును, రీతి విషయమున వామనమార్గమును, గుణస్వరూప వివేచనమున దండిపద్ధతిని అనుసరించెను. కాలభేదమునుబట్టి వారి మతములు భేదించినవి. అన్నిమతములకును ప్రాధాన్యము నొసఁగుచు పెద్దయకవి మతభేదములను లెక్కింపక పరస్పర విరుద్ధము లగు విషయములను పెక్కింటిని చేర్చెను; కొన్నిటికి లక్షణము పొందలేదు; కొన్ని లక్ష్యములు తల్లక్షణముల కననుగుణములు; కొన్ని తెలుఁగున కుపయోగింపని విషయములు వివరింపఁబడినవి; ఉపయోగించునట్టి కొన్ని విడువఁబడినవి.

1. రసాభివ్యక్తికిఁ గల కారణములలో విభావము కలదు. అది ఆలంబనము అని, ఉద్దీపన మని రెండువిధములు. రసమునకు సమవాయకారణము (ఏది లేక రసము కలుఁగదో అది సమవాయకారణము) నాయకుఁడు, నాయికయు. నాయికానాయకుల గుణము, చేష్ట, అలంకారము, తటస్థము ఉద్దీపనవిభావములు. ఇది అలంకారశాస్త్ర సంప్రదాయము. పెద్దయ నాయికానాయకులను ఆలంబన విభావముగా లెక్కింపక వారి రూపయౌవనకాంతులనే లెక్కించెను. అది సంప్రదాయ విరుద్ధము. [1] ఉద్దీపనవిభావములలోఁ గూడ తిరిగి పయివానినే పేర్కొనెను. [2] లక్ష్యములు లక్షణానుగుణము లయి పరస్పరము భేదము లేక యున్నవి. ఇచటఁ బూర్వాపరవిరోధమును కలుగుచున్నది.

2. చూడామణియందు స్థాయిభావలక్షణము 'ఆత్మసంభావిత విభావకానుభావ, సాత్త్వికవ్యభిచారిసంజ్ఞలఁ దనర్చు భావములచేత సువ్యక్తభంగులైన, వాని రసికులు స్థాయిభావంబు లండ్రు' అని కలదు. (పుట. 12) కాని సజాతియభావములచేతఁ గాని, విజాతీయ భావముల చేతఁగాని అపహృతముగాక రసాభివ్యక్తి పర్యంతమునుండు స్థిరమగు భావము స్థాయి. మీఁదిది రసమునకు లక్షణము కాఁగలదు.

3. 'అతి వికృత దర్శనాభాషిత చేష్టాగతుల చేతఁ జేపడు హాసప్రతిపాదన'ము హాస మని హాసలక్షణము. దాని యుదాహరణము దానికనుగుణముగ లేదు. [3] అందలిహాసము వికృత

---

1. క. ఆలంబనంబు నాఁగరసాలంబన మైనరూప యౌవనకాంతి
శ్రీలావణ్యాదిక; మదిమూలము తద్వ్యక్తికిన్ బ్రమోదప్రదమై.

2. సీ. రూపలావణ్యతారుణ్యాదిశారీర
గుణము లాలంబనగుణములరయ. (చూడా. పుట. 4.)

3. క. చాళుక్యవిభునిఁ దలఁచిన హేలల నీ నుదుటిచేత, నెఱిఁగి తినుచున్
లీలాహాసము నకు నావాలముఁ గావించెనింతి వదనోదరమున్. (18 పుట)

దర్శనము వలనఁ గల్గినది కాదు ; అది శృంగార రసానుకూలము. హాస్యోదాహరణమును పయి రీతిగనే అననుకూలము. [1] 13 వ పుటయందలి జుగుప్సోదాహరణమున జుగుప్స వ్యక్తముగ లేదు. 14 వ పుటయందలి విస్మయోదాహరణమున 'విస్మయ' పదము ప్రయోగింపఁ బడినది. భావములు, అందును స్థాయిభావములు పేరితో చెప్పఁబడకూడదు.

**4.** నాయకుఁడు ధీరోదాత్త, ధీరోద్ధత, ధీరలలిత, ధీరశాంత భేదములచే నాల్గు విధముల నుండును. ధీరోదాత్తుఁ డెన్నఁడును ధీరోద్ధతాదులలో నన్యతముఁడు కాఁజాలఁడు. అట్లే ధీరోద్ధతాదులును. ఈ గ్రంథములోని ధీరోదాత్తుఁడు విశ్వేశ్వరభూపతియే తిరిగి ధీరలలితుఁడుగ చెప్పఁబడెను. (పుటలు 31, 2).

**5.** దండి కావ్యభేదములను 'గద్యం, పద్యంచ మిశ్రంచ తత్త్రిధా పరికీర్తితమ్' అని మూఁడు విధములుగ పేర్కొనెను. ఈ భేద పరిగణనము సంస్కృతమునకు సరిపడును; తెలుఁగునకు సరిపడదు. ఆంధ్రమునందలి పద్య కావ్యములు సామాన్యముగ గద్యసహితములు. అవన్నియును పద్యకావ్యము లనియే వాడుక. మిశ్రకావ్యములుగ ప్రసిద్ధములు కాలేదు. మఱియుఁ బెద్దయకాలమునకు ఆంధ్రమున వచనగ్రంథములు వెలువడలేదు. కావునఁ బయి సంస్కృతమూలము ననుసరించి 'అట్టి కవికృతమైన కావ్యత్రయంబు, గద్యపద్య విమిశ్ర సంపాద్య మంద్రు.' (పుట 41.) అని ఆంధ్రానుపయుక్తముగ విభాగ మొనర్చుటకుఁ దగిన ఫలము లేదు. ఈ విభాగమే తిరిగి 18 వ పుటయందును కలదు. అచ్చట నితఁడు మిశ్రకావ్యములలో రూపకములను, నాటకములను, చంపూకావ్యములను లెక్కించెను. అప్పటి కాంధ్రమున నాటకములు గాని చంపూగ్రంథము లను ప్రత్యేకగ్రంథములు కాని లేవు. న్యాయమునుబట్టి యితఁడు విద్యానాథాదుల వలె 'ధ్వని, గుణీభూతవ్యంగ్యము, చిత్రము' అను భేదములనే వివరించుట మంచిది. [2] ఉత్తమకావ్యమగు ధ్వనియు నొకచో లక్షణోదాహరణములతో వివరింపఁ బడినది.

**6.** వృత్తి (వ్యాపార) సాహాయ్యమున శబ్ద మర్థమును బోధించును. అది అభిధ, లక్షణ, వ్యంజన అని మూఁడు విధములు. ఆ వృత్తి శబ్దవృత్తి యని ప్రసిద్ధము. వాచకశబ్ద మభిధ వలన ముఖ్యమగు (వాచ్యమగు) నర్థమును, లక్షకశబ్దము లక్షణవలన లక్ష్యార్థమును, వ్యంజకశబ్దము వ్యంజనవలన వ్యంగ్యార్థమును బోధించును. పయి యంశమును వివరించు సందర్భమునఁ బెద్దయ 'అర్థవృత్తులు' అను శీర్షికక్రింద వృత్తుల స్వరూపముం దెలుపు నొక యాఁటవెలఁదిని వ్రాసెను. [3] దానింబట్టి ముఖ్యము, లక్ష్యము, గౌణము, వ్యంగ్యము నని యర్థవృత్తులు నాలుగనియు, వానివలన 'వాచ్య భేదంబులు తెలియు'ననియుఁ దెలియుచున్నది. వృత్తులభిధాదులు గాని వాచ్యాదులు కావు ; అవియు శబ్దవృత్తులు గాని యర్థవృత్తులు కావు. ఒకవేళ ఎట్లో కష్టముమీద నవి యర్థవృత్తు లని యొప్పించినను, ఆవృత్తులభిధాదులుకాని ముఖ్యాదులుకావు. అభిధకు 'ముఖ్య' యను వాడుక యున్నను తక్కినవాని కట్టి వ్యవహారము లేదు. గౌణనిరూపణ మనావశ్యకము. అది లక్షణలోనే చేరును. పయి వృత్తులవలన వాచ్యము, లక్ష్యము, గౌణము, వ్యంగ్యము నను అర్థ విశేషములు క్రమముగ కలుగునుగాని వాచ్య భేదములుమాత్రము కలుఁగవు. అచట 'వాచ్యాది

1. ఉ. కల్ప కుజంబులందెగడుఁ, గామగవిం బ్రహసించు, వట్టిసం
కల్పపురాయినవ్వు, శిబికర్ణుల చాగము నేవగించు, న
స్వల్పవదాన్య విశ్వజన వల్లభుచే సిరినొందియక్షరా
ట్కల్ప విదూషకప్రతతి గర్వితరాజ సభాంతరంబునన్.

దండిమాత్రము హాస్యమున కిట్టి యుదాహరణము నే యిచ్చియున్నాఁడు. (పుట 24)

2. క. పాకాదికృతవ్యంగ్య-వ్యాకీర్ణం బైనకావ్య మది యుత్తమమై
చేకొనఁబడు మధురార్థ-శ్రీకము ధ్వని యనెడు పేరుచేఁ జెలువొందున్. (పుట 55)

3. ఆ. ముఖ్యలక్ష్యగౌణములును వ్యంగ్యంబు నా నర్థవర్తనంబు లయ్యె నాల్గు,
వానివలనఁ గల్గు వాచ్యభేదంబుల నరసి తెలియవలయు నంద్రు బుధులు. (పుట 54

భేదము'లని దిద్ది, ఆదిపదముచే లక్ష్యోక్తులను గ్రహించినచోఁ గొంతలోఁ గొంతయైన మేలు.

7. ఇందు 'శక్తిగ్రాహకములు' అను శీర్షిక క్రింద

సీ. విహిత సంయోగంబు విప్రయోగంబును
సామర్థ్యమును సాహచర్యకంబు,
నర్థవిరోధలింగౌచిత్యచేష్టలు
పరశబ్ద సన్నిధి ప్రకరణములు,
దేశకాల క్రమాదికములు శబ్దార్థ
కవితానవచ్ఛేద కల్పనములు,
స్మృతిహేతుకములు విశేషవాక్యస్వర
వ్యక్తులు నాఁగఁ బర్యాయగతుల,
తే. నలరు నన్నింట నర్థంబు నవగమింపఁ
దగున నేకార్థయుతమై తనరుశబ్ద
సంతతుల కర్థసంధాన చతురులెల్ల;
'......................... . .'

(మాడా. 4-67) అను పద్యము కలదు.

ఇది మమ్మటుని కావ్యప్రకాశములోని విషయము. అనేకార్థములు గల పదము, సందర్భమునుబట్టి యొకే యర్థమును తెలుపును. రెండవయర్థము వ్యంజనా వ్యాపారమువలననే తెలుపఁబడును. తొలుత ఆశబ్దము ఒక్క యర్థమునే తీసికొనుటకు సంయోగము, విప్రయోగము, సాహచర్యము, విరోధము, అర్థము, ప్రకరణము, లింగము, శబ్దాంతరసన్నిధి, సామర్థ్యము, ఔచిత్యము, దేశము, కాలము, వ్యక్తి, స్వరము, చేష్ట మొదలగునవియే హేతువులు. పయివానివలన శబ్దమున కొక యర్థము నియమితము కాఁగా తక్కినయర్థము వ్యంగ్యమగును. ఉదా-'హరి సశంఖచక్రుఁడు.'— హరి యను పదమునకు విష్ణువు, ఇంద్రుఁడు, కోతి, కప్ప, పాము మొదలగు నర్థము లనేకములు కలవు. కాని ఇచట 'శంఖచక్రములతోఁ గూడిన' అను సంయోగ సంబంధ బోధక మగు విశేషణమువలన విష్ణువేయను నర్థము నిశ్చితమైనది. తక్కిన యర్థములు (విశేషార్థములు) వ్యంజనా వ్యాపారమువలనఁ గలుగుచున్నవి. ఈ యర్థ మనువాదమువలన స్పష్టపడకున్నది.

8. వామనాచార్యుని మతమున కావ్యమునకుఁ బ్రధానములు గుణములు. దాని ననుసరించి '(ప్రాణదశకయుతమగు) రీతి కావ్యమున కాత్మ' యని యతఁడు చెప్పెను. మమ్మటాచార్య, విద్యానాథాదుల మతమున ధ్వని కావ్యమున కాత్మ. అందును రసము మిగుల ముఖ్యము. ఇవి రెండును విరుద్ధము లగు మతములు. పెద్దయ కవి చాల చోట్లయందు మమ్మటాదుల మతము ననుసరించి రసమునకే కావ్యమునఁ బ్రాధాన్యమును తెలిపెను. 'అలంకృతి లక్షణంబు' 'భావ, రస ప్రపంచమునఁ బర్వు' ననియు, 'గావ్యమున వస్తు, రసాలంకార ప్రాధాన్యములు మూఁ' డనియుఁ, దన మతమునఁ గల వ్యంగ్యజీవితత్వమును, రసప్రాధాన్యమును అతఁడు వివరించెను. ఇట్లు చెప్పియు వామనమతము ననుసరించి 'రీతి' వివరణ సందర్భమున 'అఖిల కావ్యములకు రీతు లాత్మ యండ్రు; ప్రాణదశకంబు వానికిఁ బ్రాణ మరయ'అని మీఁదఁ జెప్పిన మతమునకు విరుద్ధముగఁ జెప్పెను.

9. పెద్దయ యొనర్చిన గుణ స్వరూప నిరూపణము దండికావ్యాదర్శము ననుసరించుచున్నది. 'అల్పప్రాణవర్ణము లెక్కువగ నుండునది శిథిలము; ఆ శైథిల్యము లేనిదే శ్లిష్టము. శైథిల్యమునకు 'మాలతీమాల లోలాలికలిల' అని యుదాహృతి; శ్లిష్టమునకు 'మాలతీదామభ్రమర లంఘితము' అని యుదాహరణము అని [1] మూలమునందలి శ్లేషగుణ వివరణము. పెద్దిరాజు పయిమూల లక్షణమును వివరించుచు వేఱురీతిగ లక్షణమును

'క. అశిథిలపదబంధురమై
విశదాల్పప్రాణవర్ణ విస్పష్టంబై
విశదగతి నొప్పు శ్లేషము
విశేషకావ్యములకెల్ల విభవప్రదమై'

అనివ్రాసెను. అందలి శ్లేషగుణ వివరణమిట్లున్నది.

శైథిల్యములేనిది శ్లిష్టము; ఇందు అల్పప్రాణాక్షరములు చాల తక్కువగ నుండును. ఉదాహృతి.

"మాలతీదామభ్రమర లంఘితము."

---

1. శ్లిష్ట మస్పృష్ట శైథిల్య; మల్పప్రాణాక్షరోత్తరమ్,
శిథిలం; మాలతీమాలా లోలాలికలిలా యథా.
అనుప్రాసధియా గౌడై ర్నాతి రూఢ మపేష్యతే,
వైదర్భై ర్మాలతీదామ లంఘితం భ్రమరై రితి. (కా. 1-ఉ.)

అల్ప ప్రాణాక్షరములు ఎక్కువగ నున్నది శిథిలము-ఉ. మాలతీమాల లోలాలికలిల- ఇది శ్లేషకు విరుద్ధ మైనది.

పయి శ్లిష్టమును అనువదించుచు పెద్దయ ఈ క్రిందిరీతిని వ్రాసియున్నాడు.

'క. అశిథిలపద.........'

శైథిల్యము లేక అల్పప్రాణవర్ణము లెక్కువగఁ గలది శ్లేష మని ఇతని నిరూపణము. అల్ప ప్రాణాక్షరములు గలది శ్లేష యగుట పొసగదు. 'శిథిలపదములు లేక విశదముగ అల్పప్రాణ వర్ణములు కలది శ్లేష'మని దాని యభిప్రాయము. ఇది మూలవిరుద్ధము. అల్పప్రాణ వర్ణములు కలది శిథిల మగును; అశిథిలము కాఁజాలదు.

10. మమ్మట, విద్యానాథాదుల మతమున రసము ప్రధాన మగుచో నుత్తమ మగు ధ్వని కావ్యమగును; రస మప్రధాన మయినచో రస వదలంకార మగును. దండికాలము నాఁటికి ధ్వని వాదము లేదు. అతని మతమునం దలంకారములే ప్రధానములు; కావున అతఁడు (ప్రధానము కానిండు అప్రధానము కానిండు) రసమున్నంత మాత్రమున 'రసవదలంకార మగు నని 'రసవద్రస పేశలమ్' అని సూత్రించియున్నాఁడు. పెద్దయ మతమునను మమ్మటాదులబోలె ధ్వని, రసము ప్రధానములు; 'రస మప్రధాన మగునపుడే' రస వదలంకారము; రస మప్రధాన మగునపుడు శేషోకదాని నది అలంకరింపఁజేయును కావున అలంకార మగుచున్నది. రసము ప్రధాన మైనచో అలంకార్యము అలంకారము కాదు. చూడామణికారుఁడు తాను తొలుతఁ జెప్పిన యంశమును విచారింపక దండినే అనుసరించి 'రసము సొగసుగ వర్ణింపఁబడిన రసవదలంకార' మని చెప్పియున్నాఁడు.[1]

11. దోషనిరూపణము ప్రతాపరుద్రీయము ననుసరించుచున్నది. కాని యది యనువాద పద్ధతినే యున్నది. ఆ యనువాదము లయినను కొన్ని కుదురకున్నవి. అట్టి వానిలో 'అవిమృష్టవిధేయాంశ' మొకటి. ఉద్దేశమును ప్రధానముగఁజేసి విధేయమును అప్రధానముగఁ జేయుట దాని లక్షణము. ఈ దోషమునకుఁ దటచుగ కాళిదాసుని కుమారసంభవములోని పార్వతీవర్ణన ఘట్టమునందలి 'ద్వితీయమార్వీమివ కార్ముకస్య' అను అపపాఠము నుదాహరించుట, పిదప 'మౌర్వీం ద్వితీయామివ కార్ముకస్య' అను సరి యగుపాఠమును గ్రహించి ఆ దోషమును పోఁద్రోలుటయుఁ గలదు. 'పార్వతీ దేవి మొలనూలు మన్మథుని వింటి రెండవనారి వలెనున్న' దనుట యీ వర్ణనములోని ప్రధానాంశము. ఇచట 'రెండవ మౌర్వివలె' నున్న దనుట ప్రస్తుతము; కేవలము పార్వతి మొల నూలు వింటినారివలె నున్నదని యనుటయే దీని యభిప్రాయము కాదు. 'ద్వితీయ మౌర్వీ' పద మప్రధాన మయినది. ఉద్దేశమగు 'మౌర్వీ'పదము విధేయ మైనది. (ఇట మౌర్వి నుద్దేశించి ద్వితీయత్వము విధేయ మగుటయే యుచితము.) 'మౌర్వీం ద్వితీయాం' అను సాధుపాఠమున 'ద్వితీయా' పదము ప్రధాన మగును.

పయి యుదాహరణము నే మనమునం దిడి కొని పెద్దయ విధేయావిమర్శదోషమును

'క. ఉవిదకు మొలనూలు మనో
భవు రెండవనారివోలెఁ బరఁగె ననంగా
నవిమృష్టవిధేయాంశం
బవు నతనికి రెండునారు లడరక యునికిన్.'
(పుట. 82)

అని వివరించుచు, మన్మథునికి రెండు నారులు లేనందున నిచట అవిమృష్ట విధేయాంశదోషము కలిగిన దని వ్రాసెను. ఈ నిరూపణ సరిగాఁ లేదు.

12. ప్రతాపరుద్రీయాదులు సంస్కృతలక్షణ గ్రంథము లగుటచే తద్భాషానుగుణముగ దోష లక్షణములు వానియందు నిరూపింపఁబడినవి. సంస్కృతమునఁ బద్యములలో ఛందస్సు-యతి నియతములు. ప్రాస మక్కఱ లేదు. కావున ప్రాసము లేకుండుట యొక దోషముగ వారు చెప్పలేదు. యతి, ఛందస్సు తప్పుట దోష మని వారు చెప్పిరి. తెలుఁగుల ప్రాసముకూడ నియతము; కాన ఆంధ్రలక్షణ గ్రంథములలో ప్రాస భంగమును ప్రధానదోషముగ లెక్కింపవలెను. పెద్దయ కేవలానువాదమార్గమునే యనుసరించి సంస్కృతమురీతి ఛందోయతి భంగములను దోషములుగ లెక్కించి ప్రాసభంగమును విడిచివేసెను.

13. పెద్దయకవి కావ్యాదర్శము ననుసరించి శ్లేషము, ప్రసాదము, సమత, మాధుర్యము, సుకుమారత, అర్థవ్యక్తి, ఉదారత, బీజము,

---

1. క. అసితం బగురత్నాది ప్రకరణములఁ దేజరిల్లి ప్రథమరసాదుల్
పొసఁగఁబడు నెచట నదివో రసవదలంకార మనఁగ రసికుల కెక్కున్. (పుట 66,7)

కాంతి సమాధు లనుపదిగుణముల నే వివరించెను. దండివలె దోషములను బదింటిని చెప్పక విద్యానాథు ననుసరించి ఏబదియారింటిని వివరించెను తిరిగి 89 వ పుటలో 'ఏదోషము నష్టుటకే. గుణము సమర్థమగు?' నను విషయమునివివరించు నపుడు మీఁది పదిగుణములలోఁ జేరు క్రొత్త గుణములను కొన్నింటిని లెక్కించెను. [1] అవి కావ్యాదర్శమునఁ గానరావు. పెద్దయకవి వాని స్వరూపమును తెలిపియుండలేదు. ఆ గుణములు, గుణదోషసంబంధ ప్రతిపాదనమును, ప్రతాపరుద్రీయమునఁ గన్పడుచున్నవి. ప్రతాపరుద్రీయమునంగు 24 గుణము లంగీకరింపఁబడినవి. పెద్దయ ఆ పరిగణనము ననుసరించి మీఁది రీతిని వివరించి, ఇది వఱకుఁ జెప్పిన విషయమును మఱచిపోయెను.

పెద్దయ తరువాతి ఆంధ్రాలంకారికులుకొందఱి గ్రంథములలోఁ బయిరీతి తప్పులే కొన్ని దొరలవలసి వచ్చినది. ఏమయినను ఆంధ్రమునఁ దొలుత నలంకార గ్రంథమును రచించు గౌరవము పెద్దయకే కలిగినది. ఇతని కవిత్వముధారాశుద్ధి కలిగి చాలరసవంతమయి సహృదయహృదయముల నాకర్షించు ననుటలో సందేహము లేదు.

శ్రీ వేంకటరాయశాస్త్రులుగారు దీనిప్రకాశకులగుటచే నిందు ముద్రణస్ఖాలిత్యముల కంతగా ప్రవేశము లేకపోయినది. కొన్ని యెడల మాత్రము స్ఖాలిత్యము కొంచెమైనను అర్థవిరోధము ఎక్కువ కలుగుచున్నది. ఒక్కయుదాహృతి-దోషములలో 'ఛందోభంగము'న [2] కీయఁబడిన యుదాహరణములో యతిభంగము కానవచ్చుచున్నది; ఛందోభంగము కానరాదు; పోనిండు; ఇది యతిభంగోదాహరణము కాఁదగునన్న — అనంతరోదాహరణమునఁ దిరిగి యతిభంగమే కానవచ్చుచున్నది. ఛందోభంగదోషమున కీయఁబడిన యుదాహృతి సరియైనది కావలెనన్న 'ఎందున నీ రాజునకే, చందంబున లేరుచూడ సరి జగంబులన్' అని యుండవలెను. ఇది ముద్రణమునఁ గల్గిన పొరపాటే కాని కవి పొరపాటు కాఁజాలదు.

---

1. గీ. అనుచితార్థ నిరాకరణాప్తికొఱకు, నగు నుదాత్తతఁ గావ్యంబులందుఁ జొనుప
యుక్తపాదవిసంధి విచ్యుతి యొనర్చుపనికి నూర్జస్వి కర్జంబు పద్యములను.
ఆ. తుదిఁ బతత్ప్రకర్ష దోషాపహతికినై యుక్తిరీతిఁ గావ్యమొగి నొనర్ప;

*　　*　　*　　*

క. ప్రేయోఽలంకారము దా, శ్రేయంబగుఁ బరుషదోష శిథిలతకొఱకై
చేయఁదగు నూర్జితంత్రము, హేయాశ్లీలంబుఁ దొలఁగ నెగుచుటకొఱకై. (పుట. 89)

(ఇచటి ప్రేయము గుణము కాని అలంకారము కాదు; కాన 'ప్రేయోనామక గుణ మది శ్రేయం' బని యుండవలెను.)

2. క. ఎందున నీరాజునకే చందంబున లేరు సరి జగంబుల నెల్లన్,
సుందరతను శూరత నన ఛందోభంగంబు కృతులఁ జను దోషంబై.

# అనంతామాత్యుఁడు

కావ్యాలంకారచూడామణికి తరువాతి యలంకారగ్రంథము రసాభరణము. ప్రత్యేకముగ అలంకారశాస్త్ర విషయములనే చెప్పు గ్రంథములలో ఇదియే మొదటిది. అనంతామాత్యుఁడు దీనికి కర్త.

రసాభరణపు టాశ్వాసాంతగద్యలయందు 'ఇది శ్రీవాణీ వరప్రసాదలబ్ధ వాగ్వైభవ, తిక్కనామాత్యసంభవ, సుకవిజనవిధే యానంతనామధేయప్రణీతం బైన—' అని చెప్పఁబడియున్నది. దీనింబట్టి యనంతుని తండ్రి తిక్కన యని తెలియును. ఈ తిక్కన కవిత్రయములోని తిక్కయజ్వమాత్రము కాఁడు. ఈ యంశము అనంతుని భోజరాజీయములోని

"చ. క్షితిఁ గృతికర్తృతామహిమఁ
జేకొని పంచమవేద మైనభా
రతముఁ దెనుంగుబాస నభి
రామముగా రచియించినట్టి యు
న్నతచరితుండు తిక్కకవి
నాయకుఁ డాదట మెచ్చి 'భవ్యభా
రతి'యనఁ బేరు గన్నకవి
రత్నము బయ్యనమంత్రి యల్పుఁడే ?"

అను పద్యమువల్లనే తెలియుచున్నది.

తన ముత్తాత యగుబయ్యనకు తిక్కయజ్వ 'భవ్యభారతి' యనుబిరుదము నొసఁగినాఁ'డని అనంతుఁడు ఇందు చెప్పికొనెను. అనంతునిది పండిత వంశమగుటచే ఈతని తండ్రి తిక్కన కవియు, పండితుఁడు నయి యుండవచ్చును. వీ రారువేల నియోగిబ్రాహ్మణులు; కౌండిన్య గోత్రులు.

భోజరాజీయమునందలి

సీ. విలసితంబ గుకృష్ణవేణ, మలాపహా
రిణి భీమనది నా ధరిత్రియందుఁ
దనరు నదీత్రయాంతర్వేది యగుపావ
నక్షేత్రమున శోభనముల కెల్ల
ధర నివాసం బగు పెరుచుగూరిపురంబు
నందు విద్వజ్జనానంద మైన
జీవనస్థితిచేతఁ జెన్నొందు వంశక
ర్తృత్వసంపత్తిఁ బ్రభుత్వ మొంది
గీ. నెమ్మిఁ బ్రత్యక్షపరమపద మ్మనంగ,
నొప్పు శ్రీకాకుళంబున కొడయఁ డైన
యంధ్రవల్లభహరిసేవ నలరుచుండుఁ
జెక్కుభంగుల ముమ్మడి తిక్కవిభుఁడు.'

అను పద్యమునుబట్టి 'ఈ కవియొక్క తండ్రి కృష్ణవేణ, భీమరథి, మలాపహ యనఁబడునదులు కలసిన యంతర్వేదిలో నుండె నని-అట్టి స్థల మాతని స్వస్థానమని తెలియుచున్నది.' కృష్ణవేణ యన కృష్ణానది; భీమరథియే భీమనది; మలాపహాయే మలప్రభానది. 'కృష్ణానదియు, మలప్రభానదియు, నైజాము రాజ్యమునకు దక్షిణపు సరిహద్దునొద్ద బొంబాయి రాజధానిలోఁ గలసినవి. ఇది యిప్పుడు కన్నడదేశము. కృష్ణయు, భీమయు నైజాము రాష్ట్రమునందు రాయచూర్ పట్టణమునకుఁ బశ్చిమమునఁ బదాఱుమైళ్ల మీఁదఁ గలసినవి. ఇది తెలుఁగుదేశ మని చెప్పవచ్చును. కావున నీ కవి నివాసస్థానము నైజాము రాజ్యమునం దుండెనని మన మూహింపవచ్చును. ఆంధ్రవిష్ణువు వీరికిఁ గులదైవము కావచ్చును.'

'ఆంధ్రవల్లభహరిసేవ నలరుచుండు' ననఁగా నీతఁ డాంధ్రరాయనియొద్ద నుద్యోగిగా నుండెనని కొందఱు అర్థము చేసికొనిరి. కాని యది పొరపాటు. 'ఆంధ్రవల్లభహరి' యనఁగా నాంధ్రవిష్ణువు; శ్రీకాకుళములోని దేవుఁడు. అతని సేవ చేయుట యనఁగా నతనిని భక్తితో భజించుట. ఏ గ్రామమున నే దేవుఁ డుండునో ఆ దేవుని తద్గ్రామాధిపతిగాఁ జెప్పుట భక్తుల యాచారముగా నున్నది. ఇట్లే 'ఈ కవియొక్క' రసాభరణము నందలి 'శ్రీనిండన్ ధ్రువపట్టణాధిపున కిచ్చెన్ భక్తిపూర్వంబుగన్' అన్న చరణముఁ జూచి కొందఱీగ్రంథమును ధ్రువపట్టణపురాజున కిచ్చె నని భ్రమపడుచున్నారు. అచ్చటను ధ్రువపట్టణాధిపుఁ డనఁగా ధ్రువపట్టణపు దేవుఁ డని యర్థము. ఈ కవి తనగ్రంథ మేదియు నరాంకితము చేయలేదు.'

పయి యుద్ధృతభాగములు ఆంధ్రవిజ్ఞాన సర్వస్వములోనివి. అనంతామాత్యుఁడు చెప్పిన 'ధ్రువపురి ప్రస్తుతము గుంటూరుమండలమునఁ గృష్ణానదీప్రాంతమునఁ గల ధూళిపూడియను గ్రామమా యని యూహా పొడముచున్న దని రసాభరణ పీఠికలో విద్వాన్ శ్రీ కోపల్లె శివకామేశ్వరరావుగారు తెలిపియున్నారు. కాని యట్లూహించుట కింకను తగిన ప్రమాణము లపేక్షితములు. అనంతుఁడు రసాభరణమును శాలివాహనశకము 1856 న, ఆనందనామ సం.

మాఘకృష్ణైకాదశీ భానువారమున ధ్రువ
పట్టణాధిపున కంకిత మొనరించినట్లు చెప్పి
యున్నాఁడు. అయ్యది క్రీ. శ. 1435 సం.
జనవరి 23 వ తేదీకి సరిపడుచున్నది. కావున
నీతఁడు 15 వ శతాబ్దపు ప్రథమార్థమున
నుండె నని చెప్పవచ్చును.

అనంతుఁడు భోజరాజీయము, ఛందోదర్ప
ణము, రసాభరణము నను మూఁడుగ్రంథములను
రచించెను. ఛందోదర్పణమునందలి

3. 'శా. జానొందన్ శకవత్సరంబుల్ బుతు,
శర, జ్వాలేందులై యొప్ప, న
య్యానందాబ్దమునందు మాఘమునఁ
గృష్ణైకాదశీభానుయు
క్తానామామృతవేళ నీకృతి యనం
తాఖ్యుండు సమ్యగ్రస
శ్రీ నిండన్ ధ్రువపట్టణాధిపున కిచ్చెన్
భక్తిపూర్వంబుగన్. [పు-42.]

ఉ. శ్రీనిధిచక్రవర్తి గురుశేఖర
పుణ్యకటాక్షలబ్ధసు
జ్ఞానుఁ డనంతధీమణి లసన్మణి
భోజచరిత్రఁ జెప్పె ల
క్ష్మీనరసింహుఁ గూర్చి నప్రసిద్ధుఁడు
వేఁకతో నొనర్చె ఛం
దోనుతి యోగివ్యాప్తిమల [4-130.]
తోయజవర్తి కనంతమూర్తికిన్.

అను పద్యములనుబట్టి భోజరాజీయ మతని
తొలిగ్రంథ మనియు, ఛందోదర్పణము రెండవ
గ్రంథ మనియు, రసాభరణము చివరిగ్రంథ
మనియు తెలియుచున్నది.

## భోజరాజీయము

ఇది యేఁడాశ్వాసముల చక్కని ప్రబంధము.
ఇది అహోబల నృసింహస్వామి కంకితము.
ఇందు భోజరాజును గుఱించిన వింతకథలు చాల
కలవు. కవిత్రయము వారి ప్రయోగములకంటె
భిన్నము లగుప్రయోగము లిందుఁ గానవచ్చు
చున్నవి. తిక్కనమహాకవి ననుకరించుట అనం
తుని కిష్ట మని గ్రంథమునుబట్టి తోఁచుచున్నది.

## ఛందోదర్పణము

అనంతుని ఛందస్సు అనుపేర నిది లోక
మునఁ బ్రసిద్ధము ఇందు ఛందోలక్షణములు వివ
రింపఁబడినవి. వానితోఁబాటు అలంకార లక్షణ
మునకుఁ జెందిన దోషవివేచనము నిందుఁ గలదు.
దీనిం గూర్చి 'మిశ్రమలక్షణ గ్రంథము'లలో
చర్చింపఁబడును.

## రసాభరణము

రసాభరణము నందలి '.... అనంత
నామధేయ ప్రణీతంబైన రసాలంకారంబు
నందు ..' అను ప్రథమాశ్వాసాంత గద్య
భాగమునుబట్టి దీనికి 'రసాలంకార' మనునామాం
తర మున్నదని తోఁచుచున్నది. లేదా-'ఆభరణ'
'అలంకారము'లకు అభేదమునైనఁ జెప్పవలెను.
సంస్కృతమున నాయాయి వ్యాఖ్యలయందుఁ
బేర్కొనఁబడు 'రసార్ణవాలంకారము'న కిది
యనువాదమేమో యని, అందుచే నిది రసా
లంకారమైయే యుండు నని రసాభరణ పీఠికా
కర్తల తలఁపు. అది సరికాదు. ప్రస్తుత గ్రంథ
మునుబట్టి చూచిన ఇది చాల గ్రంథములను
పరిశీలించి రచింపఁబడినట్లు తేలును, గాని యేదో
యొక గ్రంథమున కనువాదమట్లు తోఁచదు.
మఱియు సంస్కృతమున 'రసార్ణవాలంకారము'
(ప్రకాశవర్షవిరచితము) అను సమగ్రాలంకార
విషయ ప్రతిపాదకమగు గ్రంథము కలదు.
దానిని శ్రీ ఈయుణ్ణి-వేంకట వీరరాఘవా
చార్యులుగారు (ఎం. ఏ.) పరిష్కరించిరి. ఈ
గ్రంథమును ఆంధ్రసాహిత్య పరిషత్తువారు
ప్రకటించియున్నారు. కానియా గ్రంథమునకును
రసాభరణమునకును సంబంధము లేదు.

రసాభరణమునకు రసార్ణవమను పేరున్నట్లు
ఆంధ్రవిజ్ఞాన సర్వస్వమునుబట్టి తెలియుచున్నది.
'ఛందోదర్పణ' పీఠికయందును అట్లే కలదు.
కాని ముద్రిత 'రసాభరణ' ప్రతియందు దీ చర్చ
లేదు.

రసాభరణము శృంగారరసమును, తత్సామ
గ్రిని సంపూర్ణముగ నిరూపించు గ్రంథము. ఇది
నాలుగాశ్వాసముల పరిమితి కలది. ప్రథమా
శ్వాసమున స్థాయిభావముల లక్ష్యలక్షణములును,
విభావానుభావసాత్త్వికభావ లక్షణములును,
శృంగారాది నవరసముల కుదాహరణములు
నీయఁబడినవి. ద్వితీయాశ్వాసమున ఆలంబనో
ద్దీపన విభావలక్షణములును, సాత్త్విక, సంచారి
భావలక్షణోదాహరణములును వివరింపఁబడినవి.
మఱియు నింక భావహావాదులగు శృంగారచేష్ట
లుద్దీపనాంతర్గతము లని వివరింపఁబడి లక్ష్య,
లక్షణము లొసఁగఁబడినవి. తృతీయాశ్వాసమున
సంభోగ, విప్రలంభ శృంగారములును, చతు

ప్రీత్యాది ద్వాదశ శృంగారావస్థలును, నాట్యశాస్త్రప్రోక్తములగు వాగ్విలసన, నైపథ్యాంగ క్రియా, సంకీర్ణ, మిశ్రము లనఁబడు పంచవిధ సంభోగ శృంగార భేదములును వివరింపఁబడినవి. పిదప భావోదయాదులును, రససాంకర్యములును చెప్పఁబడినవి. చతుర్థాశ్వాసమున నాయికా నాయకుల లక్షణోదాహరణములు విపులముగఁ జెప్పఁబడియున్నవి.

ఈ గ్రంథము ప్రత్యేకముగ ఒక గ్రంథమున కనువాదము కాదు. ప్రసిద్ధ సంస్కృతాలంకార గ్రంథములందలి విషయము చర్విత చర్వణముగ వినా సంగ్రహముగ నిందీయఁబడినది. దీని పీఠికలో శ్రీ కోపల్లె శివకామేశ్వరరావుగారు '— రసాభరణమును దెనుఁగున వ్రాసిన యనంతామాత్యుఁడు విశ్వనాథుని దర్పణమును, మమ్మటుని కావ్యప్రకాశమునుగూడ మేలవించి, యెం దేవిషయము ప్రశస్తమైనదో దాని నెల్ల గ్రహించినాఁ డనవచ్చు'నని వ్రాసిరి. కాని విషయ నిరూపణమునుబట్టి యిది చాలవఱకు విద్యానాథుని ప్రతాపరుద్రీయమునే యనుకరించుచున్నది. దర్పణాదుల ననుసరించుచున్నట్లు తోఁచదు. ప్రతాపరుద్రీయానుక్త విషయమున గ్రంథాంతరసాహాయ్య మపేక్షింపఁబడవచ్చును. మచ్చునకుఁ గొంత—

౧. రసాభరణములోని మొదటిశ్లోకము- 'శృంగారహాస్యకరుణాః' - అనునది ప్రతాపరుద్రీయమున నట్లే యున్నది. మమ్మట, విశ్వనాథులు తొలుత ఎనిమిది రసములను చెప్పి తిరిగి శాంతమును ఒప్పికొనిరి. ఆరీతి యిందు లేదు.

౨. రసాభరణమునందలి

ఉ. 'ఆదట వర్ధమానవిభ
వాతిశయంబున వార్ధులట్లు ర
త్యాదులు వీచుల ట్లుదయ
మా నడఁగుం బెరభావపంక్తి ని
ర్వేదముఖోపభోగరుచి
వృద్ధి రసంబది నాట్యసంగతిన్
మోద మెలర్ప సభ్యుల మ
నోగతులం దగు కార్యమై చనున్.'

[పుట 4]

అనుపద్యము ప్రతాపరుద్రీయమునందలి

శ్లో. 'భావే స్థాయిని వర్ధమానవిభవే
రత్యాదికే సింధువత్
కల్లోలా ఇవ సంభవన్తి విలయ
న్త్యాయాన్తి భావా ముహుః,
నిర్వేదాద్యుపభోగభావితనిజా
స్వాదాతిరేకో రసో
లోకే స్యా దనుకార్య ఏవ కథితో
నాట్యే తు సామాజికే.'

[రసప్రకరణమ్.]

అనుశ్లోకమునకు అనువాద మనుట నిర్వివాదము. అట్లయ్యును ఈ యనువాదము మూలాభిప్రాయమును సరిగా తెలుపకున్నది.

౩. రసాభరణమునందలి

'సీ. రసము నాయకసమాశ్రయమునఁ బ్రావీణ్యుఁ
డగునట్టి చేష్టలనైనఁ దత్క
థాకర్ణనంబుననైన సామాజిక
ప్రకరానుభావ్యమై పరఁగుచుండుఁ,
బరగతం బయ్యు సద్భావనచే రసో
దయవిశేషము విరుద్ధంబు కాదు,
మఱియు మాలత్యాది మహిళాప్రసంగంబు
వినుచు సభ్యులు నిజవనితలందుఁ
దలఁపు నిలుప రసాశ్రయత్వంబు గలుఁగు;
ననుకరణమాత్రమై యుండు నాశ్రయంబు
గాదు, భావుకత్వాదులు గలిగెనేని
వాఁడు సామాజికుల యట్టివాఁడ యపుడు.

క. 'ప్రకటనటుఁ డరయ సామా
జికసముఁ డగునేని వానిచే ననుభావా
దిక మెట్లొదవు ననిన వా
నికి నిది యభ్యాసజనితనిపుణత యయ్యెన్.'

[పుటలు 6 7]

అనుపద్యములు ప్రతాపరుద్రీయమందలి

'అత్ర రసో నాయకాశ్రయ ఏవ. యదిపరం నిపుణనట చేష్టయా, తథావిధ కావ్యశ్రవణ బలేన చ సామాజికైః స్వాత్మా ద్భావ్యతే, తదా పరగతస్యాపి రసస్య సమ్యగ్భావనయా పరత్ర నిరతిశయానందజనన మవిరుద్ధమ్. అథవా మాలత్యాదిశబ్దేభ్యో యోషిన్మాత్రప్రతీతౌ, రావణాదిశబ్దేభ్య శ్శత్రుమాత్రప్రతీతౌ చ స్మృత్యారూఢేన తత్తద్యోషిద్విశేషేణాను కార్యేణ సామాజికాశ్రయత్వమపి న విరుద్ధమ్. నటస్యానుకరణమాత్ర పరతయా నైవ రసాశ్రయయోగ్యతా, తస్య భావుకత్వాభ్యుపగమేఽపి సామాజికత్వ మేవ, అనుభావాదీనాం ప్రకాశనం తు శిక్షాభ్యాసపాటవే నైవ ఘటతే.'

అను వచనభావమున కాంధ్రీకృతి యనుట స్పష్టము. ఈ యభిప్రాయము మీది యనువాదమున వ్యక్తము కాదు. అనంతుని రసాభాస విభాగము ప్రతాపరుద్రీయమునకే సరిపడియున్నది. ఆలంబనోద్దీపన విభావముల యొక్కయు, స్వాధీన పతికాద్యష్టవిధ శృంగార నాయికల యొక్కయు లక్షణోదాహరణములును దాని ప్రతాపరుద్రీయాను కరణత్వమునే తెలియఁ జేయుచున్నవి.

అనంతుఁడు సరసకవి. పండితుఁడు. ఇతఁడొసఁగిన లక్షణములు, వాని యుదాహరణములు చాల పొందిక కలిగియున్నవి; కాని శాస్త్రగ్రంథానువాదమున సహజములగు లోపములిందును కొలఁదిగఁ గలవు.

తొలుత రత్యాదిస్థాయిభావములకును మరల శృంగారాది రసములకును ఉదాహరణములును ఇందు కలవు. అవి పునరుక్తములు. రత్యాది భావములే విభావాది సహాయమున రసములగుచున్నవి కదా!

విప్రలంభ శృంగార భేదములలో మానము, ఈర్ష్య వేఱువేఱుగఁ జేర్కొనఁబడియున్నవి. ఈర్ష్యమానమునందలి భేదమే కాని వేఱుకాదు.

ఇందుఁ బ్రగల్భయు, ప్రౌఢయు వేర్వేఱు నాయికలుగ చెప్పబడిరి. వారిరువురు నభిన్నలు.

స్వాధీనపతికాది శృంగార నాయికల కిందు రెండుపాదు లుదాహరణ లొసఁగుట పునరుక్తము.

చాలకాలమునకుకు మూలఁబడియుండిన రసాభరణమును ఆంధ్రసాహిత్య పరిషత్తువారు తమ పత్రికలోను,౧౯౩౦. సం. న తిరిగి గ్రంథరూపముగను ప్రకటించిరి. వారు తమయొద్దనున్న ప్రతిని చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోని ప్రతులతో సరిపోల్చి చూచి, వీలగునంత సంస్కరించి ప్రకటించిరి. అన్ని ప్రతులందును తొలుత కృత్యాదిపద్యములు లేవు. తొలుత కొంత గ్రంథము లోపించినదని పరిషత్తువా రభిప్రాయపడుచున్నారు. అన్ని ప్రతులందును కృత్యాదిపద్యములు లేవఁట! ముద్రిత గ్రంథమునందు గొన్నియెడల సందేహములు, కొన్ని లేఖక ప్రమాదములు నున్నవని పరిషత్తువారు తెలిపినారు. ప్రమాదములను, పాఠభేదముల బాగోగులను కొన్నిటిని పీఠికా రచయితలు వివరించినారు. యింకను కొన్ని కలవు. వానిలోఁ గొన్ని ఉల్లేఖింపఁబడుచున్నవి.

పుట ౪. పంక్తి ౧౭లో '—దగు కార్యమై చనున్' అనుచో 'అను కార్యమై చనన్' అని యుండుటయే కవిహృదయమై యుండును. మూలమున అట్లే కలదు

పుట. ౧౦. ౭వ పంక్తికి పిదప 'ధైర్యమున కుదాహరణము—' అనియు, ౧౯వ పంక్తి తరువాత 'విచ్ఛిత్తి కుదాహరణము—అనియు, నుండవలెను.

పుట. ౧౩. పంక్తి ౧౬. 'అపగతంబగు—నకు బదులు 'పరగతంబగు—' అని యుండవలెను.

# భట్టుమూర్తి

## ౧

సమగ్రముగను, ఛందో, వ్యాకరణ సాంకర్య రహితముగను రచింపఁబడిన యలంకార గ్రంథములలో మూర్తికవి గ్రథితమగు కావ్యాలంకారసంగ్రహమే మొదటిది; తుది గ్రంథము నిప్పటి వఱకు నిదియే. దీనికిఁ బూర్వము వెలువడిన కావ్యాలంకార చూడామణి విషయాంతర సాంకర్యయుతము; రసాభరణము శృంగారరస స్వరూపమాత్ర ప్రతిపాదకము. మఱియు నిది విషయవివేచనమున మేలయినది

దీనికి 'నరసభూపాలీయ' మను పేరు ప్రసిద్ధముగ నున్నది. ఆ పేరు గ్రంథమున నెచ్చటను గాన్పింపలేదు.[1] ఏతన్మూల మనఁదగు 'ప్రతాపరుద్ర యశోభూషణము'నకు 'ప్రతాపరుద్రీయ'మను వాడుక కలిగినట్లే దీనికిని పయి 'నరసభూపాలీయ' నామము కలిగియుండవలెను. ఈ గ్రంథమందలి పంచమాశ్వాసాంత గద్యయందు మాత్రము 'నరసభూపాలీయ' పదము చేర్పఁబడినది. అది పయి వ్యవహారమునుబట్టి ప్రాచీనులు కాని, యిప్పటివారుగాని చేర్చినది కావచ్చును.

ఏతద్గ్రంథకర్తృత్వముంగూర్చి కొన్ని యభిప్రాయభేదములు కలవు. దీనిని రచించిన మూర్తికవియు, వసుచరిత్ర హరిశ్చంద్ర నలోపాఖ్యానములను రచించిన రామరాజ భూషణుఁడు అభిన్నులను వాద మొకటియు, భిన్నులను వాద మొకటియు, చాలయేండ్లపాటు తెలుఁగు దేశమును కలవరపఱచినవి. ఇప్పటికి 'ఇరువు రభిన్నవ్యక్తులే' యను వాదమే నిలిచినది. అయినను వ్యతిరేకవాదులు లేకపోలేదు. పయివాదముల సారాంశము క్రింద నీయఁబడును.

భేదవాదులు స్వాభిప్రాయ సమర్థకములని క్రింది ప్రమాణముల నొసంగుచున్నారు.

౧. మూర్తికవి తండ్రి వేంకటరాయ భూషణుఁడు; రామరాయభూషణుని తండ్రి నూరపరాజు.

౨. నరసభూపాలీయము గద్యభాగములలో '... శ్రీహనుమత్ప్రసాదలబ్ధకవితాసార ...' అనియు, వసుచరిత్ర, హరిశ్చంద్రనలోపాఖ్యాన గద్యభాగములలో శ్రీరామచంద్ర చరణారవిందవందిత...' అనియు నున్నవి.

౩. నరసభూపాలీయ శైలి యప్రౌఢము; తక్కిన గ్రంథముల శైలి ప్రౌఢము.

అభేదవాదుల ప్రత్యుత్తరము లివి—

౧. మూర్తికవి తండ్రి పేరు నూరపరాజు; అతఁడు వేంకట దేవరాయల యాస్థానమునకు భూషణుఁ డగుటచే, 'వేంకటరాయ భూషణుఁ' డయినాఁడు. ఆరీతిగనే మూర్తికవి కృష్ణదేవరాయల యల్లుఁడగు రామరాయల సభ కలంకార భూతుఁడగుటచే 'రామరాజ భూషణుఁ'డను బిరుద మాతని కబ్బినది. నరసభూపాలీయ రచనాకాలమున కాతనికి ఆ బిరుదము లేదు; కాన అందు మూర్తికవి తన పేరినే చెప్పికొనెను. తండ్రికి బిరుదమున్నందున ఆ బిరుదనామమునే యుపయోగించి మొదటి పేరి నుపేక్షించెను. వసుచరిత్ర రచనకుముందే అతనికి బిరుదలాభము కలిగినది. కావున పయి గ్రంథద్వయమున ఆనామమునే యుపయోగించికొనెను. అప్పుడు తన తండ్రి పేరు 'నూరపరాజు' అని చెప్పుట దోషము కాఁజాలదు.

౨. మూర్తికవి తొలుత హనుమద్భక్తుఁడు. క్రమక్రమముగ ఆ హనుమద్భక్తి ఎక్కువయి అతఁడు శ్రీరామచంద్రుని భక్తుఁడయ్యెను. అప్పుడును మూర్తికవికి హనుమంతునియెడ భక్తి కొఱవడలేదు. కావుననే వసుచరిత్ర, హరిశ్చంద్ర నలోపాఖ్యానముల గద్యలలో రామచంద్రునితో పాటు పవననందనుఁడును పేర్కొనఁబడియున్నాఁడు. ఒక దేవతయందు భక్తియున్నచో వేఱొక దేవతయం దుండరాదని నియమము లేదు.

1 తాళపత్ర ప్రతులందు నిట్టులే కలదు. ఇప్పటి ముద్రాపకులు మాత్రము దీనిని 'నరసభూపాలీయము'గానే ప్రకటించుచున్నారు.

౩. నరసభూపాలీయము లక్షణగ్రంథము. శాస్త్రీయవిషయ వివేచనమునకే కాని కవితా చమత్కార ప్రదర్శనమున కది తగిన యవకాశము నీయఁజాలదు. తక్కినవి ప్రబంధము లగుటచే తత్ప్రదర్శనమున కత్యంతము ననుకూలములు. కావున శైలిభేదమును విభిన్న కర్తృత్వమున హేతువు కాఁజాలదు.

భేదవాదులలోఁ గొందఱు 'రామరాజభూషణ' పదము బిరుదవాచకము కాదనియు, భట్టుమూర్తి రామరాజసభకు భూషణప్రాయుఁడుగాని రామరాజునకు భూషణము కాఁజాలఁడనియు, పయిపదము బిరుదవాచకమే యైనచో 'రామరాజసభాభూషణ-' వంటిదేదో యొకటి యుండవలెననియుఁ జెప్పుచున్నారు. కాని యియ్యది యభేదవాదమును ప్రతిఘటించుటలో నసమర్థము. శాకప్రియుఁడగు పార్థివుఁడు శాకపార్థివుఁడును, దేవపూజకుఁడగు బ్రాహ్మణుఁడు దేవబ్రాహ్మణుఁడు నయినట్లు మధ్యమపదలోపి సమాసాశ్రయణమున 'రామరాజభూషణ' పదమునకు 'రామరాజ సభాభూషణ' అనురీతి నర్థమును గ్రహింప వీలగును. కాని పయిసమాసము-ఎచటనో, అగతికమగు నపుడే విధిలేక యాశ్రయింపఁబడును. అప్పుడు పయిపదము బిరుదవాచము కాక వ్యక్తివాచకమే యనువారి మతమునఁ గూడ దాని యౌచిత్యము విచారణీయమే కదా!

మూర్తికవి రామరాజభూషణు లభిన్నులనుటకు ముఖ్యమగు కారణము లివి.—

౧. వసుచరిత్ర వ్యాఖ్యాతయగు సోమనాథకవి తత్కర్త భట్టుమూర్తియనియే చెప్పియున్నాఁడు. ౨. ఆంధ్రకౌముదీ వివరణమున '... ముప్రత్యయాభావస్యాల్లసాని పెద్దనార్యస్య శిష్యేణ భట్టుమూర్తి మహాకవి నా విరచితే వసుచరిత్రే[1]' అని వసుచరిత్ర భట్టుమూర్తి కృతమనియే చెప్పెను. ౩. 'అల్లసాని పెద్దన ఆటునిటు నేడ్చె, ముక్కుతిమ్మన్న ముద్దుముద్దుగా నేడ్చె, భట్టుమూర్తి బావురని యేడ్చె' అని తెనాలిరామలింగని కర్తృకముగఁ జెప్పఁబడు కథాసంప్రదాయమునుబట్టి, భట్టుమూర్తి యేడ్పున కుదాహృతమగు పద్యము వసుచరిత్రములోని 'ఆ జాబిల్లి వెలుంగు' అనునదగుటఁబట్టి పయివాదమునకే బలము కలుగుచున్నది. పయి కథ యథార్థము కాకున్నను, దీనివలన భట్టుమూర్తియే వసుచరిత్రకర్తయని లోకుల వ్యవహారమని మాత్రము నిశ్చయింప వచ్చును.

మూర్తికవికిఁ దిరుమలరాయల యొక్కయుఁ, దదగ్రజుఁడగు రామరాయల యొక్కయు నాశ్రయము లభింపకపూర్వ మతఁడు వారి మేనల్లుఁడగు ఓబళ నరసరాజు నాశ్రయించి, తన కావ్యాలంకార సంగ్రహము నాతనికిఁ గృతినిచ్చి, తన్మూలముగ రామరాయల యాశ్రయమును సంపాదించి, యాతని దయకుఁ బాత్రుఁడయ్యెను. ఆ యనుగ్రహానే కవికి 'రామరాయభూషణ' బిరుదలాభమును—అనన్యసామాన్యమును లభింపఁజేసినది.

ఇతఁడు శ్రీకృష్ణదేవరాయల యాస్థానములోని యష్టదిగ్గజములలోనివాఁడని ప్రతీతి. కృష్ణరాయల సమకాలికుఁడగు అల్లసాని పెద్దనామాత్యుఁ డీతనికి గురువని యాంధ్రకౌముదీ వివరణముఁబట్టి, కథలనుబట్టి తెలియుచున్నది. శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు 'శీర్ణకర్ణాట రాజ్య చరిత్రము'న రామరాజభూషణుఁడు కృష్ణదేవరాయల యాస్థానములోని వాఁడు కాఁడని వ్రాసియున్నారు.[2] 'అతని వసుచరిత్రయందలి

౧. తిరుమలరాయ శేఖరుని
ధరణిమూర్ధభటధాటి యాజిభీ
కరయవనేశ్వర ప్రతతి
ఖానబలంబుల జక్కనేయు ని
ర్ధరఁ బెనుగొండ కొండలును
దద్విపచర్మకపాల మాలికా
పరికర భూషితంబులయి
బవ్వడిఁ గాంచె గిరీశభావమున్ [౧౫౯౦

అను పద్యముచే క్రీ.శ. ౧౫౮౮ ] సంవత్సరమున జరిగిన పెనుగొండయుద్ధము సూచింపఁబడుచున్నందున సంతకుఁ బైగా నతఁడు జీవింపవలసి యున్నది. క్రీ.శ. ౧౫౩౦ నాఁటికే కృష్ణదేవరాయలు కీర్తిశేషుఁడయ్యెను. కాన అతని కాలమున భట్టుమూర్తికవి యుండుట పొసఁగదు' అని శ్రీ పంతులుగారి యభిప్రాయము. కాని మూర్తికవి క్రీ.శ. ౧౫౧౦ వ. సం. ప్రాంతమున పుట్టినాఁడనుకొన్నచో

1. ఆంధ్రకవుల చరిత్రము; ద్వితీయభాగానుబంధము. పు. ౧౯౬.
2. శీర్ణకర్ణాటక రాజ్యచరిత్రము. పు. ౨౩౨.

నతఁడు క్రీ. శ. ౧౫౩౦ సం. వఱకు రాజ్య మేలిన కృష్ణరాయల యాస్థానపండితుఁడగుట కాని, ౧౫౮౦ సం. కుఁబైగా జీవించియుండుట కాని యసంభవము కానేఱదు. సుమారెనుఁబది సంవత్సరముల వఱకు జనులు జీవించియుండుట యిప్పటికిని గలదు కదా! రామరాజు (కృష్ణదేవరాయల యల్లుఁడు) కృష్ణదేవరాయల కాలమందును, ఆంతకుఁ బూర్వమును వీరుఁడై సేనలను నడిపించినట్లు జీర్ణకర్ణాట రాజ్యచరిత్రముననే (పుట ౨౫౦) కలదు. అళియరామరాజు క్రీ. శ ౧౫౬౫ వ సంవత్సరపుఁ దళ్లికోట యుద్ధము నాఁటికి సయితము సమర్థుఁడై యున్నట్లు చరిత్రకారులందఱును వ్రాసియున్నారు. అట్టిస్థితిలో నతని కాలపువాఁడగు భట్టుమూర్తి మాత్రము కృష్ణరాయల కాలమునఁ బండితుఁడు కాకుండుటయు, క్రీ. శ. ౧౫౮౦ కిఁబైగా జీవించకుండుటయు సంభవములు కావు.

కృష్ణరాయల కాలమునాఁటికి మూర్తికవి బాలకవి కావచ్చును. విద్యావ్యాసంగమున నుండుటచే నప్పుడతఁ డేగ్రంథములను వ్రాయక పోయియుండవచ్చును. కృష్ణరాయల కాలమునాఁటి యతని చాటువులు చాల ప్రచారమున నున్నవి.

భట్టుమూర్తి రచించిన మూఁడుగ్రంథములే మనకు లభించినవి. అవి ౧ (నరసభూపాలీయము) కావ్యాలంకార సంగ్రహము; ౨ వసుచరిత్రము; ౩. హరిశ్చంద్ర నలోపాఖ్యానము. వసుచరిత్రము నందలి 'శ్రీ రామక్షితిపున్[1] అను పద్యముంబట్టియు, హరిశ్చంద్ర నలోపాఖ్యానము నందలి 'వనధిలంఘన'[2] అను పద్యపాదముంబట్టియు నితఁడు చాలకృతులను, గ్రంథములను రచించినట్లు తెలియుచున్నది. 'వసుచరిత్రాదికావ్యప్రణీత' అనునపుడాదిశబ్దమున హరిశ్చంద్ర నలోపాఖ్యానమును గ్రహించిన బాధకము లేదు

రామరాజభూషణుఁడు సంగీత కళారహస్యవేది. తత్కళాభిలాషి. అతఁడు తన్ను గురించి 'సంగీత కళారహస్యనిధి' యని చెప్పికొని యున్నాఁడు. అతని పద్యము లనేకములు సంగీత విషయప్రచురములు; మఱియు రామరాజు గాన నాట్యాదిప్రియుఁడు; కావున తన యలంకారగ్రంథ కృతిపతియగు నరసరాజు నాశ్రయమున మూర్తికవి రామరాజు ప్రాపుఁ బొంది యతని కభీష్టములగు 'బహుసంస్కృతాంధ్రకృతు'లను (పాటలను) రచించి యతని వలన సమాన గౌరవమును పొందియుండవలెను.

శ్రీ వీరేశలింగము పంతులుగారు రామరాజభూషణుని వసుచరిత్రమే తొలిగ్రంథమని, నరసభూపాలీయము రెండవగ్రంథమని చెప్పి, అందులకు 'హరిశ్చంద్ర నలోపాఖ్యానము' లోని 'వసుచరిత్రాది కావ్యప్రణీత' పదము ప్రమాణీకరించి యున్నారు. వసుచరిత్రము తొలిగ్రంథమగుటచేతనే కవి దానినే తొలుతఁ బేర్కొనెనని వారి యభిప్రాయము. అట్టి నిర్దేశము కవికృత గ్రంథములలో నదియే ప్రధానమను నంశమును తేటపఱచునుగాని ప్రథమమను నంశమును తెలుపదు. శ్రీనాథుఁడు 'నైషధాది మహాప్రబంధములు పెక్కు' అని కాశీఖండమునఁ జెప్పికొనినాఁడు. అచట నిదేరీతి నైషధమతని రచనలలో నుత్తమమనవలెను. అదే మొదటిదనినచో 'చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాఁడు రచియించితిని మరుత్తరాట్చరిత్ర' మను స్వవచనమునకే వ్యాఘాతమగును.[3]

వసుచరిత్రము షడాశ్వాసముల ప్రౌఢప్రబంధము; ప్రబంధములకెల్ల తలమానికము. కోలాహల పర్వతమునకు, శుక్తిమతీనదికిని గలిగిన గిరికయను కన్యను ఉపరిచరవసువు వివాహమాడుట యిందలి కథాంశము ఇది కల్పనలకు గని; అలంకారముల కాటపట్టు సూక్తిరత్నములకు సుధాసింధువు; ఉత్తమోత్తమమగు

---

1. 'శా. శ్రీరామక్షితిపున్ మదగ్రజు జగచ్ఛ్రీలోలు నానాకళా
పారీణుం బహుసంస్కృతాంధ్రకృతులం బల్కాయు మెప్పించి త
త్కారుణ్యంబున రత్నహార హయవేదండాగ్రహారాది స
త్కారంబందితి రామభూషణకవీ! ధన్యుండ వీవన్నిటన్.' [౧-౧౪]

2. 'వసుచరిత్రాదికావ్యప్రణీత బహునృపప్రాపితానేకరత్నపల్లవఖండ.' [౧-౫౩]

3. వసుచరిత్ర, హరిశ్చంద్ర నలోపాఖ్యానవిమర్శనములు చూడుడు.

ధ్వనికావ్యము. కావ్యమయ్యును నాటకపద్ధతులిందుఁ జాల కూర్పబడి సొంపు పెంపొందింపఁబడినది. ఈ ప్రబంధపు పోకడలను, వర్ణనావిధానములను గ్రహించి వ్రాయఁబడిన ప్రబంధములకుఁ బ్రాశస్త్యము కలిగి 'పిల్ల వసుచరిత్రము'లను బిరుదలాభము కలిగినది. దానింబట్టియే వసుచరిత్రప్రాశస్త్యము నందఱును గుర్తింపఁగలుగుదురు.

హరిశ్చంద్ర నలోపాఖ్యానము ద్వ్యర్థి కావ్యము. శ్లేషకావ్యములలో నిది మిన్నయను పేరుపొందినది. ఇందు హరిశ్చంద్ర, నలకథలు రెంటను ప్రతిపద్యమునను వచ్చునట్లు కూర్పఁబడినది ఇది కేవలము శ్లేషకావ్యమే కాక వ్యంగ్యార్థము లనేకము లుండుటంబట్టి యుత్తమకావ్యముకూడ నగుచున్నదని పండితుల యాశయము.

౨

కావ్యాలంకార సంగ్రహమునకు విద్యానాథ పండితుడు సంస్కృతమున రచించిన ప్రతాపరుద్రయశోభూషణము మూలము ఈ 'తెలుఁగు నరసభూపాలీయము'నకు మూలము 'సంస్కృత నరసభూపాలీయ' మున్నదనియు, దానిని మూర్తికవి పితృవ్యపుత్రుఁడు రచియించెననియు, నా మూలగ్రంథము తమ వద్ద నున్నదనియు, శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు చెప్పుచున్నారు. కవిగారు చెప్పినటులు దీనికి మూలము సంస్కృత నరసభూపాలమయినను, అది ప్రతాపరుద్రీయమునకు అనుసృతిమాత్రము కావలెను. తెనుఁగు నరసభూపాలీయమును పరిశీలించి చూచినచో నది ప్రతాపరుద్రీయము ననుసరించినట్లే తోఁచును. ఇంతకును శ్రీరామకృష్ణకవిగారు సప్రమాణముగ నిశ్చయించువఱకును దీనికి మూలము ప్రతాపరుద్రీయమే యనుకొనవలెను.

నరసభూపాలీయమునందుఁ బ్రతాపరుద్రీయమున లేని విషయములు కొన్ని చేర్పఁబడినవి; ఉన్నవి కొన్ని విడువఁబడినవి; కొన్ని మూలము రీతిని గాక వేఱొకరీతిని వివరింపఁబడినవి. నాయికాభేదములను తెలుపు సందర్భమున నింకను మూలమున లేని ధీరాదిభేదములు చెప్పఁబడినవి; అట్లే కొన్ని క్షుద్రకావ్యభేదములు-కళికోత్కళికాదులు వివరింపఁబడినవి. మూలమునఁగల శాస్త్రవిషయక చర్చలు విడువఁబడినవి. కథ, ఆఖ్యాయికా భేదము నాటకప్రకరణమంతయు త్యక్తములు. విద్యానాథుఁడు భోజుని మతము ననుసరించి యిరువదినాలుగు గుణముల నంగీకరింపఁగా మూర్తికవి యా విభాగమును విడిచి, కావ్యాదర్శాదులలో నున్నయట్లు పదిగుణములనే లెక్కించెను. లక్షణనిరూపణమున మాత్రము ప్రతాపరుద్రీయము ననుసరించెను. అర్థాలంకారములలో గీర్వాణవ్యాకరణ సంబద్ధములగు భేదములను విడిచెను

సంస్కృతమున రూపక వాఙ్మయము చాల ప్రాచీనకాలమునందే వెలసెను. లక్ష్యము ననుసరించి యాలంకారికులు లక్షణములను వ్రాసిరి. ఆంధ్రమునఁ బందొమ్మిదవ శతాబ్దపుఁ జివరివఱకు దృశ్యవాఙ్మయము వెలువడలేదు. మూర్తికవి కాలమున నది లేదని వేఱుగఁ జెప్పఁబనిలేదు. లక్ష్యములేనందున లక్షణకరణ మనావశ్యక మైనది. కావున మూర్తికవి మూలమున నున్న నాటక ప్రకరణము నాంధ్రీకరింపక విడిచిపెట్టెను

నరసభూపాలీయ మైదాశ్వాసముల గ్రంథము; మూర్తికవి దీనిని కావ్యముగను, ప్రబంధముగను చెప్పుకొనినాఁడు.[1] ఇది కావ్యలక్షణముకాని కావ్యముకాదు. సంస్కృతమున 'ప్రబంధ' పదము గ్రంథసామాన్యపరముగ వాడఁబడుచున్నది. ఆంధ్రమున 'ప్రబంధము'నకుఁ గావ్యమను నర్థమే ప్రసిద్ధము. పద్యరచన 'ప్రబంధము' అదియే కావ్యము. కావున నిదియు నట్టిదే! కవి రచించిన దనుభావమే కావ్యమనుటకుఁ గారణమయి యుండవచ్చును.

ఇందుఁ బ్రథమాశ్వాసమున నాయకగుణములు మూలానుసారముగ వివరింపఁబడినవి. పీఠికయందు ప్రతాపరుద్రీయ పీఠికయందలి విషయములు కొన్ని చెప్పఁబడినవి. నాయకగుణ

1. ఉ. 'నీవొనరింపఁబూనిన యనేక మహాకవివాఙ్మయోప కా
రావహమైన కావ్యము మదంకితమై వెలయుంగ' [౧-౧౬]
'కావ్యాలంకార సంగ్రహం బను మహాప్రబంధంబునందు'
[ఆశ్వాసాంత గద్యములు]

నిరూపణ మయిన పిదప నాయకస్వరూపము వివరింపఁబడినది. ద్వితీయాశ్వాసమున ధీరోదాత్తాది నాయకుల స్వరూపములు, భేదములు, దక్షిణాది శృంగార నాయకుల స్వరూపోదాహరణములు, స్వీయాది నాయికలయు, ముగ్ధాద్యవాంతర నాయికలయు, స్వాధీనపతి కాద్యష్టవిధనాయికలయు లక్షణోదాహరణములు, కావ్యస్వరూపము, అభిధాదివృత్తుల లక్షణము, వృత్తి, రీతి, పాక, ధ్వని, గుణీభూతవ్యంగ్య, క్షుద్రకావ్య స్వరూపములు వివరింపఁబడినవి. తృతీయాశ్వాసమున స్థాయిభావ, విభావానుభావ, సాత్త్విక, సంచారిభావములు, శృంగారావస్థలు, శృంగారచేష్టలు, భావోదయాదులు, రససంకరము లక్షణోదాహరణములతోఁ సంగ్రహింపఁబడినవి. చతుర్థాశ్వాసమున పదవాక్యార్థదోషములు, దశవిధగుణములు, శబ్దాలంకారములు, చిత్రము మొదలగు వానికి లక్షణోదాహరణము లీయఁబడినవి. పంచమాశ్వాసమునం దర్థాలంకారములకుఁగల పరస్పరసంబంధము, వాని భేదములు, మిశ్రాలంకారములు వివరింపఁబడినది.

నరసభూపాలీయ మిదివఱకుఁ బలుమారు ముద్రింపఁబడినది. కాని యెవరును సవిమర్శముగఁ బరిశోధించి ముద్రించినట్లు తోఁచదు. ఇందలి తృతీయాశ్వాసమగు రసప్రకరణమును, ద్వితీయాశ్వాసములోని నాయికానాయక భేదములతోఁ జేర్చి సవిమర్శముగ, సవ్యాఖ్యానముగ బ్ర. శ్రీ. వెల్లాల సదాశివశాస్త్రులుగారు ప్రకటింపించిరి కాని యది యేకాశ్వాసమే. వ్యాఖ్యానమున నచ్చటచ్చట మూలమునందలి యసందర్భములు, నపపాఠములు బాగుగ విచారించి ప్రదర్శింపఁబడినవి. సమగ్రముగఁ బ్రకటింపఁబడిన ప్రతులలో శ్రీ వావిళ్లవారు ప్రకటించినది కొంత మేలు. వారు తగుమాత్రపు పీఠికతో (విమర్శతో) దానిని ప్రకటించినారు. ఒక ముద్రణమున దొరలిన స్ఖాలిత్యమును వేఱొక ముద్రణమున వారు సవరించుచునే యున్నారు. కాని పరిశోధన మసమగ్రము. కాని వాని పీఠికయందుఁ గల విమర్శనము ప్రబంధవిమర్శనముఁబోలి కవిత్వపాకమును, కల్పనలను, రేఫద్వయమైత్రిని విమర్శించున దగు యున్నది. ఈగ్రంథ మలంకారశాస్త్రమను దృష్టితోఁ జూచినచో విమర్శింపఁదగిన యంశము లింద నేకము లున్నవని స్పష్టపడును.

మూర్తికవి కవులలో మిన్న యనుటకు సందేహ మేమియు లేదు. కాని పాండిత్యమున- అందును నలంకారశాస్త్ర పాండిత్యమునఁ గూడ నట్టివాఁడే యని చెప్పజాలము. కవిత్వము వేఱు; పాండిత్యము వేఱు. కవులని ప్రసిద్ధిఁ జెందినవారు శాస్త్రనిర్మాతలగుట యరుదు. శాస్త్రనిర్మాతలు కవిత్వమున జనులను రంజింపఁ జేయుటయు కష్టము. కవులు వ్రాసిన శాస్త్రగ్రంథములలో సిద్ధాంతముల పట్టున లోపములు కన్పించుట సహజము. నరసభూపాలీయమునందుఁ గవిత్వము మంచి పాకమునఁబడి సర్వజనహృదయావర్జకమయి యున్నది; కాని శాస్త్రీయ విషయ ప్రతిపాదనమునఁ గొన్ని లోపములు కానవచ్చుచున్నవి మచ్చునకుఁ గొన్ని—

౧. మూలగ్రంథకారుఁడగు విద్యానాథుఁడు "పూర్వేభ్యో భామహాదిభ్యః సాదరం విహితాంజలిః, వక్ష్యే సమ్యగలంకారశాస్త్ర సర్వస్వ సంగ్రహమ్." అని ప్రాచీనాచార్య నమస్కృతి నొనరించెను; కాని భామహాదు లేయే విషయములను ప్రతిపాదించిరో చెప్పలేదు. మూర్తికవి నామనిర్దేశమాత్రమునఁ దృప్తిపొందక 'సీ. నిజరూపమునకు వన్నె యొనర్చు వేల్పులొక్క, పెనుకొంగు ధ్వని హీరకళికలమర, . . . . . భామహాదుల ననిశంబు ప్రస్తుతింతు' [౧-౧౦] అని భామహాదుల యోగ్యముగ నొనర్చిన కావ్య సామగ్రినికూడ వివరించెను ఈ నిరూపణ సరికాదు. భామహుని కాలమునాఁటికి ధ్వనివాదము పుట్టనేలేదు. అతఁ డలంకారమార్గవాది. మూలకారుఁ డేయంశముం జెప్పక తప్పుకొనెను; మూర్తికవి తప్పుదారింబోవఁ దలఁపడెను.

౨. ధీరోదాత్త, ధీరోద్ధత, ధీరలలిత, ధీరశాంతులని నాయకులు నాల్గువిధములుగ నుందురు. వీరందఱు విభిన్నులు. ధీరోదాత్తుఁ డెన్నఁడును ధీరోద్ధతుఁడుగాని, ధీరలలితుఁడు కాని, ధీరశాంతుఁడు కాని కాఁడు. మూలకారుఁడు ప్రతాపరుద్రుఁడు ధీరోదాత్తుఁడని, యుద్ధభటులు ధీరోద్ధతులని, కాకతీంద్రుఁడు ధీరలలితుఁడని, రాజాశ్రితబ్రాహ్మణులు ధీరశాంతులని యుదాహరణములతో వివరించెను. మూర్తికవి ధీరోదాత్తునిగఁ జెప్పిన నరసరాజు నే

తిరిగి 'ఈ......యింతుల రత్నహారముల నెల్ల ధనంబుల నిచ్చి కొల్వని, శ్చింతితదాల్చి నోబయు నృసింహుఁడు భోగకళాప్రవీణుఁడై.' [నరస. ౨-౫] అని ధీరలలితునిగఁ జెప్పెను. ఇది సరికాదు.

౩. మూలమునం దనుకూల నాయక లక్షణము ఇట్లున్నది. 'ఏకాయత్తోఽనుకూలః స్యాత్ ఏకస్యాం నాయికాయాం విశేషానురక్తోఽనుకూలనాయకః' అనఁగా ఒక్క నాయికయందు విశేషానురాగము కలవాఁడనుకూలనాయకుఁడని యర్థము. అనుకూలునకు భార్యలు పెక్కు ఉండవచ్చు; అందరి యెడలను అనురాగ ముండవచ్చును; ఒక్క నాయికయం దందఱికంటె నెక్కువ యనురాగమున్నఁ జాలును. మూర్తికవి 'చ ..యొక్క కాంతకే, వలచి గుణాభిరాముఁ డగువాఁ డనుకూలుఁడు' అని చెప్పెను. ఈ యనుకూల లక్షణమును బట్టియు, '..నోబభూపసం, దనుఁడగు నారసింహుఁడిల దానసమాప్రియుఁడయ్యె నెంతయున్' అను నుదాహరణ భాగమునుబట్టియు, నాయికకు నాయకునియం దెక్కువ యనురాగ ముండవలెనను విపరీతార్థావగతి కెక్కువ యవకాశమున్నది.

౪. ఉపమానమును జెప్పి యుపమేయమును జెప్పక, యారెండింటికి నభేదము చెప్పుట యధ్యవసాయము. దానితోఁ గూడిన లక్షణ సాధ్యవసాయలక్షణ మూలమున దీనికి 'కాకతీయ వంశపారావారమున చంద్రుఁడు పుట్టె'నని యుదాహరణము కలదు. అచట నుపమానమగు చంద్రపదమే కలదు ఉపమేయ వాచకమగు ప్రతాపరుద్ర పదములేదు. చంద్రప్రతాపరుద్రుల కిచట నభేదము.

పయి లక్షణ కుదాహరణముగ మూర్తికవి 'క.. పోచి రాజవంశ, సిరరత్నస్తంభమున నృసింహుఁడు పుట్టెన్' [౨-౬౫.] అని వ్రాసెను. ఇచట 'నృసింహ'పదము శ్లిష్టము. అది యుపమానమును, ఉపమేయమును గూడఁ గావచ్చును ఇది సాధ్యవసాయోదాహరణము కావలెనన్న నృసింహశబ్దము తీసివేసి వేఱొక శబ్దమును జెప్పుట యుచితము.

౫. వ్యంజకమగు శబ్దమువల్ల నేగాక వాచ్యార్థముల వల్లను వ్యంగ్యార్థ ప్రతీతి కలుగును. కావున నట్టియెడ వ్యంగ్యార్థమున కర్థాంతర సమేతత్వము (వేఱొక యర్థముతోఁ గూడి యుండుట) కలదు. ఇది దానికి సామాన్య ధర్మము. లక్షణామూలవ్యంగ్యము అత్యంత తిరస్కృతము, అర్థాంతర సంక్రమితము నని రెండువిధములు ప్రకృతానుపయుక్తమగు నర్థము వ్యంగ్యార్థమున సంక్రమించినచో అర్థాంతర సంక్రమితమగును. రాముఁడు తన్నుగూర్చి చెప్పికొననపుడు 'రాముఁడను గాన సర్వమును సహింతు'ననుచో, తాను రాముఁడనని వేఱుగఁ జెప్పనక్కఱలేదు. ఆ పదమునకు నుపయోగములేనిదయి 'సీతావియోగాగ్నులనుసహించినవాఁడ'నను వ్యంగ్యార్థమున సంక్రమించుచున్నది. ఈ యర్థాంతర సంక్రమితము నరసభూపాలీయమునఁ జాలచోట్ల 'అర్థాంతరసమేత' మని చెప్పఁబడినది. వ్యంగ్య సామాన్యధర్మమగు నర్థాంతర సమేతత్వము వ్యంగ్యభేదమును తెలుపఁజాలదు.

౬. వాచ్యార్థానుపపత్తి, వాచ్యార్థముతోడి సంబంధముకల లక్షణ ననుసరించి వచ్చు వ్యంగ్య మత్యంత తిరస్కృతావివక్షిత వాచ్యమనఁ బడును 'గంగయందు గొల్లపల్లె కల'దని చెప్పినపుడు పల్లెయుండుట యసంభవము; అచట గంగకుఁ, దీరమునకు సామీప్య సంబంధ మున్నది కావున 'గంగయొడ్డున గొల్లపల్లె కల'దను లక్ష్యార్థము కలుగును. దానివలన పల్లెయొక్క చల్లదనము, పవిత్రత మొదలగు గుణములు వ్యంగ్యములగును. మూర్తికవి పయిధ్వనికి 'క. ఖరఖుర . ఖరకర తురగోత్కరమై, కర మమరు నృసింహాధాటి కాహాయ మనఁగన్' అని యుదాహరించి అతిక్రమింపఁబడిన సామ్యముగల మూర్ధ్యాశ్వములు కలదను బహువ్రీహి సమాసమున 'తిరస్కృత స్వార్థము' కలదని వ్రాసెను. [౨-౧౧౩, ౧౪౪.] ఇది సరికాదు ఇందలి వ్యంగ్యార్థమును కవి వివరింపలేదు. బహువ్రీహి యందు 'కలవాఁడు, కలది' అనునవి వాచ్యములు కాకపోవుటచే ఆ సమాసము అత్యంత తిరస్కృతములని కవి పొరపడియుండవలెను.

౭. శబ్దశక్తి మూలాలంకార ధ్వనికి [1]'కోమలి పద్మిని; నరసరాజా ఇనుఁడు. తత్కర సంస్పర్శనమున నీ యామె చెలఁగును'

---

1. క. ఈ కోమలి పద్మినియట! యేకాలముఁ బ్రోచునినుఁడ వీవఁట! సతి దా నీకరసంస్పర్శమున గాక చెలంగునె నృసింహా! ఘనబలసింహా!

అని యుదాహరణము. ఇచటఁ బద్మినీ, ఇన శబ్దములు నానార్థకము లయినను [పద్మిని = కమలిని, పద్మినీజాతిస్త్రీ, ఇనుఁడు = సూర్యుఁడు, రాజు.] ఇది శబ్దశక్తిధ్వని కుదాహృతి కాఁజాలదు. దానియందన్ని పదములును శ్లిష్టములు కావలెను. అట్టి పదములు ప్రకృతార్థము నేగాక యప్రకృతార్థమునుగూడ దెలుపును. అప్రకృతార్థ కథనము అసంబద్ధము కాకుండుటకై వాచ్యప్రతీయమానములకు నుపమానోపమేయ భావముగాని యభేదభావముగాని కల్పింపఁబడును. పయి యుదాహరణ పద్యమునఁగల 'కోమలి, నృసింహ! ఘనబలసింహా!' అను పదము లశ్లిష్టములు. ఇచట కోమలీ కమలినులకు, రాజసూర్యులకు నుపమానోపమేయ భావము వ్యంగ్యమువలనఁ గలిగినను, శబ్దశక్తి ధ్వనిలక్షణా సంఘటితమగుట ధ్వని కాఁజాలదు. వ్యంగ్యమంతయు ధ్వనియే యగునను నియమము లేదు.

౮. స్వతః సిద్ధార్థ శక్తిమూలాలంకారకృత వస్తుధ్వనికి '(నరసరాజుగారి) – చారుయశోధ భూమణికి సారసవైరి ముఖంబు; తారకల్ సారనఖాంకురంబులు; శంకరశైల, హిమాద్రులార్త్యవక్షోరహముల్; సితాబ్జములు సొంపగు లోచన పంకజాతముల్.' [౨-౧౨౩] అని యుదాహరణ మీయఁబడినది. ఇచటఁ బరిణామము వాచ్యమగు నలంకారమనియు, దానివలన నరసవిభుని కీర్తి ముల్లోకములు నిండు ననునది వ్యంగ్యమనియు సమన్వయము చేయఁబడినది. ఇచట వాచ్యమగు నలంకారము రూపకము; పరిణామము కాదు. కీర్త్యాదులగు నుపమేయములందుఁ గాంతాత్వాద్యుపమానత ఆరోపింపఁబడిన రూపకమని, ఉపమానమం దుపమేయత యారోపింపఁబడిన పరిణామమని యలంకారిక సిద్ధాంతము. 'ఆమె దృగబ్జమున వీక్షించుచున్న' దనునపుడు ఉపమానమగు నబ్జము వీక్షణ క్రియోపయోగి కాఁజాలనందున వఁదత్ప్రయోజనార్థ మది దృక్కుగాఁ బరిణమించును. అది పరిణామమగును కాన మీఁది వివరణము తప్పు. మఱియు 'సితాబ్జములు లోచనము' లన్నఁజాలును. 'లోచన పంకజాతముల్' అనఁ బనిలేదు.

౯. చిత్రకావ్యమున కుదాహరణముల నిత్తునని చెప్పియు ఈయనేలేదు.

౧౦. 'నాయికా నాయకులలో నొక్కరికే యనురాగమున్నను; ఆ యనురాగము ఉభయనిష్ఠమైన తిర్యక్ మ్లేచ్ఛవిషయక మయినను; ఒక్క స్త్రీకి పెక్కురు పురుషుల యం దనురక్తి యున్నను రసాభాసమగు'నని ప్రతాపరుద్రీయమునందలి రసాభాసలక్షణము. నరసభూపాలీయమునందు మాత్రము 'పలువుర కొక కామిని పయి వలపున్నను, ఒక్కవారసతికిఁ బలువురిపై వలపున్నను, మృగవిహగాదుల వలపు నిబద్ధమయినను రసాభాసమగు'నని చెప్పఁబడినది. ఇది మూలముకంటెఁ జాల వేఱయినది. [౩-౧౪౪] మూలమందలి 'ఒక్కరికే ప్రేమయుండుట, అనురాగము మ్లేచ్ఛగతమగుట' నను భేదము లిందు విడువఁబడినవి. దీనింబట్టి వేశ్యకంటె యితరలగు స్త్రీలకు బహునాయకగతమగు ననురాగము రసాభాసము కాదను విపరీతార్థము కలుగుచున్నది.

౧౧. [1]'ప్రకృతోపయోగముగ నుపమేయమునందు నుపమానత్వ మారోపించుట పరిణామాలంకార' మని యిందలి లక్షణము. ఇది వఱకు వివరింపఁబడిన (౮.) విషయవివేచనముంబట్టి యిది రూపకలక్షణమగును గాని పరిణామలక్షణము కాఁగు. దీని కనుగుణముగనే 'దేవస్త్రీల కౌఁగిలికొఱకు స్వర్గమునకేఁగు శత్రురాజులకు నరసరాజు కత్తి నీలాలనిచ్చెన యయిన'దని యుదాహరణ మీయఁబడినది. ఇచట నుపమేయమగు కత్తియందు నిచ్చెన తన మారోపింపఁబడుటచే నిది రూపకోదాహృతి యగుట యుక్తము. ఈ గ్రంథమునందలి రూపకలక్షణము అస్పష్టముగ నున్నను చివఱకు దీనిలోని పరిణామలక్షణములోనే సరిపడుచున్నది. పయి యుదాహరణమునకును, రూపకోదాహృతికిని భేదములేదు.

౧౨. అప్రస్తుత వృత్తాంతమువలనఁ బ్రస్తుత వృత్తాంతము గమ్యమానమగుచో నప్రస్తుత ప్రశంసాలంకృతి యగును దాని కుదాహరణము నిందు [౫-౧౪౫.]

1. క. 'ధరలో నుపమేయమునను, నరుదుగ నారోప్యమాణమగు నుపమానం
బరయఁ, బ్రకృతోపయోగాకరముగఁ బరిణామమయ్యె ' [౫-౫౦]

క. 'ననలు మొలకెత్తెఁ దేనెలు
చినికెం జిగురాకు గండెఁ జెదరె నలితతుల్
చనువున నీపూఁదీఁగఁకు
ఘనమైననృసింహుపొందుకలుగఁగఁబోలున్.'

అని యుదాహరణ మీయఁబడినది. ఇచట పూవుఁదీఁగ వృత్తాంతమువలన నాయికా వృత్తాంతము తోఁచుచుండుట యుక్తము; కాని 'ఘనమైన నృసింహుపొందు కలుగఁగఁబోలున్' అని వాచ్యముకూడ నింగఁ బ్రవేశించుటచే నిది పయిసాలంకారమున కుదాహృతి కాఁజాలదు. 'నృసింహుపొందు'నకు అప్రస్తుతమగు నర్థమును కల్పించుట యసంగతము.

౧౩. నరసభూపాలీయమున అర్థాలంకార ప్రకరణములో రసవత్, ప్రేయ, ఊర్జస్వి, సమాహితములను నాలుగలంకారముల నామము లీయఁబడినవి; కాని, వాని లక్షణోదాహరణములు లేవు. మూర్తికవి వానిం గూర్చి వ్రాయుచు ఇవి 'అసమరసప్రకరణమున రసభావాద్యుపనిబద్ధ రసములు గానన్' ఇచట వివరింపలేదని వ్రాసినాఁడు. [౫-౨౩౦] దీని కర్థ మేమో! కాని రసప్రకరణమున వీని సంగతియే లేదు.

౧౪. దోష నిరూపణ సందర్భమున సంస్కృతమునే యనుసరించి ఛందో, యతి భంగములను మాత్రమే తెల్పి, ప్రాసభంగమును నిరూపింపకుండుట అనుచితము; అది ప్రధాన దోషములలో నొకటి.

౧౫. పరస్పర విరుద్ధవిషయములకు రూపక, పరిణామాలంకార వర్ణ్యయుదాహరణము; మచ్చునకు మఱొకటి. మూలమందలి గల్ల, కటిశబ్దములతోఁబాటు ఇందు 'చన్నులు, కన్నులు' కూడ గ్రామ్యములేయని చూడామణి ననుసరింపఁ బడినది, కాని పయి 'గుప్త' పదములతోఁగూడిన చక్కని పద్యము-[1] స్వవిరచితము లాటానుప్రాసమను శబ్దాలంకారమున కుదాహరణముగ నీయఁబడినది. [౪-౩౮]

ఈ గ్రంథమునఁ గొన్నియెడల కొన్ని విషయములు వర్జింపఁబడి యీయఁబడిన లక్షణములు చాల అస్పష్టముగ నున్నవి. ఇది లక్షణగ్రంథమైనను పద్యకావ్యమగుటచే ఛందోయతిప్రాసంసిద్ధికొఱకు అక్కఱలేని పెంపు, అవాచకముల కూర్పు ఎక్కువయినది. కొన్నిట సంప్రదాయములు కొఱవడినవి. మచ్చునకుఁ గొన్ని—

౧. కావ్యములు 'అంగనాజన విలాసాలాపలీలా సముత్పాదుర్భావములు' [పుట ౧౧.] లని యిందుఁగలదు. 'కావ్యములు కాంతా సమ్మితము' లని దీనిపిండితార్థము. కాంత తన యభీష్టము ప్రియునకు మాటలచేఁ గాక చేష్టలచే తెలియఁజేసిన నేచమత్కారము. కావున వ్యంగ్య ప్రధానమగు కావ్యమే యుత్తమము. అలంకారికులందఱి మతము నదియే అట్టి కావ్యమే కాంతాసమ్మితమగును. ఇందు దానికి విరుద్ధముగ 'ఆలాపలీలాసము ప్రాదుర్భావ' అని చెప్పఁబడినది.

౨. రసస్వరూప నిరూపణ సందర్భమున మూర్తికవి 'వారిరి దుఃఖమైన సుఖమైభవమైన దిటీకటాళియుం, దాకలపూర్ణమై సహృదయాత్ములఁ గేవలహర్షమై తగున్' [పుట ౬౩.] అని చెప్పెను. నటులందుఁ గాన్పించు సుఖదుఃఖ భావములవలన సహృదయులకు విగలితవేద్యాంతరమగు నానందము కలుగునని యాలంకారికుల మతము దీని మూలము 'సుఖంవా దుఃఖంవా నిబిడయతుయూనోః, సహృదయే త్వమందానందోత్కర్ష పరిణమతి పూర్ణోరసభరః' అని యున్నది. నటులయందే సుఖదుఃఖములు కలుగవు, అవి యందరియెడను కల్గును. మూలమందలి 'ఆనందము' మూర్తికవి యనువాదమున హర్ష' మయినది 'హర్షము సంచారిభావము; అది సంతోషమను నర్థముననే ప్రసిద్ధము. విగలిత వేద్యాంతరమగు నర్థమున కిది యవాచకము.

గ్రంథలోపములతోఁ బాటు వెనుకటి ముద్రణములలో ముద్రణస్ఖాలిత్యములును మెండుగ గలవు. కాని నూతనముగ వెలువడిన నటీకాప్రతి (వావిళ్లవారిది)లో మాత్రము చాలవఱకు లోపములు సవరింపఁ బడినవి.

1. 'చ. ఘనత నృసింహుఁ జూడఁగల కన్నులు కన్నులు; వాని కౌఁగిటం
జనువున నీవు చూపఁగల చన్నులు చన్నులు; వాని మోవికిం
జొనిపిన పాటలాధరము జున్నులు జున్నులు; వాని మేనఁ జే
ర్చిన రససాంగయష్టికల చెన్నులు చెన్నులువో తలోదరీ!'

# గుడిపాటి కోదండపతి

## ౧

కేవలము రససామగ్రీ నిరూపకములగు గ్రంథములలో రసమంజరి యొకటి. దీనిని రచించినవాఁడు గుడిపాటి కోదండపతికవి. ఇతఁడు నందవరీకవంశ నియోగిబ్రాహ్మణుఁడు. ఈ నందవరీక వంశమును గుఱించి యొక చిత్రమైన గాథకలదు. దానిని శ్రీ వీరేశలింగము పంతులుగారు తమ కవులచరిత్రమున (3 వ భాగము, పుట ౪౨౦.) వివరించియున్నారు. దాని సంగ్రహమిది—

"పూర్వము కర్ణాటమును పాలించుచుండిన నందుఁడను రాజు తన యోగమహిమచే యోగవాహములనెక్కి ప్రతిదినము కాశికిఁబోయి గంగాస్నానముచేసి వచ్చుచుండెను. ఈ రహస్యము వాని భార్య కనిపెట్టి తన్నుఁగూడఁ గాశికి దీసికొనిపోవలెనని వేడుకొనఁగా రాజట్లే యొనర్చెను. కాని యచట నామె బహిష్ఠ యగుటచే మైలపడిన యోగవాహనములు తిరిగి కదలలేదు. అంత రాజేమిచేయుటకును దోఁచక గంగాతీరముననున్న సద్బ్రాహ్మణుల సాయము కోరఁగా వారు తనకుఁ గర్ణాటరాజ్యమున వృత్తుల నొసంగునట్లు చండీశ్వరి సన్నిధిని ప్రమాణము చేయగోరిరి. రాజట్లే ప్రతిజ్ఞ చేసెను. వారు తమ మంత్రప్రభావమున రాజభార్యను పవిత్రురాలిగా నొనరించిరి; యోగవాహనములను నడిపించిరి. పిదపఁ గొన్నియేండ్లకు కాశీప్రాంతమున క్షామము సంభవింపఁగా ఏనూఱు కుటుంబములవారు కర్ణాటదేశమున కేఁగి తమకు వాగ్దానమొనర్చిన వృత్తుల నీయ రాజును కోరిరి. రాజు కోరికపయి వారు చండీశ్వరిచే సాక్ష్యమిప్పించిరి. రాజు వారి మహిమ కచ్చెరువంది తనపేరిట 'నందవర'మను గ్రామమును కట్టించి దానిని వారి కగ్రహారముగ నిచ్చెను. నందవరమునం దుండువారగుటచే వారు నందవరీకు లయిరి. వీరినే కరణకమ్మలనియుఁ జెప్పుట కలదు."

ఈ కథ యెట్టిదయినను, నందవరీకు లార్యావర్తమునఁ గాటకము సంభవించినపుడు దక్షిణాపథమునకువచ్చి తెలుఁగుదేశమున వృత్తులను సంపాదించుకొన్నది మాత్రము నిజము కావచ్చునని శ్రీ వీరేశలింగము పంతులుగారి యభిప్రాయము. అలసాని పెద్దన్న, రాయని భాస్కరుఁడు మొదలగువారు కోదండపతి తెగకుఁ జెందినవారే. నందవరీకు లార్యావర్తము నుండి కర్ణాటమునకు వచ్చిరనుటలోఁ బ్రమాణము లింకను కావలసియున్నవి.

కోదండపతి యాశ్వలాయన సూత్రుఁడు. భారద్వాజ గోత్రుఁడు. వేంగశమంత్రి పౌత్రుఁడు. రంగయామాత్యునకును, సీరమాంబకును పుత్రుఁడు. పయి యంశములు రసమంజరి తృతీయ గుచ్ఛపుఁ జివఱనున్న పద్యమునుబట్టి తెలియున్నవి.[1]

కోదండపతికాలము సరిగాఁ దెలియదు; కాని యితఁ డిన్నూఱు సంవత్సరముల క్రిందటివాఁడేమోయని కవులచరిత్రలోఁ గలదు. ఆ యూహకుఁ దగిన యాధారము కావలెను.

## ౨

రసమంజరి మూఁడుగుచ్ఛముల గ్రంథము; సంస్కృతమున భానుదత్తమిశ్రుఁడు రచించిన కృతి కిది తెలుఁగుసేత. ఇందు మొదటి గుచ్ఛములో ముగ్ధాదినాయికా లక్షణము, ధీరాదుల లక్షణము వివరింపఁబడినవి. రెండవ గుచ్ఛమున స్వాధీనపతిక మొదలగు ఎనిమిది విధముల నాయికలు, ఆ నాయికలలోని ముగ్ధాద్యంతర్భేదములతోఁ గూడ చెప్పఁబడిరి. మూఁడవ గుచ్ఛములో నాయకలక్షణము, వారియందలి భేదములు స్పష్టపరుపఁబడినవి.

ఈ గ్రంథ మొకసారి చాలకాలముక్రిందట ముద్రింపఁబడినదఁట! కాని ప్రతులెచ్చటను లభింపలేదు.

---

1. సీ. శ్రీకర నందవరీకాగ్రగణ్యుండు, వహిమీఱు గుడిపాటి వంశఘనుఁడు,
……………………………భాసిల్లు కోదండపతి ఘనుండు,

# అడిదము సూరకవి

## ౧

తెలుఁగునం దర్థాలంకారములను వివరించు లక్షణగ్రంథములను రచించిన ప్రాచీనులలో 'చంద్రాలోకము' నాంధ్రీకరించిన అడిదము సూరకవి ముఖ్యుఁడు. అడిదమువారిది వసిష్ఠ గోత్రము; సూరకవి తాత చినలచ్చనమంత్రి; తండ్రి భాస్కరామాత్యుఁడు.[1] ఇతఁడు క్రీ. శ ౧౭౨౦ ప్రాంతమున విజయనగర సమీపమునఁ గల భూపాలరాజుపేట యను గ్రామమున జన్మించెను.

ఈకవి కాలనిర్ణయమునుగూర్చి శ్రీ అడిదము రామారావుగారు తమ 'అడిదము సూరకవి' చరిత్రమునందు ప్రమాణముల నిచ్చుచున్నారు. 'సూరకవిగారి మనుమఁడు సూరన ౪౫ సంవత్సరములు జీవించి పోయిన చిత్రభాను సంవత్సరమునఁగాక యింక్రిందటి చిత్రభాను వత్సరమునకు ముందటి చిత్రభాను సంవత్సరము ఆషాఢ బహుళపాడ్యమినాఁడు (౧౮౨౩ సం. న) కీర్తిశేషుఁడయ్యెను. దీనిం బట్టి ఇతఁడు క్రీ. శ. ౧౭౭౮ సం. న జీవించియుండవలెను. ఇతఁడు తన తండ్రికి ౨౫ వ యేట జన్మించెనట! అట్లయిచో సూరకవి కుమారుఁడు బాలభాస్కరకవి క్రీ. శ ౧౭౫౦ ప్రాంతమున జన్మించియుండవలెను. సూరకవికి ౨౫ సం॥ వయస్సు మించిన తరువాత సంతానము కలిగినట్లు వాడుక. ఈరీతిగా అడిదము వారి కుటుంబము నందుండి వచ్చుచున్న సమాచారములంబట్టి చూచినచో సూరకవి క్రీ. శ. ౧౭౨౦ ప్రాంతమున జన్మించియుండ వచ్చునని తోఁచుచున్నది.'

సూరకవి విశాఖపట్టణము మండలములోని విజయనగర సంస్థానమునకు ప్రభువులును, సూర్యవంశ క్షత్రియులునగు శ్రీ పూసపాటి వంశ మహారాజుల కాశ్రితుఁడు; సంస్థానపండిత కవి. ఈ విజయనగర ప్రభువులు గుర్గాసామ్రాజ్య సాక్షాత్కారమును పొందిన తన తపఃప్రభావమునఁ దా నేలు రాజ్యమున నేడుగడియలకాలము సువర్ణవృష్టి కురిపించెనని ఖ్యాతినిగన్న శ్రీమాధవ వర్మ సంతతివారు. ఈ ప్రభువులలోని వారగు శ్రీ పెదవిజయరామ మహారాజులుంగారి కాలమునను, శ్రీ చినవిజయరామ మహారాజులుంగారి కాలమునను సూరకవి జీవించియుండెను. ఇందు మొదటివారగు శ్రీ పెదవిజయరామ మహారాజుగారు బొబ్బిలియుద్ధమున వీరస్వర్గము నలంకరించిరి. అప్పటికి సూరకవి నిండు జవ్వనమున నున్నట్లు చాటువులవలన నిశ్చయింపవచ్చును. సూరకవి యొకపద్యమూలో క్రీ. శ. ౧౭౪౬ సం. న పెదవిజయరామరాజునకును, బాదుల్లా ఖానునకును జరిగిన యుద్ధమునుగూర్చి ప్రసంగించెను. దానింబట్టియు నతఁడు ౧౭౨౦. ప్రాంతమున జన్మించెననవచ్చును. శ్రీ పెదవిజయ రామరాజుగారు కీర్తిశేషులయిన పిదప ఆనంద గజపతిరాజుగారు రాజ్యమునకువచ్చి కొలఁది కాలముమాత్రమే రాజ్యముచేసిరి. వారు స్వర్గస్థులయిన తరువాత శ్రీ చినవిజయరామ గజపతి మహారాజులుంగారు రాజ్యమునకువచ్చి క్రీ. శ. ౧౭౬౦ మొదలు ౧౭౯౪ వఱకును రాజ్యము చేసిరి. ఈ మహారాజులుంగారి కాలముననే సూరకవి ప్రతిభ యతిశయించియుండెను.

శ్రీ వత్సవాయి తిమ్మజగపతిరాజుగారి రాజ్యకాలమునఁ బెద్దాపురమున నొకప్పుడు రాజులందఱును సభతీర్చియుండఁగా సూరకవి యొక[2] పద్యమునుచెప్పి తన ప్రభువును స్తుతించెనని వాడుక. శ్రీ తిమ్మజగపతిరాజుగారు. క్రీ శ. ౧౭౫౯ మొదలు ౧౭౯౮ వఱకు నుండిరందున శ్రీ చినవిజయరామ మహారాజులుంగారికిని, సూరకవి సమకాలీనుఁడని చెప్పవలెను.

శ్రీ చినవిజయరామ మహారాజుగారి సమకాలి కుఁడును, శృంగవరపుకోట జమీందారును మఱి కాశీపతిరాజుగారి సింహవకుమారుఁడును అగు రాజభూపాలరాజు తన గర్వమును, ఎదిరి బలమును నెఱుఁగక విజయ నగరముమీఁదికి దాడివెడలివచ్చెను. అప్పుడు

---

1. క. చినలచ్చ మంత్రితనయుని, నఘుని మజ్జనకు భాస్కరామాత్యమణిన్
గొనియాడెద శ్లాఘాలంఘనజాంఘిక కవనధాటి కలిగిన మేటిన్. [కవిసంశయవిచ్ఛేదము]

2. ఉ. రాజుకళంకమూర్తి; రతిరాజు శరీరవిహీనుఁ; డంబికా
రాజు దిగంబరుండు; మృగరాజు గుహాంతరసీమవర్తి; వి
భ్రాజితపూషవాడ్విజయరామనృపాలుఁడు రాజుకాక, యీ
రాజులు రాజులే, పెనుతరాజులుగాక ధరాతలంబునన్.

సూరకవి వాని యవివేకమును పరిహసించుచు[1] నొక పద్యము చెప్పెను. దీనింబట్టియు సూరకవి శ్రీ చినవిజయరామమహారాజులంగారి కాలమున నుండెనని చెప్పవలెను. సూరకవి క్రీ. శ. ౧౭౨౦ ప్రాంతమున జన్మించి, తన కిరువదియైదేఁడుల వయసు వచ్చువఱకును తండ్రిగారియొద్ద భూపాలరాజులేగయందే కాలము గడపెను. వారి యనంతరము విశాఖపట్టణ మండలములోనిదే యగు చీపురుపల్లికి సమీపమునఁగల రామచంద్రపురమునకు (గులివిందాడకు) కాపురమునూర్చి యామరణాంతమచటనే యుండెను. అతఁ డీగ్రామమున నివసించినను, శ్రీ విజయనగరప్రభువుల నే యాశ్రయించి, వారిచ్చిన యినాముభూముల ననుభవించెడివాఁడు. క్రీ. శ. ౧౭౯౪ వ సంవత్సరమున పద్మనాభమున ఆంగ్లేయులతో జరిగిన యుద్ధమున వీరస్వర్గమలంకరించిన తన ప్రభువు, శ్రీ చినవిజయరామగజపతిమహారాజుగారికంటెఁ దొమ్మిదేండ్లు ముందుగా-అనఁగా-౧౭౮౫ ప్రాంతమున నీ కవిశేఖరుఁడు స్తమించెను.

సూరకవి నివాసస్థానమగు రామచంద్రపురము ప్రస్తుతపు తూర్పుగోదావరిజిల్లాయందలి కోటరామచంద్రపురమనియు, నతఁ డప్పుడప్పుడు విజయనగరమునకు వచ్చి తన్మహారాజుల యాశ్రయమును సంపాదించి యాస్థానకవియయ్యెననియుఁ వీరేశలింగముగారు వ్రాసియున్నారు. సూరకవి చాటుపద్యములు చాల వఱకును విజయనగర ప్రాంతములకే సంబంధించియున్నవి. వేఱొక కవితోఁ బద్యరూపముగ సూరకవికి జరిగిన సంభాషణను బట్టి యతఁడు చీపురుపల్లి నివాసియనుట స్పష్టము.[2] చీపురుపల్లి రామచంద్రపురము (గులివిందాడ) కలిసియేయున్న గ్రామములు. ఆరెండిటను చీపురుపల్లియే పెద్దది. కావున సూరకవి ఆపేరే చెప్పెను.

అడిదమువారిది పండితవంశము, పూర్వము ఈ వంశపురుషులు ఏనుఁగులపయి గ్రంథముల నుంచుకొని దేశాటనము చేసెడివారఁట! అందుచేఁ దొలుత వీరి ఇంటిపేరు 'గ్రంథవారణము' వారట. వీరి వంశములో నొకఁడగు నీలాద్రికవి యొకయుద్ధమునఁ దన ప్రభువుతోఁ గూడ రణరంగమున కురికి పగతుఱను గెలిచెనఁట! రాజు సంతోషించి యతనికి 'అడిదము'ను (కత్తిని) బహుమతిగా ఇచ్చెనఁట! అప్పటినుండియు నీ వంశమువారికి 'అడిదమువా'రని యుపనామము కలిగినది. సూరకవివేషముకూడఁ బండితులరీతి కాక మొగలాయీ పద్ధతి నుండెడిదఁట! అతఁడొకచేత గంటమును, వేఱొకచేత బాకును ధరించి 'ఇదం బ్రాహ్మ్య, మిదం క్షాత్ర'మ్మను నీతిని వెల్లడించెడివాఁడు.[3]

సూరకవి శాపానుగ్రహ సమర్థతలు కల గొప్ప కవీశ్వరుఁడు. ఈ సామర్థ్యములు కల యాంధ్రకవులు వేములవాడ భీమకవి, మొదలగువా రల్పసంఖ్యాకులు. తిట్టుకవిత్వమున సూరకవికిఁగల సామర్థ్యమును 'సూరకవి తిట్టు కమసాలిసుత్తిపెట్టు' అను పెద్దలవాడుకయే తెలియపఱచుచున్నది.

సూరకవి సమకాలికు లతనింగూర్చి చెప్పిన చాటువులఁ బట్టి[4] యితఁడు పదునెనిమిదవ శతాబ్దిలో నుండిన ప్రౌఢకవులలోను, లాక్షణికులలోను పేరుపడినవాఁడని తెలియుచున్నది. ఇతఁడట్టి యనన్యలభ్యమగు వైదుష్యము కలిగియుండుటచేఁగనే తమ పోషకులగు విజయనగరప్రభువులను లక్ష్యము సేయక[5] యెల్లపుడును

1. గీ. విజయరామమహారాజ పేరుఁ జేలఁ బట్టములికించె రాజభూపాలరాజు,
కడుపుమాటలకేమి? యీ కాలమందుఁ బుట్టినవ్వాను పులిగొంతుగొట్టెకఱచె.

2. క. ఊరెయ్యది? చీపురుపలి, పేరో? సూరకవి; యింటిపే? రడిదమువార్,
మీరాజు విజయరామమహారా; జతఁడేమి సరసుఁడా? భోజుఁడయా!

3. 'అడిదము సూరకవి.' ప్రథమ, ద్వితీయ ప్రకరణములు.

4. క. రవిచొఱఁగను భువితత్త్వము భువిలో పలనుండు జనులఁ బోషించ సదాశివుఁడెఱుఁగు నాట్యతత్త్వము, కవితాతత్త్వంబు సూరకవికే తెలియున్.

5. చ. గరిసెలు వ్రాఁతగాని మఱిగంటెఁ డెఱుంగము, మన్యదేశముల్
తిరిగి యభీష్టవస్తువులఁ దెచ్చి భుజింతుము సార్వకాలమున్;
సురుచిర సత్కవిత్వనిధి సూరకవీంద్రుని కేలఁగల్గ గం
టరమును రేగ మోఁకె మొదచన్నులవంటివి రెండు మాన్యముల్?

దేశాటన మొనర్చుచు వర్షాశనములను సంపాదించి కాలము గడపెడివాఁడు. నూరకవి జీవితకాలములోఁ జాలభాగము దేశాటనములకయి వినియోగింపఁబడుటచే, నితఁడు 'గడియకు నూఱుపద్దెములు గంటములేక రచిం'చుదిట్టయయ్యెను, విశేషముగ గ్రంథములను రచింపలేక పోయెను; ఇతని చాటువులు-హృద్యములు, సర్వజనాకర్షకములగునవి అసంఖ్యాకములు కలవు

ఆఱిదము నూరకవి ఆఱుగ్రంథములను రచించెను. అవి కవిజనరంజనము, కవిసంశయవిచ్ఛేదము, ఆంధ్రనామశేషము, ఆంధ్రచంద్రాలోకము, రామలింగేశ శతకము, శ్రీరామదండకము అనునవి.

౧. కవిజనరంజనము — దీనికిఁ జంద్రమతీపరిణయమను నామాంతరము కలదు. ఇందుఁ జంద్రమతీ, హరిశ్చంద్రుల వివాహకథ మూఁడాశ్వాసములలో ముద్దుగ వర్ణింపఁబడినది. ఇతని గ్రంథములలో నెల్ల నిదియే మిన్నయయి కవికి మిగులఁ బ్రఖ్యాతిని కూర్చిపెట్టినది. ఇతని గ్రంథముల పౌర్వాపర్యమును నిర్ణయింప వీలు లేదు; కాని కవి తన లక్షణగ్రంథమగు కవిసంశయవిచ్ఛేదమున నీ ప్రబంధమును బ్రస్తావించుటచే నిది దానికంటెఁ బ్రాచీనమని తెలియుచున్నది. ఇందు వసుచరిత్రపుఁ బోకడలు చాల కలవు కవిత్వ ప్రాశస్త్యమునుబట్టియే దీనికి 'పిల్లవసుచరిత్ర' మను ఖ్యాతి కలిగినది.

౨. కవి సంశయవిచ్ఛేదము ఇది మూఁడు ప్రకరణములలక్షణగ్రంథము. ఇందలి ప్రకరణములకుఁ దరంగములని పేరు. కవి తనకుఁ బూర్వమున వెలువడిన, వ్యాకరణములచే సాధింపఁబడని రూపముల నిందు సాధించెను. ఇందుఁ జాల లాక్షణికుల కవుల ప్రయోగములందలి సంశయములు విచ్ఛేదింపఁబడినవి. శకటరేఫ, తద్భవముల చర్చ కలదు.

౩. ఆంధ్రనామశేషము — ఇది పద్యరూపముగనున్న చిన్న నిఘంటువు. పైఁడిపాటి లక్ష్మణకవికృతమగు నాంధ్రనామ సంగ్రహమునకుఁ బూరకగ్రంథము.

౪. రామలింగేశ శతకము — శ్రీ విజయనగర ప్రభువులగు చిన విజయరామగజపతి మహారాజులుంగారి రాజ్యకాలమున దివానుగానుండిన సీతారామరాజుగారి చండశాసనత, తద్ద్వారమున దేశమునఁ గలిగిన ప్రజాపీడ, నాఁటి సాంఘికార్థిక రాజకీయ పరిస్థితులు నిందు అన్యాపదేశముగఁ జక్కని దృష్టాంతములతో వెల్లడింపఁబడినవి.

౫. శ్రీరామదండకము — ఇందు రామాయణకథ సంక్షేపముగ వర్ణింపఁబడినది. శైలి చాల ప్రౌఢము. ఉత్తమదండకములలో నిదియొకటి. ఇది కవికిఁగల యుభయభాషాపాండిత్యమును వెల్లడిచేయుచున్నది.

౨

నూరకవి రచించిన 'చంద్రాలోక' మను నర్థాలంకార లక్షణగ్రంథము సంస్కృతమునకనువాదము.

సంస్కృతమునఁ బీయూషవర్ష (జయదేవ) మహాకవి 'చంద్రాలోకము'ను రచించెను. అందుఁ గేవల మలంకారములే కాక తక్కిన కావ్యసామగ్రియుఁ జాల ప్రకరణములలో వివరింపఁబడినది. అందలి 'అర్థాలంకారము' లను ఆధారముగఁ జేసికొని అప్పయదీక్షితులు 'కువలయానంద' మను గ్రంథమును రచించెను. కువలయానందము కారికా, వృత్తిరూపముల నున్నది. అందలి కారికలు ప్రత్యేక గ్రంథముగఁ బ్రకటింపఁబడి జయదేవకృతమగు చంద్రాలోకముగఁ బ్రచారమున నున్నది. జయదేవుని గ్రంథము ననుసరించి[1] రచింపఁబడుటచే ఆ కారికల కా వ్యపదేశము కలిగి యుండవచ్చును.

ఈ చంద్రాలోకమునకు మూలము జయదేవ చంద్రాలోకార్థాలంకార ప్రకరణమని కొందఱు, దీక్షితుల కువలయానందకారికలే యని కొందఱు తలంచుచున్నారు. నూరకవి మాత్రము తన గ్రంథమునకు మూలము కాళిదాసు కృతమగు చంద్రాలోక[2] మని వ్రాయుచున్నాఁడు. కాళిదాసమహాకవి చంద్రాలోక

---

1. శ్లో. యేషాం చన్ద్రాలోకే దృశ్యన్తే లక్ష్యలక్షణశ్లోకాః।
ప్రాయస్త ఏవ తేషా మితరేషా మభినవా విలిఖ్యన్తే. [కువలయానందము]

2. గీ బాలురకునైనఁ దెలియఁగాఁ గాళిదాసు, మునురచించెఁ జంద్రాలోకమును బ్రీతిగ,
భావఁజేసితి నీకృతిభవ్యముగను......... [చంద్రాలోకము]

మును రచించిన ట్లెచటను ప్రసిద్ధి లేదు. ఒకవేళ సూరకవికి లభించిన గ్రంథముపై 'కాళిదాసకృతచంద్రాలోక' మని పేరున్నను, అది లేఖక ప్రమాదమనియు, ఆ వ్రాఁతయందలి యథార్థమును బరిశీలింపక సూరకవి యిటులఁ బొరపడియుండవచ్చుననియుఁ దోఁచుచున్నది.

సూరకవి తెలిఁగించినది దీక్షితుల కువలయానందకారికలు కాని, జయదేవుని చంద్రాలోకము కాదు. అనువాదము దీక్షితకృతికే సరిపడుచున్నది.[1] ఉపమాలంకారాదులయందు నతఁడు దీక్షితు ననుసరించెను గాని జయదేవు ననుసరింపలేదు. దీక్షితుల లక్షణములు కొన్ని జయదేవుని లక్షణములకంటె విభిన్నములు. ప్రసిద్ధోపమానమున కుపమేయత కల్పింపఁబడినపుడు 'ప్రతీపాలంకార' మగునని దీక్షితుల లక్షణము. జయదేవుఁడు దానిని ప్రత్యేకాలంకారముగాఁ బరిగణింపక 'ప్రతీపోపమ' అను నుపమాభేదముగ లెక్కించెను. దీక్షితుల ననుసరించి సూరకవి ప్రతీపమును బ్రత్యేకాలంకారముగ గ్రహించెను. ఇట్లే సూరకవి దీక్షితుల ననుసరించి యప్రస్తుత ప్రశంసాలంకారమున 'స్వరూపసంబంధ నిబంధన'మను నొక్క భేదమునే యుదాహరించెను; కాని, జయదేవునివలెఁ గార్యకారణ, సామాన్య, విశేష భేదముల నుదాహరింపలేదు. ఇట్టి భేదములింకను గలవు మఱియు సూరకవి చెప్పిన యలంకారక్రమము దీక్షితుల పద్ధతి ననుసరించుచున్నది కాని జయదేవుని మార్గమును త్రొక్కలేదు. ఉదాహరణములు కూడఁ జాలవఱకు జయదేవుని గ్రంథమునుండి భేదించుచున్నవి.

శ్రీ రేనమండ్ర వేంకటరామయ్యగారు, శ్రీ తాడూరి లక్ష్మీనరసింహారావు పంతులుగారును శ్రీ రాజా మంత్రిప్రెగడ భుజంగరావుగారు చంద్రాలోకమును కాళిదాసే వ్రాసెనని అభిప్రాయపడిరి. శ్రీ అడిదము రామారావుగారు సూరకవి జయదేవుని చంద్రాలోకమునే ఆంధ్రీకరించెనని తలఁచిరి. ఆంధ్రవిజ్ఞాన సర్వస్వమున 'అలంకారములు' అను శీర్షికలో 'సూరకవి జయదేవుని చంద్రాలోకమునందలి ౫వ మయూఖము నాంధ్రీకరించె'నని వ్రాయఁబడియున్నది. పైయభిప్రాయములు సరియైనవి కావు. సూరకవి చంద్రాలోక మేకాశ్వాస గ్రంథము. మూల గ్రంథమునఁగూడ నధ్యాయ విభాగము లేదు. మన సౌకర్యముకొఱకు విభజింపఁదలఁచినచో నొక్కొక్క యలంకారము నొక్కొక ప్రకరణముగ విభజింపవచ్చును. దీక్షితులవారి కువలయానందమట్లే విభజింపఁబడినది.

కువలయానందకారికలలో నూఱు అలంకారములకే లక్ష్యలక్షణములు కలవు. ఈ చంద్రాలోకమునందును నట్లే కలవు. దీని నింతవఱకును విశాఖపట్టణమునందలి 'ఆర్ష' ముద్రాక్షరశాలవారును, ఏలూరిలోని 'మంజువాణీ' ముద్రాలయాధిపతులును, చెన్నపురియందలి 'వావిళ్ల' ముద్రణాలయాధికారులును ముద్రించి ప్రకటించిరి. ఆర్ష ముద్రాక్షరశాలవారి గ్రంథము పీఠికను బట్టి చూడ, సూరకవి రచించిన గ్రంథములోఁ గొంత గ్రంథపాత మున్నట్లును, శ్రీమాన్ పరవస్తు వేంకటరంగాచార్యులయ్యవారలుగారు దానిని స్వరచిత లక్ష్యలక్షణములచేఁ బూరించినట్లును తెలియుచున్నది. కాని యీ గ్రంథపాత మన్నిటియందును, ఒకే స్థలమున నుండుటవల్ల, అది నిజముగ గ్రంథపాతము కాదనియు, సూరకవి ఆయా యలంకారములను విడిచెననియు తలంపవచ్చును

చంద్రాలోకమును ఏలూరు మంజువాణీ ముద్రాక్షరశాలలో ముద్రించిప్రకటించిన శ్రీ భుజంగరావుగారు చంద్రాలోకమున విడువఁబడిన యలంకారములను చేర్చుచు, ఉత్తర, ఉల్లేఖ, ఛేకోక్తి, పరికరాంకుర, భ్రాంతిమద్, విశేషోక్తి, సందేహ, సముచ్చయ, స్మృత్యలంకారములను చేర్చిరి. కాని యవియన్నియు గ్రంథమునందే యున్నవి. ఉల్లేఖ, స్మృతి,

1. శ్లో. ఉపమా యత్ర సాదృశ్యలక్ష్మీ రుల్లసతి ద్వయోః।
హృదయే ఖేలతోరుచ్చైస్తన్వఙ్గిస్తనయోరివ. [జయదేవుఁడు]
ఉపమా యత్ర సాదృశ్యలక్ష్మీ రుల్లసతి ద్వయోః।
హంసీవకృష్ణ తే కీర్తిః స్వర్గంగా మవగాహతే. [దీక్షితులు]
గీ. వర్ణ్యమునుపమాన ముపమాన వాచకము సమానధర్మము సంఘటింపనగు నుపమ
హంసిచందాన నీకీర్తి యబ్జనాథ! అభ్రగంగావగాహనం బాచరించు. [సూరకవి.]

భ్రాంతిమ, త్సందేహాలంకారములిందుఁ బరిణామ భేదములుగను, పరికరాంకురము పరికర భేదముగను, విశేషోక్తి విభావనాంతర్భూతముగను, సముచ్చయ లక్ష్యలక్షణములు వికల్ప భేదములుగను, ఉత్తరాలంకారము విశేషాభిన్నముగను, ఛేకోక్తి లోకోక్త్యంతర్భూతముగను, ఇందు వివరింపఁబడినది. అపహ్నుతి భేదములు, అతిశయోక్తి భేదములను ప్రత్యేకాలంకారములుగ లెక్కింపఁబడినవి. ౬వ విభావనా భేదమున, విభావనాలక్షణమును, విశేషోక్త్యుదాహరణమును మేళవింపఁబడినవి.

ఇప్పటికి వెలువడిన చంద్రాలోక ప్రతులలో శ్రీ అక్కిరాజు ఉమాకాన్తముగారిచేఁ బరిష్కరింపఁబడి శ్రీ వావిళ్లవారిచేఁ బ్రకటింపఁబడినదే యుత్తమము. శ్రీ ఉమాకాన్తముగారు సవిశేషముగు 'చంద్రాలోక వృత్తాన్తము'తోను, 'చంద్రాలోకవివరణము'తోను దానికిఁ గొంత వన్నెగూర్చి యాంధ్రులకుఁ గొంత యుపకారమొనర్చిరి.

శ్రీ ఉమాకాన్తముగారు సవిమర్శముగఁ జంద్రాలోకమును బ్రకటించుటచేఁ జాల విషయములందు బాగుగఁ జర్చింపఁబడియున్నవి. కాని అందును కొన్ని లోపములు కానవచ్చుచున్నవి — గమ్యోత్ప్రేక్షాలక్ష్యము మూలమున నున్నను సూరకవి విడిచెనని వారు వ్రాసిరి. కాని కువలయానందకారికలలోఁ జాల ప్రతులలో గమ్యోత్ప్రేక్షాలక్ష్యములు లేవు; లక్షణమును లేదు. మంజువాణి ముద్రాశాలవారు విభావనా భేదముక్రింద నిచ్చిన లక్ష్యలక్షణములనే వీరు 'విశేషోక్తి' క్రింద నిచ్చి 'కారణము కార్యమువలనఁ గలిగినేని' అన దానిని 'కారణంబుండి కార్యంబు కలుగదేని' అని సవరించిరి. వయి లక్ష్యలక్షణములకు నడుమ నొక పద్యము పోయినది; ఆ పద్యములోని సగముభాగము విభావనోదాహరణముగను, విశేషోక్తి లక్షణములై యుండును.

వక్త యొక యభిప్రాయమునఁ జెప్పఁగా శ్రోత వేఱొక యర్థమును గ్రహించుట వక్రోక్తి. చంద్రాలోకమునందు వక్త 'ముంచ మానం దినం ప్రాప్తం' (తెల్లవాఱినది. ఇఁకనైన కోపమును విడువుము) అని నాయకుఁడు పల్కఁగా, 'ప్రాప్తం నందినం మా ముంచ' (వచ్చిన నందిని విడువకుము) అను నర్థమును గ్రహించి నాయిక 'నేహ నంది హరాంతికే' (నంది యిక్కడ లేదు; శివుని సమీపమున నున్నది) అని సమాధానము చెప్పినట్లు ఉన్నది. సూరకవి యిచ్చిన 'సూరకవివేలు పెవ్వఁడు? 'సోముఁ; డతఁడు చంద్రుఁడా? కాఁడు; శివు'డను ఉదాహృతి సందేహనివారణ రూపమున నున్నది. ఇది వక్రోక్తి కుదాహరణము కాఁజాలదు.

ముద్రితప్రతులనుఁబట్టి సూరకవి యాంధ్రీకరింపక విడిచిన యలంకారములు పది. అవి ౧. ఆవృత్తిదీపకము; ౨. వ్యాఘాతము; ౩. ప్రత్యనీకము; ౪. వికస్వరము; ౫. సూక్ష్మము; ౬. పిహితము; ౭. వ్యాజోక్తి; ౮. గూఢోక్తి; ౯. వివృతోక్తి; ౧౦. యుక్తి అనునవి. ఇవికాక కొన్ని యలంకారములలోఁ గొన్ని భేదములు విడువఁబడినవి. తుల్యయోగితాలంకారమున 'వర్ణ్యములకుఁగాని, అవర్ణ్యములకుఁగాని ధర్మైక్యముండుట' అను ప్రథమ భేదము, 'స్వక్రియచే మంచిచెడ్డలను లోకమున కెఱుకపఱచుట' అగు నిదర్శనాలంకారతృతీయ భేదము, 'ఒకచోటఁ జేయఁదగిన పనిని మఱొకచోటఁ జేయుట, ఒక్కటి చేయఁబోయి వేఱొకటి చేయుట' అను అసంగతి భేదములు రెండు, ఉల్లాసభేదోదాహరణములు మూఁడు, విశేషముచే సామాన్య సమర్థనరూపమగు నర్థాంతరన్యాసభేదము, సాకూతగూఢోత్తరరూపము, ప్రశ్నద్వయమున కేకోత్తరరూపమునగు నుత్తరాలంకార భేదములు నిందుఁ గానరాకున్నవి.

సూరకవి యాంధ్రీకరణము మూలమునకుఁ జాల అనుగుణముగ నున్నది. కాని కొన్ని పట్టుల నిందును గొన్ని లోపములు కనిపించుచున్నవి.

౧. ఉత్ప్రేక్షాలక్షణము మూలమున 'సంభావనాస్యాదుత్ప్రేక్షా' (ఊహించుటయుత్ప్రేక్ష) అని కలదు. ఇందు లక్షణములేదు. ౪. 'విదితములుత్ప్రేక్షలు పెంపాదవెడుఁ గావ్యములయందు నుక్తానుక్తా, స్పదమును సిద్ధాసిద్ధా, స్పదమున నన్ వస్తు, హేతు, ఫలరూపమునన్.' అని తద్భేదపరిగణనమే చేయఁబడినది.

౨. కారికలలో నసంబంధాతిశయోక్తి లక్షణము 'యోగేఽప్యయోగోఽసంబంధాతిశయోక్తిరితీష్యతే' అని యున్నది. 'సంబంధమున్నను లేకుండునట్లు చెప్పుట'యని దాని యర్థము. సూరకవి దీనిని సంబంధాతి

శయోక్తిగఁ బరిగణించుచు 'యోగ మొందవుచు నుండి సుయోగ మొందవ, కున్న మును చెప్పినదియయ్యె యుప్పాగ్రకృతుల' అని చెప్పినాఁడు. మును చెప్పునది యనఁగా ముందు చెప్పిన సంబంధాతిశయోక్తి. అయోగమున యోగకల్పనము సంబంధాతిశయోక్తి.

3. కార్యకారణముల పౌర్వాపర్యము విపర్యస్తమగున నత్యంతాతిశయోక్తి. దీని యుదాహృతి 'అగ్రేమానో గతః పశ్చా దను నీతా ప్రియేణ సా' అని సంస్కృతమునఁ గలదు. సూరకవి దీనిని 'క.. మానము, పయనం బాయెను; ప్రియుండు పదపడి చనియెన్.' అని తెనిఁగించెను. మొదట నాయికకుఁ గోపము పోయినదని, ఆపిదప ప్రియుఁడామెం బ్రతిమాలఁ గొనెననియు మూలాభిప్రాయము.

4. ప్రకృతార్థమును దెలియఁజేయు పదములచే సూచ్యార్థమును సూచించుట ముద్రాలంకారమగును. దీనికి మూలమున 'నితంబగుర్వీ తరుణీ దృగ్యుగ్మ విపులాచసా' అని యుదాహృతి కలదు. ఇచట 'దృగ్యుగ్మవిపులా' అను సమస్తపదములోని 'యుగ్మవిపులా' పదము సంస్కృతానుష్టుప్ ఛందో విశేషమగు 'యుగ్మవిపుల'ను సూచించుచున్నది. సూరకవి యౌచిత్యమును పాటింపక పయిలక్ష్యమునే 'గీ. కృతుల ముద్ర నితంబగుర్వి యగు తరుణి, యతివిలోచన విపులయు నన్నయట్లు' అని తన యిచ్చవచ్చినట్లు పదములను తారుమారుచేసి యాంధ్రీకరించినాఁడు. సూరకవి వ్రాసినది తెలుఁగు తేఁటగీతి పద్యముగాన దానిని సూచించు పదముకల యుదాహృతి యే యపేక్షితము.

5. మూలమునం దుత్తరాలంకారభేదములన్నిటి యందును అలంకారనామ ముత్తరముగానే చెప్పఁబడినది. సూరకవి 'క. పరగుఁ గృతులందుఁ బ్రశ్నోత్తరమనఁగ నలంక్రియా వతంసము —' అని పయిదాని పేరు 'ప్రశ్నోత్తరము'గ మార్చినాఁడు.

6. నాల్గవ విభావనాలంకారభేదము మూలమున 'అకారణాత్కార్యజన్మ చతుర్థీ స్యా ద్విభావనా' అని యున్నది. అనఁగా 'కారణము కాని కారణమునుండి కార్యము పుట్టుట' అని యర్థము. దీనికి 'కారణములేక కార్యంబు కలిగెనేని' అని యాంధ్రీకృతి కలదు. విభావన తొలిభేదముకూడ ఈ రీతిగ నేయున్నది. 'కారణములేక కార్యంబు కలుగఁజెప్ప' అని యచటి లక్షణము. అది 'విభావనా వినాపిస్యాత్కారణం కార్యజన్మచేత్.' అను మూలమునకు సరిగ నేయున్నది. తెలుఁగు లక్షణములలో మొదటి, నాల్గవ భేదములకైక్యము కానవచ్చుచున్నది.

7 మూలమునఁ బ్రౌఢోక్తి లక్షణము 'ప్రౌఢోక్తి రన్యహేతూక్త్యై సాక్షాల్లాభః ఫలస్య యః' అనియున్నది. అనఁగా 'ఉత్కర్ష హేతువుకాని అన్యకారణము నుత్కర్ష కలుగఁజేయుకారణముగ నిబంధించుట' అని యర్థము. దీనికి తెలిఁగింపు 'గీ. ఎసఁగుఁ బ్రౌఢోక్తి యుత్కర్ష హేతు వమరు, దాని కతిశయ కారణత్వము నుడివిన...' అని యున్నది. ఇది మూలమునకు విరుద్ధము.

చంద్రాలోకమున ముద్రణస్ఖాలిత్యములు చాల తక్కువ. ఉన్నవి కొన్ని విపరీతార్థమును గలుగఁజేయుచున్నవి; అవిదిద్దను సాధ్యములు.

వ్యాజస్తుతి లక్షణమున '. నదియు వ్యాజస్తుతి' అని కలదు; దీనింబట్టి యింకొక వ్యాజస్తుతియున్న ట్లర్థమగును. కాన నీ సముచ్చయమును అవధారణముగ మార్చి 'అదియ వ్యాజస్తుతి' అనుట యుక్తము.

పయిదాని ద్వితీయోదాహరణమున 'అతినిశిత నఖదంతలూనాంగివైతి, వెందువలనమదర్థమునందు నహహా!' అనునది 'ఎందువలనమదర్థమ యంశువలన' అనుదానికి బదులుగాపడినది.

# వెణుతుర్ల వడ్డికవి

౧

శృంగారరససామగ్రిని వివరించు గ్రంథములలో శృంగారరసాలవాల మొకటి. దీనిని రచించినవాఁడు వెణుతుర్ల వడ్డికవి. [1]వడ్డికవి కౌండిన్యగోత్రుఁడు; తండ్రి మంగళగిరి; తాత వెంకనార్యుఁడు.[2] వడ్డికవి శ్రీరామభక్తుఁడు, శుక్లయజుర్వేది, దేశికాచార్యుల శిష్యుఁడు.

వడ్డికవి కాలము, నివాసము నిర్ణయింపఁదగిన యాధారములు లేవు. ఇతఁడు తన గ్రంథము పూర్వకవుల గ్రంథముల ననుసరించియే వ్రాసినట్లు చెప్పికొని యున్నాఁడు.[3] ఆ గ్రంథములు సంస్కృతగ్రంథము లయినను కావచ్చును. ఆంధ్రగ్రంథము లయినను కావచ్చును.

వడ్డికవి యెన్ని గ్రంథములను రచించెనో స్పష్టముగఁ దెలియదు. కాని శృంగారరసాలవాలము, బాలగోపాల విలాసము అను నితని కృతులు కన్పించుచున్నవి. బాలగోపాల విలాసము శ్రీ కృష్ణుని విలాసములను ప్రతిపాదించు ప్రబంధము.

౨

నామమునుబట్టియే 'శృంగారరసాలవాలము' శృంగారరసప్రతిపాదక గ్రంథముగఁ గన్పించుచున్నది. కాని యిది రసమంజరివలెఁ గేవల శృంగారరస సామగ్రీప్రతిపాదకము కాదు; ఇందుఁ దొలుతఁ గావ్యస్వరూప చర్చ కొంత కలదు. పిదపఁ గరుణాదు లగు రసాంతరములు నుల్లేఖింపఁబడినవి. దీనికి మూలము రసమంజరిని బోలు రసవిషయ ప్రతిపాదకము లగు కొన్ని గ్రంథములు, కావ్యాలంకార సంగ్రహము మొదలగు గ్రంథములు ఆధారము గావచ్చును.

శృంగారరసాలవాలము మూఁడాశ్వాసముల గ్రంథము. ప్రథమాశ్వాసమునఁ గావ్య లక్షణము, రత్యాదిస్థాయి భావోదాహృతులు, ఆలంబనోద్దీపన విభావములు, అనుభావ, సాత్త్విక, సంచారిభావములు, శృంగారచేష్టలు, చక్షుః ప్రీత్యాది శృంగారావస్థలు, స్వప్న-చిత్ర-సాక్షాద్దర్శనములు కలవు. ద్వితీయోల్లాసమున స్వీయ-ముగ్ధ-మధ్య-ప్రౌఢ ధీరాదినాయికలు, పరకీయ, వృత్తాది సురతగోపన వాగ్విదగ్ధ, ప్రియవిదగ్ధ, లక్షిత, కులట, ప్రథమాద్యనుశయాన, ముదిత మొదలగు నాయికాభేదములు వివరింపఁబడినవి. తృతీయాశ్వాసమునఁ బ్రోషితభర్తృకాద్యష్టవిధ నాయికల స్వరూపము, ముగ్ధాదులందీ యష్టభేద నిరూపణము, జ్యోత్స్నాభిసారికా ప్రవత్స్యత్పతికల లక్షణము, నాయికల ఉత్తమ మధ్యమాధమ భేద వివృతి, మండనాది స్వరూపము, నాయక భేదములు, నాయక సహాయు లగు పీఠమర్ద-విట-విదూషక స్వరూపము సోదాహరణముగ వివరింపఁబడినవి.

శృంగారరసాలవాలమును చెన్నపురిలోని 'ధుండిగణపతి బుక్కుడిపో' వారు ప్రకటించి గ్రంథమును ప్రచారములోనికిఁ దెచ్చిరి. 'గ్రంథపరిచయ' మొనరించిన శ్రీ మంచళ్ల వేంకట కృష్ణయ్యశర్మ (బి. ఏ.) గారు గ్రంథమును

---

1. 'ఇది శ్రీరామభద్ర కరుణాకటాక్షలబ్ధ కవితాచమత్కార వెణుతుర్ల కులాలంకార, కౌండిన్యసగోత్ర పవిత్ర, వేంకనాచార్య పౌత్ర, సాధుచారిత్ర, మంగళగిరిపుత్ర, వినయగుణధుర్య వడ్డికవి ప్రణీతం బైన......'

2. ఉ. శ్రీరఘువీరభక్తిరససింధువిహారుఁడ శుక్లయాజుషా
చారుఁడ దేశికాంఘ్రిపరిచారుఁడ నే వెణుతుర్లవంశవి
స్తారుఁడ వడ్డినామకవిసత్తముఁడన్ రఘువర్యు పేర శృం
గారరసాలవాల మనుకావ్యము సేతు జగద్ధితంబుగన్.

3. గీ. అవధరింపుము పూర్వసత్కవినికాయ, కావ్యలక్షణలక్ష్యసంగతు లెఱింగి,
కృష్ణదేవుఁడు కల్పినక్రీడలాంధ్ర, భాష శృంగారరసము నేర్పఱతు నిటుల.

గూర్చియు, గ్రంథకర్తను గూర్చియు సంగ్రహముగఁ బరిచయ మొనర్చిరి.

రసములలో శృంగార ముత్తమ మగుట, యందనేక భేదములు కలయుట నెఱిఁగి తత్ప్రతిపాదక మగుకావ్యమును వ్రాయ నిడ్డికవి తలఁచినట్లు గ్రంథమునఁ గలదు. శ్రీ ఘన్నయ్య శర్మగారును ఇందుఁ బ్రాచీనప్రబంధములందువలెఁ గృత్యాది వర్ణనాదికములు, షష్ఠ్యంతములు, స్వప్నసాక్షాత్కారములు మున్నగునవి లేవని యిది యొక ప్రబంధ మను సంశయమునే వివరించిరి. ఇయ్యది కావ్య, ప్రబంధములకు లక్షణము చెప్పునది, కావ్యము కాని, ప్రబంధము కాని కాఁజాలదు.

సామాన్యముగ నాంధ్రాలంకారికులు నిరూపించు లక్షణములు సంస్కృతానుసారులు. అయినను ఇందు చాల స్వతంత్రత కనపడుచున్నది. లక్షణములు కొన్ని విలక్షణములుగ నున్నవి.

౧. 'ఆజి బలవంతుచేతఁ జీకాకు నొందినోయుట' జుగుప్స యని యిందలి లక్షణము. (౪. పుట.) పయి లక్షణమున కనుగుణముగనే యుదాహృతియు 'శ్రీకృష్ణుని రథము నడ్డగించి పరాభూతుఁ డగురుక్మి వృత్తాంతము' కలదు. మాంస, మస్తిష్క, వసాది దర్శనమున మనసునకుఁ బట్టరాని యేవగింపు కల్గుట జుగుప్స. కావున నిందలి లక్ష్యలక్షణములు సంస్కృతానుసారలు కాకున్నవి.

౨. 'విరహవ్యథ శోక' మని యిందుఁ గలదు. (౩ పుట.) 'విరహవ్యథచే బాధపడు నొక గోపభామినికి, కృష్ణుడు దర్శన మొసఁగుట' దాని కుదాహరణము. పుత్రాది వియోగమునఁ గల్గువైక్లబ్యమే శోకము. ఇచట లక్ష్యమున సుఖాంతత యున్నది. ఇదియు విలక్షణము.

౩. 'ఆత్మవికాసమందుట' హాస మని యిందలి లక్షణము. ఇది వాగంగ వికారాదికములవలనఁ గల్గు మనోవికారము 'కృష్ణుఁడు జలక్రీడలఁ దేలుస్త్రీల వలువల దొంగిలి, వారిని చేతు లెత్తి మ్రొక్కమనఁగ, వారు అకలంక మనోహరాంగ శృంగారము లెల్ల దోఁపఁ గరకాండము లె ముకుళించి మ్రొక్కఁ, దా, వనరుహాక్షుఁడు, ఆగసి హాస్య విలాస దక్షుఁడై నవ్వె' నని పయి హాసమున కుదాహృతి. కేవల హాసము హాస్యస్థాయి కాఁజాలదు; లక్ష్యము సరి గాదు.

౪ శమలక్షణ మిందు 'నెమ్మదిలోన నోర్పు సెలఁగ నిశ్చలపరి.తృప్తియ శమ'మని చెప్పఁబడినది.

దీని యుదాహరణము 'బోటు లనేక లాంఛాకరి పొట్ట సహింపక నైకరీతులఁ మాటలు మంచెమేళములు, మానము లూనము లెంచి,... నిజమానస శాంతగుఁ బూన... శౌరి యప్పాటలగంధు లందఱొక పాటుగఁ దేర్చెఁ గ్రమక్రమంబుగన్' అని కలదు. ఇచట మొదట్లఁ బోట్లాశ కొనిన స్త్రీలు శాంతము వహించి ట్లు వర్ణింపఁబడుటచే నిది శమోదాహరణ మని వివరింపఁబడినది. ఈ లక్ష్యము మీఁది లక్షణము కూడ సరి కావు.

శృంగార రసాలవాలము రచన చాల సరసము. లక్ష్యములు కొన్ని లక్షణములకు సరిపోకున్నను, సరసముగ నున్న వనుటకు సందేహము లేదు. ఇందు ముద్రణస్ఖాలిత్యములు మిక్కిలిగ దొరలినవి తక్కిన యచ్చు తప్పులతోఁ బాటు ఆకారాంత స్త్రీలింగశబ్దములు - స్వీయా, పరకీయా, సామాన్యా - మొదలగు శీర్షికా పదములు - ఇందు అకారాంతములుగ నే విడువఁబడినవి.

# కటికనేని రామయకవి

## ౧

ఆంధ్రమునఁ గల యర్థాలంకార గ్రంథములలో సంస్కృత కువలయానందము నాంధ్రీకరణ మగుకువలయానందప్రకాశ మొకటి. దీనిని రచించిన యాతఁడు కటికినేని రామయకవి. ఇతనిది పద్మనాయకకులము; చెలికనూళ్ల గోత్రము; రామయకవి ముత్తాత గోపరాజ మహీవల్లభుఁడు; తాత నరసరాయఁడు, తండ్రి సూరశౌరి; తల్లి బుచ్చెమ్మ; తమ్ముఁడు వేంకటరాయఁడు.

రామయకవి వైష్ణవమతావలంబి; కులగురువు శ్రీ ప్రతివాదిభయంకర వేదాంతాచార్యుఁడు. ఆదిగురువు తర్క వ్యాకరణ విద్వాంసుఁ డగుకనకాద్రి. ఇతఁడే కవికి విద్యాగురువు కావచ్చును. రామయ 'అతివిచిత్ర రసగుణాలంకార బంధురగీతి ప్రబంధ నిర్మాణ చాతురీధురీణుఁడు.' తనకుఁ బరమాప్తు లగు పానుగంటి వేంకయ, కాశి వేంకటనరసయ మొదలగువారు ప్రేరింప నీ 'కువలయానంద ప్రకాశ ప్రబంధంబును' లోకోపకారార్థంబుగా రచియించెను. రంగార్యవర్యుని సాహాయ్యమున నేతత్కృతి రచింపఁబడినది.

రామయకవి కాలము కాని నివాసస్థానము కాని స్పష్టముగాఁ దెలియవు. తెలిసికొనుటకుఁ దగిన యాధారములును లేవు. కువలయానంద ప్రకాశము క్రీ. శ. ౧౮౯౩ వ సంవత్సరమున 'శ్రీ కాశీవిశ్వనాథ' ముద్రాక్షరశాలయందు వెంకటగిరిలో ముద్రింపఁబడినది. దీనిని శ్రీ వెలుగోటి ముద్దుకృష్ణ యాచేంద్ర బహదరువారు ముద్రింపించి ప్రకటించినారు. ఇతఁడు వెంకటగిరి ప్రభువుల బంధుకోటిలోనివాఁడు కావచ్చును.

రామయకవి యెన్ని గ్రంథములను రచించెనో తెలియదు. శ్రీకృష్ణవిలాస మను గ్రంథాంతరము నీతఁడు రచించినట్లు తెలియుచున్నది.[1] అది యొక శృంగారప్రబంధమయి యుండవచ్చును.

## ౨

కువలయానంద ప్రకాశము సంస్కృతమున అప్పయదీక్షితులు రచించిన 'కువలయానందము' లోని తొలి నూఱలంకారములకును యథామూల మగు తెలుఁగుసేఁత. కొలఁది చోటుల మాత్రము మూలమున లేని యుదాహరణములు కొన్ని కలవు.

మూల మెచటను విడువఁబడినట్లు తోఁచదు. ఆంధ్రముతో నంతగా సంబంధింపనివి, సంస్కృతసంబంధములగు చర్చలు కూడ నిందు భాషాంతరీకరింపఁ బడినవి.

ఇది మూఁడాశ్వాసముల గ్రంథము. ఇందలి యాశ్వాసములకు ఘట్టము లని పేరు. ప్రథమాశ్వాసమున నుపమాలంకారము మొదలావృత్తిదీపకాలంకారము వఱకు, ద్వితీయాశ్వాసమునఁ బ్రతివస్తూపమాలంకారము మొదలుకొని విషమాలంకారాంతము వఱకును, తృతీయాశ్వాసమున సమాలంకారము మొదలుకొని స్వాత్యలంకారాంతము లక్ష్యలక్షణాదికము కలుగు. మిగిలిన భాగము విడువఁ బడినది.

కువలయానందమునకిది తెలుఁగుసేఁత యైనను, 'తు, చ' లు తప్పకుండ నిది యాంధ్రీకరణ మగుటచేతను, చాలవఱకు మూలమునందలి వాక్యముల కాకృతిగనె తత్సమీకరించిన యనుకరణ మగుటచేతను, నిందలి విషయము కొంత దుర్గ్రాహ్యముగనె యున్నది. శాస్త్రీయచర్చలపట్టుల ననువాదము మూలమునే పోలుచున్నది. ఉదాహరణ శ్లోకములు స్వేచ్ఛాంధ్రీకరణము కాక యథామూలములు.

వచనానువాదమున కుదాహరణము :

౧ ప్రసిద్ధోపమానోపమేయ భావప్రాతిలోమ్యంబువలనఁ బ్రతీపం బనం బరఁగు. దీనికి మూలము 'ప్రసిద్ధోపమానోపమేయ భావప్రాతిలోమ్యాత్ప్రతీపకమ్'

౨ వర్ణనీయం బైనవస్తువునందుఁ దత్సదృశధర్మోపఫలకంబైన తదీయ ధర్మనిహ్నవంబును, మఱియుఁ గనుంగొని నిజాసోత్ప్రేక్షిత ధర్మాంతర నిహ్నవంబును శుద్ధాపహ్నవం బనం బరఁగు

దీనికి మూలము—'వర్ణ్యేయే వస్తుని తత్సదృశ ధర్మోపఫలక స్వదీయ ధర్మనిహ్నవః శుద్ధాపహ్నుతిః' అని యున్నది.

---

1. కువలయానందప్రకాశము. పుటలు. ౫౨, ౫౩.

3. ఈ యుదాహరణంబునందుఁ బ్రస్తుతాప్రస్తుతంబులకు యుగపద్ధర్మాన్వయంబు ప్రతిభాసింపుచున్నయది......మను లక్ష్యంబునందు నప్రస్తుతంబునకే ముందుగా ధర్మాన్వయంబు ప్రతిభాసింపుచున్నయది. ఐనను బ్రస్తుతోద్దేశంబుచేతఁ బ్రస్తుతంబైనవర్ణనంబునకే యప్రస్తుతంబు నంబైన నన్వయంబు సంభవించుంగావునఁ బ్రాసంగికత్వంబు పరిత్యక్తంబు గాదు. రథ్యాప్రాసాదంబులకు యుగపదుపకారకత్వంబు గలుగుటచే దీపంబులకును, నతిథులకుఁ బ్రథమ పరివేషణంబు సేయుటచేత జామాత్రర్థంబు ప్రపితంబైన నూపంబునకును బ్రాసంగికత్వంబు రహితంబు గాదుగదా! తుల్యయోగితాలంకారంబునందు నొకటి ప్రస్తుతంబు వేఱొకటి యప్రస్తుతంబని విశేషగ్రహణంబు లేదిందు సర్వోద్దేశంబుచేత నే ధర్మోక్తి గలుగుటం జేసి పరస్పరవిశేషంబు నిర్దేశింపంబడియె, నీ యలంకారద్వయంబునం దుపమాలంకారంబునకు గమ్యత్వావిశేషంబు గలిగినను నీ దీపకాలంకారంబునం దప్రస్తుతం బుపమానంబనియుఁ, బ్రస్తుత ముపమేయం బనియు, నుపమానోపమేయ భావంబు వ్యవస్థితంబై యున్నయది. యత్తుల్యయోగితాలంకారంబునందుఁ బద్భావంబునకు విశేషగ్రహణంబు లేకుండుటవలన నైచ్ఛికంబై యుండుటంజేసి నీ యలంకారంబులకు రెంటికి నిది మఱియొకవిశేషం బయ్యె.

దీని మూలము '... ఇత్యత్ర ప్రస్తుతానామప్రస్తుతానాం యుగపద్ధర్మాన్వయ స్తథాపి ప్రాసంగికత్వం నహీయతే, వస్తుగత్యా ప్రస్తుతోద్దేశేనప్రస్తుతస్యైవ వర్ణనస్యాప్రస్తుతేఽన్వయాత్, నహి దీపస్య రథ్యాప్రాసాదయో ర్యుగపదుపకారకత్వేన జామాత్రర్థం శ్రపితస్య సూపస్యాతిథిభ్యః ప్రథమ పరివేషణేన చ ప్రాసంగికత్వం హీయతే. తుల్యయోగితాయాం త్వేకం ప్రస్తుత మన్య దప్రస్తుత మితి విశేషాగ్రహణాత్సర్వోద్దేశేనైవ ధర్మాన్వయ ఇతి విశేషః, అయం చానయో రపరో విశేషః, ఉభయోరనయో రుపమాలంకారస్య గమ్యత్వావిశేషేఽపి అత్రాప్రస్తుత ముపమానం, ప్రస్తుత ముపమేయ మితి వ్యవస్థిత ఉపమానోపమేయ భావః, తత్రతు విశేషాగ్రహణా దైచ్ఛిక స్స ఇతి'. విషయవివరణ మంతయు నీరీతిగనే యున్నది. మూలమందలి ఉపమోత్ప్రేక్షాసమాసోక్తికావ్యలింగార్థాంతరన్యాస లలితాదుల విషయవిమర్శన మింతకంటెను కఠినతర శైలిలో నున్నది.

భాషాంతరీకరణపద్ధతికి :

౧. గీ. రాజసేవ మనుష్యులకీ జగతిని
ఖడ్గధారావలేహంబు కదిసి చూడఁ
బంచవక్త్రపరిరంభ మంచితముగ
నాగకన్యావదనచుంబనంబు దెలియ.
(పుట. ౮౫.)

దీని మూలము.

రాజసేవా మనుష్యాణా మసిధారావలేహనమ్,
పంచాననపరిష్వంగో వ్యాళీవదనచుంబనమ్.

ఛందోయతిప్రాస సంసిద్ధికొఱకుఁ బయి పద్యమున 'ఈ జగతిని, కదిసి చూడ, అంచితముగ, తెలియ' అను పదములు తెచ్చి పెట్టుకొనినవి. మూలములోని 'వ్యాళికి' 'నాగకన్య' అని యాంధ్రకృతి. 'నాగకన్యా వదనచుంబనము' పంచానన పరిష్వంగమువంటిది కాకపో వచ్చునుగదా!

౨. గీ. మఱియుఁ గపికాపిశాయనమత్త మంత
వృశ్చికముచేత దష్టమై నగుడుపడియెఁ,
గడిమి మఱియుఁ పిశాచికాగ్రస్తమయ్యె
నహహా! దానివికార మేమనఁగ వచ్చు?
(పుట. ౨౪౦)

దీనికి మూలము—

కపిరపి చ కాపిశాయన
మదమత్తో వృశ్చికేన సందష్టః,
అపిచ పిశాచగ్రస్తః కిం బ్రూమో
వైకృతం తస్య?

మూలములోని 'కపిః, అపిచ' పదములకు పాదమున 'మఱియుఁ గపి' అని తారుమారయినవి. 'కడిమి' పద్యము కుదురుబాటునకు వచ్చినది.

ఇందచ్చటచ్చట వివరణసందర్భమున గవితా ననుసరించినపద్యముల సంగతి నేమఱచి మూలము నే వివరింప దొరకొనెను.

3. సహోక్తిని వివరించుచోట మూలము ననుసరించి 'అనేన సార్థం విహారాంబురాశీ' రిత్యాది స్థలంబులయందు సహోక్త్యలంకారముగా నుండుటకై జనరంజనం బనువిశేషంబు సహభావంబునకు దత్తం బయ్యెనని యిందు

వ్రాయఁబడినది. పయి సంస్కృత శ్లోకపాదాను వాదము విడువఁబడినది. (పుట. ౬౩)

౪. అర్థాంతరన్యాస వివరణ సందర్భమున మూలమునఁగల 'యోయోద్ధుంమవాన్ సహోఽగ్ని మాం. ...యథామమాంసః' అను సంస్కృత మనువాదమునందును తెలిఁగింపఁబడక యట్లే యుంచఁబడినది (౭౨.)

౫. 'పుష్కలకారణంబు గలిగి కార్య సముత్పత్తి గాక యున్న ..' విశేషోక్తి యని తాను లక్షణము నాంధ్రీకరించినను రామయకవి అతద్గుణాలంకార వివరణ సందర్భమున (పుట ౨౪౦.) విశేషోక్తి స్వరూపమును తెల్పుచు 'కార్యాజనిర్విశేషోక్తిః సతిపుష్కల కారణే' అను మూలముననే యుట్టంకించెను. కాని తన యనువాదమును పేర్కొనలేదు.

౬. విరృతోక్తి వివరణమున మూలమున నున్నట్లే 'చేతోఽలం కౌముదే మదీయం నాన్యత్ర కుత్రాపి చ సాభిలాష' మిత్యాకారక దమయంతీ వాక్యాదికంబు ఉదాహరింపఁ బడినది.

౭. కొన్నిచోట్ల మూలమునందలి లక్ష్యము లనువాదమునందును మార్పు చెందక యట్లే నిలిచియున్నవి.

౧౭౩ వ పుటలో సమాలంకారవివరణమున

గీ. 'న ఖలు శస్త్రం ప్రకుర్వీత నందన'యని
తండ్రి చెప్పినవచనము తనయుఁడు విని
యదియె శస్త్రంబు గావించె నాత్మజనకు
నాజ్ఞ నుల్లంఘనము సేయఁడయ్యె నపుడు.

దీనిమూలము.

శ్లో. శస్త్రం న ఖలు కర్తవ్య
మితి పిత్రానియోజితః
తదేవ శస్త్రం కృతవాన్
పితురాజ్ఞా న లంఘితా.

తండ్రి కుమారునితో 'శస్త్రముచేయవలదు' అని చెప్పఁగా నతఁడు 'నఖలు శస్త్రము' (గోరుగుండు) నే చేసిన ట్లిచట శ్లేషంబట్టి సమాలంకారము సమర్థింపఁబడినది ఇచట లక్ష్యముకూడ తెలుఁగుననుండుటయే యుక్తము.

మూలమునఁ గొన్నిచోటుల లక్ష్య శ్లోకము లందలి ప్రయోగములంగూర్చి చర్చలు పెరిగి నవి. అనువాదమున నట్టి చర్చల కవకాశము లేదు. అట్లయినను ఆ యనువాదము క్రిందఁ దిరిగి మూలమును వ్రాసి దానిపయి చర్చలు సాగింపఁబడినవి. ఉత్ప్రేక్షోదాహరణమున [పుట. ౪౫.] 'అపికారస్థితిరితి .. కామినీ, నవనీలార్ద్రి నఖక్షత ప్రతతులో నా నెంతయున్ భాసిలెన్' అనుచోటఁగల 'నాన' ఉత్ప్రేక్షా వాచకమే కాని యుపమావాచకము కాదు. అయినను మూలమందలి చర్చనుగూడ వ్రాయఁ దలఁచి కవి పై పద్యమునకు మూల మగు 'భాలేంగువక్రాణి ..నఖక్షతానీవ వనస్థలీ నామ్' అను చోటఁ గల 'ఇవ' శబ్దము సాదృశ్య వాచకమా? ఉత్ప్రేక్షావాచకమా? యని చర్చించి గ్రంథమును పెంచెను.

వివరణమునం దచ్చటచ్చట మూలములోని శ్లోకములే యనువాదమునఁ గలవు. అట్టివి సమాసోక్తియందును, నుత్ప్రేక్షయందును గలవు. వాని కనువాదము గాని వివరణము గాని లేదు. ఇది యథామూలానువాద మగుటచే లక్ష్య పద్యములకు మూలమున నున్నచో నిందును వివరణ ముండుటయు, అవి కష్టములయ్యును మూలమున లేకుండుటచే నిందును వివరణము లేకుండుటయుఁ జాలచోట్లఁ గలదు. దృష్టాంత, ప్రతివస్తూపమా సంభవ విభావనా విశేషోక్త్యాదులం దీరీతి కన్పించును.

పయి విషయములంబట్టి చూడఁగా మూల గ్రంథమును బాగుగఁ జదివినవాఁడే యనువాది యను నిస్సందేహముగఁ జెప్పఁగల దని తెలియుచున్నది

ఇట్లు ఆంధ్రీకరణము యథామూలముగా నున్నను, గొన్ని యెడలఁ గవి స్వాతంత్ర్యము నవలంబించెను — కొన్నిచోట్ల మూలకారికలలోని లక్ష్యభాగములు విడువఁబడినవి. ఉ. అధికతారూప్యరూపకము. కొన్ని యెడల మూలమున లేని 'అలంకార సంకరోదాహరణములు' కవినిబద్ధములు కలవు. ఉ. నిదర్శన, ఉత్ప్రేక్ష.

ఈ కువలయానంద ప్రకాశమునఁ గొన్ని యెడల ననువాదమునఁ గొన్ని దోసఁగులు కన్పించుచున్నవి. ముద్రనకు — ముద్రాలంకారము లక్ష్యలక్షణములు మూలమున,

'శ్లో. సూచ్యార్థసూచనం ముద్రా
ప్రకృతార్థపరైః పదైః
నితంబగుర్వీ తరుణీ
దృగ్యుగ్మవిపులా చ సా'

అని యున్నవి. ప్రకృతార్థమును దెలియఁజేయు పదములచే సూచ్యార్థము సూచింపఁబడిన ముద్ర యగు నని యర్థము. ఇచట 'దృగ్యుగ్మవిపులా' లోని యుగ్మవిపులాపదము అనుష్టుప్ ఛందో విశేష మగు యుగ్మవిపుల యను భేదమును (మీఁది శ్లోకచ్ఛందమును) సూచించుచున్నది. అనువాదమునఁ గూడ-

గీ. 'ధరణిఁ బ్రకృతార్థపరపదోత్కరముచేత
మొనయు సూచ్యార్థసూచన ముద్ర యగును;
దరుణి నిర్వక్రచక్రనితంబగుర్వి
విపుల కమరాభదృగ్యుగ్మవిపుల యగును'

అను వాల మందలి 'యుగ్మవిపుల'యే గ్రహింపఁబడి యది మూలమునకు సరిపెట్టఁబడినది. కాని యనువాద పద్యమున సూచ్యార్థ సూచన లేనందునఁ బయి యలంకారమున కిది యుదాహరణము కాఁజాలకున్నది. ఇందు 'దృగ్యుగ్మ విపుల'కు బదులు 'తేఁటగీతి' యని యుండిన - అది ప్రకృతార్థమున సమన్వయించిన ఉదాహరణము కాఁగలదు.

[పుట. ౨౩౪.]

మూలములోఁ బరికరాలంకార వివరణ సందర్భమున - శ్లేష, యమకాది స్థలములలో నపుష్టార్థదోషము పాటింపఁబడనందున నొక్క విశేషణ మభిప్రాయ గర్భిత మయినను పరికరాలంకార మగు నని చెప్పఁబడినది. అందు యమకమునకు-

'అతియశేత నిజాం యది దేవతా
ముభయ తశ్చ్యవతే జుషతేఽప్యఘమ్.
క్షితిభృతైవ సదైవతకా వయం
వనవతానవతా కి మహాగ్రుహా.'

అని యుదాహరణ మీయఁబడినది. ఇచట 'వనవతానవతా' యని యమకము.

చ. తెలియక నెవ్వఁ డేని
నిజదేవతఁ గొల్వక నన్యదైవతం
బులను యజించు నాతఁ
డఘమున్ వెసఁ జెందు నిహోర్ధ్వలోకసు
స్థలనముఁ జెందఁ గాన వన
సంపద గల్గిన యిన్నగేంద్రముం
గొలిచెదువార మింద్రు మతిఁ
గొల్వఁగ నేల యరణ్యములన్.'

అనునది మీఁదిశ్లోకమున కనువాదము. ఇందు మూలమునందువలె యమకము లేదు; అభిప్రాయ గర్భిత మగువిశేషణము యమకమునం దుండవలెను. వివరణములో 'వనసంపద గల్గిన' యనునది సాభిప్రాయ విశేషణముగఁ జెప్పఁబడినది. [పుటలు ౧౦౬, ౧౦౩.]

ఉత్తరాలంకారపు మొదటిభేద మిందు 'గూఢోత్తర'మను ప్రత్యేకాలంకారముగఁ జేర్కొనఁబడినది. మూలము—'కించిదాకూత సహితం స్యాద్గూఢోత్తరముత్తరం.' లక్షణానువాదము—'కించి దాకూత సహితమైన మించు నుత్తరంబు పరఁగును గూఢోత్తరం బటందు' (ఇచట అలంకార నామ మగు 'ఉత్తర'ము 'గూఢోత్తరవిశేషణ'ముగ గ్రహింపఁబడినది.)

(పుట. ౨౪౬)

పయి ఉత్తరాలంకారపు రెండవభేదము యొక్క లక్షణోదాహరణములు క్రింది రీతి నున్నవి —

'ప్రశ్నోత్తరాంతరాభిన్న
ముత్తరం చిత్ర ముచ్యతే
కేదారపోషణరతాః
కే ఖేటాః కిం చలం వయః'

'ప్రశ్నోత్తరములకు భేదము లేకుండుట, రెండు ప్రశ్నముల కొక్కటే యుత్తర మగుట చిత్ర మగు ఉత్తరాలంకార భేదము' అని పయి లక్షణము నర్థము. పయి శ్లోకమున కనువాదము-

గీ. బెరసి ప్రశ్నోత్తరాంతరాభిన్నమైన
నుత్తరం బది చిత్రమై యొగి నెసంగు;
జగతిఁ 'గేదారపోషణ శాలినః స్మ
కిం చలం హి వయః ఖగాః కే చ' యనఁగ.

ఇందలి లక్ష్యము మూలమే; అదియుఁ దారుమారుగ నున్నది. మఱియు నీ భేదము 'చిత్రము' అను ప్రత్యేకాలంకారముగఁ జేర్కొనఁబడినది. (పుట. ౨౪౭)

ఛేకోక్త్యుదాహరణము మూలమున
'మలయమరుతాం వ్రాతా యాతాః
వికాసితమల్లికా
పరిమలభరో భగ్నోగ్రీష్మ
స్త్వముత్సహసే యది
ఘన ఘటయితం త్వం
నిఃస్నేహం య ఏవ నివర్తనే
ప్రభవతి గవాం కిం నశ్ఛిన్నం
స ఏవ ధనంజయః,'

అని యున్నది; దీని యనువాదము—

గీ. మలయమరుదంకురస్ఫురన్మహిమ యణఁగ
మల్లికామోదభృద్గ్రీష్మ మెల్ల సమసె
ఘన! ఘటింపుము ప్రియుఁ గూర్మి కలిగి నేని
యావుల మరల్చువాఁడె పో యర్జునుండు.

లోకోక్తి కర్థాంతరకల్పనము చేయఁబడిన ఛేకోక్తి యగు నని లక్షణము. మూలమందలి 'గవాం నివర్తనే యః ప్రభవతి స ఏవ ధనంజయః' అనునది 'ఆవులను మరల్చినవాఁడే అర్జునుఁడు' అను లోకోక్తిని తెలియఁజేయుచు గో, ధనంజయ శబ్దశ్లేషవలన 'సౌందర్యవతి యగు నాయికను విడిచి ధనాశచే దూరదేశమునకుఁ బోయినవాఁ డరసికుఁ డగుట పశుప్రాయుఁ డని, ధనములను (ధనాశను) జయించినవాఁడే యట్టి పశుప్రాయు నింటికి మళ్లింపఁగలవాఁ డని యర్థాంతరము వచ్చుచున్నది. అనువాదములోని ఆవు, అర్జునుడు, అనునది అర్థాంతరావగమనమున కనుకూలములు కావు.

[పుట. ౨౬౦]

వక్రోక్త్యుదాహరణముగ
'అహో! కేనేదృశీబుద్ధి
ర్దారుణా తవ నిర్మితా
త్రిగుణా శ్రూయతే బుద్ధి
ర్నతు దారుమయీ క్వచిత్.'
అను శ్లోకము కలదు; దాని తెనిఁగింపు—

గీ. రమణి! సుప్పగ మురుదారుఘటిత మయ్యె;
నెవనిచేతను నీమది యవనియంగు,
బుద్ధి త్రిగుణాత్మకం బని పొలుపు మిగులు
దారుమయ మంచు నెచ్చటఁ దనర వినము.

మూలమందలి 'దారుణా' అను దానికి సబబగునర్థము దారుణ మైనది (కఠినమైనది) అని; అది తృతీయైక వచనముగా - వక్రబుద్ధితో గ్రహించి 'బుద్ధి యెచ్చటను కఱ్ఱతోఁ జేయఁబడ' దని జవాబీయఁబడినది. అనువాదమున 'ఉరు దారుఘటితము' అని కలదు. దీనికి రెండర్థములు లేవు; కఱ్ఱచేఁ జేయఁబడిన దనునర్థ మొక్కటియే వచ్చును. ఇచట అర్థాంతరప్రతీతి కలుగదు; ఇది వక్రోక్తి కుదాహరణము కాఁజాలదు.

ఈ గ్రంథము చాల జాగ్రతగ అచ్చొత్తింపఁబడినది. అయినను అచ్చటచ్చట తప్పులు పడినవి. అంతఁ గొన్ని విపరీతార్థస్ఫోరకములు కలవు. ప్రాగుదాహృత గ్రంథభాగములందును, మఱి చాలచోట్లను కళలు గ్రుతప్రకృతికములుగ నున్నవి. అవి ముద్రణస్ఖాలిత్యములు కావచ్చును.

# నవీన వాఙ్మయము

తక్కిన వాఙ్మయవిభాగములతోఁబాటలంకార వాఙ్మయమును ఆంధ్రమున క్రమముగ నభివృద్ధిఁ బొందుచున్నది. పెక్కురు పండితు లీ వాఙ్మయము నాదరించుచున్నారు. నవీనులును తొలుతఁ జాలవఱకు కేవలము అర్థాలంకారములను వివరించుగ్రంథములనే వ్రాయఁ దొడఁగినను క్రమముగ సమగ్రాలంకార శాస్త్రగ్రంథముల రచింపసాగిరి. అందు మూఁడు వంతుల ముప్పాలు భాషాంతరీకరణములు. భాషాంతరీకృతు లయినను ఆంధ్రమునకుఁ జాలవఱకు నుపయోగించునవియే. ప్రాచీను లగు నాంధ్రలాక్షణికులు నవీన సంస్కృతాలంకార గ్రంథముల ననుసరించిరి; నవీనులలోఁ గొందఱు ప్రాచీనాలంకార గ్రంథములను కూడఁ దగిన రీతిని తెనిఁగించుచున్నారు. అట్టి గ్రంథములు, వానియందలి విషయపరిశీలనము అలంకార తత్త్వముకు దెలిసికొనుట కెంతయు ననుగుణములు. ఇటు లీ వాఙ్మయము అభివృద్ధి పొందుచుండుట ముదావహము.

ఈ ప్రకరణమున అకారాదిక్రమముగ నీయఁబడినగ్రంథములలోఁ దెలిసినంతవఱకు ముద్రితములు, అముద్రితములు నగు నవీనాలంకార గ్రంథములు చేర్పఁబడినవి. వానిలోని విషయము లేవియో సంగ్రహముగఁ జెప్పఁబడినవి. ఆ గ్రంథముల విషయ విమర్శనము, గ్రంథము మంచి చెడుగులు నిందుఁ జేర్పఁబడలేదు.

### అచ్చతెనుఁగు రసమంజరి

**అముద్రితము.**

కర్త చింతలపిల్లి రామకృష్ణమూర్తిశాస్త్రి గారు; భానుదత్త మిశ్రుఁడు సంస్కృతమున రచించిన 'రసమంజరి' కిది యచ్చాంధ్రానువాదము; శృంగారరసానుగుణు లగు నాయికలయు, నాయకులయు లక్షణోదాహరణము లిందుఁ గలవు.

### అలంకారచంద్రిక

**(ముద్రితము)**

కర్త: వేలనూతుల శివరామ కృష్ణయ్య, నవీనగ్రంథములలో నిది ప్రాచీనము. ఇం దర్థాలంకారములు లక్షణోదాహరణములతో వివరింపఁబడినవి దీనికి దీక్షితులవారి 'కువలయానందకారికలు' మూలము.

### అలంకారచంద్రోదయము

ముద్రితము. కర్త: ఇమ్మనేని శరభలింగ నాయఁడు, ఇందును అర్థాలంకారములే వివరింపఁబడియున్నవి.

### అలంకారతత్త్వవిచారము

ముద్రితము కర్త: కురుగంటి సీతారామయ్య, ఎం., ఏ. అలంకారములతత్త్వ మిందు విచారింపఁబడినది.

### అలంకారమంజరి

ముద్రితము. కర్త: శేట్లూరి రాఘవయ్య, ఎం., ఏ. సంపూర్ణముగ కావ్య, తదంగములను సవిమర్శముగ వివరించు గ్రంథము. ఇందు కావ్యభేదములు, శబ్దభేదములు, వృత్తులు, వ్యంగ్యము, ధ్వనిభేదములు, రసస్వరూపము, గుణీభూత వ్యంగములు, శబ్దాలంకారములు, గుణ, రీతులు, అర్థాలంకారములును వివరింపఁబడినవి. చివఱ ననుబంధమున శబ్ద, రసములకు సంబంధించిన విశేషములు - గ్రంథమున విడువఁబడినవి - కలవు. దీనికి మమ్మటాచార్యుని కావ్యప్రకాశము స్థూలమూలము.

### అలంకారసంగ్రహము

ముద్రితము. కర్త: తి. రంగాచార్యులు. కువలయానందకారికల ననుసరించి యర్థాలంకారములను వివరించుగ్రంథము.

### అలంకారసంగ్రహము

ముద్రితము. కర్త: కందుకూరి వీరేశలింగము. ఇదియు నయిరీతి గ్రంథమే

### అలంకారసార సంగ్రహము

ముద్రితము. కర్త: వేదము వేంకటరాయ శాస్త్రి. ఇదియుఁ బయిరీతిదే. ఇందు మూలమందువలె లక్ష్యలక్షణములు పద్యములలోనే యున్నవి. వివరణము వచనమున నున్నది.

### ఆంధ్రకువలయానందము

అప్పయదీక్షితుల కృతి కాంధ్రానువాదము. శ్రీ కంభంపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి విరచితము. తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయ ప్రచురణము.

## ఆంధ్రదశరూపకము

ముద్రితము. కర్త : మల్లాది సూర్యనారాయణ శాస్త్రి. సంస్కృతమున ధనంజయుఁడు వ్రాసిన దశరూపకము (మూలము) నకును, ధనికుని 'దశరూపకావలోకము' (వివరణము) నకును (రెంటిమీఁదను) ఇది యనువాదము. నాటక లక్షణములను వివరించు గ్రంథము. సంస్కృత వివృతి యందలి చర్చావిషయము లిందు సంగ్రహముగ నీయఁబడినవి. మూలకారిక లిందు వచనమున - సూత్రరూపముగ తెలిఁగించఁబడినవి.

## ఆంధ్రధ్వన్యాలోకము

ముద్రితము. శ్రీ వేదాల - తిరువేంగళాచార్యులుగారు. ఆనందవర్ధనాచార్యుని ధ్వన్యాలోకమునకుఁ దెలుఁగు ఉదాహృతులు తెలుఁగు ప్రబంధములనుండి గ్రహింపఁబడినవి

## ఆంధ్రధ్వన్యాలోకము

ముద్రితము. బొడ్డపాటి కుటుంబరాయశర్మ. ఇదియు ఆనందవర్ధనుని మూలమున కనువాదము.

## ఆంధ్రధ్వన్యాలోకము

ముద్రితము. విజయనగర సంస్కృతకళాశాలా పండితులగు శ్రీ పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి రచితము.

## ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణము

ముద్రితము. చలమచర్ల రంగాచార్యులుగారు. విద్యానాథుని ప్రతాపరుద్ర యశోభూషణమున కిది యాంధ్రానువాదము.

## ఆంధ్రప్రతాపరుద్రీయము

ముద్రితము. జమ్ములమడక మాధవరామ శర్మగారు. ఇదియు ప్రతాపరుద్రీయమున కనువాదమే. శ్రీ చల్లపల్లి రాజావారి కంకితము.

## ఆంధ్రదశరూపకవిమర్శనము

ముద్రితము. కర్త : వెల్లాల సదాశివశాస్త్రి. పయి దశరూపకమునందలి గుణదోషములను విమర్శించు గ్రంథ మిది.



## ఆంధ్రసాహిత్యదర్పణము

ముద్రితము. కర్త వేదము వేంకటరాయ శాస్త్రి. సంస్కృతమున విశ్వనాథకవిరాజు వ్రాసిన సాహిత్యదర్పణమున కిది యథామూలానువాదము. ఇందు మూలకారికలు వచనమున సూత్రరూపముగ తెలిఁగింపఁబడినవి ఉదాహరణశ్లోకములకు వచనరూపముగా అనువాదము కలదు. ఉదాహరణ శ్లోకములు అధస్సూచిక (Foot note) యందు ఈయఁబడినవి.

## ఆంధ్రధ్వని

ముద్రితము కర్త : అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రి. సంస్కృతమున ఆనంద వర్ధనాచార్యులు రచించిన ధ్వన్యాలోకమునందలి మూలమునకు (ధ్వనినామము కలదానికి) ఇది పద్యానువాదము.

## ఔచిత్యవిచారచర్చ

అసమగ్రము. ముద్రితము. అనువాదకులు రామకృష్ణకవులు. సంస్కృతమున క్షేమేంద్రుఁడు వ్రాసినగ్రంథము దీనికి మూలము. పిఠాపురమునందలి 'కవిత' పత్రికలో ప్రకటింపఁబడినది.

## కవికంఠాభరణము

ముద్రితము. కర్తలు. రామకృష్ణ కవులు. క్షేమేంద్రని కృతికిఁ దెలుఁగుసేఁత. ఇందు కవులవలంబింపఁ దగినపద్ధతులు వివరింపఁబడినవి. ఇట్టివానిని 'కవిశిక్షా' గ్రంథము లందురు. వీని నలంకార వాఙ్మయమునందే యందఱును లెక్కింతురు.

## కావ్యకల్పలతావివృతి

ముద్రితము. కర్త కల్లూరి వేంకటసుబ్రహ్మణ్య దీక్షితులుగారు. సంస్కృతమున దేవేశ్వరుఁడు వ్రాసినగ్రంథమునకు తెలుఁగు వివృతి యిది. పయి దానివలె నిదియు కవిశిక్షా గ్రంథము.

## కావ్యకలాపము

ముద్రితము. కర్త. సాహిత్యం నారాయణ శర్మగారు. కావ్యసామగ్రీవివరణ మొనరించు గ్రంథము.

### కావ్యభూషణనిరూపణము

ముద్రితము. కర్త: చదలువాడ సుందర రామశాస్త్రిగారు. అర్థాలంకారవివరణ మింగుఁ గలదు.

### కావ్యమీమాంస

ముద్రితము. కర్త: పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి. ఇప్పటికి కావ్యమీమాంస యందలి ప్రథమాధ్యాయమగు 'కవిరహస్య'మే యుపలబ్ధము. దాని కిది యథామూలానువాదము. మూలమునందలి పద్యముల క్రిందు వచనమున భావానువాదమే కలదు.

### కావ్యప్రకాశవివృతి

ముద్రితము. కర్త: కొండూరి నరసింహాచార్యులు. మమ్మటాచార్యులు సంస్కృతమున రచించిన కావ్యప్రకాశమున కిది యాంధ్రవివృతి. కావ్యాంగముల చర్చ యిందలి విషయము.

### కావ్యలక్షణము

ముద్రితము. కర్త: శ్రీ కందుకూరి వీరేశలింగము. విద్యార్థుల కుపయోగించు కావ్యస్వరూప సంగ్రహము, అలంకారములు కొన్ని యిందు వివృతములు.

### కావ్యలక్షణము

ముద్రితము కర్త శృంగారకవి సర్వారాయుఁడు. ఇదియు పయి గ్రంథము వంటిదే.

### కావ్యాలంకారసంగ్రహటీక

శ్రీ వి. కృష్ణమాచార్యులుగారును, శ్రీ బ. సీతారామాచార్యులుగారును కలిసి రచించినది. ముద్రితము.

### కావ్యాలంకారసంగ్రహము

శ్రీ సన్నిధానము-సూర్యనారాయణ శాస్త్రిగారి విపులటీకతోఁ గూడినది వెల ౮ రూపాయిలు.

### కావ్యాలంకారసంగ్రహటీక

ముద్రితము. కర్త శ్రీ బులుసు వేంకటరమణయ్య. ఇందు - మీఁది టీకకూడ చేయఁబడినది. వావిళ్లప్రచురణము - వెల రు 3 లు.

### కావ్యాత్మ

ముద్రితము. కర్త: కేట్లూరి రాఘవయ్యంగారు; ఎం.,ఏ. ఇందు సంస్కృతాలంకార వాఙ్మయములోని విషయములు ప్రాచీన, నవీన మత నిరూపణ పురస్సరముగ వివరింపఁబడినవి. ఆయా యాలంకారికుల మతమున కావ్యమున కాత్మ యేదియో యిందు చర్చింపఁబడినది. ఆంగ్లమున డాక్టర్ సుశీలకుమారదేగారు (ఎం.,ఏ) వ్రాసిన సంస్కృతాలంకార వాఙ్మయచరిత్ర ద్వితీయభాగము (History of Sanskrit Poetics, Volume ii) దీనికి మూలము.

### - కావ్యాలంకారచూడామణివివృతి

ముద్రితము. కర్త వేదము వేంకటరాయశాస్త్రి ఆంధ్రమున విన్నకోట పెద్దయకవి రచించిన 'కావ్యాలంకారచూడామణి' కిది టిప్పణీగ్రంథము. పయి మూలగ్రంథమును ప్రకటించినవారును శ్రీ శాస్త్రులుగారే.

### కావ్యాలంకారసంగ్రహటీక

ముద్రితము. కర్త. వెల్లాల సదాశివశాస్త్రి. తెలుఁగున ప్రబంధాంకము మూర్తికవి నరసరాజున కంకితముగా రచియించిన 'కావ్యాలంకార సంగ్రహమునందలి రసప్రకరణమునకు (తృతీయాశ్వాసమునకు) ఇది తెలుఁగుటీక. రసమునకు సంబంధించి యుండుటచే ద్వితీయాశ్వాసమునందలి నాయికా స్వరూప, విశేషములు నిందు సమూలముగ వివరింపఁబడినవి. ఈ టీకయందు మూర్తికవి గ్రంథములోని తప్పులు, వానికి సవరణలును కలవు.

### కావ్యాలంకారసూత్రవృత్తి

ముద్రితము. కర్త: శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు. సంస్కృతమున వామనాచార్యుఁడు రచియించిన ప్రాచీనాలంకారగ్రంథము కావ్యాలంకారసూత్రవృత్తి కిది యనువాదము. మూలమునందువలెనే యిందును సూత్రము, వివృతి వచనమునఁ గలవు. ఉదాహరణములు వివిధము లగు ప్రాచీనాధునాతన సాంధ్రగ్రంథములనుండి యొసఁగఁబడినవి.

### కువలయానందసారము

ముద్రితము. కర్త: శ్రీ బులుసు వేంకట రమణయ్య. సంస్కృతమున అప్పయదీక్షితులు రచించిన కువలయానందమున కిది తెలుఁగు సేఁత. మూలమునందువలె నిందు లక్షణములు పద్యమునను, వివరణము గద్యమునను గలదు. ఉదాహరణములు చాలవఱకు ప్రాచీనాధునాతనాంధ్ర ప్రబంధములనుండి యేఱుకొనఁబడినవి. కొన్ని చాటువులు, కొన్ని మూలమున కనువాదములు. ఇందు పయికువలయానందములోని నూఱలంకారములే వివరింపఁబడినవి. వానిలోని శాస్త్రచర్చలు తెలుఁగునకు సంబంధించినంతవఱకు వివరింపఁబడినవి

### గంధవహము

అముద్రితము. మంచెళ్ల వాసుదేవకవి.

### నవరసగంగాధరము

ముద్రితము. జమ్ములమడక మాధవరామ శర్మగారు రచించినది. జగన్నాథ పండితరాజు రచించిన సంస్కృతగ్రంథమునకు రూపకాంత మగు ననువాదము.

### చంద్రాలోకము

ముద్రితము. కర్త: తాడూరి లక్ష్మీనరసింహ రావు. అప్పయదీక్షితుల కువలయానంద (మూల) కారికల కిది యాంధ్రానువాదము. (పద్య రూపము.) ఇందలి విషయ మర్థాలంకార వివేచనము.

### తెలుఁగు కావ్యాదర్శము

ముద్రితము. కర్త. అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రి. దండి సంస్కృతమున రచించిన కావ్యాదర్శమున కనువాదము. మూలమువలె నిదియు పద్యరూపము. మూలమునందలి విషయము లన్నియు ననువాదమునఁ గలవు

### నంజరాజయశోభూషణము

### ప్రతాపరుద్రీయము

గణపవరపు వేంకటకవి.

### రసమంజరి

గణపవరపు వెంకటకవి.

### నాటకలక్షణము

ముద్రితము. కర్త: శృంగారకవి సర్వారాయఁడు. నాటకలక్షణమును వివరించు గ్రంథము.

### భరతరసప్రకరణము

ముద్రితము. కర్త: తిరువెంకటాచార్యులు. భరతగీత మగు రసవిషయము ఇందుఁ గలదు.

### రసమంజరి

ముద్రితము. కర్త తాడూరి లక్ష్మీనరసింహ రావు. భానుదత్తుని కృతికి తెలిగింపు. ఇందు శృంగారరసమున కనుగుణలగు నాయికా నాయకుల స్వరూపము వివరింపఁబడినది.

### రసమంజరి

అముద్రితము. కర్త: వేదము వేంకటరాయ శాస్త్రి. ఇదియు పయి భానుదత్తకృతికి తెనిఁగింపే.

### చంద్రాలోకవివృతి

ముద్రితము. కర్త: అక్కిరాజు ఉమాకాంతము. దీక్షితుల కువలయానంద (మూల) కారికల కాంధ్రానువాదము, వచనమున 'చంద్రాలోకము' తోను, అడిదము సూరకవి 'ఆంధ్ర చంద్రాలోకము' తోను కూడఁ జేర్చి ముద్రింపఁబడినది.

### రసభావనాయికాసంప్రదాయములు

ముద్రితము. కర్త శ్రీ ఘట్రేపు నాగభూషణము. రసము, భావము, నాయిక మొ., సంప్రదాయము లేవో యిందుఁ గలవు.

### రసికజనానందము

ముద్రితము. కర్త: ప్రో. నరసింహారావుగారు రసవిషయ మిందుఁ బ్రతిపాదితము.

## సాహిత్యచింతామణి

ముద్రితము. కర్త: తి. ఈ. శ్రీనివాసాచార్యులు. వచనము. కువలయానంద (మూల) కారికలలోని విషయ మిందుఁ గలదు.

## సంస్కృతాలంకారచరిత్రము

ప్రథమభాగము. ముద్రితము. కర్త: మేడేపల్లి వేంకటరమణాచార్యులు. సంస్కృతమునందలి యాలంకారికుల యొక్కయు, అలంకారవాఙ్మయముయొక్కయుఁ జరిత్ర మిందుఁ గొంతవఱకుఁ గలదు.

కేవలము అలంకారశాస్త్రగ్రంథము లివియే. ఇవి కాక సారస్వతమును విమర్శించుచు, సందర్భానుసారము కావ్యాంగములను వివరించు గ్రంథములు అనేకము లాంధ్రసారస్వతమున వెలసినవి. వాని యుత్పత్తికి పాశ్చాత్యభాషా వాఙ్మయ సంప్రదాయముల నాంధ్రభాషా వాఙ్మయముల సంప్రదాయములతో సరిపోల్చుట, పరిపోల్చి మంచిచెడుగులను వివరించుట ముఖ్యము లగు కారణములు. అట్టి విమర్శగ్రంథములలోఁ గొన్ని ప్రాచీన సంప్రదాయములపైనే ఆధారపడినవి; కొన్ని ప్రాచీనసంప్రదాయములను పూర్తిగ నిరసించునవి. కొన్ని దేశ, కాల, పాత్రానుగుణముగ ప్రాచీనపద్ధతులను సంస్కరించి వాఙ్మయమునకు నవ్యతఁ గూర్పఁజాలినవి.

పయి విమర్శగ్రంథములు బహుముఖములు. వాని నన్నింటిని అలంకారవాఙ్మయచరిత్రమే ప్రధానముగఁ గల యీ గ్రంథమున వివరించుట యప్రస్తుతము.

# ద్వితీయ భాగము

## కావ్యము

మానవులను హితమునఁ బ్రవర్తింపఁజేయుట, అహితమునుండి మరల్చుట వాఙ్మయమునకు సాధారణమగు ధర్మము. వైదికవాఙ్మయము ప్రభుసమ్మితము; అది శబ్దప్రధానము. రాజశాసనమును ప్రజ లనుసరించుచున్నట్లు వేదవాక్యముల యనుశాసనమును అంద ఱామోదించవలెను. 'ఎందుల కనుసరింపవలె?' నను ప్రశ్న వేయు వీలు లేదు. రాజశాసనము నతిక్రమించినవారికి శిక్ష యట్లే వేదశాసనము నతిక్రమించినవారికి రౌరవాది నరకవాసరూప మగు శిక్ష కలుగును. కావున వేదము ప్రభువుతోఁ బోల్పఁబడినది.

పురాణేతిహాసములు సుహృత్సమ్మితములు; అవి అర్థప్రధానములు. మిత్రుఁడు 'ఇది మంచిది; మంచిగాఁ బ్రవర్తించినవారు లోకోత్తరకీర్తివిలసితు లయినారు; ఇది చెడ్డది; ఇట్లు ప్రవర్తించినవారు అపకీర్తిపాలయి నశించినారు' అని దృష్టాంతపూర్వకముగ మిత్రునికి హితమును బోధించునట్లు, పురాణేతిహాసములు రామరావణుల చరిత్రములను చెప్పి 'రామునివలెఁ బ్రవర్తింపవలెను; రావణునిరీతిగ నుండరా' దని హితమును బోధించును. ఇది శాసనము కాకపోవుటచే పూర్వమార్గముకంటెఁ గొంత మృదుల మయినది. ఇందు శబ్దములవలనఁ గలుగునర్థమే ప్రధానము.

కావ్యవాఙ్మయము కాంతాసమ్మితము; ఇందు వ్యంగ్యమే ప్రధానము; శబ్దార్థము లప్రధానములు. విలాసవతి యగు కాంత కటాక్షవీక్షణాది విలాసములచేత నే కాంతు నాకర్షించుచు 'ఇది నాకు ఇష్టము; కాన దీని నే చేయుము; ఇది యనిష్టము, కాన చేయకుము' అని మాటలచేఁ జెప్పకయే కావలసిన దంతయు సంపాదించునట్లే కావ్యము వ్యంగ్యప్రధానక మయి, శబ్దార్థప్రధానకము లగు వేద, పురాణములకంటె విలక్షణ మయి, వ్యంజనావ్యాపారమహిమచేత నే 'రామాదులవలె నుండవలె, రావణాదులవలె నుండరా' దని పురుషులకు హితబోధ చేయును. ఇది పూర్వమార్గద్వయముకంటె అత్యంతరమణీయము; సరసము. వేద, పురాణ, కావ్యవాఙ్మయము లన్నింటివలనను గలుగు ప్రయోజన మొక్కటియే యయినను పయి విశేషమునుబట్టియే కావ్యవాఙ్మయ మందఱకు నావశ్యక మయినది. వ్యంగ్యప్రధానకము కాని కావ్యము ఉత్తమకావ్య మెన్నటికిని కాఁజాలదు.

కావ్యప్రయోజనముల ననేకు లనేకవిధముల నుగ్గడించి యున్నారు. ప్రాచీనాలంకారికుఁడగు భామహాచార్యుఁడు

'ధర్మార్థకామమోక్షేషు
వైలక్షణ్యం కళాసు చ,
కరోతి కీర్తిం ప్రీతిం చ
సాధుకావ్యనిషేవణమ్'

అని చెప్పియున్నాఁడు. మమ్మటుఁడు కావ్యప్రకాశమునందు

'కావ్యం యశసేఽర్థకృతే
వ్యవహారవిదే శివేతరక్షతయే,
సద్యఃఫలనిర్వృతయే కాంతా
సమ్మితతయోపదేశయుజే'

అని వివరించినాఁడు. ప్రవరసేనుఁడు

'పరివర్ధతే విజ్ఞానం
సంభావ్యతే యశో విసర్పన్తి గుణాః,
శ్రూయతే సుపురుషచరితం
కిం తద్యేన న హరన్తి కావ్యాలాపాః.'

అనినాఁడు. విశ్వనాథుఁడు

'చతుర్వర్గఫలప్రాప్తిః
సుఖా దల్పధియా మపి,
కావ్యాత్ . . .

అని విశదపఱచినాఁడు.

కవిజనాశ్రయమున 'సత్కావ్యముఁ జెప్పఁగఁ బడయరాని వస్తువు కలదే?' అని కలదు. మూర్తికవి 'ఉద్వేలనిర్వాణభవ్యరసాస్వాదరసాయనం బనిన కావ్యం బెన్న సామాన్యమే?' అని యుగ్గడించినాఁడు. ఇటులనే తక్కిన పెక్కుమంది కావ్యలక్షణకర్తలు, కావ్యకర్తలు వివిధము లగు కావ్య

ప్రయోజనములను పేర్కొనియున్నారు. అన్నిటి కంటెను ప్రధాన మగుప్రయోజనము సద్యః ఫలము రసానందము. దాని తరువాత నే తక్కిన వన్నియును.

కావ్యము నందఱును రచింపఁజాలరు; 'నానృషిః కురుతే కావ్యం' అని పెద్దలన్నారు. అందరును దాని నర్థము చేసికొనను జాలరు. కావ్యమును రచించుటకు మూఁడు హేతువులను కొందఱు పేర్కొనినారు. దండ్యాచార్యుఁడు 'నైసర్గిక మగుప్రతిభ, నిర్మల మగు శ్రుతము, అమంద మగునభియోగము (పట్టుదల) కావ్యహేతువు' లని చెప్పియున్నాఁడు. 'శక్తి, నైపుణ్యము, అభ్యాసము ననుమూఁడు నున్నఁగాని కావ్యము రచింప శక్యము కాదని మమ్మటాచార్యులు చెప్పిరి. జగన్నాథ పండితరాజు కేవల మగుప్రతిభయే కావ్యహేతు వనియు, నది కొన్నియెడల దేవతానుగ్రహాదులవలనఁ గలుగు ననియు, కొన్నియెడల విలక్షణము లగువ్యుత్పత్త్యభ్యాసములవలనఁ గలుగు ననియు సవిమర్శముగ సిద్ధాంతీకరించెను. దేని నంగీకరించినను, దేని నంగీకరింపక పోయినను ప్రతిభ కావ్యహేతు వగుట సర్వసమ్మతము. అదియే అపూర్వ మగుశక్తి. అది లేనిచో కావ్యమును రచింప వీలు లేదు. ప్రతిభ లేక వ్రాయఁబడినకావ్యము కావ్యాభాస మగును; కాని కావ్యము కాఁజాలదు. శాస్త్రములు చదివి పండితుఁ డగుట సులభము; కావ్యము వ్రాయుట చాల కష్టతరము. ఈ సంగతినే భామహుఁడు 'గురూపదేశా దధ్యేతుం శాస్త్రం జడధియోఽప్యలమ్, కావ్యంతు జాయతే జాతు కస్యచి త్ప్రతిభావతః.' అని తెల్పియున్నాఁడు.

కావ్యలక్షణమును గూర్చి ప్రాచీనకాలము నుండియు నభిప్రాయ భేదములు కలుగుచునే యున్నవి. ప్రాచీనాలంకారికుఁ డగుభామహుఁడు 'శబ్దార్థౌ సహితౌ కావ్య'మని విశిష్టము లగుశబ్దార్థములు రెండును గలసి కావ్యమగు నని చెప్పినాఁడు. [1]పయిలక్షణమునకు గుణాలంకారసాహిత్యమును, దోషరాహిత్యతను మేళవించి వామనుఁడు కొంత మెఱుఁగు పెట్టినాఁడు. రుద్రటాచార్యుఁడు, ఆనంద వర్థనాచార్యుఁడు, కుంతకుఁడు, మమ్మటాచార్యుడు, వాగ్భటుఁడు, విద్యానాథుఁడు మొదలగువారా మార్గము నే యనుసరించినారు. దండ్యాచార్యుఁడు 'ఇష్ట మగునర్థమును తెలియఁజేయు పదసమూహమే కావ్య' మని నిర్వచించినాఁడు[2]. లక్షణకరణమున కొంత భేదమున్నను రాజశేఖరుఁడు, కేశవమిశ్రుఁడు, జయదేవుఁడు, విశ్వనాథుఁడు, పండితరాజు మొదలగువారు శబ్దమే కావ్య మనుదండి మతము నే యనుసరించి రనుట స్పష్టము.

ఆంధ్రాలంకారికులలోఁ జూడామణి కారుఁడు కొన్ని పట్టుల దండి ననుసరించినను, కొన్నియెడల ప్రతాపరుద్రీయము ననుసరించినను కావ్యలక్షణమును చెప్పక చల్లగ జారవిడిచినాఁడు. మూర్తికవి విద్యానాథునే

---

1. కావ్యశబ్దోఽయం గుణాలంకారసంస్కృతయో శ్శబ్దార్థయో ర్వర్తతే. [కావ్యాలంకార సూత్రవృత్తి]

'నను శబ్దార్థౌ కావ్యం — [కావ్యాలంకారః-2౧.]

'శబ్దార్థౌ సహితౌ వక్రకవివ్యాపార శాలిని, బంధే వ్యవస్థితౌ కావ్యం...' [వక్రోక్తిజీవితమ్.]

'తదదోషౌ శబ్దార్థౌ సగుణా వనలంకృతీక్వాపి.' [కావ్యప్ర]

'సాధుశబ్దార్థసంబంధం గుణాలంకారభూషితమ్, స్ఫుటరీతిరసోపేతం కావ్యం కుర్వీత ..' [కావ్యానుశాసనమ్.]

'గుణాలంకారసహితౌ శబ్దార్థౌ దోషవర్జితౌ ....కావ్యమ్' [ప్రతాపరుద్రీయమ్]

2 'శరీరం తావ దిష్టార్థవ్యవచ్ఛిన్నా పదావళీ.' [కావ్యాదర్శః]

'గుణవదలంకృతం చ వాక్య మేవ కావ్యమ్' [కావ్యమీమాంసా]

'కావ్యం రసాదిమ ద్వాక్యం శ్రుతం సుఖవిశేషకృత్' [అలంకారశేఖరః]

'నిర్దోషా లక్షణవతీ సరీతి ర్గుణభూషితా,

'సాలంకారరసానేకవృత్తి ర్వాక్ కావ్యనామభాక్,' [చంద్రా]

'వాక్యం రసాత్మకం కావ్యమ్.' [సాహిత్యదర్పణః]

'రమణీయార్థప్రతిపాదకః శబ్దః కావ్యమ్. [రసగంగాధరః]

యనుసరించినాఁడు[1]. అప్పకవి నన్నయ వ్రాసిన 'తదదోషౌ పరిక్రుతౌ చ వాగయ? అనులక్షణము నాంధ్రీకరించినను, సరి యగు నట్లు రీతిని చెప్పఁజాలక పోయెను. ఇంచుమించుగ ఆంధ్రాలంకారికు లందఱును శబ్దార్థయుగళమే కావ్యపదవాచ్య మని తేల్చిరి.

శబ్దమే కావ్య మని చెప్పినవారి మతమునఁ గూడ నర్థమునకుఁ గావ్యశరీరమున ప్రవేశము అనివార్యము. ఏల యన శబ్దమునకుఁ గల ప్రధానప్రయోజన మర్థప్రతిపాదనమే. 'ఇష్టార్థముఁ దెల్పు పదావళి, రమణీయార్థప్రతిపాదక మగుశబ్దము' ననులక్షణైకదేశమీ యంశమును తెలియఁజేయుచున్నది. కావ్యపదవాచ్యత శబ్దమునకే కలుగు నని మాత్రము రెండవపక్షమువారి మతము. కావ్య మర్థము కాలేదు, కావ్య మర్థ మగుచున్నది. కావ్యమును చదివితిని' మొదలగువ్యవహారములనుబట్టి శబ్దమే కావ్యపదవాచ్య మని పయివారి యాశయము. విమర్శకు లీమతమునే యామోదింతురు.

కావ్యమును వ్యక్తిగా పోల్చి, మానవధర్మములను దానియం దారోపించుట ఆలంకారికులు చాలమందికి పరిపాటి యయినది. ఇది క్రమక్రమముగ వచ్చినట్లు తోఁచుచున్నది. కావ్యమునం దలంకారములు ప్రధానము లని చెప్పిన భామహుఁడు తక్కినసంగతులను - అనగా - ఆత్మ - మొదలగువానిని - వివరింపక పోయినను 'అలంకారములు భూషణములవంటి' వని '. కాంతమపి నిర్భూషం విభాతి వనితాముఖ' మ్మను దృష్టాంతమున విశదపఱచెను. దండి 'పదావళి - శరీర' మ్మని శరీర మనువ్యవహారము నములు లోనికిఁ దెచ్చెను. వామనుఁడు 'రీతి రాత్మా కావ్యస్య' అని ఆత్మవ్యవహారమును బ్రవర్తింపఁ జేసినవాఁడు. శరీరము, అలంకారములు నున్నపుడు ఆత్మ లేకుండుట యెట్లు? వామనుఁ డంతతోఁ దృప్తి నొందక గుణములు, అలంకారములుకూడ నుండవలె ననియు, అవి యెన్నియు నున్నయపుడే కావ్య మగు ననియుఁ జెప్పియున్నాఁడు. పిదప నాలంకారికులలోఁ జాలమంది కావ్యముయొక్క యాత్మంగూర్చియే చర్చలను సాగించిరి. ఆనందవర్ధనుఁడు ధ్వని, అంగును రసధ్వనియే కావ్యమున కాత్మ యనియు కుంతకుఁడు వక్రోక్తి (అతిశయోక్తి) యే కావ్యాత్మ యనియు, క్షేమేంద్రుఁడు రససిద్ధ మగుకావ్యమునకు ఔచిత్యమే జీవిత మనియు వివరించినాఁడు. తుద కానందవర్ధనుని మతమే నిలిచినది. మమ్మటాచార్యుఁ డాదిగాఁ గల యాలంకారికు లందఱు నామతమునే యవలంబించిరి. కావ్యప్రకాశాదు లగు కొన్ని గ్రంథములలోఁ గావ్యలక్షణమున గుణాలంకారములకుఁ బ్రవేశము కలిగినది. సాహిత్యదర్పణకారుఁడు, రసగంగాధరకారుఁడు మొదలగువా రావాదమును ప్రతిఘటించిరి.

కావ్యమునందలి యలంకారములు భూషణములవంటివి శ్లేషాదిగుణములు శౌర్యాదులవంటివి. పయిగుణాలంకారములకుఁ గావ్యలక్షణమునఁ బ్రవేశ మున్నచో-అలంకారములు లేనివారును శౌర్య, ధైర్యాదులు లేనివారును మనుష్యులు కాక పోవలసివచ్చును. అట్లు లోకమున వ్యవహార మున్నదా? లేదు; మఱియు శౌర్యాదు లాత్మధర్మములు; శరీరధర్మములు కావు. కావునఁ గావ్యలక్షణమున వానికిఁ బ్రవేశ మక్కఱ లేదు. దోషములు కావ్యమున కపకర్షహేతువు లని, గుణాలంకారము లుత్కర్షపాదకము లని మాత్రము చెప్పవచ్చును; ఇది నవీనుల మతము. ఇదియే సిద్ధాంతము.

ఆంధ్రాలంకారికులు సామాన్యముగ విద్యానాథునే యనుసరించిరి[2]. విద్యానాథుఁడు మమ్మటు ననుసరించి కావ్యలక్షణమున గుణాలంకారములను జొప్పించెను. ఇది యుచితము కాదు.

'కావ్యమునకు ధ్వనియే ఆత్మ' అనుమతము బయలుదేరువలనను కావ్యము గద్య-పద్య మిశ్ర

---

1. 'తను వగుశబ్దార్థంబులు......' [నరసభూపాలీయము.]

2. క. తను వగుశబ్దార్థంబులు, ధ్వనిజీవ, మలంక్రియావితానము సొమ్ముల్,
తనరు గుణంబులు గుణములు, ఘనవృత్తులు వృత్తు లౌర కావ్యంబునకున్. [నరస]

భేదములచే మూఁడువిధము లని చెప్పఁబడినది. నాటకములు, చంపువులు, మిశ్రము లని పరిగ ణింపఁ బడినవి[1]. ధ్వనివాదము వెలసిన పిదపఁ బయివిభాగము మాఱిపోయినది; కావ్యము ధ్వని, గుణీభూతవ్యంగ్యము, చిత్రము అని మూఁడువిధము లని క్రొత్తవిభాగము ఏర్పడినది. వ్యంగ్యము ప్రధానముగఁ గలది ఉత్తమ కావ్యము; దీనికి ధ్వని యనునది నామాంత రము; వ్యంగ్య మప్రధాన మయి, వాచ్యము ప్రధానముగఁ గలది మధ్యమకావ్యము; దీనినే గుణీభూతవ్యంగ్య మందురు. పయిరెండు భేద ములకంటె వేఱయినది-అనఁగా రస, భావాది తాత్పర్యము లేనిది, వ్యంగ్యార్థప్రకాశనశక్తి లేనిది-అధమకావ్యము; ఇదియే చిత్రకావ్యము, ఇది కావ్యాభాసము కాని కావ్యము కాదు[2]. పయి విభాగ మానందవర్ధనకృతము; మమ్మటాదు లామతమునే యనుసరించిరి.

సాహిత్యదర్పణకర్త యగువిశ్వనాథుని మతమున రసమే ప్రధానము. రసము ప్రధాన మగునది తన్మతమునం దుత్తమకావ్యము; అప్రధాన మగునది గుణీభూతవ్యంగ్యము. అతని మతమునఁ జిత్రము కావ్యమే కాదు.

రసగంగాధరమునఁ గావ్యము, ఉత్తమోత్త మము, ఉత్తమము, మధ్యమము, అధమము నని నాల్గువిధము లని చెప్పఁబడినది. శబ్దార్థము లప్రధానములయి, వ్యంగ్యార్థమును ద్యోతన చేసిన ఉత్తమోత్తమకావ్య మని, వ్యంగ్య మప్రధాన మయ్యుఁ జమత్కారము కలిగించిన నది యుత్తమ కావ్య మనియు, వ్యంగ్యముకంటె వాచ్యమే చమత్కారాధాయక మయిన అది మధ్యమ మనియు, అర్థచమత్కృతిపురస్కృత మగుశబ్ద చమత్కృతి యున్నకావ్య మధమ మనియు, నతని మతము. అర్థచమత్కృతి లేక శబ్దచమ త్కృతియే కల యేకాక్షరపద్య, పద్మబంధాదు లితనిమతమునఁ గావ్యములు కాఁజాలవు.

శబ్దార్థభేదములచే ద్వివిధ మగుచిత్రములో, నర్థచిత్రము లగునుపమోత్ప్రేక్షా దీపక సమా సోక్త్యాదులును, శబ్దచిత్రము లగునను ప్రాస, యమకాదులును మూఁడవ, నాల్గవ కావ్యభేద ములలోఁ జేరుచుండు నని యతని యాశయము.

ఆంధ్రాలంకారికులలోఁ బ్రాచీనుఁ డగు పెద్దయకవి కావ్యవిభాగవిషయమున దండి మతమునే తీసికొనుటచే గద్య - పద్య - మిశ్ర భేదములచేఁ గావ్యము మూఁడువిధము లనియే చెప్పవలసి వచ్చెను. మూర్తికవి ప్రతాపరుద్రీ యానుయాయి, కనుక కావ్యము ధ్వని, గుణీ భూతవ్యంగ్య, చిత్రభేదములచే నతని మతమున మూఁడువిధము లయినది[4]. కావ్యాలంకార సంగ్రహము రసగంగాధరముకంటెఁ బ్రాచీ నము; అందుచే అందలి కావ్యవిభాగ మిందుఁ

1. 'గద్యం పద్యం చ మిశ్రం చ తత్త్రిధా పరికీర్తితమ్.'
'గద్యపద్యమయీ కాచి చ్చంపూ రిత్యభిధీయతే.'
'మిశ్రాణి నాటకాదీని తేషా మన్యత్ర విస్తరః.' [కావ్యాదర్శః.]

2. యత్రార్థః శబ్దో వాత మర్థ ముపసర్జనీకృతస్వార్థౌ,
వ్యంక్తః కావ్యవిశేషః సధ్వని రితి సూరిభిః కథితః. [ధ్వన్య. 33.]
ప్రకారోఽన్యోగుణీభూతవ్యంగ్యః కావ్యస్య దృశ్యతే,
యత్ర వ్యంగ్యాన్వయే వాచ్యచారుత్వం స్యాత్ప్రకర్షవత్. [ధ్వ. పు. 205]
ప్రధానగుణభావాభ్యాం వ్యంగ్య స్యైవం వ్యవస్థితే.
కావ్యే ఉభే తతోఽన్య ద్య చ్చిత్ర మిత్యభిధీయతే. [ధ్వ. పు. 220.]
తచ్చోత్తమోత్తమమధ్యమాధమభేదా చ్చతుర్ధా.

3. శబ్దార్థౌ యత్ర గుణీభావితాత్మానౌ క మప్యర్థ మభివ్యంక్త స్తదాద్యమ్. యత్ర వ్యంగ్య మప్రధాన మేవ సచ్చమత్కార కారణం తద్ద్వితీయమ్. యత్ర వ్యంగ్యచమత్కారాసమానా ధికరణో వాచ్యచమత్కార స్తత్తృతీయమ్. యత్రార్థచమ త్కృత్యుపస్కృతా శబ్దచమత్కృతిః ప్రధానం తదధమం చతుర్థమ్.

4. తే. వ్యంగ్యము ప్రధాన మైనఁ నప్రధాన, మైన నస్ఫుట మైనఁ గావ్యము త్రిసంఖ్య నమరు నుత్తమమధ్యమాధమత ధ్వనియు, నీకృతవ్యంగ్యమును జిత్ర మై కడంగి [పు. 36.]

గాననగుచున్నది. అప్పకవి వేరురీతి ననుసరించెను; కాని నరసభూపాలీయమునఁ జెప్పఁబడిన కావ్యవిభాగమే యుచిత మయినది.

## క్షుద్రప్రబంధములు-ఉదాహరణము :

ఇదివఱకెకఁ జెప్పఁబడినకావ్యభేదముల నే గాక కొంద ఱాలంకారికులు క్షుద్రప్రబంధము లను గొన్నింటి నుదాహరించి యున్నారు. క్షుద్రప్రబంధ మనఁగా స్వరూపమున మిక్కిలి చిన్నది యగుకావ్యము. ఇయ్యది చిత్రమునందే చేరును. ప్రతాపరుద్రీయము ననుసరించి మూర్తి కవి క్షుద్రప్రబంధములలో 'ఉదాహరణ, చక్రవాళ, బిరుదావళీ, తారావళులను, అందుఁ జెప్పఁబడని 'మంజరి'ని ఉదాహరించి యున్నాఁడు. వీనిలో ఉదాహరణ మాంధ్ర వాఙ్మయమున విశిష్టస్థానము నాక్రమించుకొని యున్నది.

తొలుత 'జయంతి' పదములోఁ బ్రారంభింపఁబడిన రమ్య మగు'మాలిని' మున్నగు వృత్తమును, తర్వాత 'అపి చ' అని ప్రారంభింపఁబడి యెనిమిది విభక్తులందు నెనిమిది గద్యములు, ప్రాసములోను, ఏదేని తాళములోను గూడిన వియు కూర్పఁబడుటయు ఉదాహరణము యొక్క సామాన్యలక్షణము.[1]

ఇయ్యది ప్రతాపరుద్రీయమున నీయఁబడిన లక్షణము. పై లక్షణ మాంధ్రులు రచించిన సంస్కృతోదాహరణములకు సరిపోవుచున్నది. జైత్రరాహులు రచించినయుదాహరణము లెట్టివో నిశ్చయింప నవకాశము లేదు. ఉదాహరణలక్షణములు ఆంధ్రులు వ్రాసినవే కాన వచ్చుచున్నవి.

సంస్కృతవాఙ్మయమున 'ఉదాహరణ' ప్రశంస కలదు. కాళిదాసమహాకవి రఘువంశము నందును, విక్రమోర్వశీయమునందును 'ఉదాహరణము'ను బేర్కొనియున్నాఁడు[2]. కాని ఆయా సందర్భములను బట్టి చూచినచో, అయ్యది లాక్షణికుల యుదాహరణలక్షణమునకు సరిపోవు నని రూఢిగాఁ జెప్ప వలనుపడదు. ఉదాహరణవాఙ్మయ మాంధ్రమున నొకవిశిష్టరచన యనియు, ఆంధ్రు లగుసంస్కృతవిద్వత్కవులీ విశిష్టరచనను గీర్వాణమునను చొప్పించిరనియు నూహింపవచ్చును[3].

ఆంధ్రలాక్షణికులలోఁ గావ్యాలంకార చూడామణికారుఁడు 'ఉదాహరణ' లక్షణమును స్పష్టముగా నిర్వచింపలేదు. కాని యుదాహరణమునందలి విభక్తుల మార్పులను, కుదింపులనుబట్టి 'సద్దళి, పద్దళి, విద్దళి, కల్యాణి, ఉత్ఫుల్లకము-'అను భేదములను బేర్కొనెను. ఇవియు నుదాహరణభేదము లని చెప్పవచ్చును.[4]

మూర్తికవి తన కావ్యాలంకారసంగ్రహమున నుదాహరణలక్షణమును సంగ్రహముగ నిచ్చి యున్నాఁడు[5]. 1. గౌరన సంస్కృతమున రచించిన 'లక్షణదీపిక' యందును దీని లక్షణము వివరముగాఁ గలదు. అప్పకవీయము మున్నగువానియందును ఉదాహరణము, సద్దళి మున్నగునవియు వివరింపఁబడి యున్నవి.

ఇవి కాక 'ఆశు, మధుర, చిత్ర, విస్తర' భేదము లగుచతుర్విధకవితాభేదములలో - మధుర కవితాభేదమునకుఁ జెందినయక్షగానాదులు కొన్ని తెలుఁగు వాఙ్మయమునఁ బ్రసిద్ధి కెక్కినవి. గీతప్రబంధములు, బిరుదా

---

1. యేనకేనాపి తాళేన గద్యపద్యసమన్వితమ్,
   జయ త్యుపక్రమం మాలిన్యాదిప్రాసవిచిత్రితమ్.
   తదుదాహరణం నామ విభక్త్యష్టకసంయుతమ్. [కావ్యప్రకరణమ్.]
2. 'జయోదాహరణం బాహ్వో ర్గాపయామాస కిన్నరాన్.
   [రఘువంశము 4 సర్గ. 78 శ్లో.]
   'పత్రే నివేశిత ముదాహరణం ప్రియాయాః' [విక్రమోర్వశీయము అం. 2 శ్లో. 15.]
3. ఉదాహరణములనుగూర్చి వివరముగా నెఱుఁగఁగోరువారు శ్రీ నిడుదవోలు - వేంకటరావుగారి 'ఉదాహరణవాఙ్మయచరిత్రను చూడవలెను.
4. చూ. కావ్యాలంకారచూడామణి. చతుర్థాశ్వాసప్రారంభము.
5. కళికోత్కళికలుఁ, బద్యము, లలరారు విభక్తులం; దదాభాసయుతో
   త్కళికలు, సజయతి పదమా నలమాలిని మొదలఁ దగ నుదాహరణ మగున్.
   [కావ్యాలంకారసంగ్రహము అ 3. ప 168.]

వళి, నామావళి, భోగావళి, రంగఘోష, దరువులు, ధవళంబులు మున్నగునవి మధురకవితా రచనలు[1] ఇట్టి వన్నియును, ప్రాచీనలాక్షణికుల సంప్రదాయము ననుసరించి చిత్రకావ్యముల భేదములుగానే పరిగణింపఁ దగినవి. వీనిలో యక్షగానములు జనాదరణపాత్రములయి మిగుల ప్రచారము నొందినవి వాని సంఖ్యయు నధికము.

దృశ్యకావ్యము.

పఠనమాత్రయోగ్య మగుచు శ్రోతవ్య మగు కావ్యము శ్రవ్యము; పయిదానికంటె విశేషముగఁ బ్రదర్శనానుకూల మగునది దృశ్యకావ్యము. నటులచే నటింపఁ బడుటచే దీనికి నాట్య మనువ్యవహారమును గలదు.

సంస్కృతవాఙ్మయమునఁ దక్కిన కావ్యములవలె నాటకముకూడఁ జాల ప్రాచీనమయినది. మిగిలిన కావ్యభేదములకంటెను, కావ్యాంగములకంటెను దీని ప్రాచీనత సమర్థింప వీలయినది. ఋగ్వేదమునందలి కొన్ని సూక్తములలో నాట్యవిషయము కన్పించుచున్నది. అష్టాధ్యాయిని వ్రాసిన పాణిని మహర్షికిఁ బూర్వము అలంకారశాస్త్రగ్రంథము లున్నవో, లేవో చెప్ప వీలు లేకున్నను, తచ్ఛాస్త్రాంతర్భూత మగు నాట్యవిషయముపయి కొన్ని సూత్రగ్రంథము లున్నట్లు అష్టాధ్యాయినిబట్టియే నిశ్చయింపవచ్చును[1]. ప్రథమాలంకారగ్రంథ మగు నాట్యశాస్త్రమునఁ బ్రధానప్రతిపాద్యము నాట్యము; తక్కిన కావ్య, కావ్యాంగవిషయవివేచన మానుషంగికము. వామనాచార్యుఁడు కావ్యములలో నాటకములే యుత్తమము లని సయుక్తికముగ సమర్థించినాఁడు[2]. అభినేయార్థ మగు కావ్యమున రసబంధమునం దభినివేశము ఉండవలెనని 'అభినేయార్థే రసబంధే అభినివేశః కార్యః' [ధ్వన్యాలోకః పు 124.] అని ఆనందవర్ధనాచార్యులు వివరించిరి. సంస్కృతమున కావ్యములకంటె నాటకములే ప్రపంచమందలి యన్ని దేశములవారి యొక్కయు హృదయముల నెక్కువగ నాకర్షింపఁ గలిగినవి.

గీర్వాణవాఙ్మయమున నాట్యకళ ఇంత ప్రాచీనమయి సర్వజనామోదము నందినను తెలుఁగునఁ బందొమ్మిదవ శతాబ్దిచివరివఱకును అజ్ఞాతవాసమునే యనుభవించినది.

ఆంధ్రమునఁ దొలుత వెలువడినవైనను అనువాదములే కాని స్వతంత్రరచనలు లేవు. పెక్కురు విద్వాంసులు సంస్కృతమునుండియు ఆంగ్లమునుండియును పరివర్తనముల నొనర్పసాగిరి[3]. సంస్కృతనాటకముల నాంధ్రములోనికి పరివర్తింపఁ బూనిన వారిలో ప్రథములు శ్రీ కోరాడ-రామచంద్రశాస్త్రిగారనియు, ఆయన 'వేణీసంహారము'ను తెనిఁగింపఁ బూనిరనియు, శ్రీ వావిలాల-వాసుదేవశాస్త్రిగారు తమ 'ఉత్తరరామచరిత్ర' పీఠికలో వ్రాసియున్నారు. ఉపలబ్ధసంస్కృతానువాదములలో మొదటిది మహామహోపాధ్యాయ శ్రీ కొక్కొండ-వేంకటరత్నం పంతులుగారి 'నరకాసురవిజయవ్యాయోగము', ఇది శ్రీ వారణాసి - ధర్మసూరివిరచిత మగు సంస్కృతమూలమునకు అనువాదము. ఆంగ్లానువాదములలో శ్రీ గురుజాడ-శ్రీరామమూర్తి పంతులుగారి 'వణిక్పురవర్తకోదంతము,' శ్రీ వావిలాల - వాసుదేవశాస్త్రిగారి 'జూలియస్ సీజరు' ప్రథమములు. తర్వాత శ్రీ వీరేశలింగము పంతులుగారు, శ్రీ ధర్మవరం-రామకృష్ణమాచార్యులుగారు, శ్రీ కోలాచలము-శ్రీనివాసరావుగారు మున్నగు వారు నాటకరచనమునకుఁ బూనుకొనిరి.

ప్రాచీనాంధ్రవాఙ్మయమున నాటకములు లేనంతమాత్రమున ఆంధ్రులకు నాట్యకళను

---

1. 'పారాశర్య శిలాలిభ్యాం భిక్షునటసూత్రయోః.'
'కర్మందకృశాశ్వాదినిః'

2. 'సందర్భేషు దశరూపకం శ్రేయః'
'తద్ధి చిత్రం చిత్రపటవ ద్విశేషగుణసాకల్యాత్.'

3. 'అభిషేకనాటకము' నకు శ్రీ నిడుదవోలు - వేంకటరావుగారు వ్రాసిన పీఠిక నుండి యీ విషయము గ్రహింపఁబడినది.

గూర్చిగాని, నాటకములఁ గూర్చిగాని తెలియు దని యనుకొన వీలులేదు. ఆంధ్రకవు లనేకులు గీర్వాణవాణిం గల నాటకములను తెనిఁగించి యున్నారు; ఆ యాంధ్రీకరణము నాటక రూపము కాక ప్రబంధరూప మయి మాత్ర మున్నది. 'వాణీ నా రాణి' యనుకొను పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి కాళిదాసు నభిజ్ఞానశాకుంతల నాటకమును శృంగారశాకుంతల ప్రబంధముగ నాంధ్రీకరించెను. క్రీ. శ. 15 వ శతాబ్దివాఁ డగు మంచనకవి రాజశేఖర కవి వ్రాసిన కర్పూరమంజరీ నాటకమును కేయూరబాహుచరిత్ర మను ప్రబంధముగ తెలిఁగించినాఁడు. ఆ శతాబ్దమునందే నంది మల్లయ్య, ఘంట సింగయ్య యనుజంటకవులు కృష్ణమిశ్రుని ప్రబోధచంద్రోదయమును ప్రబంధముగాఁ బరివర్తించిరి.

ప్రాచీనకాలమున నాంధ్రమున దృశ్య కావ్యవాఙ్మయము లేక పోవుటకుఁ దగిన కారణ మూహాతీతము. కాని యుక్తిచేఁ గొన్నింటిని జూప వీలగును. నన్నయ మొదలు కొని కవి యనిపించుకొనినవా రందఱును ప్రబంధరచనము నే ప్రారంభించిరి. గద్యవాఙ్మయమునకుఁ గాని, దృశ్యవాఙ్మయమునకుఁ గాని యక్కాలమున నుత్పత్తి కలుగలేదు. పెద్దల దారిఁ ద్రొక్కిన నెక్కువ గౌరవము కలుగు ననునూహనో, నూతనవాఙ్మయావతరణమున సాహసము లేక పోవుటనో, జనాదర మునందలి సందేహముననో వారు నాటకములను ప్రబంధములనుగాఁ బరివర్తింపఁ దొడంగి యుండవచ్చును. గతానుగతిక న్యాయమున నర్వాచీను లామార్గము నే యవలంబించి యుండవచ్చును. తక్కిన దేశముల సంగతి యెటు లున్నను ఆంధ్రదేశమున మాత్రము మొన మొన్నటివఱకును వేసగానియెడ ననాదర భావము ఎక్కువగఁ జూపఁబడుచుండెడిది. పత్రధారి యెంతటి ప్రజ్ఞావంతుఁ డైనఁ గానిండు; గానమాధుర్యమున గండశిలలను సయితము ద్రవింపఁజేయుశక్తియుతుఁడు కానిండు; భావప్రకటనమునఁ బ్రవీణుఁడు కానిండు. ఏమయినను సరియే. వేసము వేయుట యనునొక్కదుర్గుణ మున్నచో నవ్యక్తికి గౌరవము గగనకుసుమము. నలుగురిలోనికి వచ్చుటకు, పంక్తిభోజనము చేయుటకు నతని కధికారము లేదు. ఏతక్కువ కులములవారో వీథినాటకములలోను, భాగవతములలోను, తోలుబొమ్మలాటలలోను పాల్గొనుచుండెడి వారు ప్రదర్శనసౌకర్యములు లేని నాటకము లీ కారణముననే యాంధ్రమున వెలువడక పోయి యుండవచ్చును. లక్ష్యములు లేని కారణమునఁ జూడామణికారుఁడు దృశ్యలక్షణమును వ్రాయ మాని యుండవచ్చును. మూర్తికవి మూలమున నున్న నాటకప్రకరణము ననువదింపక విడిచి యుండవచ్చును. అప్పకవి యీ విషయమును కొంచెము కదిపి యున్నాఁడు. తన్నిరూపణమునందలి యసందర్భములనుబట్టియే యప్పటివఱకు నాంధ్రమున దృశ్యకావ్యములు వెలువడ లే దని నిశ్చయింప వీలగును[1].

కీ. శే. శ్రీ కొమఱ్ఱాజు. లక్ష్మణరావు పంతులుగారు 'ఆంధ్రవాఙ్మయమున నాటకములను రచింపవలసి వచ్చినచోఁ బాత్రానుగుణముగ గ్రామ్యభాషను వ్యవహరింప వలసి వచ్చునని కాఁబోలు మనవారు నాటకముల నాంధ్రీకరించ నెంచినపుడు దృశ్యకావ్యములుగాఁ గూర్పక శ్రవ్యప్రబంధములుగనే వ్రాయవలసి వచ్చినది' [ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము ;]

అని యాంధ్రమున దృశ్యకావ్యాభావకారణమును వివరించి యున్నారు. కాని వ్యావహారిక భాష వాడరాని దని ఆ కాలమున ఆగ్రహ మండినట్లు తోఁచదు. పద్యభాగమును విడిచి వచనభాగమును వ్యావహారిక భాషలో వ్రాయుట ప్రసిద్ధము. అప్పకవీయాది లాక్షణిక గ్రంథములలోని వివరణము, కొన్ని గద్యములు వ్యావహారిక భాషయందే యున్నవి. ఆ కాలము ప్రబంధయుగము. అప్పుడు పురాణములు కూడ ప్రబంధములుగనే వెలువడినవి.

---

1. ఆంధ్రమునఁ దొలుత దృశ్యకావ్యములు లేకుండుటకు - భాస, కాళిదాసాదుల సంస్కృతనాటకముల వ్యాప్తియు, గ్రాంథిక భాషానిర్బంధమును, అర్థప్రకటనమున కను వగు వచనరచన తెలుఁగున లేక పోవుటయు, తెలుఁగున వ్యాప్తిలో నున్న దేశినాటకరచనమును కారణము లని శ్రీ నిడుదవోలు - వెంకటరావుగారు తెల్పుచున్నారు. [చూ. అభిషేక నాటకము పీఠిక.]

నాటకములు నట్లే వెలువడినవి. గద్యముల కాంధ్రీకరణము లగు జక్కన విక్రమార్క చరిత్ర, నారాయణకవి పంచతంత్రము, సింహాసనద్వాత్రింశిక, హంసవింశతి మొదలగునవి ప్రబంధములే. మనవారికిఁ గలప్రబంధవ్యామోహము ఇతరవాఙ్మయముల యుత్పత్తికి అడ్డంకి కలిగించె నని యూహింప వీలున్నది. మఱియు శబ్దాడంబరమును ప్రేమించి, కావ్యమును తమ పాండిత్యప్రదర్శనభూమిగాఁ దలఁచు నాకాలపు కవులకుఁ దమ కోరిక తీరుటకు నాటకములు తగినసాధనములు కా వని తోఁచి యుండవచ్చును.

ప్రాచీనాంధ్రవాఙ్మయమున నాటకములు లేకున్నను ‘నాటకము’ అనుపదము ప్రయోగమున నుండెడిది. నాటకము లనుపేరిటోఁ గొన్ని ప్రబంధములు ప్రసిద్ధములు. నటనాప్రకారముల వర్ణన ముండుటచేత అవి నాటకములయి యుండవచ్చును. రాధామాధవకవి విష్ణుమాయానాటకము, శ్రీనాథుని వీథినాటకము మొదలగునవి పయివాని కుదాహరణములు. యక్షగానములు నాటకములుగఁ జేర్కొనఁబడుచున్నవి. సారంగధర నాటకము, మన్నారుదాసవిలాసనాటకము, రుక్మాంగద నాటకము మొదలగునవి వాని కుదాహరణములు. పయి యక్షగానములు క్రమముగ భాగవతములకును, వీథినాటకములకును దారి చూపి యుండవచ్చును

వాఙ్మయాంతరసంపర్కమువలన నొక వాఙ్మయమునఁ బరిణామము కలుగుట సహజము. ప్రపంచమంతను వ్యాపించి, ప్రఖ్యాతిఁ గన్న యాంగ్లభాష భారతదేశమునకుఁ గూడ రాజభాష యగుటచేఁ దదభ్యాసము సర్వజనుల కావశ్యక మైనది. తత్సంపర్కమునను, ఆంగ్లవాఙ్మయమునందలి రసవంతము లగు నాటకములు పెక్కులు ప్రదర్శనము మూలముగ వ్యాప్తిఁ జెందుటంబట్టియు, మనవారు కూడ తెలుఁగున నాటకములను వ్రాయఁ దొడఁగిరి. అందును భాషాంతరీకరణమే ప్రథమప్రయత్నము. తొలుత వెలువడినదృశ్యకావ్యములు కొన్ని ప్రబంధసంపర్కమును పూర్తిగాఁ ద్రెంచుకొనఁ జాలక శబ్దాడంబరభూయిష్ఠములు, దీర్ఘగద్యయుతములు, పద్యబహుళములు లయి యుండెడివి. క్రమక్రమముగ వాని కా సంపర్కము తగ్గినది. పిదప సంస్కృతాంగ్లాది నాటకభాషాంతరీకరణమే కాక స్వతంత్ర రచనము కూడ ఆంధ్రుల లవఱచుకొనిరి.

సంస్కృతదృశ్యకావ్యములు మిశ్రకావ్యముల తెగకుఁ జెందినవి. కేవలపద్యాత్మకములు, కేవల గద్యరూపములు నగు నాటకము లావాఙ్మయమున లేవు. ఆంగ్లభాషయందుఁ గేవలపద్యరూపకములు, గద్యరూపకములు నగు నవి కలవు. పయి భాషా వాఙ్మయముల సంపర్కముచే నాంధ్రమునను అనేకరకముల దృశ్యకావ్యములు వెలువడ సాగినవి. వేనీసు వర్తకచరిత్రమువంటి పద్యనాటకములు, కన్యాశుల్కమువంటి గద్యనాటకములు, మిశ్ర నాటకములు అనేకములు కలవు.

సంస్కృతమున ‘నాటకము లన్నియు సుఖాంతములుగ నుండవలె’ నను నియమము కలదు. ఆంధ్రమునం దాంగ్లసంప్రదాయము ననుసరించి దుఃఖాంతము లగునాటకములును రచింపఁ బడుచున్నవి. భారతీయవిమర్శకు లనేకులు సుఖాంతతయే నాటకములం దుచితమని వివరించి యున్నారు[1]. ఉభయవిధము లగునాటకములవలనను గలుగ వలసినది విగళితవేద్యాంతరము, పరబ్రహ్మాస్వాదసబ్రహ్మచారియు నగురసానందమే!

సంస్కృతమున దృశ్యకావ్యముల భేదములు ముప్పదికిఁ బయిగాఁ జేర్కొనఁబడినవి. అందు నాటక, ప్రకరణాదు లగు వివిధరూపకములు ప్రధానములు; తక్కిన సట్టక, నాటికాదు లప్రధానములు. ప్రధానములు నాట్యము లని, అప్రధానములు నృత్యము లని చెప్పఁబ[illegible]వి. నాట్యమున రసము, నృత్యమున భా[illegible]ధానములు[2]. తొలి పది రూపకములకును, ఇతి

1. చూ. శ్రీపాద కామేశ్వరరావుగారి ‘సాహిత్యమీమాంస’
2. ‘అవస్థానుకృతి ర్నాట్యం రూపం దృశ్యత యోచ్యతే.
రూపకం తత్సమారోపా ద్దశధైవ రసాశ్రయమ్.
నాటకం సప్రకరణం భాణః ప్రహసనం డిమః.
వ్యాయోగ సమవకారౌ చ వీథ్యంకేహామృగాదశ.
అన్యద్ భావాశ్రయం నృత్యమ్....’ [దశరూపకమ్. 7, 9.]

వృత్తము, రసము, నాయకుఁడు మొదలగువారి భేదములంబట్టి పరస్పరభేదము కలుగుచున్నది. నృత్యములకుఁ గూడనట్లే భేదము కలదు. ప్రధానములకు రూపకము లనియు, ఇతరముల కుప రూపకము లనియు వ్యవహారము ప్రసిద్ధము.

ఈ విషయప్రతిపాదనమునను, (ఈ గ్రంథమున) లోకవ్యవహారమునను 'నాటక' పదము దృశ్యకావ్యసామాన్యపరముగ వాడఁబడినది. ఆలంకారిక లక్షణము ననుసరించి నాటకము ప్రధానము లగుపదిరూపకములలోఁ బ్రధాన భేదము; కాని సామాన్యవాచకము కాదు. 'రూపకము' మాత్రము సామాన్యవాచకము; అన్నిరూపకములందును రూప ప్రదర్శనము సామాన్యము.

ఆంధ్రనాటకకర్తలు పయి భేదములను పాటించలేదు. సుఖాంత, దుఃఖాంతము లను భేదములు రెండే యాంధ్రనాటకములందుఁ గలవు. 'నాటక' పద మిందు రూపకసామాన్యవాచకము.

ఆంధ్రమున రూపకరచన ప్రారంభింపఁబడిన మొదటికాలమున సంస్కృతభాషాంతరీకరణమే యెక్కువ. కావునసంస్కృతాలంకారికుల నాటకలక్షణము లన్నియు వానికి సరిపడెడివి. కొన్ని స్వతంత్రగ్రంథములు వెలువడినకాలమునను, ప్రస్తావనము, విష్కంభకము, ప్రవేశకము, అంకవిభాగము మొదలగువిషయములు (తక్కిన సంధి, సంధ్యంగముల సంగతి యెటు లున్నను) సంస్కృతసంప్రదాయము ననుసరించియే సమకూర్పఁబడెడివి. క్రమక్రమముగ సంస్కృతనాటకవిలక్షణముగ నొక్క యంకముననే బహుళరంగనిర్దేశము, ప్రస్తావనాద్యభావము, నిర్దిష్టరసవినిమయము, ఇతివృత్తకల్పన స్వాతంత్ర్యము నాంధ్రనాటకములందు ప్రవేశించినవి. ఒక్క యాంధ్రముననే కాదు; సంస్కృతమున నాటకములను రచించువారు కూడ ప్రాచీననియమముల నతిక్రమించుచున్నారు. సర్వజనాహ్లాదనమున కేర్పడిన దృశ్యకావ్యముల లక్షణములు దేశకాలానుగుణముగ మారుచుండవలె ననియు, మార్పు లేక పోయిన జనసామాన్యమునకు నాటకదర్శనమున నిచ్ఛ కలుగ దనియు, పయికారణములఁ బట్టి ప్రాచీనలక్షణముల నిప్పు డుపేక్షించుట దోషము కాఁజాల దనియు వారి యభిమతము. పయి యభిప్రాయ మెంతయు నుచితము. సంస్కృతసాహిత్యోద్ధరణమునకుఁ గంకణము కట్టుకొనిన పెద్దపెద్ద సంస్థలవారే పయి యాశయములను వెలిబుచ్చినారు. ఇఁక నాంధ్రులు ఆ లక్షణముల నతిక్రమించుటలో దోషమేమున్నది? అట్లు లక్షణాతిక్రమణ మొనర్చినపుడు నాటకముల పరస్పరభేద పరిశీలనము, ఇతివృత్తనిర్ణయము, నాయకనిర్ణయము, రసనిర్ణయము అపేక్షణీయములు కాఁజాలవు. అట్టి భేద పరిగణన మనావశ్యకము. రచింపఁబడిననాటకము అన్నివిధముల స్వాభావికముగను, సత్య ప్రతిపాదకముగను ఉండినఁ జాలును.

దృశ్యకావ్యములలో నొక భేద మగుప్రహసనము సంస్కృతమునందువలె తెలుఁగునను ప్రత్యేకతను గలిగియున్నది. తక్కినదృశ్యకావ్యము లన్నియు నాటకములుగ నేపరిగణింపఁబడినను ప్రహసనములు ప్రత్యేకింపఁబడినవి.

సంస్కృతమునఁ బ్రహసనములు వెలువడుటకుఁ గారణము మతాంతరద్వేషము. హాస్యరసము ప్రధానముగ మతాంతరముల నధిక్షేపించుట వాని ప్రధానలక్ష్యము హాస్యపరిపోషణమునకు వీనియందుఁ బాషండులు, విటులు, వేశ్యలు మొదలగువారి ప్రవేశ మావశ్యకము. వారి వారి వికారపు చేష్టలు, సంభాషణములు నంతఱికిని నవ్వు పుట్టించును. ప్రహసనములయం దనుచితములు, అసభ్యములు నగువర్ణనము లుండఁ గూడదు. [1]ప్రసిద్ధప్రహసనము లగుభగవదజ్జుకము, మత్తవిలాసము, లటకమేలకము మొదలగునవి పయి లక్షణమున కనుగుణముగనే యున్నవి. కాని కొన్ని కాళిదాసప్రహసనము మొదలగునవి గ్రామ్యాసభ్యవ్రీడాజుగుప్సాధాయకము లగువస్తువర్ణనములచే నిండియున్నవి. అవి యెట్లును సహృదయహృదయావర్జకములు

1. 'కస్యచి చ్చేష్టితం వృత్త మశ్లీలేన గ్రామ్యేణ జుగుప్సాఽమాంగళ్యహేతునా చాసభ్యేన చ వ్రీడాకారిణా చ రహితం, పరిహాస ప్రధానవచన బహుళం చైతదభిధాయి రూపక మపి చోపచారాత్, శుద్ధం ప్రహసనమ్. [నాట్యదర్పణమ్.]

కాఁజాలవు. అన్నివిధముల లక్షణాతిక్రమణమున కనుమతింపని ప్రాచీనకాలమున లక్షణ విరుద్ధముగ, బండబూతులతో నిండిన యిట్టి ప్రహసనములు వెలువడుట మిక్కిలి యాశ్చర్యావహము. పయి 'కాళిదాసప్రహసనము' కాళిదాసకవికృత మని ప్రసిద్ధి. అతఁ డెన్నఁడు నట్టి ప్రహసనమును వ్రాసి యుండఁడు. అతని కపప్రథ కలుగఁజేయుటకు మఱియొకఁడట్లు వ్రాసి, తత్కర్తృత్వము నామహాకవికంటఁగట్టి యుండవలెను. గ్రంథరచనమే నామావశిష్ట మయిన సంస్కృతమునందుఁ బ్రస్తుతకాలమునఁ బ్రహసనములు వెలువడకుండుటలో ఆశ్చర్యము లేదు.

దృశ్యరచన మారంభ మయిన క్రొత్తలో తెలుఁగునఁ గొలఁదిగ ప్రహసనములు కూడ వెలువడినవి. అం దసభ్యములు కానరావు. సంస్కృతప్రహసనములరీతి మతాంతరనిరసనము వీని లక్ష్యము కాదు; సంఘసంస్కరణము ప్రధానము. ఇందులకై శ్రీ వీరేశలింగము పంతులుగారు పెక్కు ప్రహసనములను వ్రాసిరి. శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారును, శ్రీ చిలకమర్తి - లక్ష్మీనరసింహము గారును సాంసారికము లగు చాల ప్రహసనములను రచించిరి.

ధ్వని :

ధ్వని యనఁగా వ్యంగ్యప్రధానక మగు కావ్యము. కాని యీ పదము వ్యంగ్యమునకుఁ బర్యాయముగఁ గూడ వాడఁబడుచున్నది. ఆంధ్రాలంకారికుఁ డగుమూర్తికవి 'ధ్వని జీవ, మలంక్రియా వితానము సొమ్ముల్... కావ్యేందిరకున్' అని ధ్వనిపదమును వ్యంగ్యపరముగ వాడినాఁడు. ఇచటఁ గూడ నా రీతియే యనుసరింపఁబడుచున్నది.

ఆనందవర్ధనునివఱకుఁ గల ప్రాచీనాలంకారికు లెవ్వరును 'ధ్వని' కల దనియే చెప్పలేదు. ధ్వనివాద మానందవర్ధనునితోడనే ఆరంభ మైనది. అతనికిఁ బూర్వము ధ్వని యనునది లేక పోలేదు. ఈ యంశ మతని 'కావ్యస్యాత్మా ధ్వని రితి బుధై ర్యస్సమామ్నాతపూర్వః' అను ప్రథమకారికా ప్రథమ పాదముననే తెలియుచున్నది. ఆనందవర్ధనుని తరువాతివా రగు భట్టనాయకుఁడు, మహిమభట్టు, దశరూపకకారుఁడు మొదలగువారు ధ్వనివాదము నెదిరించిరి, కుంతకుఁడు, క్షేమేంద్రుఁడు పయివాదము నెదిరింపకున్నను ధ్వనిని కాక వేఱొకదానిని [అనఁగా కుంతకుఁడు వక్రోక్తిని, క్షేమేంద్రుఁ డౌచిత్యమును] కావ్యాత్మగా అంగీకరించిరి. కాని వీరి వాదములకు తగిన బలము లేక పోయినది. వారి వాదములు వారితోనే అణఁగి పోయినవి. ౧౧ వ శతాబ్దపువాఁడు మమ్మటభట్టు కావ్యప్రకాశమున ధ్వనివాదమును సమర్థించెను అందు మహిమభట్టు,దశరూపక కారుల మతములు ఖండింపఁబడినవి. అది మొదలుకొని యాలంకారికు లందఱును ధ్వనివాదమునే యామోదించిరి. కొందరు ప్రధాన ధ్వనిభేద మగురసమును కావ్యాత్మగ గ్రహించిరి. మమ్మటుని తర్వాత వెలువడిన గ్రంథము లన్నియు నతని పద్ధతులనే యనుసరించినవి. ఆంధ్రాలంకారికుల కుపాస్యదైవ మగువిద్యానాథుఁడును కావ్యప్రకాశకారునే యనుసరించుటచే, తెలుఁగువారి మతమునఁ గూడ ధ్వనియే కావ్యమున కాత్మ యగు నని వేఱుగఁ జెప్పఁబని లేదు.

వాచ్యము, లక్ష్యము, వ్యంగ్యము నని అర్థము మూఁడు విధములు. అభిధ, లక్షణ, వ్యంజన అని శబ్దవ్యాపారములు మూఁడు. వాచకము అభిధా వ్యాపారమువలన వాచ్యార్థమును తెలుపును; లక్షకము లక్షణావ్యాపారమువలన లక్ష్యార్థమును తెలుపును; 'రాముఁడు' అని వాచ్యార్థోదాహృతి. 'గంగయందు గొల్లపల్లె' లక్ష్యోదాహృతి. ఇచట గంగయందుఁ బల్లె యుండుట యసంభవము కాన 'గంగయందు' అనుదానికి 'గంగాతీరమందు' అనునర్థమును చెప్పవలెను. వాచ్యార్థమునకు బాధ, వాచ్యార్థసంబంధము నున్నయపుడే లక్షణ యాశ్రయణీయము. శబ్దము కాక అర్థమే అచట లక్షక మని కొందఱి మతము.

వీఁడి వాచ్య, లక్ష్యార్థములకంటె వే ఱగు నర్థమే వ్యంగ్యము; ఆ యర్థమును బోధించు శబ్దము, అర్థము వ్యంజకములు; వ్యాపారము వ్యంజన. 'కైరవంబులు విరిసె' ననఁగా 'కలువలు వికసించిన' వని వాచ్య మగునర్థమువలన 'జగదానందకరుం డగుచంద్రుఁ డుదయించె' నను మఱియొక యర్థము స్ఫురించుచున్నది. అది యిచట వ్యంగ్యార్థము. ఈ రీతినే 'గంగయందు గొల్లపల్లె కల' దని చెప్పినపుడు

కలిగిన 'గంగాతీరమున గొల్లపల్లె కల' దను లక్ష్యార్థమువలన 'గొల్లపల్లియ చాల చల్లని ప్రదేశము, పవిత్రము' అనునర్థము కలుగును. ఇదియే వ్యంగ్యార్థము. ఇచట 'గంగాతీరమున పల్లె కల' దని మాత్రమే కవివివక్షితము కాదు. అదియే యతని యుద్దేశమైనచో 'గంగాతీరమున గొల్లపల్లె కల' దని వాచ్యముగనే చెప్పియుండును. అది వాచ్యముగ నున్నపుడు— లక్ష్యార్థానంతరభావి యగువ్యంగ్యార్థము కలుగనేరదు. పయినిరూపణమునుబట్టి వాచ్య, లక్ష్యార్థములవలన వ్యంగ్యార్థము కలుగు ననియు నది యుభయవిలక్షణ మనియుఁ దెలియుచున్నది.

మూర్తికవి వ్యంగ్యలక్షణమును వ్రాయుచు 'వాచ్యార్థమున కలంకార మగునర్థాంతరము వ్యంగ్య' మని చెప్పెను[1]. ఇది సరి కాదు. వ్యంగ్యము వాచ్య, లక్ష్యార్థములవలనఁ గలుగు నది కాని వాచ్యార్థమున కలంకారము కాదు. వ్యంగ్య మొకానొకప్పుడు (గుణీభూతవ్యంగ్యమున) వాచ్యమున కలంకారము కావచ్చును; కాని వ్యంగ్యసామాన్య మలంకార్యము కాని యలంకారము కాదు. గుణాలంకారాదులు దీని కలంకారము లగును. కాన మూర్తికవి లక్షణమును విడిచి మీఁదిలక్షణము నాశ్రయించుటయే యుత్తమము. వ్యంగ్యము శబ్దార్థములవలననే గాక చేష్టాదులవలనను గలుగును. కాని ప్రస్తుతము గల్పింపఁబడునది కావ్యసామగ్రి యగుటచేఁ దత్సంబద్ధ మగు వ్యంగ్యము నే గ్రహించుట ప్రస్తుతము.


వక్తృబోద్ధవ్యాదిభేదములఁబట్టియు, శబ్దార్థప్రబంధాది భేదములంబట్టియు వ్యంగ్యము వేలకొలఁది భేదములఁ బొందినది. అందుఁ బ్రధానము లగునవియే కొన్ని యిచట వివరింపఁబడును. ధ్వని అభిధామూలము, లక్షణామూలము నని తొలుత రెండువిధములు. లక్షణామూలమున కవివక్షితవాచ్యధ్వని యని, అభిధామూలమునకు వివక్షితాన్యపరవాచ్యధ్వని యని పేరులు. అవివక్షితవాచ్య మర్థాంతరసంక్రమితము, అత్యంతతిరస్కృతము నని రెండువిధములు; అం దొక్కొక్కటి మరల వాక్యగతము, పదగతము నని రెండేసి విధములు. మొత్తముపై లక్షణామూలధ్వని నాలుగువిధములు. వివక్షితాన్యపరవాచ్యము సంలక్ష్యక్రమము, అసంలక్ష్యక్రమము నని రెండు విధములు. సంలక్ష్యక్రమము శబ్దశక్తిమూలము, అర్థశక్తిమూలము, ఉభయశక్తిమూలము నని ముప్విధములు. శబ్దశక్తిమూలము వస్త్వలంకారభేదములచే రెండు విధములు; అం దొక్కొక్కటి వాక్య, పదగత భేదములచే రెండేసి విధములు కాఁగా నాలుగు విధములు. అర్థశక్తిమూలము స్వతఃసిద్ధము కవిప్రౌఢోక్తిసిద్ధము, కవినిబద్ధవక్తృప్రౌఢోక్తిసిద్ధము నని ముప్విధములు. అం దొకటి వస్త్వలంకారభేదములచే రెండేసి విధములు. అం దొక్కొక్కటి మరల వస్త్వలంకార భేదములచే రెండేసి విధములు; అవి మరల ప్రబంధ, వాక్య, పదగత భేదములచే మూఁడేసి విధములు; ఇట్లర్థశక్తిమూలధ్వని ముప్పదియాఱు తెఱఁగులు. అసంలక్ష్యక్రమవ్యంగ్యము ప్రబంధ-వాక్య-పద-పదైకదేశ-రచనా-వర్ణగత భేదములచే ఆఱు విధములు. ఇట్లు సామాన్యముగ నీ ధ్వని (౪+౪+౩౬+౧+౬=౫౧.) ఏఁబదియొక్క విధములు.

పయిభేదములను చాలమంది యాలంకారికు లంగీకరించిరి. ప్రతాపరుద్రీయమునఁ బయిరీతి విభాగమే కలదు. రసగంగాధరమునం దర్థశక్తిమూలధ్వనిలో 'కవినిబద్ధవక్తృప్రౌఢోక్తిసిద్ధ' భేదములు వేఱుగఁ బరిగణింపఁబడలేదు, కవినిబద్ధ మగునర్థము, కవినిబద్ధుఁ డగువక్తయొక్క ప్రౌఢోక్తిసిద్ధ మగునర్థము అభిన్నము లనియే యతని మతము; కవినిబద్ధవక్తృప్రౌఢోక్తిసిద్ధార్థమును వేఱుగ నంగీకరించినచో 'కవినిబద్ధవక్తృనిబద్ధవక్తృప్రౌఢోక్తిసిద్ధ మగునర్థము, తద్వక్తృనిబద్ధవక్తృ ప్రౌఢోక్తి సిద్ధ మగునర్థము' నని పరము లసంఖ్యాకములు అంగీకరింప వలసివచ్చు నని, యందుచే ఆనంత్యము కలుగు నని యందుఁ జెప్పఁబడినది[2]. మూర్తికవి విద్యానాథునిపద్ధతి ననుసరించెను.

పయిని చెప్పఁబడిన ధ్వని ప్రధానభేదములు సులభముగఁ దెలియుటకయి వివరముగ ధ్వని వృక్షము క్రింద నీయఁబడినది.

---

1. క. సంగతము లగుపదార్థము, లంగలవాచ్యార్థమున కలంకారం బై రంగగునర్థాంతర మర, యం గావ్యములందు వ్యంగ్య మగుచుఁ జెలంగున్.
2. చూ. రసగంగాధరము; ద్వితీయాననాగంధము.




ప్ర = ప్రబంధగతము. వా = వాక్యగతము. ప = పదగతము.

# రసచర్చ

—★—

అన్ని వాఙ్మయములందలి ప్రతి కావ్యమునకును పరమ ప్రయోజనము రసము. రసవిలసితము కాని కావ్యమునకు వేద, పురాణ వైలక్షణ్యము, కాంతాసమ్మితత్వము కుదురవు. అట్టి కావ్యము కావ్యానుకరణమగును; కాని కావ్యము కాజాలదు. ఈ సిద్ధాంతము కావ్యవాఙ్మయ మారంభమయిన నాటనుండియు ననుస్యూతముగ వచ్చుచున్నది.

ఆంధ్రవాఙ్మయమున రసతత్త్వ మరయుటకు ముందు దన్మూలమగు సంస్కృతమునందలి దాని తత్త్వమును పరిశీలింపవలసియున్నది. నవీనులగు సంస్కృతాలంకారికులు కావ్యమున రసమే ప్రధానమని చెప్పియున్నారు. ప్రాచీనాలంకారికులు విభిన్నములగు వానికిఁ బ్రాధాన్యము నొసఁగియున్నారు. భరతుఁడు నాట్యము, భామహుడు దండి ఉద్భటుఁడు అలంకారములు, వామనుఁడు గుణములు, ఆనందవర్ధనాచార్యుఁడు ధ్వని కావ్యమునఁ బ్రధానములని చెప్పినారు. కుంతకుఁడు వక్రోక్తిని, మహిమభట్టనుమితిని, క్షేమేంద్రుఁ డౌచిత్యమును కావ్యాత్మలుగ గ్రహించినారు. వయి వారి మతములు విభిన్నము లయినను ప్రధానమగు రసమును మాత్రము వారు, తాము ప్రధానములని యనుకొనినవానియందే స్వీకరించిరి. నాట్యము ప్రధానమనిన భరతముని మతమున రసము నాట్యస్వరూపము.[1] అలంకార ప్రాధాన్యమునంగీకరించిన భామహ, దండ్యాచార్యుల మతమున రసములంకారములందే చేర్పఁబడినది.[2] గుణ ప్రాధాన్యవాదియగు వామనుని మతమున రసములన్నియును కాంతిగుణమునందంతర్భావింపఁ జేయఁబడినవి.[3] ఉద్భటుఁడు రసమును అలంకారముగనే చెప్పినాఁడు. కావ్యమునకు ధ్వనియే ఆత్మయని నిర్వచించిన యానందవర్ధనాచార్యులు రసము ప్రధానమగు ధ్వనియని నిర్వచించెను;[4] ధ్వన్యాలోకవ్యాఖ్యాతయగు నభినవగుప్తుఁడు రసధ్వని ప్రాధాన్యమును చక్కఁగ వివరించిరి.[5] అనుమితివాదియగు మహిమభట్టు 'రసము కావ్యమున కాత్మ యగుటలో నెవ్వరికిని విప్రతిపత్తిలేదని' స్పష్టముగఁ జెప్పియున్నాఁడు. కుంతకుఁడు రసమును వక్రోక్తియందే యిమిడ్చెను.[6] క్షేమేంద్రుఁడు రసమును కావ్యమునఁ బ్రధానమని, రసపరమగు కావ్యమున నౌచిత్యము తప్పక యుండవలెనని చెప్పియున్నాఁడు. మమ్మటాదులానందవర్ధనుని మతమునే యనుసరించిరి. ప్రాచీనులలో రుద్రటుఁడు, నవీనులలో సాహిత్యదర్పణకారుఁడు రసమునకే ఎక్కువ ప్రాముఖ్యము నొసంగిరి. రుద్రటుఁడు తక్కినవారివలె రసమును వేఱొక కావ్యాంగముగ నంగీకరింపక ప్రత్యేకముగనే కావ్యాత్మగ 'వాక్యం రసాత్మకం కావ్య'మ్మని చెప్పినాఁడు. అతని మతమున వస్త్వలంకారములు వ్యంగ్యము లయినను కావ్యాత్మలు కాజాలవు.

---

1. నాట్యం చ రస ఏవేత్యుక్తప్రాయమ్. [లోచనః పు - 182]
2. రసవద్దర్శిత స్పష్ట శృంగారాది రసం [కావ్యాలం 3-6]
   . రస వద్రసపేశలమ్ [కావ్యాదర్శ. ద్వితీ]
3. దీప్త రసత్వం కాన్తిః.
   దీప్తా రసాః శృంగారాదయో యస్య సః, తస్య భావః, దీప్తరసత్వమ్, కాన్తిః యథా-
   'ప్రేయాన్ సాయ ముపాగతః—' ఇత్యాది. ఏవంరసాన్తరేష్వప్యుదాహరణీయమ్.
   [కా. సూ. వృత్తి]
4. కావ్యస్యాత్మా ధ్వనిః, (పు. 2.) కావ్యస్యాత్మా స ఏవార్థః (పు. 26)
   సఏవేతి. ప్రతీయమాన మాత్రేఽపి ప్రక్రాన్తే తృతీయ ఏవ రసాదిధ్వనిరితి మన్తవ్యమ్.
   [ధ్వన్యాలోకః, లోచనః.]
5. కావ్యస్యాత్మని సంజ్ఞిని రసాదిరూపే న కస్యచిద్విమతిః.
6. అలంకారాస్త్వలంకారాః గుణా ఏవ గుణాః పునః,
   ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితమ్. [ఔచిత్య: 1]

ఆంధ్రాలంకారికులు నవీనసంస్కృతాలంకారికుల మతము తీసికొనుటచే నాంధ్రకావ్యములలో రసమునకే ప్రాధాన్యముండవలెనని తన్మతమని చెప్పవలెను. ఆంధ్రశబ్ద చింతామణి యందు 'సా వాగ్వ్యా రసవృత్తిః' అని, 'సాధ్వ్యో హి రసో యథార్థం కవిభిః' అని పయి యంశమే తెలుపఁబడినది. విన్నకోట పెద్దనగు కవి 'భావరసప్రసంగమునఁ గావ్యాలంకృతి లక్షణంబు' అనియు; మూర్తికవియు 'అసదృశ రసప్రధాన శబ్దార్థములను' అని పయి యభిప్రాయమునే సూచించిరి. అప్పకవి చింతామణి సూత్రముల నాంధ్రీకరించుచు, 'రసమే కావ్యమునఁ బ్రధాన'మని నొక్కి చెప్పినాఁడు.[1] పెద్దయయు, అప్పకవియును వేఱొకయెడ వామను ననుసరించి 'అఖిలకావ్యములకు రీతు లాత్మ' లని చెప్పియున్నను, ప్రధానముగ వారు తెల్పిన రసప్రాధాన్యసిద్ధాంతమే యనవలెను.

సంస్కృతాలంకార వాఙ్మయమున కాది గ్రంథమగు భరతనాట్యశాస్త్రమునందే రసస్వరూప మొకమాదిరిగ నిర్వచింపఁబడినది. 'విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః' అని నాట్యశాస్త్రమందలి రస నిర్వచన సూత్రము. ఈ సూత్రముపయి ఆధారపడి అనేకులగు నాలంకారికులు పెక్కు రీతుల సమన్వయముఁ జేసికొని, తమ కిచ్చవచ్చిన మతములను నిరూపింపసాగిరి. కొందరు పయి సూత్రమునకు విచిత్రముగను రసనిర్వచన మొనర్చిరి. మొత్తముపయి రసనిర్వచనమునుగూర్చి పదునొకండు మతములు బయలువెడలినవి. అందు ఎనిమిది మాత్రము సూత్రమున కనుగుణములు. ఆయెనిమిదింటనుగూడ ముఖ్యమైనవి నాలుగే! వానినే చాలమంది వివరించి తక్కిన వానిని విడిచిరి. రసగంగాధరమున మాత్ర మన్నిమతముల తత్త్వము వివరింపఁబడినది.

రసనిర్వచనమునఁ బ్రసిద్ధములగు నా నాలుగు మతములు నివి. 1. భట్టలోల్లటుని యుత్పత్తివాదము; 2. శ్రీశంకుకుని యనుమితివాదము; 3. భట్టనాయకుని భుక్తివాదము, 4 అభినవగుప్తుని వ్యక్తివాదము. ఇందభినవగుప్తాచార్యుల వాదమునకు సర్వాలంకారికప్రామాణికుండగు నానందవర్ధనాచార్యుల ధ్వనివాదము మూలము; సహృదయ హృదయావర్జకమును, యుక్తియుక్తమునగు వ్యక్తివాదమే యందరిచేత నామోదింపఁబడినది దానికిఁ గారణములు మున్ముందు చూపఁబడును.

విభావము, అనుభావము, వ్యభిచారిభావము నను మూఁడు విధములగు భావముల సంయోగమును పొంది, పరిపోషింపఁబడిన స్థాయిభావమే రసమగునని యించుమించుగ నన్నిమతముల వారు నంగీకరించియున్నారు. స్థాయిభావము రసముగ మాఱునపుడు—లేనిస్థాయి యుత్పన్నమగుటచే రసముత్పన్నమగుననియు, అనుమితములగు స్థాయిభావములంబట్టి రసమున్నట్లూహింపవలెననియు, సత్త్వోద్రేకము వలన రసము సామాజికులచే ననుభవింపఁబడుననియు, సహృదయహృదయములందు వాసనారూపమున నున్న స్థాయిభావమే విభావాదులచే వ్యక్తమై రసమగుననియు, క్రమముగ భట్టలోల్లట - శ్రీశంకుక - భట్టనాయక, అభినవగుప్తుల మతసారములు. స్థాయియే రసముగ మాఱుననుటలో నీ నల్వురికిని విప్రతిపత్తిలేదు. భరతముని స్థాయిభావములే రసములుగ మాఱునని స్పష్టముగఁ జెప్పియున్నాఁడు.[2] ఆలంకారికులందఱు నించుమించుగ నీయభిప్రాయమునే తీసికొనిరి. వారి ననుసరించిన యాంధ్ర

---

1. గీ. రసరసాశ్రయ వాక్య సంతతులఁ గూర్చి,
కావ్యము రచింతు రారె పో కవులనంగ!
నట్లు గావున నేభాషనైనఁ గవిత,
పలుకు వారికి సాధింపవలయు రసము. [1 ఆ.]

2. అథ స్థాయిభావాన్ రసత్వ ముపనేష్యామః. [నాట్య: 6 అ.]

లాక్షణికులు నల్లే వివరించిరి. [1]స్థాయిభావాతిరిక్తముగ రసమను నొక అపూర్వపదార్థము లేదని పయివారి మతము.

విభావము లనఁగా రసాభివ్యక్తికి కనుగుణములగు కారణములు; అవి యాలంబనములనియు, నుద్దీపనములనియు రెండు విధములు. ఏవి లేనిచో రసమభివ్యక్తము కాదో; అవి ఆలంబన కారణములు; 'రసమునకు సమవాయికారణ మాలంబన విభావ'మని సంస్కృతాలంకారికు లందురు. నాయకుఁడు, నాయిక ఆలంబన కారణములు. స్థాయి వ్యక్తమగుటకు సహకారులగునవి ఉద్దీపనకారణములు. [2] అట్టి ఆలంబనగుణము, చేష్ట, అలంకారము, తటస్థము నని నాలుగు విధములు అట్టివి యౌవనము, సౌందర్యము, హావ, భావాదులు, హారాంగదాదులు, మలయానిలము, చంద్రుఁడు మొదలగు నవి యగుచుండును శరీరమునఁ బుట్టిన వాక్ప్రభృ మొదలగు కార్యము లనుభావములు. [3]పరుల సుఖదుఃఖములచే దనకు సుఖదుఃఖములు కల్గునటుల భావించెడి సత్త్వమువలనఁ బుట్టినవి సాత్త్వికభావములు [4] ఈ భావములు అనుభావాభిన్నములని చాలమంది తలంపు. ప్రాచీనాలంకారికులు వీనిని వేఱుగ లెక్కింపక అనుభావములలోనే చేర్చియున్నారు. నాట్యశాస్త్రమునందలి రససూత్రములోని 'అనుభావ' మను పదము ఉభయవిధములగు భావములను గ్రహింపవలెను. (కంపము, కన్నీరు, గద్గదత మొ. సాత్త్వికములు) సముద్రమునందలి తరంగములవలెఁ బుట్టుచు, విలీనములు కావలసినవగుచు విలీనములగుచు, మఱలఁ బుట్టుచు, చరించుచు, [5] రసాభివ్యక్తికి సహకారము నొనరించునవి వ్యభిచారిభావములు; ఇవియే సంచారిభావములనియుఁ జెప్పఁబడును. ఎన్ని నదులు సముద్రమునఁ గలిసినను దాని రూపమును మార్పుచేయని రీతిని సజాతీయములుకాని, విజాతీయములుకాని యగు భావములచే ఏమియు మార్పుఁజెందని (స్థిరముగు) భావమే స్థాయిభావము. [6] ఈ స్థాయిభావము లెనిమిదని కొందఱును, తొమ్మిదని కొందఱును, పదియని కొందఱును, వానిక సంఖ్యానియమము లేదని, భావము లెన్ని యున్నవో అన్నియు స్థాయిభావములు కావచ్చునని కొందఱును చెప్పుచున్నారు. కాని వీని ననుసరించిన రసములు తొమ్మిదని చాలమంది వివరించుటచే స్థాయిభావములు తొమ్మిదియని చెప్పవచ్చును. అవి రతి-హాసము-శోకము మొదలగునవి.

1. క. ఉక్తవిభావాదులచే వ్యక్తంబగు స్థాయిరూప భావంబులు సు
వ్యక్తములై నిజగుణ సంసక్తములై రసములన రసత్వము నొందున్ [చూడా 2-4]
క. పులకాంకురంబులు కలిగిన నలువగు నిలిను రసాయనంబగు పగిదిన్
లలిత విభావాదులచే నలఘుతర స్థాయిభావ మలరున్ రసమై. [నరస. 3-4]
2. క. ఈ రసమునకు త్పాదనకారణము విభావ మనఁగఁ గల దది ద్వివిధం
బై రంజిలు నాలంబన, మారయ నుద్దీపనంబు ననఁగ ధరిత్రిన్.
క. వనితయుఁ బతియును నాలంబనమగు; నుద్దీపనంబు ప్రాయంబును సా
మ్యము శేషయు మదనాదులు, ననఁదగు . [నరస 3-27, 28.]
3. కార్యభూతోఽనుభావః స్యాత్కటాక్షాదిః శరీరజః [ప్రతాప:-రస]
...ప్రాదుర్భూతకటాక్షాదిః మానినాం ననుభావమయ్యే. [నరస. 3-34]
4. క. పరగత సుఖదుఃఖాదుల నరయఁగ భావించి యుల్లమున కది సత్వ
స్ఫురణము, తద్భవభావము లరయఁగ సాత్త్వికము లయ్యె [నరస 3-36]
5. క. ఆహార్యాదు రసోత్పత్తిక సహాయభావంబులు లెమి సంచారులగున్. [నరస:3-47.
(విశేషేణ ఆభిముఖ్యేన చరంతీతి వ్యభిచారిణః (వి+ఆ+అభి+చారిణః)
6. విరుద్ధైరవిరుద్ధైర్వా భావైర్విచ్ఛిద్యతే న యః,
ఆత్మభావం నయత్యాన్యాన్ స స్థాయీ .. [దశరూపకమ్: 4.[
తే. గరిమనదు లెన్ని కలిసినఁ గప్పకొనుచు, జలధి సముద్రనీతి సంచారిభావ
కంచటంబులు లెన్ని గలసిన మింగిచి, తాను ననపుడు భావంబు స్థాయిదలఁప.
[నరస: 3-5]

పయి స్థాయి భావములకుఁ బుష్టములగు విభావాది సామగ్రి లభించినపుడే అవి యథార్థ లగు స్థాయిభావములు. అట్లుకానిచో-అనఁగా-విభావాది సామగ్రి వానికిఁ జాల దక్కువ యగుచో స్థాయిత్వముపోవును. అపుడవి వ్యభిచారిభావములే అగును. [1] రసమును బాగుగఁ బోషింపఁ దలఁచిన వారు విభావాదులను సముచితమగునట్లు నిబంధింపవలసియున్నది.

పయిస్థాయిభావములు చిత్తవృత్తి విశేషములు; (జ్ఞానవిశేషములు;) అవి క్రొత్తగాఁ బుట్టునవి కావు. తగిన యుద్బోధము కలిగినచో అవి వ్యక్తములగును; లేని యెడఁ గావు. ఆ భావము ఈ రీతిని లేనివారికి రసాస్వాదము కలుగఁజాలదు. కావ సహృదయులకే గాని ఇతరులకు రసాస్వాద యోగ్యతలేదు. వాసనా రూపమగు భావము అందఱి యెడఁదల నుండి తీరవలెనని నియమములేదు.

రసమాత్రమున విభావానుభావ వ్యభిచారులే చెప్పఁబడినవి; మూలములోలేని స్వాత్త్వికస్థాయిభావములను చెప్పుట మూల విరుద్ధమని కొందఱు సందేహింపవచ్చును. కాని అట్టి సందేహమున కవకాశము లేదు.

పయిరసమాత్రము ననుసరించి ప్రాచీనాలంకారికులు పెక్కురు-అనఁగా ధ్వనికారుఁడు, అభినవగుప్తాచార్యులు, మమ్మటాచార్యులు మొదలగువారు, సాత్త్వికభావములను వేఱుగఁజెప్పలేదు. ధనంజయుఁడు, ధనికుఁడు, విద్యానాథుఁడు మొదలగు కొందఱు సాత్త్వికభావములను వేఱుగ లెక్కించిరి. పెద్దయు, మాత్రికవి విద్యానాథుని ప్రతాపరుద్రీయ మార్గము నే అనుసరించినారు. [2] ఇదివఱకు చెప్పఁబడిన లక్షణములను బట్టి అనుభావములు, సాత్త్విక భావములుకూడ కార్యములే యని తెలియుచున్నది. అనుభావములు శరీరమునఁ బుట్టునవి; సాత్త్వికభావము లంతఃకరణోత్పన్నములు. కార్యములు మొదట సాత్త్వికావస్థ యందుండి తరువాత ననుభావములుగ మాఱును. కావున రెండు నభిన్నములే యను నభిప్రాయమున ప్రాచీనులు వానిని వేర్వేఱుగఁ జేర్కొనలేదు [3] భరతముని యెనిమిది స్థాయిభావములను, ఎనిమిది అనుభావములను, ముప్పది మూఁడు సంచారిభావములను - మొత్తముపయి నలుబదితొమ్మిది భావములను పేర్కొనెను. ప్రాథమికావస్థాభేదములను నిర్దేశింపఁ దలఁచిన కొందఱు వీనిని వేర్వేఱుగఁ జూపిరి. కావ ఏమతమునకును భంగము కలుగదు.

లోకమునందు కారణములు, కార్యములు, సహకారి కారణములు అగునవియే కావ్య నాట్యములయందు వరుసగ విభావములు, అనుభావములు, వ్యభిచారి భావములు ననిచెప్పఁబడుచున్నవి. ఏదయిన నాటకప్రదర్శనమును చూచునపుడుకాని, ఏదైన కావ్యమును వినునపుడుకాని వాని తత్త్వమును బాగుగగుర్తించి, అనుభవమునకుఁ దెచ్చికొను సమర్థులగు సహృదయులకు, విభావాది భావములు తొలుత అవి ప్రత్యేక వ్యక్తి సంబద్ధములయినను, వ్యక్తి సంబంధమును విడిచి సర్వసాధారణములుగ గోచరించును. ఇట్టి సామాన్యజ్ఞానము కావ్యము అందు కంటె నాటకములందే వేగముగఁగల్గును. కావున మనమొక నాటకమునే దృష్టాంతముగఁ

1. రత్యాదయః స్థాయిభావాః స్యు ర్భూయిష్ఠ విభావజాః
స్తోకైర్విభావై రుత్పన్నా స్తఏవ వ్యభిచారిణః. [సంగీత రత్నాకరః]

2. విభావైరనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః.
ఆనీయమానః స్వాదుత్వం స్థాయీభావో రసఃస్మృతః.
విభావానుభావసాత్త్వికవ్యభిచారి సామగ్రీసముల్లాసిత స్థాయీభావో రసః.
[ప్రతాప: రస]

గీ. అట్టి విజ్ఞానకలితమై యలరుభావ మాత్మఁబ్రవ్యక్తమై విభావానుభావ
సాత్త్విక వ్యభిచారి సంజ్ఞలఁ దనర్చు, నాల్గు దెఱఁగుల రసనిదానంబు గాఁగ.
[మాడా: 1-20.]

సాత్త్విక భావంబులు నెనిమిదింటి నేర్పడ నలరింతు [వరస: 3-33]

3. ఏవం సర్వమిళిత్వా ఏకోనపంచాశద్భేదాః [నాట్య: 6-అ.]

దీనికొనుట మేలు. శాకుంతల నాటకము ప్రదర్శింపఁబడుచున్న దనుకొందము. అందు శకుంతలా దుష్యంతు లాలంబనవిభావములు; సహృదయుఁడగు సామాజికునికి ఆ విభావములు వ్యక్తివిశేషరూపమునఁ గాక సామాన్యరూపమునఁ దోఁచును. అనఁగా విభావములందు శకుంతలాత్వ దుష్యంతత్వములు నశించిపోవును. ఇట్లే యనుభావ, సంచారిభావములు వ్యక్తివిశేషసంబంధమును వదలి సామాన్యము లగును. ఇట్టి భావసామాన్యత కావ్యము సులలిత పదబంధ బంధురమై, ప్రదర్శించు నటులు తత్తద్భావ ప్రదర్శనమున నిపుణులై యుండు నపుడే రసాస్వాదన సమర్థులగు సహృదయులకే కలుగును.

అట్లు సాధారణములగు విభావానుభావ వ్యభిచారి భావములవలన విలక్షణమగు నొక వ్యాపారము పుట్టుచున్నది. అదియే వ్యంజన. ఈ వ్యాపారమువలననే సహృదయ హృదయములయందు వాసనారూపమునఁ బ్రతిష్ఠిత పూర్వములగు రత్యాది స్థాయిభావము లభివ్యక్తములగును. అనఁగా-ఉన్న స్థాయిభావములే వ్యంజనా వ్యాపారమువలనఁ బ్రకాశితములగును. సహృదయ హృదయములందు స్థాయిభావములు తొలుతనుండియు నున్నను, వాని నజ్ఞాన మను మూత కప్పివైచుటచే వ్యక్తములు కాఁజాలవు; వ్యంజనా వ్యాపార మా యావరకమగు అజ్ఞానమును పోగొట్టును. అజ్ఞానము నశించిన పిదప లోనున్న స్థాయిభావము, దానితోడిదే యగు నానందమును ప్రకాశించును.

మానవునికి మమత్వము అజ్ఞానజనితము. అజ్ఞానము నశించినపుడు మమత్వమును నశించును. అపుడు సహృదయునకుఁ దానొక వ్యక్తివిశేషమను ననుజ్ఞానము నశించును. అతఁడు సాధారణ వ్యక్తియే యగును. దుష్యంతాదులగు విభావములు దుష్యంతత్వాది వ్యక్తివిశేష సంబంధమును వీడి సామాన్యులగుటను, సహృదయ సామాజికుఁడును సామాన్యుఁడగుటను, పయివిభావములకు, సామాజికునకు నభేదము కలుగును. అపుడు సామాన్య రూపలగు శకుంతలాదినాయికలయెడ సామాజికులకు స్వకాంతాత్వ జ్ఞానముకలిగి అనురాగము కల్గుట కాటంక మేమియులేదు. ఇట్టి సుహృదయుఁడగు సామాజికునకు స్థాయిభావము వ్యక్తమయి, విగలిత వేద్యాంతరమగు నానందమును కల్గించును. అట్టి స్థాయిభావవిశిష్టమగు చిదానందమే రసము. ఈరసము సహృదయులగు వారందఱికిని ఆస్వాదన క్షమము. ఇది శృంగార రస ప్రతీతి మార్గము. తక్కిన రసములకు నిదియే పద్ధతి. పయిది వ్యక్తివాదుల మతము. ఇదియే సిద్ధాంతితమగుటచేఁ దొలుదొల్త నిరూపింపఁబడినది. తక్కిన మార్గములును, వాని యందలి యనుపపత్తులును క్రింద నిరూపింపఁ బడుచున్నవి.

'విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః' అను భరత రససూత్రము నందలి 'సంయోగ, నిష్పత్తి' శబ్దములకుఁ దమకుఁ దోఁచిన రీతిని పలువురు పండితులు పెక్కర్థములను నిర్వచించుటచే వాదములు పెరిగినవి. ఉత్పత్తివాదులగు భట్టలోల్లట ప్రభృతులు 'విభావములవలనఁ బుట్టి, అనుభావములవలనఁ బ్రతీతియోగ్యమయి, సంచారిభావములచేఁ బోషింపఁబడిన స్థాయిభావము రస'మని చెప్పిరి. రసము రామాదినాయక నిష్ఠమని, నాయకవేషము ధరించుటచే నటుని యందును అది గోచరించునని వీరి యాశయము. ఈ మతమున సూత్రమునందలి 'సంయోగ' పదమునకు మూఁడు విధములగు నర్థముల నంగీకరింప వలెను. స్థాయి, విభావముల సంయోగము కార్యకారణ భావము; స్థాయ్యనుభావ సంయోగము జ్ఞాప్యజ్ఞాపక భావము; స్థాయి, సంచారి సంయోగము పోష్యపోషక భావము. ఈ మతమున 'నిష్పత్తి' పదమునకు 'ఉత్పత్తి' అని యర్థము. ఈ మతము సరి కాఁజాలదు. ఉన్న స్థాయిభావమే ప్రకాశితమగును గాని క్రొత్తగాఁ బుట్టునది కాదు. రసమెన్నివేలయేండ్ల క్రిందటనో యుండినరామాది నాయకనిష్ఠమే యైనచో సామాజికులకు రసాస్వాదము కలుఁగఁజాలదు. అది సామాజిక నిష్ఠమయియే యుండవలెను. సంయోగ పదమునకుఁ బయిరీతిని చాల యర్థములను కల్పించుటయు సరి కాదు.

అనుమితివాదులగు శ్రీశంకుకులు లోకమునఁ బ్రసిద్ధములగు సమ్యక్, మిథ్యా, సంశయ, సాదృశ్యప్రతీతులకంటె విలక్షణమగు ప్రతీతి కలదని, అది చిత్రమునుజూచి 'ఇదిగో గుఱ్ఱము' అను కొను దానివంటిదని, అది రామపాత్ర

ధారి యగు నటునియెడ 'వీఁడగో రాముఁడు' అను బుద్ధిని కల్గించునని చెప్పెదరు. సరసమగు నాట్యమువలనను, నిపుణుఁడగు నటునిచేష్టల వలనను నటునియందు లేనిభావము లచట నున్నట్లే సామాజికులు గ్రహింతురు. కాఁగా రసము నాయకనిష్ఠమైనను, నటునియం దనుమేయమయి సామాజికులచే ననుభవింపఁబడును. ఇదియే వారి మతము. ఈ మతమున 'సంయోగ' పదమునకు అనుమాప్యానుమాపకభావ మర్థము. 'నిష్పత్తి' యనఁగా అనుమితి. ఈమతముకూడ సరికాదు. నటుఁడు తటస్థుఁడగుటచేఁ దద్గతముగ ననుమితమగు స్థాయిభావము సామాజికులకు విగళితవేద్యాంతరమగు నానందమును కలిగింపఁజాలదు; అనుమితమగునది సరిగ ఆస్వాదమునకు రాదు, రామాదినాయకనిష్ఠమగు రసము (ఒకరియందుండు రసము) సామాజికులకు (వేఱొకరికి) ఆస్వాదయోగ్యమగుట అనుభవమునకు విరుద్ధము. కావున ఈ వాదమున రసముయొక్క యథార్థస్వరూపము సుస్పష్టము కాదు.

భుక్తివాదులగు భట్టనాయకప్రభృతులది మూఁడవమతము. లోకవ్యతిరిక్తముగ కావ్యనాటకములందు క్రొత్త రసవ్యాపారములు రెండుకలవు. అవి ౧ భావకత్వము, ౨ భోగము. అందు మొదటి వ్యాపారముచే విభావానుభావవ్యభిచారిభావములు వ్యక్తివిశేషసంబంధమును విడిచి సర్వసాధారణములగును. పిదప సాధారణరూపమునున్న స్థాయిభావము భోగవ్యాపారమువలన సామాజికులచే నాస్వాదింపఁబడును. భోగవ్యాపారమే సత్త్వరజస్తమోగుణములలోని రజస్తమోగుణముల నణఁచి సత్త్వము నుద్రేకింపఁజేసి రసము నాస్వాదమునకుఁ దెచ్చును. ఆ భుజ్యమానమగు స్థాయియే రసమని పయివారి మతము. ఈ మతమున 'సంయోగ' పదమునకు 'సాధారణీకరణసంబంధ'మని యర్థము. 'నిష్పత్తి' యనఁగా భుక్తి లేక అనుభవము. ఈ వాదముకూడ సరికాదు. ఈ మతమునఁ గ్రొత్తగ భావకత్వ, భోగవ్యాపారముల నంగీకరింపవలసియుండును. రసము సామాజికభుజ్యమానమనుటచే రసము పుట్టునని కాని, జ్ఞాప్యమగునని కాని నిశ్చయముగఁ జెప్పుటకు వీలులేదు. అది యభివ్యక్తమనుటయే యుచితము; కాని భుక్తివాదులు వ్యక్తివాదుల మతమున కణుమాత్రము నవకాశము నీయరు. పయికారణములంబట్టి యీసందేహమునకును అవకాశములేని వ్యక్తివాదమే యుచితమైనది. అందే రసము స్వరూపమును బాగుగఁ దెలిసికొన వీలుకలదు.

వ్యక్తివాద సిద్ధాంత మిదివఱకే వివరింపఁబడినది. ఆ మతమున రససూత్రములోని 'సంయోగ'మునకు 'వ్యంజనావ్యాపారసంబంధ' మనియు, 'నిష్పత్తి'కి 'అభివ్యక్తి' అనియు నర్థములు.

పయిని వివరింపఁబడిన విషయమునుబట్టి రసము లన్నింటివలన నానందమే కలుగుననియు, దుఃఖము కలుగదనియుఁ దేలుచున్నది. రసస్వరూప నిరూపణమున నిపుణుఁడును, ప్రామాణికుఁడును అగు అభినవగుప్తాచార్యుఁడీ రీతినే చెప్పియున్నాఁడు. చాలమంది యాలంకారికు లతని మతమునే యనుసరించిరి. కాని యిచట నొక సందేహము కలుగవచ్చును. సుఖహేతువులగు రతి హాసాదులవలన — శృంగార హాస్యాదిరసములవలన ఆనందము కలుగవచ్చును; దుఃఖహేతువులగు శోక, భయాదులవలనను — కరుణ, భయానకాదిరసములవలనను ఆనంద మెట్లు కలుగును ?

కాని పయిప్రశ్నకు సమాధానము లేకపోలేదు. కావ్యప్రపంచము లోకవిలక్షణము. లోకమునందు సుఖహేతువులవలన సుఖము, దుఃఖహేతువులవలన దుఃఖము కలుగుట నియమసిద్ధము. కవిబ్రహ్మసృష్టి విలక్షణమగుటచే దుఃఖహేతువులవలనఁగూడ సుఖమే — కావ్యనాట్యములందుఁ గలుగును; అదియు సామాన్యసుఖము కాదు; విగళితవేద్యాంతరమగు ఆనందమే! దుఃఖహేతువులవలనను ఆనందము కూర్పఁగలవాఁడే కవి. హాలాహలమునుండి యమృతము చిలికింపఁగల సామర్థ్యములేని కవి యథార్థకవి కాఁడు. శ్రోతకాని, ద్రష్టకాని కేవలము దుఃఖము ననుభవింపవలెనను నాశయమునఁ గవి కావ్యమునుగాని, నాటకమునుగాని వ్రాయఁబూనఁడు. తనకు దుఃఖము కలుగవలెనని కోరి సహృదయుఁడు కావ్యపఠనమునకుఁగాని, నాటకదర్శనమునకుఁగాని దొరకొనఁడు. దుఃఖాంతములగు కావ్య, నాట్యములం బ్రవర్తించిన సహృదయుఁ డట్టి దుఃఖమువలనను మనస్సున కొకరీతి శాంతికలిగి యానందము కలుగవలెనను కోరికతోడనే ప్రవర్తించును.

మఱియు సహృదయులు కవి దుఃఖవిషయములను నిరూపించుటయందు ఎంతవఱకు నెగ్గెను? కరుణరసమును పోషించుపట్టుల మనలను రామాదులతోఁబాటు ఏడిపించగలిగెనా? లేదా? అని యాలోచింతురు. అట్లొనరించినపుడే వారు కవిని మెచ్చుకొని యానందింతురు. (ఇది యనుభవసిద్ధము.) సంస్కృతాలంకారికులు ఇంచుమించుగ నందఱును కరుణాదిరసముల వలనను ఆనందమే కలుగునని చెప్పినారు. నాట్యదర్పణకర్తలగు రామచంద్ర, గుణచంద్రులు మాత్రము సుఖాత్మకత్వ, దుఃఖాత్మకత్వ భేదములగల రసములు రెండు విధములనియు, రసములు కొన్ని (కరుణాదులు) దుఃఖస్వరూపములనియు వివరించియున్నారు [1] కాని వీరిమతము నితరులెవ్వరు నామోదించలేదు. వీరి గురువగు హేమచంద్రాచార్యులు గూడ యీ మతమును సూచింపనైనను లేరు. [2] లోకోత్తరమగు నానందమునకుఁ గారణములెట్టివయినను కావచ్చును. అవి యానంద స్వరూపమును మార్పఁజాలవు.

ఆంధ్రాలంకారికులు కూడ అన్ని రసముల వలనను ఆనందమే కలుగునని ఒప్పుకొనిరి. మూర్తికవి ఈ యంశమునే 'వారిరి దుఃఖమైన సుఖవైభవమైన [illegible] దారయఁ బూర్ణమై సహృదయాత్ములఁ గేవల హర్షమై తగున్' అని చెప్పినాఁడు. ఇచ్చట 'హర్షము'నకు 'ఆనంద'మను నర్థము చెప్పవలెను. వ్యక్తమగు స్థాయిభావముతోఁ గూడ గలిత వేద్యాంతరమగు నానందము కలుగునని యిచటఁ జెప్పఁబడినది. రసానందములు రెండును భిన్నములా? అభిన్నములా? అను సందేహ మొకటి కలుగుచున్నది. ఈ విషయమున సంస్కృతాలంకారికులు రెండు విధములగను చెప్పియున్నారు. మమ్మటాచార్యులు కావ్యప్రకాశమున 'రసాస్వాదనమువలన విగలిత వేద్యాంతరమగు నానందము కలుగు'నని యొకచోటను, 'రసము బ్రహ్మానందముతో సమానమగు'నని వేఱొకయెడను చెప్పియున్నారు. [3] రసగంగాధరము నందలి రసస్వరూపమును బట్టి స్థాయికంటె ఆనందము వేఱనియు, ఈ రెండింటికిని అవినాభావ సంబంధమున్నదనియుఁ దెలియుచున్నది. [4] పండితరాజు స్థాయిభావముతోఁ గూడిన యానందము రసమా? లేక యానందముతో నున్న స్థాయి రసమా? అని విమర్శించి శ్రుతిని ప్రమాణీకరించుచు రత్యాది స్థాయిభావవిశిష్టమగు చిదానందమే రసమని సిద్ధాంతీకరించియున్నాఁడు. [5] రసమానందస్వరూపమనియే శ్రుతిజ్ఞము రసలక్షణమునందలి 'నిజస్వరూపానందేన సహ గోచరీక్రియమాణః, రత్యాదిరేవ రసః' అను నంశము పయివానిని సమర్థకము. ఇట్లు కరిమతమునఁ రెండు విధములగు నభిప్రాయములు నుండినట్లు తోఁచుచున్నది. పయివానికి సమన్వయము చేయఁదలఁచినచో ఒకమార్గము కలదు. రసము, నానందమును వేఱైయైనను, రసము ఆనందమునకు హేతువగు కారణమున హేతు, హేతుమంతముల కభేదము చెప్పుట యుక్తమగుటచే, రసానందముల కభేదము చెప్పినను చెప్పవచ్చును. ఆంధ్రాలంకారికులలోఁ బెద్దయ కీ మతమేమో తెలుపవలసియున్నది, మూర్తికవి మతమున మాత్రము రసానందముల కభేదము కలదని 'భావము [illegible] దారయఁ బూర్ణమై సహృదయాత్ములఁ గేవల హర్షమై తగున్' [పుట 63.] అను పలికి నిర్వచనమును బట్టి తెలియుచున్నది.

---

1. నాట్యదర్పణమ్ పు. 3. [G O Series]
2. కావ్యానుశాసనమ్. [నిర్ణయసాగరప్రతి]
3. సకలప్రయోజనమౌలిభూతం సమనన్తరమేవ రసాస్వాదనసముద్భూతం విగలిత వేద్యాన్తర మానందం. [కావ్యప్ర ప్రథమోల్లాసః]
   బ్రహ్మాస్వాదసబ్రహ్మచారీ రసః. [కావ్యప్ర చతు]
4. స్వప్రకాశతయా వాస్తవేన నిజస్వరూపానందేన సహ గోచరీక్రియమాణః ప్రాగ్వినివిష్టవాసనారూపో రత్యాదిరేవ రసః [రసగం ప్రథ]
5. వస్తుతస్తు వక్ష్యమాణశ్రుతిస్వారస్యేన రత్యాద్యవచ్ఛిన్నా భగ్నావరణా చిదేవ రసః. 'రసో వై సః, రసం హ్యేవాయం లబ్ధ్వానన్దీ భవతీ'తి శ్రుతిః.
   [రసగంగాధరః. పు. 20.]

రససంఖ్యాపరిగణనమునఁ బ్రాచీనకాలము నుండియు మతభేదములు కలుగుచున్నవి. స్థాయి భావము లెన్నియున్న అన్నిరసములు కలవని చెప్పవలెను. భరతముని యెనిమిది స్థాయిభావములనే నిర్వచించియున్నాఁడు. దానింబట్టి యతనిమతమున ఎనిమిది రసములే యని చెప్పవలసి వచ్చును; రసములు తొమ్మిదని చాలమంది చెప్పుచున్నారు. కొందఱు చెప్పని ఆ రసము శాంతము; భరతుఁడును శాంతరసము లేదని యెచ్చటను చెప్పలేదు. 'అష్టౌ నాట్యేరసాః స్మృతాః' అనియే నాట్యశాస్త్రమునఁ గలదు. దానింబట్టి నాట్యరసము లెనిమిదని, నాట్యాతిరిక్తముగఁ గావ్యమందు శాంతరసము కలదని అతనిమతమును కొందఱు వివరించుచున్నారు. అభినవగుప్తాచార్యులు శాంతరసమునుగూర్చి ప్రసంగించుచు, అది భరతముని సమ్మతమని 'మునినాఽప్యంగీకృతం, 'క్వచిచ్ఛమః'— ఇత్యాదినా' అని అతని వచనమును ప్రమాణీకరించినాఁడు. దానింబట్టి శాంతరసమునకు శమము స్థాయి యని మునిమతమయినట్లును తెలియుచున్నది. నాట్యశాస్త్రమున 'రతిర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా. జుగుప్సా విస్మయశ్చేతి స్థాయిభావాః ప్రకీర్తితాః' అని స్థాయిభావములు నిరూపింపఁబడిన పిదప 'నిర్వేదగ్లాని శంకాఖ్యాః' అని సంచారిభావములు ప్రస్తుతింపఁబడినవి. కాని శమము స్థాయిభావమని కాని, భావమాత్రమని కాని చెప్పఁబడి యుండలేదు. కావ్యప్రకాశకారుఁడు శాంతమునకు నిర్వేదము స్థాయి భావము అని చెప్పియున్నాఁడు. నిర్వేదము మంగళప్రాయమగుటచే దానిని తొలుతఁ జెప్పరాదనియు, అట్లు చెప్పుట నిర్వేదమొకపుడు స్థాయి కావచ్చునను సంశయమును తెలియఁజేయుననియు, నిర్వేదము స్థాయిగాఁగల శాంతరసము కలదనియు నతని మతము. [1] విద్యానాథాదులు శమమునే శాంతస్థాయి భావముగఁ జెప్పియున్నారు. [2] పండితరాజు నిర్వేదమునే యొప్పుకొన్నాఁడు. [3] ఇటుల శాంతస్థాయి భావముంగూర్చి యభిప్రాయభేదములున్నట్లు తెలియుచున్నది. విచారించి చూచినచో శమము, నిర్వేదము నొక్కటియే యని, నిర్వేదమునకు శమము నామాంతరమని తేలును. భరతముని శమము నంగీకరింపనిచో అభినవగుప్తుని మతము కుదురదు. పయి రెండును తృష్ణాక్షయరూపములే. రెండింటికి నభేదమును తలంచియే భరతముని 'క్వచిచ్ఛమః' అని చెప్పియుండవలెను. ఆంధ్రాలంకారికులు శమమునే శాంతిస్థాయిగాఁ జెప్పిరి. ఏది చెప్పినను ఒకటియే!

రసములు తొమ్మిదని సనాతన సిద్ధమగు వాదము. కాని కొందరీ పద్ధతి నొప్పుకొనలేదు. శృంగార ప్రకాశమును వ్రాసిన భోజదేవుఁడు [4] శృంగార మొక్కటియే రసమని, గతానుగతిక న్యాయమున వీరాద్భుతాదులు రసములయినవని వివరించియున్నాఁడు. రూపగోస్వామి 'ఉజ్జ్వల నీలమణి' యందు 'ఉజ్జ్వలవేషమగు శృంగార మొక్కటియే రసమని వివరించెను. ప్రాచీనాలంకారికుఁడగు రుద్రటాచార్యుఁడు తొలుతఁ బదిరసములను పేర్కొని, యంతలోఁ దనివినొందక మధుర పదార్థముల యాస్వాదనమువలన వివిధ రసములు కలుగునట్లు, అన్ని భావముల యాస్వాద

1. నిర్వేదస్యామంగళప్రాయస్య ప్రథమమనుపాదేయత్వేఽప్యుపాదానం సంచారిత్వేఽపి స్థాయిత్వప్రతిపాదనార్థమ్. తేన నిర్వేద స్థాయిభావోఽస్తి, శాంతోఽపి నవమోరసః [కావ్యప్ర. చతు.]
2. జుగుప్సా విస్మయశమాః స్థాయిభావాః . [ప్రతాప: రస: సాహిత్య దర్పణమ్]
3. రతిశ్శోకశ్చ నిర్వేదం . . [రస గంగాధరః: పు-80.]
4. వీరాద్భుతాదిషు రసేషు రసప్రసిద్ధిః సిద్ధా కుతోఽపి వటయక్షవదావిభాతి లోకే గతానుగతికత్వవశాదుపేతామేతాం నివర్తయితుమేష పరిశ్రమో నః, శృంగార వీర కరుణాద్భుత హాస్య రౌద్ర బీభత్స వత్సల భయానక శాంతనామ్నః ఆమ్నాసిషుర్దశరసా నపరే; వయం తు శృంగారమేవ రసనాద్రసమామనామః. [పీఠిక.]

నము వలనను రసాస్వాదనము కలుగవచ్చు నని, అందుచే నిర్వేదాదు లన్నియు రసములు కావచ్చు నని వివరించి యున్నాఁడు.[1] అధునాతన విమర్శకులు కొందఱు రససంఖ్యను నియమించుటకు వీలులేదనియు, భావానుసారముగ ఇచ్ఛకు వచ్చినన్ని రసములుండవచ్చుననియు నొనరించు సిద్ధాంతమున కీ రుద్రటవాద మెంతయు అనుగుణ మగుచున్నది. రసస్వరూపవివరణ సందర్భమున జగన్నాథ పండితుఁడు కూడ స్థాయిభావము లయినను భూయిష్ఠ విభావజనితము లగునప్పుడే స్థాయి భావములని, లేని యెడల వ్యభిచారు లగునని చెప్పియున్నాఁడు కదా! ఆ రీతినే తక్కిన భావములు భూయిష్ఠవిభావజములగుచో రసములగుటలో అనుపపత్తిలేదు. ఇట్లు రస సంఖ్యావిషయమయి వివిధములగు అభిప్రాయము లున్నవి. రస సంఖ్యాపరిగణనమున జగన్నాథ పండితుఁడు చాల విమర్శించి తుదకు తొమ్మిది రసములనే యంగీకరించెను. ఆ విషయము సంగ్రహముగ క్రింద నీయఁబడును.

దేవ, గురు, పిత్రాది విషయకమగు రతి భావమనియు, అదియే కాంతావిషయకమగుచో రస మగుననియు నాలంకారికుల సిద్ధాంతము. ఆస్వాదనముపట్టుల భేదములేనియప్పు డన్నియు రసములేయని కాని, అన్నియు భావములేయని కాని ఏల అనరాదు? లేదా, స్త్రీవిషయకరతి భావమయి, దేవ, గురు, పిత్రాది విషయకమే రసమేల కారాదు? పయిరీతి సందేహము లనేకములు కలుగవచ్చును. అట్టి ప్రశ్నలకు సమాధాన మొసఁగుటకు బగలు ప్రథమాలంకారికుఁడు, ప్రామాణికుఁడునగు భరతముని చెప్పినదానికే శరణుఁజొచ్చుట యుక్తము. ముని చెప్పిన తొమ్మిదే రసములని, తదతిరిక్తములు భావములని చెప్పవలెను. వీనికిఁ బేరిలోనే భేదము; ఫలమున నన్నియు నొక్కటే.[2]

ఆంధ్రాలంకారికులును రసములు తొమ్మిదని చెప్పియున్నారు.

రసము నాయకనిష్ఠమా? సామాజికనిష్ఠమా? నటనిష్ఠమా? అని సందేహము కొందఱికిఁ గలుగవచ్చును. అభినవగుప్తులమతమును బట్టి— రసము సామాజికులచే ననుభవింపఁబడుటచే దానికి తన్నిష్ఠతయే యుచితమైనది. కొన్ని మతములలో నాయకనిష్ఠము; కాని యా మతములు యుక్తములు కావని యిదివఱకే చెప్పఁబడినది. కావ్యమునందు శ్రోతలకును, నాట్యములందు ద్రష్టలకును రసము కలుగునని చెప్పుచు పెద్దిరాజు (పెద్దయ కవి) పయిమతమునే యామోదించినాఁడు.[3] ప్రతాపరుద్రీయమునం దభినవగుప్తుని మతమే యనుసరింపఁబడినది. అందలి 'భావేస్థాయిని' అను శ్లోకమునే ఆంధ్రీకరించిన మూర్తికవి మతమును వేఱుగఁ జెప్పఁబనిలేదు. కావున రసము సహృదయుఁడగు సామాజికుని యందే యుండునని చెప్పవలెను. కొన్ని శతాబ్దముల క్రిందట నుండిన నాయకనిష్ఠము కాఁజాలదు. అట్లే యైనచో సామాజికునకు రసాస్వాదముకలుగక పోవలసివచ్చును. అది నటనిష్ఠ మంతకన్నను కాదు. నటుఁడు కేవల మభినయాదుల ననుకరించునేగాని ఆయా భావము లాతనికి కలుగుట లేదు. ఒకప్పుడతఁడు తన్మయుఁడయి రసము ననుభవించెనేని— అప్పుడతఁడు నటుఁడు కాక సామాజికుఁడే యగును. నటునకు శిక్షాభ్యాస పాటవమున భావానుకరణ యోగ్యతయే కలదు; రసాస్వాద యోగ్యత లేదు

ఈ రసస్వరూప వివరణములోని కొన్ని యంశములు మనవారి కనుభవవిరుద్ధములుగ తోఁచవచ్చును. ప్రాచీనార్వాచీన లాక్షణికు లందఱును పయిరీతినే యనుసరించిరి. వారి నిర్వచనము అనుభవానుసారియై యుండవలెను.

1. శృంగార వీరకరుణా బీభత్సభయానకాద్భుతా హాస్యః,
రౌద్రః శాన్తః ప్రేయా నితి మన్తవ్యా రసాః సర్వే.
రసనాద్రసత్వమేషాం మధురాదీనా మివోక్త మాచార్యైః,
నిర్వేదాదిష్వపి తన్నికామ మస్తీతి తేఽపి రసాః [కావ్యాలంకార : 3-3,4]
2. భరతాది మునివచనానామేవాత్ర రసభావత్వాది వ్యవస్థా పర్వతేన స్వాతంత్ర్యాయోగాత్. అన్యథా పుత్రాది విషయాయా అపి రతేః స్థాయిభావత్వం కుతో నస్యాత్...రసానాం నవత్వగణనాచ మునినియంత్రితా భజ్యేత...[రసగంగాధరః : పు-16.]
3. ప్రోడలకుఁ గావ్యములయందుఁ బొందు రసము;
ద్రష్టలకు నాట్యములయందుఁ దనరు రసము; [చూడు : ?-7.]

# గుణములు

———:o:———

మానవునికి శౌర్యధైర్యములవలెనే కావ్యమునం దాత్మరూపమగు రసమున కుత్కర్షను కలుగఁజేయునవి గుణములు. శౌర్యాదులవలె నివియు నాత్మధర్మములు. గుణములు కావ్యమున ఎట్టివో భామహుని మతమున నిరూపించుట కష్టము; దండి 'ఇతి వైదర్భమార్గస్య ప్రాణా దశగుణాః స్మృతాః' అని వైదర్భమార్గమున కివి ప్రాణము లని చెప్పినాఁడు. సమాధిగుణమును—వైదర్భమార్గము ననుసరించియే — కావ్యసర్వస్వముగఁ జెప్పినాఁడు. [తదేతత్ కావ్యసర్వస్వం సమాధిర్నామ యో గుణః.] తన మతమున గుణముల స్థాన మేమో స్పష్టముగఁ దెలుపలేదు. కావ్యమునకు శోభను కలిగించుధర్మము లలంకారము లని యితని మతము[1]. వామనుఁడు కావ్యశోభను కలిగించుధర్మములు గుణము లని, అలంకారములు గుణసంపాదితశోభకు నుత్కర్షఁ గలుగఁజేయున వనియు నిర్వచించినాఁడు[2]. వామనుని మతమున గుణము కావ్యాత్మ యగుట దానికెక్కువ ప్రాముఖ్యము కలిగినది. ఆనందవర్ధనాచార్యులు 'అంగి యగుధ్వని నాశ్రయించునవి గుణము లని, అంగము లగుశబ్దార్థముల నాశ్రయించునవి గుణము లని చెప్పియున్నాఁడు. మమ్మటాదు లామార్గమునే అనుసరించినారు.[3] గుణము లాత్మధర్మములే యైనచో 'రచన మధుర మయినది; బంధ మోజస్వంతము' అను వ్యవహారములు కుదుర వని తలఁప నక్కఱ లేదనియు, 'ఆకారమే శూరముగ నున్న' దనురీతి వ్యవహారమునుబట్టి లక్షణను గ్రహించవలె ననియు మమ్మటాదుల మతము. గుణములు రసధర్మములే కాక శబ్దార్థరచనాధర్మములును కావచ్చు ననియు పండితరా జభిప్రాయపడెను.[4]

భరతముని గుణములు పది యని చెప్పెను. అవి ౧. శ్లేష; ౨. ప్రసాదము; ౩. సమత; ౪. మాధుర్యము; ౫. సుకుమారత; ౬. అర్థవ్యక్తి; ౭. ఉదారత; ౮. ఓజస్సు; ౯. కాంతి; ౧౦. సమాధి అనునవి. దండి భరతమునినే యనుసరించెను. వామనుఁడు పయిగుణములనే అంగీకరించుచు అవి యర్థగుణములు, శబ్దగుణములు కావచ్చు నని చెప్పెను. అతని మతమునఁ బది శబ్దగుణములు, పది యర్థగుణములు (మొత్తము పై నిరువదిగుణములు.)

భామహాచార్యుఁడు మాధుర్యము, ఓజస్సు, ప్రసాదము ననుమూఁడుగుణములనే యొప్పుకొనెను. ఆనందవర్ధనుఁ డామతమునే తీసికొనెను. మమ్మటుఁ డానందవర్ధనుని సమర్థించుచు దండివామనాదుల మతములను ఖండించి 'గుణములు మూఁడే కాని పది కా' వని నొక్కి చెప్పెను. అతని మతమునఁ గొన్నిగుణములు కొన్నిటియం దంతర్భవించును; కొన్ని దోషాభావమాత్రప్రయోజకములు; కొన్నిగుణములు కొండొకయెడ దోషము లగును. ఎట్లన — శ్లేష, సమాధి, ఉదారతయు ఓజోగుణమునం దంతర్భవించును. అర్థవ్యక్తి ప్రసాదమునఁ జేరును. క్లిష్టత్వరూపదోషము లేకుండుటకయి సుకుమారతయు, గ్రామ్యమును పరిహరించుటకయి కాంతియు స్వీకరింపఁబడినవి. సమత యంతటను గుణము కాఁజాలదు. ఒక్క పద్యమునందే సందర్భమునబట్టి రచనయు మాఱుచుండును.

పండితరాజు మూఁడుగుణములనే యంగీకరించుచు ప్రాచీనులమతము ననుసరించి దశగుణస్వరూపమును కూడ వివరించినాఁడు.

భోజదేవుఁ డీ రెండుమార్గములకంటె విలక్షణముగ నిరువదినాలుగు గుణములను అంగీకరించెను. విద్యానాథుఁడు భోజుని మతమునే

---

1. 'కావ్యశోభాకరాన్ ధర్మా నలంకారాన్ ప్రచక్షతే.' [కావ్యా 2-1]
2. కావ్యశోభాయాః కర్తారో ధర్మా గుణాః
   తదతిశయహేతవ స్త్వలంకారాః. [కా. సూ. వృ.]
8. తమర్థ మవలంబంతే యేఽంగినం తే గుణాః స్మృతాః
   అంగాశ్రితా స్త్వలంకారా మన్తవ్యాః కటకాదివత్. [ధ్వన్యా. ద్వితీ
4. రసగంగాధరః, పు. 55.

యనుసరించెను;[1] అందలి గుణములు కొన్ని కొన్నిటియందు గతార్థ మగుచున్నను, కొన్ని దోషాభావముగాఁ గను బడుచున్నను వరుసగనే వివరించెను.

చూడామణికారుఁడు చాలవఱకుఁ బ్రతాపరుద్రీయము ననుసరించినను గుణవిషయమున దండినే యనుసరించెను. మూర్తికవి ప్రతాపరుద్రీయమునే యొకమాదిరిగ నాంధ్రీకరించుచున్నను పదిగుణములనే యొప్పుకొనెను. వాని లక్షణములను మాత్రము ప్రతాపరుద్రీయానుసారముగనే నిర్వచించెను.

పెద్దయకవియు, తదనుసారి యగునప్పకవియు గుణములు కొన్ని దోషాభావమాత్రప్రయోజకము లని తెలుపునెడ తాము చెప్పనివి, ప్రతాపరుద్రీయమున నున్నవియు నగు గుణములను పేర్కొని యున్నారు. ఈ సంగతి వివరముగ నిదివఱకే చెప్పఁబడినది.

క్షేమేంద్రుఁడు కవికంఠాభరణమున మీఁది మతములకు విలక్షణముగ 'శబ్దవైమల్యము, అర్థవైమల్యము, ఉభయవైమల్యము' నను మూఁడు గుణములను చెప్పియున్నాఁడు. కాని యీ మతము నెవరును ఆమోదించ లేదు. ఇది శబ్దార్థస్వచ్ఛతారూప మగుప్రసాదగుణమందే యంతర్భవించును. ఓజోమాధుర్యము లట్లు ప్రసాదమున నిమిడి యుండవు. కావున పయిమతముల నన్నింటిని బాగుగ విచారించినచో మాధుర్యౌజఃప్రసాదములు మూఁడే గుణము లనువాద ముత్తమ మని తోఁచును.

ఏదేని పద్యమునందలి ధ్వనిని గాని, గుణమును గాని, అలంకారమును గాని, తక్కిన కావ్యాంగములను గాని లక్షణసమన్వయమును బట్టియే నిశ్చయింపవలసి యున్నది. వ్యాఖ్యాత ఏమి చెప్పిన దానికే తల యూపవలసియున్నది. లాక్షణికు లుదాహరించినలక్ష్యములను విడిచి, గ్రంథాంతరలక్ష్యములందలి గుణాలంకారాదులను వివరించుట చాల కష్టము. అందును అలంకారాదుల లక్షణములు కొంచెము విశదరీతి నుండుటచేఁ గొంతవఱకయిన ఊహించి చెప్ప నవకాశము కలదు. గుణముల లక్షణము లంత స్పష్టములు కావు వానిని గుర్తించుట దుర్ఘటము. లాక్షణికులు కూడ ఒకేపద్యమును మూఁడు నాలుగు గుణముల కుదాహరించుట కలదు. గుణములు పది యని చెప్పినపుడు అవి కొన్ని పరస్పరవిరుద్ధము లేమో యని యనుమానించుటకును వీలు కలదు. అనేకపదము లేకపదముగా గోచరించుట శ్లేష మనియు, పదములు వేర్వేఱుగ నుండుట మాధుర్య మనియు లక్షణములు కలవు. ఇది పరస్పరము విరుద్ధముగ నున్నట్లు తోఁచును. పదములు కలిసియున్నను, కలిసి యుండకున్నను కూడ గుణములే యగుచో వానిని వేర్వేఱుగఁ బరిగణించుటయు అనావశ్యక మని తోఁచక పోదు. తక్కినలక్షణముల సంగతి యెట్లు లున్నను గుణముల లక్షణములు మాత్ర మొకరి ననుసరించి యింకొకరు చెప్పినట్లు లేదు. దండి లక్షణము వేఱు; వామనుని లక్షణము వేఱు; భోజుని లక్షణము వేఱు. ఆ లక్షణములకు సాంగత్యము కుదురదు. ఒకే గ్రంథమునందే పరస్పరము వైరుధ్య మున్నటుల స్థూలదృష్టికి గోచరించినను, సూక్ష్మపర్యాలోచనమున సమన్వయము కుదురఁగలదు. కాని గుణములు మూఁడే యనుమతమున లక్షణములకుఁ బరస్పరము భేదము సుస్పష్టము. ఎట్టి లక్ష్యమునం దయిన సమన్వయము సుసాధ్యము.

ఆంధ్రాలంకారికులు పదిగుణములనే చెప్పిరి. వారి లక్షణములు విభిన్నములు; అస్పష్టములు. అందుననే వారి గుణలక్షణవిభాగములు విమర్శనలకు లోనగుచున్నవి.

---

1. శ్లో. శ్లేషః ప్రసాదః సమతా మాధుర్యం సుకుమారతా
అర్థవ్యక్తి రుదారత్వం తథా కాన్తి రుదాత్తతా॥
ఓజః సుశబ్దతా ప్రేయా నౌర్జిత్య మథ విస్తరః.
సమాధిః సౌక్ష్మ్యగాంభీర్యే సంక్షేపో భావికం తథా.
సంమితత్వం తథా ప్రౌఢీ రీతి రుక్తి ర్గతి స్తథా.
వ్యా. తత్ర భోజరాజమతే నోద్దేశ మాహ—శ్లేష ఇత్యాది. [ప్రతా. గుణ]

# అలంకారములు

—— :o: ——

కావ్యసామగ్రియం దలంకారములే ప్రాచీనతమములు; అధికసంఖ్యాకములు; ప్రాచీనుల మతమున నివియే ముఖ్యములు. ఈ యంశము 'న కాన్త మపి నిర్భూషం విభాతి వనితాముఖ' మిత్యాదివలనఁ దెలియుచున్నది. ఏమి చెప్పినను, ఏమి చెప్పకున్నను అందఱు నలంకారములనుగూర్చి చెప్పుచునే యుండిరి. సాహిత్యశాస్త్రమున సంపూర్ణముగ కావ్యసామగ్రిని చర్చించుగ్రంథములకంటె అలంకారచర్చారూపము లగుగ్రంథములే యెక్కువ. వైదిక వాఙ్మయమందును అనేకము లగునలంకారములు కన్పించుచున్నవి. సాహిత్యశాస్త్రమున కలంకారశాస్త్ర మను పేరు అలంకారబాహుళ్యమునుబట్టియే కలిగిన దని కుమారస్వామి సోమయాజి ప్రతాపరుద్రీయవ్యాఖ్యానమునఁ దెలిపియున్నాడు.[1]

అలంకారములు కావ్యమునకు శోభను కూర్చున వని అందఱు నంగీకరింతురు. 'అలంక్రియతే కావ్య మనే నేతి చారుత్వహేతు రలంకారః' అనువ్యుత్పత్తి వివరణములు పయి యంశమును విశదపఱుచుచున్నవి. దండి యలంకారములు కావ్యశోభాహేతువు లని చెప్పియున్నాడు; వామనుఁడు గుణసంపాదిత మగు శోభకుఁ బరిపోషమును గూర్చున వలంకారము లని చెప్పినాఁడు. మఱియు వామనుని మతమున 'సౌందర్య' మనునర్థమలంకారమునకుఁ జెప్పఁబడినది. గ్రంథారంభముననే యతఁడు 'అలంకార మున్నకారణమున కావ్యము గ్రాహ్యము; సౌందర్యమే యలంకారము; ఆ సౌందర్యము దోషహీనము, గుణాలంకారాదానమువలనఁ గల్గు నని చెప్పియున్నాఁడు.[2] కొందఱు చమత్కారజనకము లలంకారము లనిరి. అందరి మతమునను అలంకారము లుపాదేయములే కాని హేయములు కావు ఇవి శబ్దసామ్యమునుబట్టి, అర్థసామ్యమునుబట్టి భూషణస్థానీయములు.

అలంకారములు శబ్దార్థభేదములచే రెండు విధములు. ఉపమాదులు అర్థాలంకారములు; అనుప్రాసాదులు శబ్దాలంకారములు. శబ్దాలంకారములం దర్థమునను, అర్థాలంకారములందు శబ్దమునను చమత్కృతి ఉండక పోదు. అయినను శబ్దచమత్కృతి ప్రధానముగ నున్నచోట శబ్దాలంకార మనియు, అర్థచమత్కృతి ప్రధాన మగుచోట నర్థాలంకార మనియు గ్రహింపవలెను. రెండు కాని, అంతకంటె నెక్కువ గాని యలంకారము లున్నచో వానిని ప్రత్యేకముగ మిశ్రాలంకారములుగఁ జెప్పుట కలదు. అవి సంకరము, సంసృష్టి యని రెండు విధములు; తిలములు, తండులములు కలిసి యున్నట్లు కలిసి యున్న యలంకారము లున్న సంసృష్టి యగును. సంసృష్టియందు అలంకారములను వేర్వేఱుగ ఏర్చి చూపవచ్చును. పాలు, నీళ్లు కలిసిపోయి యేక మయినట్లు రెండలంకారములు కలిసిపోయిన నచట సంకరము. సంకరమున అలంకారములను వేర్వేఱుగఁ దీసి చూపుటకు వలను కాదు. అందొక్క యలంకారము తీసి వైచినచో రెండవదానికిని హాని కలుగుచుండును. సంకరము సామాన్యముగ అంగాంగిభావ సంకరము, ఏకవాచకానుప్రవేశ సంకరము, సందేహసంకరము నని మూఁడువిధములు.

పయి మిశ్రాలంకారములను వేఱు భేదముగ లెక్కింప నక్కఱ లేదు. సంకీర్ణములు గాని, సంసృష్టములు గాని యగునలంకారము లన్నియు శబ్దాలంకారము లైనఁ గావచ్చును; అర్థాలంకారము లైనఁ గావచ్చును; లేదా కొన్ని శబ్దాలంకారములును, కొన్ని యర్థాలంకారములును గావచ్చును. సంస్కృతాలంకారికులు కొందఱు ప్రత్యేకముగ మిశ్రాలంకార ప్రకరణమును వ్రాసిరి. ఆంధ్రాలంకారికు లటులొనర్ప లేదు. మిశ్రములలోని యలంకారములు శబ్దార్థ సంబద్ధమాత్రము లగుటచే వానిని ప్రత్యేకముగ

1. 'యద్యపి రసాలంకారాద్యనేకవిషయకం శాస్త్రం,
తథాపి ఛత్రిన్యాయే నాలంకారశాస్త్ర ముచ్యతే.' [ప్రతా. వ్యాఖ్యా. సాయ.]

2. కావ్యం గ్రాహ్య మలంకారాత్.
సౌందర్య మలంకారః
సదోషగుణాలంకారహానాదానాభ్యామ్. [కా. సూ. 1-1-1-3]

విభజింప నక్కఱ లేదు.

శబ్దాలంకారములకంటె నర్థాలంకారములే యెక్కువగా కావ్యమునకు శోభను గలిగించుట కుపయోగపడును. రసతత్పరుఁడగు కవి యర్థాలంకారములం గూర్పఁ బ్రయత్నింప వచ్చును; కాని శబ్దాలంకారములఁ గూర్పఁ బ్రయత్నింప రాదు. అవి రసమునకు భంజకములు కావచ్చును వానియంతట నవి యెచ్చట నైనను పడినచో దోషము లేదు; ప్రయత్నపూర్వకముగ వానిని నిబంధించినచోఁ బ్రమాదము కలుగును[1] కావ్యమునకుఁ బ్రధానప్రయోజన మగు— ఆత్మస్థానీయ మగు రసమునకు నుద్బోధకము లగు శబ్దాలంకారములకంటె అర్థాలంకారములే యుత్తమములు. ప్రధాన మగు శృంగారాదిరసమున కలంకారముగఁ గూర్పఁబడిన రూపకాదు లగు నర్థాలంకారములే యథార్థాలంకారములు[2]. ఆలంకారికు లందఱును నీ విషయము నామోదించిరి.

అలంకారము చమత్కృత్యాధాయకము. వివిధకవితంసముల యూహలనుబట్టి, రచనలను బట్టి చమత్కారము భిన్న మగుచుండుటచే అలంకారముల సంఖ్యయుఁ బెరుగును. మాటల తీరు లనంతములు! అట్టి చమత్కార విశేషములు శబ్దములవలనఁ గాక యర్థములవలననే యెక్కువగఁ గలుగను; కావున నర్థాలంకారముల సంఖ్యయే క్రమక్రమముగ నూఱింటికిఁ బయిగ పెరిగినది. శబ్దాలంకారము లే పదింటికో తక్కువగ నున్నవి. అందుచే ఎక్కువ చమత్కారాధాయకము లగుటచే అర్థాలంకారము లగ్రశ్రేణిలోని వని చెప్పవలెను. అర్థాలంకారములు లేనికవిత విధవవలె నుండు[3] నని యగ్నిపురాణమునఁ జెప్పఁబడినది.

అర్థాలంకారములయందును కొన్ని ప్రధానములుగను, మఱికొన్ని ప్రధానముల విశేషరూపములుగను అంగీకరింపఁబడినవి. భరతముని మూఁడర్థాలంకారములను ఉపమ, దీపకము, రూపకములను చెప్పి, అందు నుపమాప్రపంచమునే విస్తరించెను. అతని మతమునం దుపమాలంకారమే ప్రధానము. భామహుఁడును ఉపమనే తొలుతఁ జేర్కొనినాఁడు. కాని యతిశయోక్తి వివరణ సందర్భమున వక్రోక్తి (అతిశయోక్తి) యుత్తమమనియు, అది లేకుండ నలంకారమే లే దనియు వివరించెను[4] అతని సిద్ధాంతము ముఖము చంద్రసమానము కాకున్నను ఉండినట్లచటఁ జెప్పఁబడినది కదా! దండి స్వభావోక్తినే ప్రధానాలంకారముగ నిర్వచించెను.[5] వాఙ్మయము.[6] స్వభావోక్తి, వక్రోక్తి యని రెండు విధము లని యతఁడే చెప్పినాఁడు. ఆనందవర్ధనాచార్యులు వక్రోక్తి ప్రాముఖ్యమును వివరించి యున్నాఁడు. వామనుఁడు భరతు ననుసరించి యుపమనే ప్రధానముగఁ జెప్పినాఁడు. అతని మతమున యుపమ యొక్కటే అలంకారము; ప్రతివస్త్వాదిక మగు నలంకారసంచయ మంతయు నుపమాభేదమే[7] నవీనాలంకారికు లందఱును ఉపమాలంకారమే ప్రధాన మని చెప్పినారు. స్వభావోక్తి వారిమతమున ముఖ్యము కాదు. ఒక్క నటియే యనేకవేషముల ధరించి సామాజికుల

---

1. 'శృంగారస్యాంగినో యత్నాదేకరూపానుబంధనాత్
సర్వేష్వేవ ప్రభేదేషు నానుప్రాసః ప్రయోజకః ।
ధ్వన్యాత్మభూతే శృంగారే యమకాదినిబంధనమ్
శక్తావపి ప్రమాదిత్వం విప్రలంభే విశేషతః ।
రసాక్షిప్తతయా యస్య బంధః శక్యక్రియో భవేత్.
అపృథగ్యత్ననిర్వర్త్యః సోఽలంకారో ధ్వనౌ మతః.' [ధ్వన్యా. 2-15-17]
2. 'ధ్వన్యాత్మభూతే శృంగారే సమీక్ష్య వినివేశితః
రూపకాది రలంకారవర్గ ఏతి యథార్థతామ్.' [ధ్వన్యా. 2-18]
3. 'అర్థాలంకారరహితా విధవేవ సరస్వతీ.' [అగ్ని.]
4. 'సైషా సర్వత్ర వక్రోక్తి రనయాఽర్థో విభావ్యతే.
యత్నోఽస్యాం కవినా కార్యః కోఽలంకారోఽనయా వినా' [కావ్యాలం]
5. స్వభావోక్తిశ్చ జాతిశ్చేత్యాద్యా సాలంకృతిః. [కావ్యాదర్శః 2]
6. భిన్నం ద్విధా స్వభావోక్తి ర్వక్రోక్తి రితి వాఙ్మయమ్. [కావ్యా]
7. 'ఉపమానోపమేయయో ర్గుణలేశతః సామ్య ముపమా.
ప్రతివస్తు ప్రభృతి రుపమాప్రపంచః. [కా. సూ. వృ. 4-1-1,2.]

హృదయముల నాకర్షించునట్టొక్క యుపమయే యలంకారప్రపంచమునఁ గూడ మాఱి కావ్యతత్త్వవిదుల కాహ్లాదము కలుగఁజేయు నని అప్పయదీక్షితులు చిత్రమీమాంసయందు వివరించిరి. ఉపమ యన్ని యలంకారములందు నుండు నని పండితరాజు వాక్రుచ్చెను.[1] మమ్మటుఁడు మొదలు విశ్వేశ్వరపండితునివఱకు గల యాలంకారికులలో నేకస్వల్పసంఖ్యాకులో తప్ప తక్కినవా రందఱును పయిమార్గమునే యనుసరించినారు.

ప్రాచీనాలంకారికులలోఁ జాలమంది స్వభావోక్తికే ప్రాముఖ్యమును నొసఁగిరి; కొందఱతిశయోక్తికిని, మఱికొందఱు తదంతర్భూత మగురూపకమునకును ప్రాధాన్యము నిచ్చియున్నారు. ఉద్భటుఁడు రూపకమునే తొలుతఁ జెప్పెను.[2] రుద్రటుఁ డలంకారముల నన్నింటిని నాల్గుభాగములుగ విభజించి, వానిలో స్వభావాఖ్యానమునే తొలుతఁ జెప్పెను.[3] రాజశేఖరుఁడు నా మార్గమునే యనుసరించెను.[4] కుంతకుని మతమున అతిశయోక్తి (వక్రోక్తి) కావ్యమున కాత్మగా మాఱినది, స్వభావోక్తి యలంకార్యము కాని అలంకారము కాఁజాల దని, వక్రోక్తి స్వభావోక్తి నలంకరించున దని యతఁడు వివరించెను. స్వభావోక్తియే అలంకార మయినచో—వక్రోక్త్యాదుల కలంకార్యముగ వే ఱేదియు లభింప దనియే యతని యూహ.[5]

ఆంధ్రాలంకారికులలో విన్నకోట పెద్దయకవి దండిమతము ననుసరించి జాతినామాంతము కలస్వభావోక్తియే ప్రధానాలంకార మని చెప్పి యున్నాఁడు.[6] మూర్తికవి విద్యానాథు ననుసరించి యుపమనే తొలుతఁ జెప్పెను.[7] అప్పకవి యలంకారవివరణసందర్భమున స్వభావోక్తినే ప్రధానముగఁ జెప్పినను వేఱొకయెడ ఉపమయే ఉత్తమ మన నభిమతమును తెల్పినాఁడు. కువలయానంద కారికల నాంధ్రీకరించిన సూరకవిమతము, కువలయానందము నాంధ్రీకరించిన రాముయ కవిమతము మూలకర్త యగుదీక్షితుల మతమున కభిన్నములు.

తక్కిన కావ్యాంగములవలెనే అలంకారములును దొలుత స్వల్పము లయినను క్రమక్రమముగ విస్తృతిని బొందినవి. ప్రథమాలంకారికుఁ డగుభరతుఁడు 'ఉపమ, దీపకము, రూపకము' అను మూఁడు అర్థాలంకారములను యమక మనుశబ్దాలంకారము నొక దానిని వివరించినాఁడు. భామహుఁడు రెండు శబ్దాలంకారములను, ముప్పదియా అర్థాలంకారములను వివరించెను. దండి ముప్పదియా అర్థాలంకారములను జెప్పి, శబ్దాలంకారములను విచిత్రము లగు పద్మ, చక్రాది బంధములను ఎక్కువగఁ జెప్పెను. ఇటులే క్రమక్రమముగ అలంకారముల సంఖ్య పెరిగి అప్పయదీక్షితుల నాటి కొక్క యర్థాలంకారములే నూటయిరువది నాలిగింటివఱకుఁ బెరిగినవి. అంతటితో ఆ సంఖ్య నిలిచి పోయినట్లు తోఁచుచున్నది. చమత్కారము లనంతములు. కావున నూహలంబట్టి యిట్టి పెం పలంకారముల కొదవివది.

తెలుఁగువారిలోఁ బెద్దయకవి యించు

1. 'ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్రభూమికా భేదాన్.
రంజయతి కావ్యరంగే నృత్యన్తీ తద్విదాం చేతః' [చిత్రమీ. పు 5.]
'విపులాలంకారవర్తి న్యుపమా......' [రసగం. పు. 157.]
2. 'అనుప్రాసః సయమకో రూపకం దీపకోపమే.'
3. 'అర్థస్యాలంకారా వాస్తవ మౌపమ్య మతిశయః శ్లేషః.
ఏషా మేవ విశేషా అన్యే భవన్తి నిశ్శేషాః' [కావ్యాలం.]
4. '...వాస్తవం పుల స్త్యః......' [కావ్యమీమాంసా. పు. 1.]
5. 'అలంకారకృతాం యేషాం స్వభావోక్తి రలంకృతిః
అలంకార్యతయా తేషాం కి మన్య దవశిష్యతే.' [వక్రోక్తి.]
6. 'అవి యెవ్వి యనఁగా స్వభావాఖ్యానమును. ఉపమయు......
క. ప్రీతి స్వభావాఖ్యానము, జాతి యనఁగఁ బరఁగు...' [చూడా. 5. 2,4.]
7. గీ. 'ఈ యలంకారముల కెల్ల నిలఁ బ్రధానమైన దుపమయ ముందుగా నను వొల్పి
యొకటి కొకటికి భేదముల్ ప్రకటములుగ, సరవి నెఱిఁగింతు...' [నర. 5. 6.]

మించుగ దండి మతమునే అనుసరించెను. అతని వలెనే యితఁడును శబ్దాలంకార, చిత్రబంధ నిరూపణమునఁ దన పాండితీపటిమం గొంత ప్రకటించుకొనెను. మూర్తికవి తన మూలకర్త వలె డెబ్బదింటి నర్థాలంకారములఁ జెప్పఁ బ్రతిజ్ఞ చేసియు, రసవత్ప్రేయ ఊర్జస్వి సమాహితంబు లనునాలుగలంకారములను విడిచిపెట్టెను. ఛేక, వృత్తి, లాటానుప్రాసములను, యమక, ముక్తపదగ్రస్తములను, బద్మ, చక్రబంధములను శబ్దాలంకారములను వివరించి, యాంధ్రమునఁ బ్రత్యేకతఁ గన్న గర్భకవిత్వమును గొంచె ముదాహరించెను. అప్పకవి చూడామణి ననుసరించుచు, రెం డలంకారములను—సంసృష్టి సంకరముల నెక్కువగా వివరించెను.

కావ్యమునందుఁ జమత్కారమును గలిగించుటయే కావ్యాంగముల పరమప్రయోజనము. వాని స్వరూపలక్షణములు మాత్రము విభిన్నములు. ప్రతాపరుద్రీయమున 'కావ్యశోభాహేతువే యలంకారము. గుణము కూడ నట్టిదే' యని పరప్రమాణ ప్రదర్శన పూర్వకముగఁ జెప్పఁబడినది.[1] గుణములు వ్యంగ్యధర్మములు, అలంకారములు శబ్దార్థధర్మము లను కొందఱి మత మనునంశ మీ వఱకే చెప్పఁబడినది. కాని సిద్ధాంతమున గుణములు శబ్దా ధర్మము లని పండితరాజు మతము. గుణాలంకారములకు ఆశ్రయభేదమునుబట్టియే గాని స్వరూపభేదమునుబట్టి భేదము లేదని నవీనుల యాశయము. రుద్రటుఁ డలంకారాతిరిక్తముగ గుణస్వరూపమును జెప్పలేదు. ఆంధ్రాలంకారికుల కుపాస్యుఁ డగువిద్యానాథుఁడు గుణములు సంఘటనాధర్మము లని, అలంకారములు శబ్దార్థధర్మము లని చెప్పినాఁడు. ఆంధ్రాలంకారికులు మాత్ర మీ చర్చలను విడిచిరి.

— — —

1. 'యో హేతుః కావ్యశోభాయాః సోఽలంకారః ప్రకీర్తితః।
గుణోఽపి తాదృశో జ్ఞేయః......' [ప్రతాప. గుణప్ర.]

# వృత్తులు

—:o:—

కావ్యమునకు శోభను గలిగించువానిలో వృత్తులు కూడఁ గలవు. వృత్తి యన వ్యాపారము; 'వృత్తయః కావ్యమాతృకాః' అను వచనము వాని ప్రాముఖ్యమును విశదము చేయుచున్నది. వృత్తులు మూఁడువిధములుగ నున్నవి. ౧. శబ్దవృత్తులు; ఇవి పరుష, గ్రామ్య లేక కోమల ఉపనాగరిక యనునవి. ఇవి అనుప్రాసమను శబ్దాలంకారమున కనుగుణములు. వీరాది రసానుగుణములు. ౨. కైశికి, ఆరభటి, సాత్త్వతి, భారతి యను నాలుగును రసానుగుణము లగునర్థవృత్తులు; ఇవి కేవల మర్థవృత్తులని స్పష్టముగా విద్యానాథాదులు చెప్పలేదు; కాని పరుషాదివృత్తుల కర్థముతో సంబంధ ముండకుండుటంబట్టి, కైశిక్యాదుల కర్థముతో నెక్కువ సంబంధ ముండుటంబట్టి యివి యర్థవృత్తులని చెప్పుటకు వీలుకలుగుచున్నది. కావ్యాలంకారచూడామణియందు కైశిక్యాదులు కావ్యవృత్తు[1] లని చెప్పఁబడినది. కాని కావ్యవృత్తిత్వము ఉభయసాధారణము గాని, విశేషబోధకము కాఁజాలదు. నరసభూపాలీయమునందు మాత్రము మూలమునందువలెనే రచనాశ్రయము లయి రసావ[illegible]నసూచకము లగు నని కైశిక్యాదు లని చెప్పఁబడినది.[2] కైశికి అత్యంత సుకుమార మగునర్థసందర్భము కలది. ఆరభటి అత్యుద్ధత మగునర్థసందర్భము కలది. కొంచెము మృదు వగునర్థసందర్భము కలది సాత్త్వతి; కొంత ప్రౌఢ మగునర్థసందర్భము కలది భారతి. కైశికి శృంగారకరుణరసములందును, ఆరభటి రౌద్ర బీభత్సములందును, సాత్త్వతి హాస్యశాంతాద్భుతములయందును, భారతి వీరభయానకములయందును వెలయును.[3] పయి రెండువిధము లగువృత్తులకు వ్యవహార మను నామాంతరము ధ్వన్యాలోకమున వ్యవహరింపఁబడినది.

పయి ద్వివిధము లగువృత్తులును కావ్యశోభాకరము లగుటచే అలంకారములవంటివే యని చాలమంది తలంచిరి. ఇవి శబ్దార్థాలంకారానతిరిక్తము లని ధ్వన్యాలోకమునఁ గలదు.[4] ఉపనాగరికాదు లనుప్రాసాదిశబ్దాలంకారాంతర్గతములు, కైశిక్యాదు లుపమాద్యర్థాలంకారాంతర్భూతము లని తన్మతము. నవీనులు మాత్రము వృత్తులను ప్రత్యేకముగ గణించిరి.

ఈ రెండువిధము లగువృత్తులు కాక 'శబ్దవృత్తు' లని ప్రసిద్ధిని గనిన మూఁడువృత్తులు అభిధ - లక్షణ - వ్యంజన అనునవి కలవు. ఇవి వాచకాది శబ్దములవలన అర్థమును ప్రతిపాదించుట కుపకరించువ్యాపారములు వీనిని శబ్దవృత్తులుగనే విద్యానాథుఁడు వివరించినాఁడు.[5] కాని విచారించి చూచినచో అభిధాదులు శబ్దవృత్తులును, అర్థవృత్తులునుకూడ నగునని తెలియఁగలదు. అభిధ శబ్దవ్యాపారము కాని అర్థవ్యాపారము కాని కావచ్చు నని రసగంగాధర

---

1. కావ్యాలంకారచూడామణి పుట. 55.
2. గీ మఱియు రచనాశ్రయంబులై మధురరసని, వేశయోగ్యత వృత్తులు కైశికియును,
నారభటియును సాత్త్వతి భారతియును, నాఁగఁ బొగడొందుఁ దల్లక్షణము లొనర్తు.
3. మ. చెలఁగుం గైశికి కోమలార్థరచనాశ్రీ నుద్ధతార్థక్రమా
కలితాడంబరమూర్తి యారభటి; యీషత్ప్రౌఢసందర్భని
ర్భల యా భారతి; పొల్చు సాత్త్వతియు నీషత్కోమలార్థక్రమం
బుల నీ వృత్తులకున్ యథోచితరసస్ఫూర్తుల్ నిరూపించెదన్.
గీ. కైశికి చెలంగు శృంగారకరుణలందు; నారభటి రౌద్రబీభత్సహారిణి యగు
నలరు భారతి (?) హాస్యశాంతాద్భుతముల; నమరు సాత్త్వతి (?) వీరభయానకముల
4. 'శబ్దార్థశరీరం తావత్కావ్యమ్. తత్ర శబ్దగతా శ్చారుత్వహేత [నరస. పృ. 84.]
వోఽనుప్రాసాదయః ప్రసిద్ధా ఏవ. అర్థగతా శ్చోపమాదయః + + + + + తదన
తిరిక్తవృత్తయోఽపి యాః కైశ్చిదుపనాగరికాద్యాః ప్రకాశితాః'
[ధ్వన్యా. సలో. పృ. 5. 6.]
5. అభిధా, లక్షణా, వ్యంజనాఖ్యా స్తిస్రః శబ్దవృత్తయః [ప్రతాపరుద్రీయ.]

# అనుబంధము 1

## మిశ్రలక్షణ గ్రంథములు

ఆంధ్రవాఙ్మయమున నలంకార శాస్త్రము నకు ప్రత్యేకతకలుగుటకుఁ బూర్వము, తరువాతఁగూడ మిశ్రలక్షణగ్రంథములు—అనగా ఛందో, వ్యాకరణాలంకార విషయ ప్రతిపాదకములు-వెలువడిన ట్లిదివఱలోఁ జెప్పఁబడినది. ఆ గ్రంథములనుగూర్చి యిచట సంగ్రహముగ వివరింపఁబడును.

లక్షణములను సంకీర్ణముగ వివరించుపద్ధతి తొలుతనుండియు నున్నది. చింతామణియందు సందర్భానుసారముగ ఛందో విషయము లత్యల్పముగ వివరింపఁబడుటచే అది మిశ్రలక్షణ గ్రంథము కాఁజాలదు. ఆరీతినే తద్వ్యాఖ్యానములగు బాలసరస్వతీయము, అహోబల పండితీయము కూడ మిశ్రలక్షణములలోఁ జేరవు. కావ్యాలంకార చూడామణిలో ప్రధానమైనది అలంకార శాస్త్రవిషయము కావున, అదియు మిశ్రగ్రంథము కాఁజాలదు.

## కవిజనాశ్రయము

మిశ్రలక్షణ గ్రంథములలో మొదటిది రేచన కవికృతమగు కవిజనాశ్రయము. దీనికి 'భీమనఛందస్సు' అనువాడుక కలదు.[1] కాని దీనిని రచించినది భీమకవి కాఁడనియు రేచన యనియు కవిచరిత్రకారులలో చాలమంది యంగీకరించియున్నారు.

కవిజనాశ్రయము ప్రాచీన చ్ఛందో గ్రంథములలో మొదటిది. కుమారసంభవ కర్తయగు నన్నిచోడ మహాకవి దీనిం జూచినట్లు తెలియుచున్నది. ఈ కవిజనాశ్రయము కన్నడమున నాగవర్మ రచించిన ఛందోంబుధి ననుసరించినట్లు తెలియుచున్నది. నాగవర్మ క్రీ. శ. 990 ప్రాంతమువాఁడు.

కవిజనాశ్రయములోని 'అమరఁగ వేల్పులచే' అను పద్యమును మడికి-సింగన తన 'సకలనీతి సమ్మతము'లో నుదాహరించి యున్నాఁడు. సింగన 1400 ప్రాంతపువాఁడు. దీనింబట్టి చూచినను రేచన 13వ శతాబ్ది వెనుకవాఁడు.

కవిజనాశ్రయము ఛందోవిషయ ప్రతిపాదకమగు గ్రంథము. అలంకార శాస్త్రమునకుఁ జేరిన 'కావ్యప్రయోజనములు, కావ్యభేదములు కావ్యదోషములు నిందు వివరింపఁబడినవి. పయి విషయములు కావ్యాదర్శము నుండి గ్రహింపఁబడినట్లు తోఁచుచున్నది. రేచన పయివాని మూలముం గూర్చి ప్రస్తావింపలేదు; కాని దశదోషములను వివరించునెడ తాను 'మునిమతము' ననసరించినట్లు చెప్పియున్నాడు.[2] ముని యనఁగా భరతమునియే యనుట ప్రసిద్ధము. కాని దోషముల పేరులను, లక్షణములను బట్టి చూచినచో నాట్య శాస్త్రదోషములకు కవిజనాశ్రయదోషములకుఁ జాలభేదము కన్పించుచున్నది. మఱియు నిందలి దోష, లక్షణములు దండికావ్యాదర్శమునకు సరిపడుచున్నవి.[3] మఱియుఁ గావ్యాదర్శమునందువలె నిందును

1. కవిజనాశ్రయము భీమనకృతమనియే అభిప్రాయపడి, ఆంధ్ర సాహిత్యపరిషత్తువారా రీతినే రెండు సార్లు ముద్రించియున్నారు.

2. క. అని యిట్లు దశవిధములగు, ముని మతమునఁ గావ్యదోషములు; వాని నెఱుం
గనివాఁ డెప్పాట నెఱుం గునుదాత్తకృతి ప్రసంగ గుణ దోషములన్.
[దోషాధికారము. ప. 3]

3. గూఢార్థ మర్థాన్తర మర్థహీనం భిన్నార్థ మేకార్థ మభిప్లుతార్థమ్,
న్యాయాదపేతం విషమం విసంధి శబ్దచ్యుతంవై దశ కావ్య దోషాః. [నాట్య. 16]

క. రూపిత పునరుక్తి వ్యర్థా పార్థ విసంధి సంశయ చ్ఛందోభం
గాపక్రమ యతిభంగ విరూపో క్త్యపశబ్దములు విరోధము కృతులన్. [2]
అపార్థం వ్యర్థ మేకార్థం ససంశయ మపక్రమమ్
శబ్దహీనం యతిభ్రష్టం భిన్నవృత్తం విసంధికమ్
దేశ కాల కలాలోకన్యాయాగమ విరోధి చ. [కావ్యా దర్శః 3 అ.]

'వ్యర్థము' మొదలగు దోషములు కొన్ని కొండొకయెడ గుణములు కావచ్చునని చెప్పఁబడినది. ఈవిషయము నాట్యశాస్త్రమునఁ గానరాదు. రేచన భరత నాట్యశాస్త్రమును చూడకపోవుటనో, తన్నామ ప్రతిపాదనమునఁ దన గ్రంథమునకు గౌరవము కలుగునని తలంచుటచేతనో, కావ్యాదర్శ నామమును తెల్పుట కిష్టబడనందుననో 'ముని'ని పేర్కొనెనని చెప్పవలెను.

కవిజనాశ్రయమును ఆంధ్రసాహిత్య పరిషత్తువారు రెండుపర్యాయము లచ్చొత్తించినారు. అది పరిషదధ్యక్షులగు శ్రీ జయంతి రామయ్యపంతులుగారి విపులపీఠికతో వెలువడినది. ఇందుఁ దొమ్మిదధికారములు కలవు. మొదటిదగు సంజ్ఞాధికారమున గురులఘు వివేకము, గణనిర్ణయము, వడిప్రాసముల నిర్ణయము కలవు. రెండవదగు వియతిచ్ఛందో అధికారమునఁ గ్రమమున 26 ఛందములు, యతిలేని వృత్తములు, ఆ వృత్తముల లక్షణములు సూక్ష్మముగ వివరింపఁబడినవి. మూఁడవదగు యతిచ్ఛందోధికారమున యతి నిలుపఁదగిన వృత్తములు వివరింపబడినవి. నాల్గవదగు ఉద్ధరమాలావృత్తాధికారమున లయగ్రాహి, లయవిభాతి, త్రిభంగి, లయహారి, దండకలక్షణములు కలవు. ఐదవదగు అర్ధసమవృత్తాధికారమున నారీప్లుత, రతిప్రియాది వృత్తములు వివరింపఁబడినవి. ఆరవయధికారమున విషమవృత్తముల వివరణకలదు. ఏడవదగు జాత్యధికారమున కందము, ఆర్య, గీతిభేదములు, సీసము, ఉత్సాహ, తరువోజ, గీదియలు, అక్కరలు, ద్విపద, త్రిపద, చౌపద, షట్పదములు వివరింపఁబడినవి. ఎనిమిదవ యధికారమున ఛందశ్శాస్త్రీయ షట్ప్రత్యయములు, తొమ్మిదవ యధికారమున దోషములు తెలుపఁబడినవి.

ఇందలి దోషాధికారము ఛందశ్శాస్త్రమునకు సంబంధించినది కానందునను, దీనిని ప్రక్షిప్తమనుటకుఁ దగిన యితరకారణములు కానరానందునను, గ్రంథభాగముననే గ్రహింపఁబడినదని ఆంధ్రసాహిత్య పరిషత్తువారు అధస్సూచికయందు వ్రాసియున్నారు. [కవిజ-పుట. 79.] దీనింబట్టి పయివిషయము ఛందస్సంబంధ కానందునఁ బ్రక్షిప్తమనుట యుక్తమని పరిశోధకుల యాశయమైనట్లు తెలుచున్నది. కాని యాంధ్రమున ఛందోవ్యాకరణాలంకారముల సాంకర్యము తొలుతనుండియు నున్నదియే యగుటచే నిది ప్రక్షిప్తమనుకొన వీలుకాదు. ఇది ప్రక్షిప్తమన్నచోఁ దక్కిన గ్రంథములలోఁ గల విషయాంతరములును ప్రక్షిప్తములే కావలసి వచ్చును.

ఈ దోషాధికారమునకు మూలము సంస్కృతమగుటచే నందున్న దోషములే యిందును వివరింపఁబడినవి; కాని యాంధ్రవాఙ్మయమునకుపయుక్తమగు రీతిని దగిన దోషములు వివరింపఁబడలేదు. సంస్కృతమునందువలె నిందును ఛందో, యతిభంగములే దోషములని చెప్పఁబడినవి; ప్రాసభంగము విడువఁబడినది.

దోషములపేర్లు అధికారపు 2 వ పద్యమునఁ గలవు. పరిషత్తువారి పత్రికలో లక్షణోదాహరణములు మాత్రము క్రమముతప్పినవి. వరుసగ పునరుక్త, వ్యర్థా, ప్రక్రమ, యతిభంగ, విరూపోక్త్యపశబ్దా, పార్థ, విసంధి, సంశయ, ఛ్ఛందోభంగ, విరోధముల లక్షణోదాహరణము లీయధికారమున నున్నవి; కాని 2 పద్యమునఁ జెప్పఁబడిన క్రమము ననుసరించిలేవు. అన్ని ప్రతులలోను పయిరీతినే యున్నదఁట! కాని, నూతనముగ (1950 లో) వెలువడిన వావిళ్ళవారి ముద్రణమున మాత్రము సక్రమముగనే యున్నది.

## ఛందోదర్పణము

దీని కనంతుని ఛందస్సను నామాంతరము కలదు. 'రసాభరణము'ను వ్రాసిన అనంతామాత్యుఁడు దీనికిఁ గర్త. ఇతనిం గూర్చి 'అనంతామాత్యుఁడు' అను శీర్షిక క్రిందలి గ్రంథమున విపులముగ విమర్శింపఁ బడినది.

ఛందోదర్పణమును 'చెన్నపురి' లోని వావిళ్ల వారు 1921 వ సం. న ముద్రించి ప్రకటించిరి. దీనికి ఛందస్సునఁ గృషిచేసిన డాక్టర్ గిడుగు వేంకట సీతాపతి పంతులుగారు విపులమగు పీఠికను వ్రాసియున్నారు. దీని ద్వితీయ ముద్రణము 1947 లో శ్రీ నిడుదవోలు వేంకటరావు గారి పీఠికతోఁ గూడ వెలువడినది.

ఇది నాలుగాశ్వాసముల గ్రంథము. ప్రథమాశ్వాసమున దైవస్తుతికిఁ దర్వాత సంజ్ఞా, యతి, ప్రాస ప్రకరణములు ; ద్వితీయాశ్వాసమున గద్య లక్షణము, వృత్తములు ; తృతీయా

శ్వాసమునజాతులు, షట్ప్రత్యయములు వివరింపబడినవి. చతుర్థాశ్వాసమునం దలంకార శాస్త్ర సంబద్ధమగు దోషవిచారము, దానికవ్వల వ్యాకరణ సంబద్ధములగు సంధి, సమాస వివరణము కలవు.

ఛందోదర్పణమునకు మూలము కవిజనాశ్రయమని తోఁచుచున్నది. అందుఁ జర్చింపఁబడిన పదిదోషములే యిందును కలవు. అందులేని ప్రాసభంగ దోషమిందుగు లేదు. కవిజనాశ్రయమున విషయ వివరణము సుస్పష్టముగ లేదు; ఇందుఁ జాల సరళముగ నున్నది.

## అప్పకవీయము

కాకునూరి అప్పకవి దీనికిఁ గర్త. అప్పకవియే తన చరిత్రమును గూర్చి పయిగ్రంథమున విపులముగఁ జెప్పి యున్నాఁడు. కాకునూరి వంశపు పూర్వ పురుషుఁడు తమ్మన్న. అతని కుమారుఁడు సోమయ్య. అతనికి గంగమాంబ యందు రంగప్ప కలిగెను. రంగప్ప కుమారులలో మూఁడవ వాఁడగు పెద సోమయ్యకు కృష్ణమ్మ యందు ముగ్గురు పుత్రులు కలిగిరి. అందు జ్యేష్ఠుఁడగు వెంకన్నకు వేనమ్మ యందు 'అప్పకవి జన్మించెను. వీరిది భారద్వాజ గోత్రము.

అప్పకవి వంశపు పూర్వుఁడు సోమయ్య వేదశాస్త్ర పురాణాది నాందములను, 'కాకునూరింటిఁ జేసెఁ గావుననుఁ 'గాకునూరింటివారని ఘనతఁ గాంచె'నని యీ గ్రంథమునఁ బీఠిక యందలి 72 వ పద్యమును బట్టి తెలియుచున్నది. కాని దాని తరువాతిపద్యమునందే పయి బిరుదము సంపాదించిన సోమయ్య (అప్పకవి తాతకుఁ దాత) చరికొండ సీమలో 'కాకునూ'రను సర్వాగ్రహారమును సంపాదించెనని చెప్పబడినది. సోమయ్య తండ్రి కాకునూరి తమ్మన్నయనియు నీ గ్రంథమున నుండుటచేఁ గాకునూరనునది గ్రామమును బట్టి వచ్చిన యింటిపేరే గాని పౌరుష నామము కాదని స్పష్టపడుచున్నది. పూర్వముండిన పేరునకే తరువాతివారు తమ వంశ గౌరవ ప్రకటన కొఱకు వ్యుత్పత్త్యర్థమును విచిత్రముగఁ గల్పించి యుండవచ్చును.

సోమయ్య 'అభినవదూతవద్గ్రామము'లో నుండిన ట్లప్పకవీయమునఁ గలదు. ఆ గ్రామము 'క్రొత్త మామిడి పల్లె' అయియుండవచ్చును. అప్పకవి కామెపల్లిలో నుండఁగా నతనికి స్వప్నము కలిగినట్లు, దానిని మాతృబంధువులు వినినట్లు గ్రంథమున గలదు. శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారూహించిన ట్లప్పకవి మేనమామల యింటిలోనే పెరిగి విద్యావంతుఁ డయ్యెనని లోకవార్త వచ్చుచుండుటచే, మేనమామలఁ బట్టియే కవి సకుటుంబముగఁ గామెపల్లిలో నుండెనని యూహింపవచ్చును అప్పకవి కాలము నాఁటికి కామెపల్లి కొండవీటికిఁ బడమటను, శ్రీశైలమున కీశాన్యదిశను గల తంగెటి సీమలో నుండినదని పీఠికలోని 73 వ పద్యమును బట్టి తెలియుచున్నది. కామెపల్లి యిప్పుడు గుంటూరు జిల్లాలోని పల్నాడు తాలూకాలో నున్నదని శ్రీ లక్ష్మణరావు పంతులు గారి యభిప్రాయము. అప్పకవి పేర్కొనిన కామెపల్లి యిప్పుడు లేదని శ్రీ అక్కిరాజు ఉమాకాన్తము గారి యాశయము.

అప్పకవిది పండిత వంశము. అతని తాతకుఁ దాతయగు సోమయ్య కాశిలో బ్రహ్మేంద్రుల వద్ద శాస్త్రముల నభ్యసించెను. తాతయగు పెదసోమయ్య క్రతువు లొనర్చెను. తండ్రి వెంకన తన పాండిత్య విశేషముచే 'సారటబ్రహ్మ' యని పేరు పొందెను. అప్పకవి చాల మంది గురువుల వల్లఁ జాల విద్యలను సంపాదించెను. ఇతనికి మూర్తి సర్వన్న సస్వరముగ వేదము చెప్పెను; కొండూరి గిరిదేశికులు శబ్దశాస్త్రము నుపదేశించిరి, సూరభట్టు సిద్ధాంతముఁ దెల్పెను; మంచికంటి ఓబకవి లక్షణము చెప్పెను; కోలచలమల్లి లింగనార్యుఁడు స్మార్త ధర్మములఁ దెల్పెను, ఆగమములను రాజయోగి గఱపెను. అప్పకవీయమును రచించు నప్పటికే కవి శ్రీశైలమున 'భోగివిభూషణు'ని 'పట్టపుఁ గవీంద్రుడై యుండె నట! ఈ భోగివిభూషణుఁడు మల్లికార్జున స్వామియే కాని మానవమాత్రుఁడు కాఁడు. దీనిం బట్టి యప్పకవి కొంత కాలము శ్రీశైలమున నివసించినట్లు తెలియుచున్నది.

అప్పకవికి, శాలివాహన శకము 1578, మన్మథ నామ సంవత్సర శ్రావణ బహుళాష్టమి నాఁడు, [అనఁగా క్రీ. శ. 1659 సం. ఆగష్టు మూఁడవ తేదీని] కామెపల్లిలో నుండఁగా

గల వచ్చినట్లును, చింతామణికి విపులమగు వ్యాఖ్యానము వ్రాయవలెనని కలలోఁ గన్పించిన శ్రీ మహావిష్ణువు కవికాజ్ఞ యొసఁగినట్లును అప్పకవీయమునఁ గలదు. అప్పకవీయమునకు ముందే కవి యనేకసంస్కృతాంధ్ర గ్రంథములను రచించినట్లు చెప్పికొనెను. కావున నితఁడు పదునేఁడవ శతాబ్దపు ప్రారంభమున జన్మించి యుండవచ్చును. శ్రీ వీరేశలింగము పంతులు గారు తమ కవుల చరిత్రలో 'అప్పకవీయము క్రీ. శ. 1656 మొదలుకొని 1660 వ సం. ప్రారంభమునకు ఇంత వఱకు రచింపఁబడిన'దని వ్రాసినారు. అందుకుఁ దగిన ప్రమాణములు మృగ్యములు.

అప్పకవి సంస్కృతమున 'అపస్తంబ షట్కర్మ నిబంధనమును, కాలబాలార్ణవమునకు శ్లోకరూపమగు సంగ్రహమును రచించెను. ఆంధ్రమున అనంతవ్రత కథ, శ్రీశైల మల్లికార్జునుని మీఁద శ్లేష నిందాస్తుతిగర్భిత సీస పద్యశతకము, కవికల్పక మనులక్షణ గ్రంథము, స్త్రీలకు ధర్మద్విపద, అంబికా వాద మనుయక్షగానము కవి రచియించిన గ్రంథాంతరములు. పయి గ్రంథముల యందొక్కటియు నిప్పుడు కానరాదు. అప్పకవి యక్షగానమును రచించుటఁ బట్టియు, నితరులు చర్చింపని యక్షగానముల నితఁడు చతురాశ్వాసమునందు చర్చించుటఁ బట్టియు, కవికి యక్షగానముల యెడ నభిమాన మున్నట్లు ఆకాలమున యక్షగానములయెడ జనసామాన్యమున కాదరమున్నట్లును ఊహింపవచ్చును.

అప్పకవీయము అసమగ్రము; అయిదాశ్వాసముల లక్షణ గ్రంథము. కవి దీని నెనిమి దాశ్వాసముల గ్రంథముగా రచింపఁ దలచి యున్నాఁడు.[1] కాని సమగ్రముగ వ్రాసినట్లు తోఁచదు. అప్పకవి చతురాశ్వాసమున గర్భ కవిత్వమును గూర్చి వ్రాయుచు,[2] 'ఇది భాషాపరిచ్ఛేదమునఁ దెలియ వ్రాసినది; ఇది వర్ణపరిచ్ఛేదములోఁ దెలియఁ జేయఁబడియె; ఇది ప్రాస పరిచ్ఛేదములోఁ దెలుపఁబడియె; ఇది యీ పరిచ్ఛేదమునఁ దెలిపెదము; ఇది సంధి పరిచ్ఛేదములోఁ దెలిపెదము' అని ఆయా ఆశ్వాసాంత పద్యములం గూర్చి తెలియఁ జేయుచు, తత్సమ, దేశ్య, క్రియా పరిచ్ఛేదముల తుదను జెప్పవలసిన పద్యములం గూర్చి చెప్పక పోవుటచేఁ జతురాశ్వాసము వ్రాయునరికిఁ గవికిఁ బంచమాశ్వాసము వ్రాయు నాలోచనమే కాని తక్కిన మూఁడాశ్వాసములను వ్రాయు నాలోచన మున్నట్లు కన్పింపదు. ఈ విషయము కవి ప్రతిజ్ఞకుఁ గొంత విరుద్ధముగాఁ గన్పించుచున్నది. గ్రంథము పూర్తి కాకపూర్వమే కవి కవసానదశ ప్రాప్తించి యుండవచ్చునని చాల మంది తలంపు.

"నన్నయభట్టుచే రచింపఁబడిన, యెనుబది రెండార్యల పరిమితిగల చింతామణి ననూయచే భీమకవి గోదావరిలోఁ గలిపెనని, అంతకుఁ బూర్వమే దానిని రాజనరేంద్రుని కొమరుఁడగు సారంగధరుఁడు వల్లించి, సిద్ధుఁడై కొన్నివందల యేండ్లు జీవించి క్రీ. శ. 1608 (కీలక సం॥) న బాలసరస్వతికిఁ డీకవ్రాయ నొసఁగెనని, తత్సాహాయ్యమున నాంధ్రమున దానికి విపులమగు వివృతి వ్రాయవలెనని యప్పకవికిఁ గలలో దేవుఁడు చెప్పిన ట్లిందుఁ గలదు. అప్పకవి పయిదాని కచ్చెరువందుచుండగా మతంగపర్వత ప్రాంతమునుండి విప్రుఁ డొకఁడు వచ్చి బాలసరస్వతీయముతోఁ గూడిన చింతామణి నాతని కచ్చెనఁట!" పయికథను నమ్ముటకు వీలులేక పోయినను, కవి యీ గ్రంథరచనకుఁ బూర్వము ఆంధ్రశబ్ద చింతామణిని జూచియుండలేదని నిశ్చయించవచ్చును.

అప్పకవి చింతామణి నాధారముగఁ జేసికొని మూలమగు 50 కారికలపయిని 1705 పద్యముల వివరణము వ్రాసెను. మూఁడవ

---

1. "...ఆంధ్ర వ్యాకరణంబు నందలి సంజ్ఞా-సంధి-తత్సమ-దేశ్య-క్రియా పరిచ్ఛేదంబులయిదునుం దెనుఁగుఁ బలుకుల నేను విస్తరించి భాషా పరిచ్ఛేదంబును, వళిప్రాస పరిచ్ఛేదంబును, పద్య పరిచ్ఛేదంబును, సంధి పరిచ్ఛేదంబును, తత్సమ పరిచ్ఛేదంబును, దేశ్య పరిచ్ఛేదంబును, క్రియా పరిచ్ఛేదంబు ననునామంబుల నభిరామంబులగు నాశ్వాసంబులెనిమిదిగా ........"
[పుట. 96.]

2. అప్పకవీయము; చతు—పుటలు-293, 294.

యాశ్వాసమున 'ఆద్యో వళి ర్ద్వితీయో వర్ణః ప్రాసః' అను నొక్క కారిక నాధారముగఁ జేసికొని యతిప్రాస విషయమును విపులముగఁ జెప్పుచు 398 పద్యముల నిచ్చియున్నాడు. అప్పకవీయము వ్యాకరణ గ్రంథమగుఁ జింతామణికి వివృతియయ్యు ఛందోవిషయములనే విపులముగ వివరించుచు ఛందోగ్రంథముగనే పేరుపడియున్నది. అలంకార విషయ మిందు గ్రంథాదినే సూక్ష్మముగను, సమగ్రముగను వివరింపఁబడినది. అలంకారాంగమగు బంధకవిత్వము చతుర్థాశ్వాసమునఁ గొంత వివరింపఁబడినది. కాన సర్వలక్షణ ప్రతిపాదకమగు నీ గ్రంథము చింతామణి కాంధ్రీకృతి యనుటకంటె స్వతంత్రగ్రంథ మనుటయే యుక్తము. తన గ్రంథమునకు గౌరవము కల్గుటకయి కవి దీనిని చింతామణ్యాంధ్రీకరణముగఁ బ్రకటింప సమకట్టియుండును.

'విశ్వశ్రేయః కావ్య' మ్మను మొదటికారికాద్వయమును వివరించు సందర్భమున అప్పకవి యలంకార విషయమును వివరించెను. అందుఁ గావ్యలక్షణము, వృత్తులు, రసము మొదలగు వాని విషయమునఁ బ్రతాపరుద్రీయము యొక్కయు, రీత్యలంకారముపట్ల కావ్యాదర్శముయొక్కయు పోలికలు కన్పించుచున్నవి, కాని యతఁడు పేరుకొనిన యలంకార గ్రంథములలోఁ గావ్యాదర్శము కానరాదు. కావున నప్పకవి పయివిషయములను సంస్కృత గ్రంథములనుండి కాక యాంధ్రమునఁ గల 'సరస భూపాలీయ, కావ్యాలంకార చూడామణుల' నుండియే గ్రహించెనని నిశ్చయింపవలెను.

అప్పకవీయము నిదివఱ కనేకులు ముద్రించిరి. అందు శ్రీ వావిళ్ళవారి ప్రతియే మేలయినది. దానికి శ్రీ గిడుగు వేంకటరామమూర్తి పంతులు గారి విలువగల విమర్శనము వన్నె గూర్చుచున్నది. 1951 లో వెలువడిన నూతన ముద్రణ మింకను మేలైనది!

ఇందుఁ బ్రథమాశ్వాసమునఁ గృత్యాద్యనంతరము కావ్య స్వరూప, భేదములు, ముక్తకాదులు, శబ్దార్థలక్షణాలంకార సంగ్రహము, శబ్దార్థదోషములు, వాక్యలక్షణము, రసవివేకము, రసస్వరూపము, నాయకనిర్ణయము, భాషోత్పత్తి, భాషాభేదములు, ప్రకృతి, వికృతి భేదములు, ఆంధ్రభాషాభేద చతుష్టయము, కవిసమయములు మొదలగునవి చెప్పఁబడినవి. ద్వితీయాశ్వాసమున చింతామణిలోని వర్ణ పరిచ్ఛేద మూలసూత్రముల నాధారముచేసికొని సంగ్రహముగ వర్ణవివేచన మొనర్పఁబడినది. తృతీయాశ్వాసమున యతులు, ప్రాసములు సవిశేషముగ వివరింపఁబడినవి. చతుర్థాశ్వాసమున ఛందఃప్రభావము, ఛందస్సులు, గురులఘునిర్ణయము, గణలక్షణము, షట్ప్రత్యయములు, వృత్త - జాతి లక్షణములు, బంధలక్షణములు వివరింపఁబడినవి. ఇందలి బంధవివేకముమాత్ర మలంకారశాస్త్రమునకు సంబంధించినది. పంచమాశ్వాసమున వ్యాకరణము వివరింపఁబడినది.

ప్రమాణలక్షణ గ్రంథములలో నప్పకవీయము ప్రధానమయినది. ఛందో విషయము నందే దీని ప్రామాణ్య మెక్కువ. ఇందలి యలంకార విషయములు చూడామణి, కావ్యాలంకార సంగ్రహములనుండి తీసికొనఁబడుటచే వానియందుఁ గల కొలఁది దోసము లిందును కన్పించుచున్నవి. అందు లేనివికూడఁ గొన్ని యిందుఁ గలవు.

1. కావ్యలక్షణముంగూర్చి సంస్కృతాలంకారికుల కభిప్రాయభేదములు కలవు. దోషరహితములు, గుణసహితములు, అలంకారయుక్తములు నగు శబ్దార్థములే కావ్యమని మమ్మట, హేమచంద్ర, వాగ్భట, విద్యాధర, విద్యానాథాదుల మతము. చక్కని యర్థమును ప్రతిపాదించు శబ్దమే కావ్యమని దండి, విశ్వనాథ, జగన్నాథ పండితరాజాదుల మతము. పయి రెండు మతములందును శబ్దార్థములు రెండును ఆవశ్యకములే యనుట స్పష్టము. అప్పకవి మూలమగు 'తదదోషౌ పరిష్కృతౌ చ వాగర్థౌ' అనుచింతామణిసూత్రమునువివరించుచు 'కృతికి నెప్డు శబ్దార్థముల్ రెండు వలయు' నని వ్రాసినాడు. [పుట 15.] ఇది 'శబ్దార్థములు రెండును గలిసి కావ్యమగు' నను మూలము నాశయమును వివరింపఁజాలదు. మఱియుఁ గా నిదానింబట్టి యప్పకవి మత మేమో నిర్ణయింప నవకాశము లేదు. 'కృతి యనంగ శబ్దార్థముల్ రెండు నగును.' అని యుండుటుచితము.

2. కావ్యభేదములను వివరించు సందర్భమున చిన్నకోట పెద్దనకవి కావ్యాదర్శము ననుసరించుచుఁ గావ్యము, గద్య-పద్య-మిశ్రభేదము

లచే ముత్త్రివిధములని చెప్పియున్నాఁడు. మూర్తి కవి ధ్వని - గుణీభూతవ్యంగ్య - చిత్రములని కావ్యము మూఁడురీతులని ప్రతాపరుద్రీయము ననుసరించినాఁడు. అప్పకవి 'కావ్యము ప్రబంధ మని, చాటుప్రబంధమని రెండు తెఱఁగు'లని యుభయముత విలక్షణముగఁ జెప్పినాడు. ప్రబంధము పద్యకావ్యమనియే తెలుఁగునఁ గల వ్యవహారము. గద్యకావ్య మెందుఁ జేర్పఁ బడినదో తెలియకున్నది. [పుట 14.]

3. 'సా వా గ్యా రసవృత్తిః' అను చింతామణి సూత్రమునుబట్టియు, అప్పకవి యొనర్చిన దాని వివరణముఁబట్టియు[1] రసమే కావ్యమున కాత్మయను తన్మతము విశదమగుచున్నది కాని వేఱొకచోటఁ జూడామణి ననుసరించి 'అఖిల కావ్యములకు నాత్మలు రీతులు' అని చెప్పఁ బడినది. [పుట 15 ] ఇచటఁ జూడామణికారుఁ డొనర్చిన పొరపాటే యప్పకవియు నొనరించెను.

4. చూడామణిలో నున్నట్లే యిందును 'ప్రాణముల్ వానికిఁ బ్రాణదశకము' [పుట 15.] అని దశగుణములనే యంగీకరించెను. కొన్నిగుణములు కొన్నిదోషములను బోఁగొట్టుట కేర్పడినవని చెప్పు సందర్భమునఁ జూడామణి యం దున్నరీతినే మీఁది దశగుణములనే కాక ఉదాత్తత, ఊర్జస్వి-ప్రేయము-యుక్తి-సూక్తి అను క్రొత్తగుణములు చెప్పఁబడినవి. [పుట 17, 18 లు.]

5. చూడామణి ననుసరించి యలంకారములలో జాతినే (స్వభావోక్తినే) ప్రధానాలంకారముగా అప్పకవి చెప్పియున్నాఁడు.[2] క ని యతనికాలమునాఁటికి, ఉపమకుఁగల గౌరవము జాతికి లేకపోయినది. ప్రాచీనాలంకారికులు స్వభావోక్తికిఁ బ్రాముఖ్యము నొసంగిరి; నవీను లుపమనే ఎక్కువ గౌరవించిరి. చూడామణి కాలమునను ఉపమకే ప్రాముఖ్య మున్నను దండి ననుసరించియే యతఁ డలంకారములను వ్రాయుటచేతఁ బ్రధానముగ స్వభావోక్తినే యంగీకరింపవలసి వచ్చినది. అప్పకవి యొక యెడ జాతికిఁ బ్రాముఖ్యము నొసఁగుచు మఱి యొకచోట ఉపమకుఁ బ్రాధాన్యమును వాకొడిచి చెప్పియున్నాఁడు.[3] ఇది పరస్పర విరుద్ధముగఁ దోఁచుచున్నది.

6. అప్పకవి యర్థములను గూర్చి చెప్పుచు 'కడు ముఖ్య, గౌణ, లక్ష్య, ధ్వని, వ్యంగములఁ గణుతింప నర్థలక్షణము లయ్యె' నని వ్రాసెను. [పుట. 16.] ముఖ్యాదు లర్థభేదములుకాని అర్థలక్షణములుకావు. ఆలంకారికు లంగీకరించిన యర్థములు మూఁడు; 1. ముఖ్యములేక వాచ్యము, 2. లక్ష్యము, 3. వ్యంగ్యము, చూడామణియందు 'గౌణము' కూడ అంగీకరింపఁబడినది; న్యాయముగ నది లక్ష్యాభిన్నము. అప్పకవి చూడామణి ననుకరించుటచే నాల్గర్థములనే చెప్పుట యుచితము, కాని యతఁడు క్రొత్తగ 'ధ్వని'నికూడఁ జేర్చినాఁడు. ధ్వని వ్యంగ్యప్రధానమగు కావ్యము; వ్యవహారమున నెచ్చటేని యది వ్యంగ్యపర్యాయముగ వాడుట కలదు. ఆ వాడుకనే కవి గ్రహించినచో ధ్వని, వ్యంగ్యములలో నేదియో యొకటి యున్నఁ జాలును.

ప్రాచీనాంధ్రాలంకారికు లెవ్వరును వ్రేలెత్తి చూపని ప్రాసభంగమును దోషముగఁ జూపుట యిందలి విశేషము.[4]

ఆంధ్రాలంకార గ్రంథము లందు గాని, ఆంధ్రవాఙ్మయ ప్రాచీన భాగములందుఁ గాని కానరాని దృశ్యకావ్య విషయము కొంత అప్పకవీయమునఁ గానవచ్చుచున్నది. అప్పకవి యష్ట

---

1. క. రసమునకు నాశ్రయంబై, యసదృశ మగునెద్ది యది గదా శబ్దము రా
 క్షసదమన! రసికు లనఁగా, వసుమతిఁదగ్విధ మెఱుంగు వారలు సుమ్మీ!
 గీ. తగ రసాశ్రయ వాక్య సంతతులఁ గూర్చి, కావ్యము లొనర్చు వారెపో కవులనంగ
 నట్లు కావున నేభాషనైనఁ గవిత పలుకువారికి సాధింప వలయు రసము.
2. సీ. చర్చింపఁ గృతులకు జాతిగుణంబులు ద్రవ్య క్రియలు జీవితంబు లగుట
 నవి యేతెఱంగున నమరు నట్లన చెప్ప వరలు జాతియు స్వభావంబు ననఁగ
 నది మొదలొక్కని .. [అప్పక. పుట. 16]
3. గీ. ఉపమ కల్గిన శయ్యలనొప్పి యున్న నంఘ్రిభవుని కావ్యంబు గ్రాహ్యంబు గాదు;
పాయసంబైన సంస్కార పక్వమైన, శాకజుష్టంబు హవ్యంబు కాని యట్లు. [పు. 14]
4. సముసన భంగంబు ఛందో యతిప్రాస భంగంబులు...[పుట. 17]

విధ భాషలంగూర్చి యొకుకపఱచు సందర్భమున నాటకములలో ఏయే పాత్రము లేయే భాషను వాడవలెనో నిశ్చయించుచు రెండు పద్యములను చెప్పెను. [1] ఆ నిర్ణయము ననుసరించి నాటకములం దుత్తమపాత్రలను సంస్కృతమును, తక్కినవారికి పాత్రభేదముల ననుసరించి ప్రాకృతభేదములను, తెలుఁగువారి కాంధ్రమును వాడవలెనని తేలుచున్నది. సంస్కృతనాటకములం దుత్తమపాత్రములకు సంస్కృతమును, తక్కినవారికి వివిధములగు ప్రాకృతములును వాడఁబడుచుండెడివి కాని అప్పకవి చెప్పినట్లు జాతుల నీచతనుబట్టి ప్రాకృతములు నియమింపఁబడిన ట్లగపడదు. ప్రాకృతభేదములు దేశభేదములనుబట్టి యేరుపడినవే గాని జాతులఁబట్టి కలిగినట్లు కన్పింపదు. అప్పకవి వారివారికి నిర్దిష్టములగు భాషలను చెప్పుచు 'తెలుగువార కాంధ్రమును చెప్పవలె' ననితా నాంధ్రుఁడగుటను, లక్షణమాంధ్రమున కగుటను, తెలుఁగునుకూడఁ జొప్పించెను. కాని పయినియమము లాంధ్రమున కేమాత్రము నుపయోగింపవు. సంస్కృతనాటకములలోఆంధ్రుల కాంధ్రము వాడుటయు ననుచితము; ఇఁక తెలుఁగునాటకములలో సంస్కృత, ప్రాకృతములకుఁ బ్రవేశమనునది వ్యర్థ్యము! సంస్కృతనాటకములో సంస్కృత, ప్రాకృతములు వాడఁబడిన ట్లాంధ్రనాటకములలో ఆంధ్రమునే వాడవలెనను నియమము ననావశ్యకము.

పయియంశమునుబట్టి అప్పకవి కాలమునఁగాని, అంతకుఁ బూర్వముకాని, తెలుగున దృశ్యకావ్యములు లేవని తేలుచున్నది. ఉండినచోఁ గవి తదనుగుణముగనే నియమము లొనర్చియుండును. నాటక పూర్వరూపములగు వీధినాటకములు, యక్షగానములు మాత్రము ప్రచారమున నుండినవి. అప్పకవికూడఁ గొన్ని యక్షగానములను వ్రాసిన ట్లిదివఱకే తెలుపఁబడినది

---

1. గీ. దేవ భూసుర ముని ధరిత్రీశ తంద్ర,
సచివ కంచుకి శ్రేష్ఠి విదూషక విరక్త
వాది యోషి న్నృపామాత్య వనితలకును,
జెప్పఁ దగు సంస్కృతము సుధాసింధు శయన.

సీ. క్షపణక జైనాది కర్మహీనులకును భాషాజనులకును బ్రాకృతంబు,
క్షితి వైశ్యశూద్ర ప్రభృతి మధ్యమాధమ జాతులకెల్లను శౌరసేని
ధీవర లుబ్ధకాది వినీచజాతుల మానవులకు నెల్ల మగధ భాష
మొగిఁ బిశాచాసుర ముఖ్యులకెల్లఁ బైశాచికా నామ భాషాద్వయంబు
పతిత చండాల యవనాది పరమ నీచ జాతి నరుల కపభ్రంశ మీ తెలుంగు
సీమ వారికి నాంధ్రంబుఁ జెప్పవలయుఁ గావ్య నాటకముల గోపికా

# అనుబంధము 2

ఆంధ్రమునఁ గల యలంకార శాస్త్రగ్రంథములు స్వల్పసంఖ్యాకములే యయినను, తెలుఁగు దేశమున అలంకారశాస్త్రము మంచి వ్యాప్తి లోనే యుండెను. తెలుఁగునాటఁ గల ప్రాచీన విద్వాంసు లందఱును సంస్కృత విద్వాంసు లగుటచే, వారిలోఁ జాలమంది అలంకారశాస్త్ర గ్రంథములను సంస్కృతమున రచించియున్నారు. ఇయ్యెడ ముద్రితములు, అముద్రితములు నగు నా సంస్కృత గ్రంథములంగూర్చి తెలుపఁబడును.

1. అప్పరాయ యశశ్చంద్రోదయము.

ముద్రితము. కర్త శ్రీ ఆణిమిళ్ళ-వేంకట శాస్త్రి. 18వ శతాబ్ది. చంద్రుని కళలవలె నిందు 16 అధ్యాయములు కలవు. వానికి 'కళ' లని పేరు. అలంకారశాస్త్రీయ విషయము లన్నియు నిందు సంగ్రహీతములు.

2. అభినవ శృంగార రసమంజరి

అముద్రితము. కర్త తిరుమల బుక్కపట్టణం వేంకటాచార్యులు. నరసింహాచార్యుల పుత్రుడు. 18-వ శతాబ్ది.

3. అలంకార కౌస్తుభము

అముద్రితము. అసమగ్రము. కర్త: శ్రీ తిరుమల బుక్క పట్టణం-వేంకటాచార్యులు. 18-వ శతాబ్ది.

4. అలంకార మంజరి

అముద్రితము. కర్త శ్రీకాకర్లపూడి రామచంద్రరాజు.

5. అలంకార మకరందము

అముద్రితము. కర్త శ్రీ కొల్లూరు—రాజశేఖరకవి. 19-వ శతాబ్ది.

అలంకార మణిహారము

ముద్రితము. కర్త. శ్రీ కృష్ణబ్రహ్మ తంత్ర పరకాల దేశికులు.

6. అలంకార మీమాంస

అముద్రితము. కర్త. శ్రీ శాంతలూరి కృష్ణసూరి.

7. అలంకార ముక్తావళి

కర్త. శ్రీ చావలి-రామశాస్త్రి. 19-వ శతాబ్ది

8. అలంకార ముక్తావళి

ముద్రితము. కర్త శ్రీ లక్ష్మీధరదీక్షితులు. ఇది సూత్ర, వృత్త్యాత్మకము.

9. అలంకార రాఘవము

అముద్రితము. కర్త శ్రీ చెరుకూరి కొండు భట్టు. చెరుకూరి యజ్ఞేశ్వరుఁడని కొందఱి యభిప్రాయము. 16-వ శతాబ్ది.

10. అలంకార శిరోభూషణము

అముద్రితము. కర్త శ్రీ కందళయార్యుఁడు. శ్రీ రామానుజాచార్యుల పుత్రుఁడు. ఇందు 10 ఉల్లాసములు కలవు. అలంకార శాస్త్రవిషయము లిందు సమగ్రమముగా వివరింపఁబడినవి.

11. అలంకార సంగ్రహము

అముద్రితము. కర్త శ్రీ అమృతానందయోగి 13-వ శతాబ్ది.

12. అలంకార సర్వస్వము

అముద్రితము. కర్త శ్రీ దేవరకొండ-ఓబలార్యకృష్ణుఁడు.

13. అలంకార సుధానిధి

అముద్రితము కర్త. శ్రీమాధవాచార్యుఁడు. 14-వ శతాబ్ది.

14. అలంకార సుధాసింధువు

కర్త. శ్రీ ఆణిమిళ్ళ-వేంకటశాస్త్రి. 18-వ శతాబ్ది.

15. అలంకార సూత్రములు

అముద్రితము. కర్త శ్రీ కృష్ణశర్మ. అలంకారశాస్త్ర విషయము లిందు సంగ్రహింపఁబడినవి.

16. అలంకార సూర్యోదయము

అముద్రితము. కర్త శ్రీ చెరుకూరి కొండు భట్టు. 16-వ శతాబ్ది.

17. అలంకారేందు శేఖరము

అముద్రితము. లక్షణమాలికా వ్యాఖ్య. కర్త శ్రీ బుక్కపట్టణం శ్రీశైల నరసింహాచార్యులు.

18. ఆమోదము

రసమంజరీ వ్యాఖ్య. కర్త శ్రీ రంగశాయికవి.

19. ఋజువృత్తి

అముద్రితము. కర్త శ్రీ బెల్లముకొండ నరసింహకవి. కావ్యప్రకాశికలోని మూలకారికలకిది వ్యాఖ్య.

### 20. కవిసమయ కల్లోలిని

అముద్రితము. కర్త శ్రీ అనంతరాయలు.

### 21. కామధేనువు

ముద్రితము. కర్త శ్రీగోపేంద్రతిప్ప భూపతి. వామనుని కావ్యాలంకార సూత్రవృత్తి కిది వ్యాఖ్య. 14-వ శతాబ్ది.

### 22. కావ్యకంటకోద్ధారము

అముద్రితము. కర్త శ్రీనరసింహకవి. 14-వ శతాబ్ది.

### 23. కావ్యకళానిధి

కర్త శ్రీ కృష్ణసుధ. 19-వ శతాబ్ది.

### 24. కావ్యప్రకాశ వ్యాఖ్య

అముద్రితము. కర్త శ్రీ చెరుకూరి కొండుభట్టు. 16-వ శతాబ్ది.

### 25. కావ్యప్రకాశికా టీక

అముద్రితము కర్త శ్రీ వాళ్ళపాక తిరువేంగడసూరి.

### 26. కావ్యప్రకాశికా వ్యాఖ్య

ముద్రితము. కర్త శ్రీ మల్లాది లక్ష్మణసూరి. 19-వ శతాబ్ది.

### 27. కావ్యాలంకార చూళిక

ముద్రితము. కర్త శ్రీ ముడుంబై నరసింహాచార్యస్వామి. అర్థాలంకారవివరణ మిందుఁ గలదు. 19-వ శతాబ్ది.

### 28. కువలయానందము

కర్త శ్రీ చాగలి రామశాస్త్రి. 19-వ శతాబ్ది.

### 29. చమత్కార చంద్రిక

అముద్రితము. కర్త శ్రీ విశ్వేశ్వర పండితుఁడు. 14-వ శతాబ్ది.

### 30. చమత్కార చంద్రిక

అముద్రితము. కర్త శ్రీ చిలకమర్తి తిరుమలాచార్యులు. కువలయానందమున కిది వ్యాఖ్య.

### 31. చిత్రమీమాంసాఖండనము

ముద్రితము. కర్త శ్రీ జగన్నాథ పండితరాయలు. అప్పయదీక్షితకృతమగు చిత్రమీమాంస యను అర్థాలంకార ప్రతిపాదకమగు గ్రంథమునకు ఖండనము. 17-వ శతాబ్ది.

### 32. తరళ

ముద్రితము. కర్త శ్రీ మల్లినాథసూరి. విద్యాధర పండితుఁడు రచించిన 'ఏకావళి' కిది వ్యాఖ్య. ఇం దలంకారశాస్త్రీయ విషయము లన్నియు చర్చింపఁబడినవి. 15-వ శతాబ్ది.

### 33. దశరూపకవర్తన

అముద్రితము. కర్త. శ్రీ కురవి రామ పండితుఁడు.

### 34. నంజరాజ యశోభూషణము

అముద్రితము. కర్త అభినవ కాళిదాస బిరుదాంచితుఁడు శ్రీ ఆలూరి నరసింహకవి. సమగ్ర విషయ ప్రతిపాదకము. 18-వ శతాబ్ది.

### 35. నాట్యశేఖరము

అముద్రితము. కర్త శ్రీ వీరభల్లట దేశికులు 13-14 శతాబ్ది ప్రాంతము.

### 36. నాట్యసర్వస్వ దీపిక

కర్త శ్రీ రామానందయోగి. (కొటికిలపూఁడి నారాయణకవి)

### 37. నౌక

అముద్రితము. కర్త. చర్ల వేంకటశాస్త్రి. ఇది సాహిత్యరత్నాకర వ్యాఖ్య.

### 38. పద్ధతి

అముద్రితము. కర్త శ్రీ కురువీరరాయఁడు. కార్వేటినగర నివాసి. ఇది దశరూపక వ్యాఖ్య.

### 39. ప్రతాపరుద్ర యశోభూషణము

ముద్రితము. కర్త శ్రీ విద్యానాథ పండితుఁడు. అలంకార శాస్త్రీయవిషయము లన్నియు నిందుఁ గలవు. 15-వ శతాబ్ది.

### 40. బాలచిత్తానురంజని

అముద్రితము. కావ్యప్రకాశికా టీక. కర్త శ్రీ నరివారి సరస్వతీ తీర్థులు.

### 41. బుధరంజని

చంద్రాలోక వ్యాఖ్య. కర్త రామభూపాల సభాభూషణ బిరుదాంకితుఁడగు తిరువేంగళసూరి.

### 42. మకరంద ఝరి

కువలయానంద టిప్పణి. కర్త శ్రీ కురవి రామపండితుఁడు.

43. మందరము

ముద్రితము. కర్త. శ్రీ మల్లాది లక్ష్మణ సూరి. ఇది సాహిత్యరత్నాకర వ్యాఖ్య. 19-వ శతాబ్ది.

44. మందార మకరందము

అముద్రితము. కర్త శ్రీ కృష్ణశర్మ. ఇందు ఛందోలంకార విషయములు వివరింపఁ బడినవి.

45. మాధుర్యమంజరి

అముద్రితము. కర్త శ్రీకృష్ణశర్మ. మందార మకరందమున కిది టిప్పణి.

46. మేకాధీశ శబ్దార్థ కల్పతరువు

అముద్రితము. కర్త: శ్రీ చర్ల భాష్యకార శాస్త్రి. 20-వ శతాబ్ది.

47. రఘునాథ భూపాలీయము

అముద్రితము. కర్త శ్రీ కృష్ణయజ్వ. ఇది ప్రతాపరుద్ర యశోభూషణము ననుసరించినది.

48. రత్నశాణము

కొంత ముద్రితము. ప్రతాపరుద్రీయ వ్యాఖ్య. కర్త శ్రీ చిలకమర్తి తిరుమలాచార్యులు.

49. రత్నాపణము

ముద్రితము. ప్రతాపరుద్రీయ వ్యాఖ్య. కర్త శ్రీ కుమారస్వామి సోమయాజి, మల్లినాథ సూరి పుత్రుఁడు. 15-వ శతాబ్ది.

50. రసగంగాధరము

ముద్రితము. అసమగ్రము. కర్త శ్రీ జగన్నాథ పండితరాయలు. 17-వ శతాబ్ది.

51. రసతరంగిణీ వ్యాఖ్య

అముద్రితము. కర్త శ్రీ చర్ల వేంకట శాస్త్రి 19-వ శతాబ్ది.

52. రసప్రకాశము

కావ్యప్రకాశ వ్యాఖ్య. కర్త శ్రీ కృష్ణ శర్మ. 17-వ శతాబ్ది.

53. రసప్రపంచము

కర్త: శ్రీ అణిమిళ్ళ వేంకటశాస్త్రి. 18-వ శతాబ్ది.

54. రసమంజరి

కర్త: శ్రీ తిరుమల బుక్కపట్టణం శ్రీనివాసాచార్యులు. 19-వ శతాబ్ది.

55. రసమంజరి

అముద్రితము. కర్త: శ్రీలక్ష్మీధర దీక్షితులు.

56. రససుధానిధి

కర్త: శ్రీ మార భట్టారకుఁడు.

57. రసార్ణవసుధాకరము

ముద్రితము. కర్త. శ్రీ సింగభూపాలుఁడు. నాట్యాలంకారశాస్త్రము. 14-వ శతాబ్ది.

58. రామచంద్రయశోభూషణము

1. అముద్రితము. కర్త. శ్రీకచ్ఛపేశ్వర దీక్షితులు.

59. లక్షణదీపిక

అముద్రితము. కర్త శ్రీ గౌరనార్యుఁడు. 15-వ శతాబ్ది.

60. లక్షణమాలిక

అలంకారేందుశేఖరవ్యాఖ్య. కర్త శ్రీనరసింహాచార్యులు.

61. వసంతరాజీయము

కర్త శ్రీకుమారగిరిప్రభువు. 14-వ శతాబ్ది

62. వేంకటాద్రిగుణ రత్నావళి

కర్త శ్రీచర్ల-వేంకటశాస్త్రి. 19-వ శతాబ్ది.

63. శరదాగమము

చంద్రాలోక వ్యాఖ్య. కర్త శ్రీప్రద్యోతన భట్టు; వందెల్ల వీరభద్రరాజుగారి ఆస్థానకవి.

64. శృంగారమంజరి

ముద్రితము. నాయికాలక్షణ నిరూపణ గ్రంథము. కర్త. శ్రీబడే అక్బర్‌షా. 17-వ శతాబ్ది.

65. శృంగారమంజరి

అముద్రితము. కర్త: శ్రీ పర్వతవర్ధనకవి.

66. శృంగారసారము

అముద్రితము. కర్త: శ్రీ గొడవర్తి వేంకట నారాయణ దీక్షితులు.

67. సాహితీసారము

అముద్రితము. కర్త: శ్రీ సీతారామకవి. అలంకార విషయములు సంగ్రహముగా నిందు వివరింపఁబడినవి.

68. సాహిత్యకల్పద్రుమము

కర్త. శ్రీ అణిమిళ్ళ నారాయణశాస్త్రి. 18-వ శతాబ్ది.

69. సాహిత్యకల్పద్రుమము

కర్త: శ్రీకొల్లూరు రాజశేఖరకవి. 19-వ శతాబ్ది.

70. సాహిత్యకల్పద్రుమము

అముద్రితము. కర్త శ్రీ సోమశేఖరకవి.

71. సాహిత్యకల్పలతిక

కర్త శ్రీ శాంతలూగి కృష్ణసూరి

72. సాహిత్యకౌముది

కర్త. శ్రీ ఆర్యసూరి.

73. సాహిత్యచింతామణి

అముద్రితము. కర్త శ్రీ పెదకోమటి వేమారెడ్డి. 15-వ శతాబ్ది.

74. సాహిత్యరత్నాకరము

అముద్రితము. కర్త శ్రీ చెరుకూరి కొండుభట్టు.

75. సాహిత్యరత్నాకరము

ముద్రితము. కర్త శ్రీవారణాసి-ధర్మసూరి. ఇందు 10 తరంగములలో అలంకార విషయము లన్నియు వివరింపఁబడినవి. 15-వ శతాబ్ది.

76. సాహిత్యసుధాసింధువు

అముద్రితము. కర్త శ్రీ విశ్వనాథకవి.

# సవరణలు

| పుట | వరుస | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|---|
| 11 | 2 | 3 | పాణ | ప్రాణ |
| ,, | నోట్సు | 2 | కవిలా | కలిలా |
| 12 | 1 | 28 | కార్యము | కార్యము ; |
| ,, | నోట్సు | 1 | అసితం | లసితం |
| ,, | 2 | 33 | తెలుఁగుల | తెలుఁగున |
| ,, | ,, | 41 | బీజము | ఓజము |
| 13 | 1 | 5 | విషయముని | విషయమును |
| ,, | ,, | 6 | జేర | జేరని |
| 14 | 1 | 35 | పెరుచు | పెరమ |
| ,, | 2 | 39 | కాని—— | ధ్రువపురి దరువూ |
| | | | రని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు. కాని - | |
| 17 | ,, | 1 | కాలమున | కాలను |
| 18 | 1 | 3 | గ్రధిత | గ్రథిత |
| ,, | 2 | 5 | నున్నవి | నున్నది |
| 19 | 1 | 35 | చెప్పెను | కలదు |
| ,, | 2 | 2 | యధార్ధము | యథార్థమైనను |
| ,, | ,, | 12 | రాయ | రాజ |
| - | ,, | 28 | ఖాప | ఖాన |
| ,, | ,, | 32 | ౫౯ వ | ౫౯] |
| ,, | ,, | 33 | ౧౫౭౭] | ౧౫౭౭ వ |
| 23 | 1 | 8 | స్యాత్ | స్యాత్ —— |
| ,, | 2 | 2 | కర్ధాంతర | కర్థాంతర |
| ,, | ,, | 20 | వాచ్యార్ధము | వాచ్యార్థము |
| ,, | ,, | 26 | లక్ష్యార్ధము | లక్ష్యార్థము |
| ,, | ,, | 35 | ౧౮౮ | ౧౧౮ |
| 24 | 1 | 2 | నానార్ధకము | నానార్థకము |
| ,, | ,, | 7 | తార్ధము | తార్థము |
| ,, | ,, | 8 | తార్ధ | తార్థ |
| ,, | ,, | 19 | సిద్ధార్ధ | సిద్ధార్థ |
| ,, | ,, | 37 | యోధజనార్ధ | యోధజనార్థ |
| ,, | 2 | 34 | రూపహృదా | రూపకోదా |
| 25 | ,, | 33 | నుగు | ును |
| 27 | 1 | 12 | ప్రమాం | క్రంగి ప్రమాం |
| 28 | 2 | 18 | మిద | మిదం |
| 30 | ,, | ,, | యూధకా | యూధికారు |
| 33 | నోట్సు | 2 | కాడిన్య | కౌండిన్య |
| 34 | 2 | 32 | అకారాంత | ఆకారాంత |
| 41 | 1 | 34 | సయి | ఆంధ్ర |
| ,, | 2 | 8 | ఉదారణ | ఉదాహరణ |
| 42 | 1 | 36 | మీఁది | పూర్వుల |
| ,, | 2 | 8 | కుమారదే | కుమారదే |
| 43 | ,, | 10 | ఇందుపయి | ఇందు |

పుట. 44. వరుస 1. పంక్తి 10 తర్వాత చేర్చఁదగినది.

ఔచిత్యవిచారచర్చ అముద్రితము. కర్త. విద్వాన్ శ్రీ విశ్వం.
కావ్యప్రకాశిక ముద్రితము. కర్త. శ్రీ. జ. మాధవరామశర్మ.
దశరూపకసంగ్రహము ముద్రితము. కర్త. శ్రీ. కో. అనంతాచార్యులు.
ధ్వనిసారము ముద్రితము. కర్త. శ్రీ. జ. మాధవరామశర్మ.
భరతసంగ్రహము ముద్రితము. కర్త. శ్రీ వేదుల సీతారామశాస్త్రి.
భరతము కర్త. శ్రీ రామరాజు సోమయ్య.
లక్షణశిరోమణి కర్త. శ్రీ పొత్తపి వేంకటరమణకవి.
లక్షణసారసంగ్రహము కర్త శ్రీ చిత్రకవి పెద్దన.
సాహిత్యదర్పణము కర్త. శ్రీ ఈ శ్రీనివాసాచార్యులు.
శృంగారమంజరి అలభ్యము. శ్రీ అక్బర్ షా.

| | | | | |
|---|---|---|---|---|
| 46 | నోట్సు | 5 | కావ్యపు | కావ్యప్ర |
| 47 | 1 | 2 | వాగయ 2 | వాగర్థా |
| ,, | ,, | 4 | నట్లు రీతిని | రీతిని[2] |
| 46 | నోట్సు | 6 | ప్రకాయో | ప్రకాశో |
| ,, | ,, | 10 | తచ్చోక్త | 3 తచ్చోక్త |
| ,, | ,, | 11 | 3 శబ్దార్థా | శబ్దార్థా |
| 49 | 1 | 17 | జయంతి[4] | జయతి[1] |
| 50 | ,, | 34 | యారేథా | యారేతు సర్వథా |
| ,, | ,, | 35 | 124[4] | 142[1] |
| ,, | నోట్సు | 1 | శిలావి | శిలాలి |
| 51 | ,, | 2 | అ | అగ |
| 52 | 1 | 2 | దృశత | దృశ్యత |
| ,, | ,, | 52 | వీక్ష్యం | వీక్ష్యం |
| ,, | ,, | 59 | పదర్శన | ప్రదర్శన |
| 54 | 2 | 7 | శతాబ్దపు | శతాబ్ది |
| 55 | 1 | 11 | వ్యంగ్యారము | వ్యంగ్యార్థము |
| 57 | ,, | 7 | నాట | నాటి |
| ,, | నోట్సు | 1 | ఏవేతు | ఏవే |
| ,, | ,, | 8 | ప్రకాన్తే | ప్రక్రాన్తే |
| 59 | 1 | 13 | చెష్ట | చేష్ట |
| ,, | 2 | 18 | యున్నలో | యున్నవో |
| ,, | నోట్సు | 12 | స్వాత్త్వీక | సాత్త్వీక |
| ,, | ,, | 15 | రుధై | రుద్రై |
| 60 | 1 | 19 | స్వాత్త్వీక | సాత్త్వీక |
| ,, | ,, | 26 | ,, | ,, |
| ,, | నోట్సు | 5 | సాయీ | సాయి |
| 63 | ,, | 9 | జనంది | ఆనంది |
| 64 | ,, | 2 | స్థాయు | స్థాయి |

| | | | | |
|---|---|---|---|---|
| 65 | నోట్సు | 8 | మఘురా | మఘురా |
| 68 | 2 | 34 | శబార్థ | శబ్దార్థ |
| 69 | నోట్సు | 6 | గ్యత్రి | గ్యత్న |
| 72 | ,, | 13 | ధన్యా | ధ్వన్యా |
| 73 | ,, | 1 | షోభిధా | షోబిధా |
| 74 | 2 | 7 | కలఁగవు | కాఁజాలవు |
| 77 | 1 | 11 | చందో | ఛందో |
| ,, | నోట్సు | 9 | [2] | [దోషా. 2] |
| 78 | 1 | 8 | బడ | పడ |
| ,, | ,, | 17 | అధికార | ధికార |
| ,, | 2 | 20 | 2 | 2-వ |
| 79 | ,, | 16 | లక్షణ | లక్ష్మణ |
| 83 | నోట్సు | 1 | తంద్ర | తేంద్ర |
| ,, | ,, | 11 | [27] | [పు 29, 30] |

---